రాహుల్ సాంకృత్యాయన్

# బౌద్ధ దర్శనం



అనువాదం

బొర్రా గోవర్ధన్

రాహుల్ సాంకృత్యాయన్

# బౌద్ధ దర్శనం

తెలుగు అనువాదం

**బొర్రా గోవర్ధన్**

ప్రచురణ

**ధర్మదీపం ఫౌండేషన్**

C/o. హైదరాబాద్ స్టడీ సర్కిల్

1-2-365/25/C, ఇందిరాపార్క్ క్రాస్‌రోడ్స్,

దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029

ఫోన్: 040-27635654

*Rahul Sankrityayan*

**Bouddha Darshanam**

Translated by : **Borra Govardhan**

**© Dharmadeepam Foundation**

Publication No : **2**

First Edition : **2010**

Second Edition : **Aug, 2016**

Price : **₹ 150/-**

Copies: **1500**

*Designing:*
**Team Theme**
Hyderabad - 20
Cell : 9704640273

*For Copies:*
**Arts & Letters**
Ph: 040-27635654

*Printed at:*
**Karshak Art Printers**
Hyderabad - 44
Ph: 040 2761 8261

# విషయ సూచిక

ముందుమాట ............................................................ ix
ధర్మవచనం ............................................................ x
అనువాదకుని మాట ............................................................ xi

**మొదటి అధ్యాయం : గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతం ............................ 1**

1. ఈశ్వరుణ్ణి అంగీకరించక పోవడం ............................................ 2
2. ఆత్మ నిత్యమని అంగీకరించక పోవడం ............................................ 5
3. ఏదైనా ఒక గ్రంథాన్ని స్వతఃప్రమాణంగా అంగీకరించక పోవడం ............... 14
4. జీవన ప్రవాహం ............................................................ 17

**రెండో అధ్యాయం : గౌతమ బుద్ధుడు ............................................ 21**

1. బుద్ధుని జీవితం ............................................................ 21
2. సాధారణ చింతన ............................................................ 24
   - I. నాలుగు ఆర్య సత్యాలు ............................................ 25
     - i. దుఃఖం ............................................................ 25
     - ii. దుఃఖ కారణం ............................................................ 26
     - iii. దుఃఖ నిరోధం ............................................................ 26
     - iv. దుఃఖ నిరోధ మార్గం ............................................ 27
   - II. జనతంత్ర వాదం ............................................................ 31
   - III. దుఃఖ వినాశనా మార్గంలోని లోపాలు ............................ 33
3. దార్శనిక చింతన ............................................................ 34
   - I. క్షణిక వాదం ............................................................ 34
     - i. స్కంధాలు ............................................................ 34
     - ii. ఆయతనాలు ............................................................ 34
     - iii. ధాతువులు ............................................................ 35
   - II. ప్రతీత్య సముత్పాదం ............................................ 36

III. అనాత్మ వాదం ........................................ 39
IV. అభౌతిక వాదం ........................................ 42
V. నిరీశ్వర వాదం ........................................ 43
VI. పది అవ్యాకతాలు ........................................ 48
i. సర్ రాధాకృష్ణన్ తప్పుడు రాతలు ........................................ 49
ii. మిళింద ప్రశ్నలు ........................................ 51
VII. భావ స్వాతంత్ర్యం ........................................ 52
VIII. అన్నీ తెలుసు అనుకోవడం తప్పు (సర్వజ్ఞత తప్పు) ........................................ 54
IX. నిర్వాణం ........................................ 54
4. బౌద్ధ దర్శనం - ఆనాటి సామాజిక స్థితి ........................................ 55

**మూడో అధ్యాయం : నాగసేనుడు ........................................ 67**

1. సామాజిక పరిస్థితి ........................................ 67
2. యవన - భారతీయ దర్శనాల కలయిక ........................................ 70
3. నాగసేనుని జీవితం ........................................ 71
4. దార్శనిక చింతన ........................................ 73
I. అనాత్మ వాదం ........................................ 74
II. కర్మ - పునర్జన్మ ........................................ 77
III. నామం - రూపం ........................................ 81
IV. నిర్వాణం ........................................ 82

**నాలుగో అధ్యాయం : బౌద్ధ సంప్రదాయం ........................................ 85**

1. బౌద్ధ ధార్మిక సంప్రదాయం ........................................ 85
2. బౌద్ధ దార్శనిక సంప్రదాయం ........................................ 87
నాగార్జునుడు ........................................ 90
3. నాగార్జునుని శూన్య వాదం ........................................ 90
I. జీవిత విశేషాలు ........................................ 90
II. దార్శనిక చింతన ........................................ 91
III. ప్రమాణ విధ్వంసన ........................................ 95
IV. యోగాచారం - ఇతర బౌద్ధ దర్శనాలు ........................................ 100

**ఐదో అధ్యాయం : బౌద్ధ దర్శన అంతిమ వికాసం ........................................ 105**

1. అసంగుడు ........................................ 105

I. యోగాచార భూమి ........................................................ 107
II. దార్శనిక చింతన ........................................................ 108
i. జ్ఞేయం (ప్రమేయం) ........................................................ 109
ii. విజ్ఞాన వాదం ........................................................ 112
III. అనిత్యతా వాదం, ప్రతీత్య సముత్పాదం ........................................................ 119
IV. హేతు విద్య ........................................................ 120
V. పరమత ఖండన ........................................................ 126
VI. ఇతర విషయాలు ........................................................ 134
i. స్కంధాలు ........................................................ 134
ii. పరమాణువులు ........................................................ 136
2. దిగ్నాగుడు ........................................................ 136
3. ధర్మకీర్తి ........................................................ 139
I. జీవిత విశేషాలు ........................................................ 139
i. ధర్మకీర్తి కాలం ........................................................ 140
II. ధర్మకీర్తి గ్రంథాలు ........................................................ 140
i. ప్రమాణ వార్తికం ........................................................ 141
III. ధర్మకీర్తి దార్శనికత ........................................................ 143
i. ఆనాటి దార్శనిక పరిస్థితి ........................................................ 144
ii. ఆనాటి సామాజిక పరిస్థితులు ........................................................ 146
iii. విజ్ఞాన వాదం ........................................................ 150
iv. క్షణిక వాదం ........................................................ 154
v. పరమార్థ సత్తా – వ్యాఖ్య ........................................................ 154
vi. నాశానికి కారణం లేదు ........................................................ 155
vii. కారణ సమూహవాదం (బహుకారణ వాదం) ........................................................ 159
viii. ప్రమాణ యోచన ........................................................ 160
ix. మనస్సు – శరీరం ........................................................ 169
4. ఇతర దర్శనాల ఖండన ........................................................ 172
I. నిత్యతావాదుల సామాన్య సిద్ధాంతాల ఖండన ........................................................ 173
i. నిత్యతావాద ఖండన ........................................................ 173
ii. ఆత్మవాద ఖండన ........................................................ 174
iii. ఈశ్వరవాద ఖండన ........................................................ 177
II. న్యాయ – వైశేషిక దర్శనాల ఖండన ........................................................ 178

i. ద్రవ్యం, గుణం మొదలైన వాటి ఖండన ................................ 179
ii. సామాన్యం ఖండన ................................................ 181
iii. అవయవి ఖండన ................................................ 184
iv. సంఖ్యా మొదలైనవాటి ఖండన ......................................... 187
III. సాంఖ్య దర్శన ఖండన..................................................... 187
IV. మీమాంస ఖండన........................................................... 190
i. ప్రత్యభిజ్ఞ ఖండన ................................................ 191
ii. శబ్ద ప్రమాణ ఖండన................................................. 192
V. అహేతువాద ఖండన......................................................... 198
VI. జైన – అనేకాంతవాద ఖండన............................................... 199
అనుబంధం.................................................................... 208
కొన్ని పదాలు – వివరణలు .......................................................... 227

# ముందుమాట



ఈ 'బౌద్ధ దర్శనం' నేను రాసిన 'దర్శన్ – దిగ్దర్శన్' అనే గ్రంథంలో ఒక భాగం. ఇందులో మూడవ అధ్యాయాన్ని మరింత విస్తృతంగా రాయాల్సిన అవసరం ఉంది. కాని, ఇప్పుడు ఆ పని చేయడానికి తగినంత సమయం లేదు. రెండో ముద్రణ నాటికి ఈ లోటు పూర్తి చేస్తాను. బుద్ధుడు, ధర్మకీర్తి – వీరి దర్శనాన్ని ఎంతో విస్తారంగా ఇచ్చాను. కాబట్టి ఈ సమాచారం వల్ల బౌద్ధ దర్శనం అంటే ఏమిటి? అనేది తెలుసుకోవడం పాఠకులకు సులువే. ఇతర దర్శనాల్ని వేరు వేరుగా చేసి ఎలా అర్థం చేసుకోలేమో, అలాగే బౌద్ధ దర్శనాన్ని కూడా ఇతర వికాసాల నుండి వేరుగా చేసి అర్థం చేసుకోలేము. కాబట్టి, బౌద్ధ దర్శన వికాసాన్ని తెలుసుకోవడానికీ, విశ్వదర్శనంలో దాని గొప్పతనాన్ని అర్థం చేసుకోవడానికి, మన దేశానివి, ఇతర దేశాలవీ అయిన ప్రాచీన, ఆధునిక దర్శనాల్ని తెలుసుకోవాలి. దాని కోసం 'దర్శన్ – దిగ్దర్శన్' చదవాల్సిన అవసరం కూడా ఉంది.

ప్రయాగ — **– రాహుల్ సాంకృత్యాయన్**

08-12-1943

# ధర్మవచనం



**ధమ్మం చరే సుచరితం, నతం దుచ్చరితం చరే।**
**ధమ్మచారీ సుఖం సేతి। అస్మిన్ లోకేవరమ్హిచ॥**

*జీవితంలో అన్ని రకాల సుఖశాంతుల్ని పొందడానికి ధర్మమే అతి ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. ధర్మాన్ని వదిలి అధార్మికంగా జీవిస్తున్నవాడు సుఖంగా ఉన్నట్లు భాసించినా నిజంగా దుఃఖంలోనే ఉంటాడు. అలాగే ధర్మబద్ధంగా జీవిస్తున్నవాడు పైకి దుఃఖంలో ఉన్నట్లు కనిపించినా ధర్మాన్ని ఆచరిస్తున్నాను అనే మానసిక సుఖశాంతిని అనుభవిస్తాడు. సుఖం బాహ్యం, ఆంతరికం అని రెండు రకాలు. బయటి వస్తువులు, ధనధాన్యాలు ఆధారంగా లభించే భౌతిక సుఖం నిజమైన సుఖం కాదని మనకు తెలుసు. ఆంతరిక సుఖం ఈ బయటి వస్తువులపై ఆధారపడకుండా ధర్మబద్ధమైన జీవన విధానం, ధ్యానాభ్యాసం మొదలైన వాటిపైనే ఆధారపడుతుంది.*

*ధర్మాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోడానికి విచక్షణాయుక్తంగా ధర్మగ్రంథాల అధ్యయనం చేయడం, లేదా వినిన ధర్మాన్ని గురించి మననం చేయడం అత్యావశ్యకం. అలా చేయడం ద్వారానే మూఢనమ్మకాలు తొలగి 'సద్ధర్మం' అవగతమవుతుంది. అలాంటి ధర్మగ్రంథాల్లో రాహుల్ సాంకృత్యాయన్ గారు రచించిన ఈ 'బౌద్ధ దర్శన్' అనే పుస్తకం ఒకటి. దీనిని తెలుగువారి ఉపయోగార్థం ఎంతో శ్రమించి బొర్రా గోవర్ధన్‌గారు తెలుగులోకి అనువదించారు. వారి శ్రమకు ప్రతిఫలంగా మీరందరూ ఈ గ్రంథాన్ని చదివి, చదివించి మనం మరచిపోయిన మన సద్ధర్మాన్ని, బుద్ధధర్మాన్ని మళ్ళీ గ్రహించి అందరూ సుఖశాంతులను పొందాలని ఆశిస్తున్నాను.*

***భవతు సబ్బ మంగళం***

***– శాసన రక్షిత భిక్షువు***

# అనువాదకుని మాట...



నేనీ పుస్తకాన్ని ఇలా తేవడానికి ప్రధాన కారణాలు రెండు. ఒకటి రాహుల్‌జీ, రెండు బౌద్ధం. నా అభిమాన రచయితల్లో రాహుల్‌జీది అగ్రస్థానం. నాకు అంతో ఇంతో చారిత్రక జ్ఞానాన్ని ప్రసాదించిన రచయిత ఆయనే. రాహుల్జీ పుస్తకాల్లోని హిమాలయాల వర్ణనల్ని చదివి, ఆ ఉత్తేజంతో రెండుసార్లు జమ్ము-కాశ్మీరు (2006, 2007), ఒకసారి నేపాల్ (2008) యాత్రలు చేసివచ్చాను. నాకెంతో పేరు తెచ్చిన, కొత్త రాతి యుగాలకి చెందిన ఇతి వృత్తంతో 'మహిషాసురమర్ధిని' అనే కథనూ (1980 లో) రాశాను. నేను నా నేపాల్ పర్యటనలో 2008, మే, 11వ తేదీన ముందుగా కుసీనగర్ వెళ్ళాను. అక్కడ శ్రీలంక, జపాన్ బుద్ధిస్ట్ అసోసియేషన్ వారి బౌద్ధారామంలో రాహుల్‌జీ రాసిన "బౌద్ధదర్శన్" అనే హిందీ పుస్తకం దొరికింది. వెంటనే కొన్నాను.

నేను హిందీలో పండితుణ్ణికాను. నగరం హైస్కూలులో హిందీ అధ్యాపకునిగా పని చేస్తున్న సుధాకర్‌గార్ని కలిశాను. ఆయన అప్పటికే హిందీలో ఓ వ్యాకరణ గ్రంథాన్ని తయారుచేశారు. నాకు వారు 'బౌద్ధదర్శన్'ని ఒక పాఠ్య పుస్తకంగా చెప్పారు. ఎంతో నోట్సు రాసుకున్నాను. ఆ నోట్సు సహాయంతో ఆ పుస్తకాన్ని ఇలా తెలుగులోకి మార్చాను.

హిందీ మూలాన్ని దగ్గర పెట్టుకొని, నా అనువాదంలోని కొన్ని లోటుపాట్లు సవరించారు పూజ్యభంతే **శాసన రక్షిత భిక్షువు**గారు. జనసాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి **కొత్తపల్లి రవిబాబు**గారు, గ్రంథాలయోధ్యమ నిర్మాత **డా॥ వెలగా వెంకటప్పయ్య** గారు, బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి **పి. అబ్బాయి**గారు, అచ్చు తప్పుల్ని సరిచేసి, చక్కని సూచనలిచ్చారు. తెలుగు ప్రజలకి ఎంతో బౌద్ధ సాహిత్యాన్ని అందించిన బౌద్ధవాఙ్మయ జ్యోతి **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**గారు అచ్చుతప్పుల్ని సరిజేయడంతో పాటు ఎన్నో సలహాలిచ్చారు. ఈ పుస్తకాన్ని అనువదించే

క్రమంలో కొన్ని వివరణల కోసం అన్నపరెడ్డిగారికి నేను చేసిన ఫోన్‌లకి మరొకరైతే విసిగిపోయే వారే!

ఈ దర్శన గ్రంథాన్ని తెలుగులోకి మార్చడానికి సహకరించిన వారిలో శైవవాణి సంపాదకులు, **నూతలపాటి రామ్మోహన్‌రావు**గారు కూడా ఒకరు. వేదోపనిషత్తులు, షడ్దర్శనాలు, శంకర అద్వైతంలో నాకు ఓనమాలు నేర్పిన గురువుగారాయన.

పుస్తకం పని దాదాపుగా పూర్తయింది. ఇక అచ్చుకెళ్ళడమే తరువాయి – అనుకొన్న సమయంలో చివరిగా ఈ పుస్తకాన్ని పరిశీలించే పని పూజ్యులు, బౌద్ధ మహా పండితులు, మాజీ IPSఅధికారి **శ్రీ వీరనారాయణ రెడ్డి** గారు తీసుకున్నారు. వారి సూచనలు విని మొదట ఖంగుతిన్నాను. కొంత నిరాశపడ్డాను. అయితే వారి సూచనలు చాలా గొప్పవి. విలువైనవి. కాదనలేనివి. మంచి రచనకు కావలసినవి కూడా. వారి సూచనలు ఇవి "భాష తేలిగ్గా ఉండాలి. సాధ్యమైనంత వరకు తెలుగు పదాలు వాడాలి. వాడుకభాష వాడడం మంచిది. సంస్కృత పదాలు వాడొద్దు. మనం పెట్టే అన్నం తినేవిధంగా ఉండాలి" ఇవీ వారి సూచనలు. వీటిని ఎవరు కాదంటారు? తిరిగి సవరణలకు కూర్చున్నాను. దిద్దుళ్ళు మొదలు పెట్టాను. ఎన్ని మార్పులో. ఒకటికాదు, రెండుకాదు తొమ్మిదిసార్లు దిద్దాను.

అయినా, ఈ పుస్తకం నవల కాదు, కథ కాదు. ఒక తత్త్వశాస్త్ర గ్రంథం. ఎన్నో సాంకేతిక పదాలున్న గ్రంథం. వాటన్నింటినీ మార్చడం సాధ్యం కాలేదు. కొన్నింటికి సరైన తెలుగు పదాలు కన్పించలేదు. కొన్నింటిని మార్చితే సరైన అర్థాన్ని ఇవ్వడంలేదు. అలాంటి వాటిని వదిలేశాను. కానీ, రచనకు సంబంధించినంతవరకు చాలా మార్పులు చేశాను. మార్పుల తరువాత నా ఆనందం అంతా ఇంతాకాదు. ఈ ఆనందానికి

శ్రీ వీరనారాయణ రెడ్డి గారే కారణం. అందుకు వారికి సహస్రాభివందనాలు.

పైన తెల్పిన పెద్దలందరితో పాటు 'సింహగోష్ఠి బుద్ధ విహార వెల్ఫేర్ అసోషియేషన్, వ్యవస్థాపకులు మా **శ్యామ్యూల్‌జాన్** గారికీ సర్వదా కృతజ్ఞుణ్ణి.

ఇక, తెలుగు నేలమీద బౌద్ధధర్మ విత్తనాలు నాటుతున్న మాన్యులు, వదాన్యులు, ధమ్మశ్రీ **చెన్నూరు ఆంజనేయ రెడ్డి**గారి ప్రోత్సాహం మరువలేనిది.

మరో విషయం.....

ఈ పుస్తకంలో రాహుల్జీ ఇచ్చిన పాదసూచికల్ని యథాతథంగా ఇచ్చాను. అవి ప్రతి అధ్యాయం చివరలో వున్నాయి. వీటికితోడు చదివేవారికి సహాయంగా ఉంటుందని కొన్ని పదాలకు వివరణలు ఇచ్చాను. అవి పుస్తకం చివరలో ఉన్నాయి. ఈ వివరణ ఇచ్చిన పదాలను మొద్దుగా (బోల్డు) ఇచ్చి, వాటిముందు ఇలా * గుర్తు ఉంచాను.

ఉదా॥ **కారికా***, **దుఃఖం***, **దర్శనం*** ఇలా...

ఈ గ్రంథానికి చేయూత నిచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెల్పుతూ...

– *బొర్రా గోవర్ధన్*

# గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతం

బుద్ధుని ఉపదేశాల్ని అర్థం చేసుకోడానికి మనం ముందుగా నాల్గు సైద్ధాంతిక విషయాల్ని తెలుసుకోవాలి. ఆ నాల్గింటిలో మూడు సిద్ధాంతాలు స్వీకరించవద్దు అని చెప్పినవి, నాల్గోది స్వీకరించి, ఆచరించమని చెప్పింది. అవి:

**మొదటిది :** భగవంతుణ్ణి **(ఈశ్వరుణ్ణి*)** అంగీకరించకపోవడం. అలా అంగీకరిస్తే 'మనిషికి మనిషే యజమాని' అనే సిద్ధాంతాన్ని తిరస్కరించినట్లు అవుతుంది.

**రెండోది :** **ఆత్మ*** 'నిత్యం' అని అంగీకరించకపోవడం. అది నిత్యం, ఏకం అని అంగీకరిస్తే ఇక ముక్తి కోసం, పరిశుద్ధి కోసం ప్రాకులాట అనవసరం.

**మూడోది :** ఏదైనా ఒక గ్రంథాన్ని 'ఇదే స్వతః ప్రమాణం' అని అంగీకరించకపోవడం. (బుద్ధి, అనుభవాల్నే ప్రామాణికంగా భావించాలి.)

**నాల్గోది :** జీవిత ప్రవాహాన్ని ఈ శరీరం వరకే పరిమితమైనదిగా భావించక ఈ శరీరానికి ముందూ – తర్వాత కూడా ఉంటుందని అంగీకరించడం. అలా అంగీకరించకపోతే, ఈ జీవితం, ఈ జీవితంలో సంభవించే అనేక విషయాలు, కార్యకారణ నియమాలచేత ఉత్పన్నమైనవని భావించక, కేవలం అనుకోకుండా జరిగే సంఘటనలుగా భావించాల్సి వస్తుంది.

బౌద్ధధర్మానికి చెందిన ఈ నాల్గు విషయాలూ అందరూ అంగీకరించినవి. వాటిని గూర్చి వివరంగా నేను ఇక్కడ చర్చిస్తాను.

# 1. ఈశ్వరుణ్ణి అంగీకరించకపోవడం

ఈశ్వర వాదులు (ఆస్తికులు) ఈ విధంగా చెప్తారు "ఏ పనికైనా ఒక **కారణం***
ఉంటుంది. అదే విధంగా ఈ ప్రపంచానికి కూడా ఏదో ఒక కారణం ఉండే ఉంటుంది. ఆ కారణమే ఈశ్వరుడు" – వారు ఇలా అన్నప్పుడు ఒక ప్రశ్న ఉదయిస్తుంది.

"మరి, ఆ ఈశ్వరుడు దేనితో తయారు చేయబడ్డాడు? ఈశ్వరుడు ఈ జగతికి **ఉపాదాన కారణమా***? అని. కుండకు కారణం మట్టి. కుండలాలకు కారణం బంగారం. అలాగే జగత్తుకి ఈశ్వరుడు? మట్టి రూపం మారి కుండ అయినప్పుడు, బంగారం కూడా అలాగే రూపం మారి కుండలం అయినప్పుడు, ఈ జగతి ఈశ్వరుని రూపాంతరమే అవ్వాలి. కానీ, ఈ ప్రపంచంలో మంచీ, చెడూ, సుఖం, దుఃఖం, దయ, నిర్దయ కన్పిస్తూనే ఉన్నాయి. అంటే ఇవ్వన్నీ జగతికి రూపాంతరుడైన ఈశ్వరునిలోనే ఉండాలి. లేదా ఆయనే ఏర్పాటు చేసినవై ఉండాలి. అయినా – ఈశ్వరుడు సుఖం కంటే దుఃఖాన్నే ఇచ్చాడు. ఈ ప్రపంచంలో **దుఃఖం*** పాలే ఎక్కువ. సుఖదుఃఖాల త్రాసులో దుఃఖం వైపు శిబ్బి ఎక్కువగా మొగ్గు చూపుతుంది.

అలాగే... ఈశ్వరునిలో 'దయ' కన్నా నిర్దయ పాలే అధికం కూడా. ఎందుకంటే ఎటు చూచినా ఈ ప్రపంచంలో క్రూరత్వమే రాజ్యమేలుతోంది.

వృక్ష సంతతిని జీవులుగా భావించక పోయినా, సూక్ష్మంగా చూచినట్లయితే – సూక్ష్మ అణువులు మొదలుకొని, క్రిమి కీటకాలు, పశువులు, పక్షులు, చేపలు, పాములు, బల్లులు, గ్రద్ధలు, తోడేళ్ళు, గుంటనక్కలు, సింహాలు, పులులు, ఆటవిక మానవులు, నాగరిక మానవులు – ప్రతి ఒక్కటీ మరో దానిపై ఆధారపడి బ్రతికేవే! తన్నుకుపోయేవే!

ఒకటి మరోదాన్ని జాగ్రత్తగా చూచినట్లయితే ఈ ప్రపంచమే ఒక పెద్ద యుద్ధ భూమిలా కనిపిస్తుంది. బలహీనుల్ని, బలవంతులు అణచి వేస్తున్నట్లనిపిస్తుంది. పునర్జన్మని నమ్మేవారు 'తమ కష్టాలు పూర్వజన్మ **కర్మ*** ఫలితాలే' అని అంటారు. ఇది కూడా ఆలోచించాల్సిన విషయమే! మంచీ–చెడు కర్మల ఫలితం తెలిసినా మనం వాటిని చేస్తూనే ఉంటాం. మరి, దీనికి మినహాయింపు పిచ్చివారు. తాగిన

మత్తులో ఉన్నవారు. అమాయకత్వంలో ఉన్న పిల్లలు. వీరు హత్య చేసినా తప్పుగా భావించలేము.

మనుషులు తప్ప ఇతరజీవులేవీ మంచీ-చెడుల ఫలితాల్ని తెలుసుకోలేవు. వాటి జీవనం ఇతర జీవుల్ని చంపి తినడం మీదే ఆధారపడి ఉంటుంది. మరి, వాటికి వాటి కర్మల బాధ్యత ఉంటుందా?

మనుషుల్లో కూడా పిల్లల్ని, పిచ్చివాళ్ళని వేరు చేసి చూచినట్లైతే, కర్మ ఫల బాధ్యతను వహించేవారి సంఖ్య తక్కువే ఉంటుంది. ఈ ప్రపంచంలో వారి సంఖ్య 150 కోట్లు ఉంటుంది (1943 నాటికి). ఇక బాధ్యత వహించని వారి సంఖ్య అపారంగా ఉంటుంది. మనుషులకన్నా దీర్ఘకాలం జీవించే తాబేళ్ళు ఉన్నాయి. వాటి సంఖ్య నూటయాభై కోట్లకంటే అధికం. ఇక, క్రిమికీటకాలు; ఏనుగులు, తిమింగలం వంటి అతిపెద్ద శరీరం గల జంతువులను గూర్చి మరి చెప్పేదేముంది?

**ఉపాదాన కారణం** ఉన్నప్పుడు అది **నిర్వికారం** (ఆకారం లేనిది) ఎలా అవుతుంది? మరి, ఈశ్వరుణ్ణి **'నిమిత్తకారకుడు'** అని అనుకొంటే, అతను ఈ జగత్తుని ఎలా సృష్టిస్తాడు? కుమ్మరి కుండల్ని, కంసాలి చెవిపోగుల్ని సృష్టించినట్టు సృష్టించినట్లయితే... అతడు ఏదైనా ఉపాదాన కారణం చేత **జగత్తును*** సృష్టించాలి కదా! లేక, ఉపాదాన కారణమైన పంచ భూతాలు లేకుండానే సృష్టించాడందామా?

**ఉపాదాన కారణం** లేకుండానే **అభావం*** నుండి **భావం* (భవం)** అంటే శూన్యం నుండి పదార్థం ఉత్పత్తి అయ్యింది అని అంగీకరించాల్సి వస్తే, కార్యకారణ సిద్ధాంతమే వ్యర్థమవుతుంది. **కార్యం*** లేకుండా కారణం, కారణం లేకుండా కార్యం ఎలా ఉంటాయి? కాబట్టి ఈ సిద్ధాంతానికి బలం లేదు. కాబట్టి ఈ జగత్తుని చూచి, దాని 'కారణం' ఈశ్వరుడే అని అంగీకరించాలా? ఇంద్రజాలికుడు తన కనికట్టు విద్యతో లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చూపించగలుగుతున్నాడు. మరి అలాగే... మాయామయుడైన ఈశ్వరుడు కూడా లేడనుకోవచ్చు గదా!

ఒకవేళ ఈశ్వరుడు **ఉపాదాన కారణం** ద్వారానే ఈ జగత్తుని సృష్టిస్తున్నాడని అనుకుందాం - కుమ్మరి లాగా వేరుగా ఉండి సృష్టిస్తున్నాడా? లేదా అందులోనే వ్యాపించి సృష్టిస్తున్నాడా? ఒకవేళ ఈశ్వరుడు విడిగా ఉన్నట్లైతే అతను సర్వవ్యాపి

కాలేడు. అతడీ సృష్టి చేయడానికి ఇతరేతర సహాయ సాధనాల మీద కూడా ఆధారపడి ఉండాలి మరి.

కుమ్మరికి మట్టితో పాత్రలు చేయడానికి సారె కావాలి. కంసాలికి బంగారపు పనిముట్లు చేయడానికి కొలిమి, సుత్తి ఇంకా కొన్ని సాధనాలు కావాలి. అదే విధంగా ఈశ్వరుడూ ఎలక్ట్రాన్లూ, న్యూట్రాన్‌లతో కూడిన అణువులను, అణువుల కలయిక వల్ల పదార్థాలను నిర్మించుటకు కొన్ని సాధనాలను ఆశ్రయించాలి కదా! అలాంటప్పుడు ఈశ్వరుడు సర్వశక్తివంతుడు ఎలా అవుతాడు? అతణ్ణి **ఉపాదాన కారణంతో** సర్వవ్యాపి అని అంగీకరించినా, ఉపాదాన కారణం లేకుండా సృష్టించలేనప్పుడు అతణ్ణి సర్వశక్తిమంతుడు అనలేం. అలాంటి పరిస్థితులలో అపవిత్రం, క్రూరత్వం లాంటి చెడుగులకు అతడే కారణం అయినందున దోషిగా కూడా నిలబడతాడు.

ఈవిధంగా ఈశ్వరుడు ఈ జగానికి **'ఉపాదాన కారణం'** కాలేడు. **'నిమిత్త కారణం*'** కూడా కాలేడు. కాబట్టి, ఈ ప్రపంచ ఉత్పత్తికి ఈశ్వరుడు కారణం కాబోడు. అలాంటప్పుడు ఈశ్వరుడు తప్ప మరేదైనా కారణం కావొచ్చు!

అయితే, దీనికి 'కారణం' ఎవరు? దానికి కారణం ఎవరు? అని ప్రశ్నిస్తే... ఈ జగత్తులో అతి సూక్ష్మాతి సూక్ష్మత కల్గిన వస్తువు, లేదా ఓ విశిష్ఠశక్తి ఉందని అంటే... (అది తెలియకుండానే), ఈ జగతికి 'కారణం' ఈశ్వరునితోనే ఎందుకు ఆగిపోవాలి? 'భగవంతునికి కూడా వేరే కారణం' ఉందని ఎందుకు అనుకోకూడదు? ఈశ్వరుడే సృష్టికి మొదలు అనుకోవడం సరైనది కాదు.

కర్త, భర్త (భరించేవాడు) ఈశ్వరుడే అయినప్పుడు, మరి, మనిషి కేవలం అతని చేతిలో కీలుబొమ్మే గదా! మరి అలాంటప్పుడు మనిషి తాను చేసే మంచిపనులు, చెడ్డపనులకు ఏవిధంగా జవాబుదారీ అవుతాడు? కర్మల ఫలితంగా మనిషి బాధలు అనుభవించడం ఏమిటి? ఇలా మనిషిని బాధించడం ఈశ్వరుని 'దయాపూరిత హృదయానికి' చిహ్నామా?

ఈశ్వరుణ్ణి సృష్టికర్త అని అంగీకరించడం కూడా సరైంది కాదు. ఈ సృష్టి అనాది. ఎందుకంటే... 'కర్త' అంటూ ఒకటి ఉంటే 'కార్యం' దానికి ముందే తెలిసి ఉండాలి. అంటే సృష్టికర్త సృష్టికి ముందే భౌతికంగా ఉండి ఉండాలి. మరి, సృష్టే

ఆది అయినప్పుడు – కోటి... రెండు కోట్లు... వంద కోట్లు... రెండు వందల కోట్ల సంవత్సరాలు కాదు. **అచింత్య***, **అనంత*** సంవత్సరాల నుండి సృష్టి ఉద్భవించే వరకూ ఈ క్రియారహితుడైన ఈశ్వరునికి ప్రమాణం ఏమిటి? – క్రియ అంటూ ఉంటే దాని ఉనికికి ప్రమాణం ఉండాలి కదా!

ఈశ్వరుణ్ణి అంగీకరిస్తే – ఇంతకుముందు మనం చెప్పుకొన్నట్లుగా మనిషిని అతని (ఈశ్వరుడి) కీలుబొమ్మ అని అంగీకరించాలి. మరి అప్పుడు "మనిషి తనకు తానే యజమాని, తనను తాను తనకి కావలసిన విధంగా తానే మలచుకోగలడు" అనే విషయాన్ని అంగీకరించలేము. అప్పుడు మనిషి తన శుద్ధత్వానికీ, ముక్తికీ ప్రయత్నించే అవసరమే లేదుకదా! మరి అలాంటప్పుడు ధర్మాలూ, ధర్మాలు చెప్పే మార్గాలూ కూడా అనవసరమే. ఉపయోగం లేనివే.

మరి, ఈశ్వరుణ్ని అంగీకరించకపోతే... మనిషి వర్తమానంలో చేసిన పనులే భవిష్యత్తులో కూడా ఉంటాయి. పని చేసే స్వేచ్ఛ మనిషికి ఉన్నప్పుడు ధర్మం చూపే మార్గంలో పనులు చేసుకొనే అవకాశం ఉంటుంది. అప్పుడే ధర్మసార్థకత చేకూరుతుంది. ఈశ్వరవాదుల ద్వారా వేలాది సంవత్సరాలుగా **ధర్మం*** పేరిట అశాంతి నెలకొంది, నెత్తురు పారింది. అయినా ఈశ్వరుడు ఈ నెత్తుటేర్లను ఆపలేదెందుకు?

నిజానికి ఈశ్వరుడనేవాడు మనిషి మెదడు చేసిన సృష్టే తప్ప వేరుకాదు.

## 2. ఆత్మ నిత్యమని అంగీకరించకపోవడం

ఇక్కడ మనం మొదటగా బౌద్ధులు **అనాత్మను*** ఏ విధంగా అంగీకరించారు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. బుద్ధుని కాలంలో బ్రాహ్మణులు, యోగులు, ఇతర మతాచార్యులు – వీరంతా అంగీకరించిన విషయం ఒకటుంది. అది ఈ శరీరంలోపల, శరీరం కంటే భిన్నమైన నిత్య చైతన్యశక్తి ఒకటుంది. అది శరీరంలోకి ప్రవేశించడం వల్లే శరీరంలో వేడి, జ్ఞానపరమైన చేష్టలు కలుగుతాయి. ఇది శరీరాన్ని విడిచి, కర్మానుసారం వెళ్ళిపోయినప్పుడు శరీరం చల్లబడుతుంది. చేష్టలుడిగి పోతాయి. ఈ నిత్య చేతనా శక్తినే వారు **ఆత్మ** అన్నారు. ఒకే రకమైన విశ్వాసం గల మతాల్లో కూడా ఆత్మ విశ్వాసం ఉంది. కానీ, **పునర్జన్మ*** విశ్వాసం లేదు (క్రైస్తవ, ఇస్లాం, యూదు మతాలు). బుద్ధుని కాలంలో మరి కొందరు ఆచార్యులు

ఇలా అంటుండేవారు “ఆత్మ శరీరం కన్నా వేరైన వస్తువు కాదు. శరీరంలోనే భిన్న భిన్న పాళ్ళల్లో కలసిపోయిన రసాయనాల వల్ల శరీరంలో వేడి, చేష్టలు పుడతాయి. ఈ రసాయనాల పాళ్ళలోని తేడాల వల్ల ఆ వేడి, చేష్టలుడిగి పోతాయి. కాబట్టి ఆత్మ శరీరానికి భిన్నమైన, వేరైన వస్తువు కాదు” అని.

‘ఆత్మ నిత్యమైనది’, ‘ఆత్మ శరీరంతో పాటు నశించిపోతుంది’ – అనే ఈ రెండు విషయాల్ని వదిలిపెట్టి – బుద్ధుడు మధ్యేమార్గాన్ని అవలంబించాం. బుద్ధుడు ఇలా అన్నారు. ‘ఆత్మ నిత్యమైంది కాదు. ప్రత్యేక కారణాల వల్ల, **స్కంధాల (పంచ భూతాలూ, మనస్సు)** కలయిక వల్ల పుట్టే ఒక శక్తి. అది మిగతా పంచభూతాల వలే క్షణ క్షణం పుడుతూ గిడుతూ ఉంటుంది. ఇది ఎప్పటివరకైతే ఒక ప్రవాహంగా క్షణ క్షణం పుడుతూ, క్షణ క్షణం గిడుతూ, మన శరీరంలో ప్రవహిస్తూ ఉంటుందో అప్పటి వరకూ శరీరం సజీవంగానే ఉంటుంది, మన ఆధ్యాత్మిక పరివర్తనం, శారీరక పరివర్తనం చాలా దగ్గరి సంబంధాలు కల్గి ఉంటాయని అర్థం చేసుకోవాలి.

మన శరీరం క్షణ క్షణం మారుతూ ఉంటుంది. నలభై ఏళ్ళ వయస్సు నాటి ఈ శరీరం – ఐదేళ్ళనాటి, లేదా ఇరవై ఏళ్ళ నాటి శరీరం కాదు. మరి, అరవై ఏళ్ళప్పుడు కూడా ఇది ఇలాగే ఉండదు. మారుతుంది. మన శరీరం నిర్మాణానికి మూలమైన ప్రతి అణువూ ప్రతిక్షణం మారుతూ ఉంటుంది. మరో క్రొత్త అణువును ఏర్పాటు చేయడానికి తాను తొలగి ఖాళీ ఇస్తూనే ఉంటుంది. ఆ విధంగా ప్రతి క్రొత్త అణువులు, నశించిన అణువుల లక్షణాలు, వారసత్వం, బాధ్యతలు చాలా విషయాల్లో పోలికలు కలిగి ఒక్కలానే ఉంటాయి. ఈ విధంగా మన తొలి సంవత్సరం నాటి శరీరం మరే సంవత్సరంలో ఉండదు. అలాగే ఇరవయ్యవయేట పదోసంవత్సరం నాటి శరీరం పూర్తిగా మారిపోతుంది. ముగిసిపోతుంది. కానీ, ఈ పోలికలు కల్గిన మార్పుల కారణంగా మన శరీరాన్ని ‘ఒక్కటే’ అంటాం.

అదే విధంగా ఆత్మ కూడా క్షణ క్షణ పరివర్తన చెందుతూనే ఉంటుంది. దాని సాదృశ పరివర్తన కారణంగా ఆత్మనూ ‘ఒక్కటే’ అంటాం. మీరు మీ జీవితాన్నే ఉదాహరణగా తీసుకోండి. రెండేళ్ళ క్రితం సిగరెట్ పొగ మీకు పడేది కాదు. కానీ, ఇప్పుడు అదే ఇష్టమనిపించవచ్చు. అలాగే... రెండేళ్ళ క్రితం పక్షుల్ని చంపడం, అవి రక్తసిక్తమై గిలగిలా కొట్టుకోవడం చూడడం, మీకు ఆనందాన్ని కల్గించి

ఉండొచ్చు. కానీ, ఇప్పుడు ఇతరులెవరైనా సరే పక్షుల్ని చంపడం చూస్తే మీరు విలవిలలాడి పోవచ్చు. ఒకవేళ మీ మనస్సు మార్పును, మీ మనో ప్రవృత్తులను డైరీలో రాసే అలవాటు గనుక మీకుంటే... మీరు పదేళ్ళనాటి డైరీలను తీసి ఒక్కసారి చదవండి. అక్కడే మీకు ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు లభిస్తాయి. పదేళ్ళ క్రితం మీరు, మీవిగా అనుకునే అభిప్రాయాల్ని, పదేళ్ళ తర్వాతి మీ అభిప్రాయాల్ని, వీటన్నింటినీ మీముందుంచినట్లైతే మీరు పాత అభిప్రాయాల్ని తిరస్కరిస్తారు. 'ఇది నా అభిప్రాయం కాదు' అని అంటారు. 'నా అభిప్రాయం ఇలా ఎప్పుడూ ఉండదు' అని కూడా వాదిస్తారు. నిజానికి మీరలా అనడం సరైందే. ఎందుకంటే గత పదేళ్ళ అనుభవాలు మిమ్మల్ని ఇలా మార్చేశాయి.

మీరు ఇలా అనొచ్చు "మనస్సు మారుతుంది. కానీ, ఆత్మ మారుతుందా?" అని.

నేను చెప్పేదేమంటే ఆత్మ అనేది మనస్సుకి వెలుపల లేదు. చిత్తం (విజ్ఞానం), ఆత్మ – ఇవి ఒక్కటే. కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం – ఈ పంచేంద్రియాల వల్ల మనం ప్రత్యక్షానుభవం పొందుతాం. మరి, మనస్సుతో అలా పొందలేం. అలా అయితే... మనం మనస్సు ఉనికిని ఎలా అంగీకరించాల్సి వస్తోంది?

కళ్ళు చింతకాయను చూస్తాయి. అప్పుడు నాలుక నుండి లాలాజలం ఊరుతుంది. ముక్కు వాసన గ్రహిస్తుంది. ముక్కు దుర్గంధాన్ని గ్రహిస్తే చేయి ముక్కు దగ్గరకు వస్తుంది. (ముక్కు మూసుకోడానికి). మనకు తెలుసు కన్నూ, నాలుకా ఒకటి కాదని. అవి కలసి లేవని. ఆ రెండింటినీ కలిపే మూడో ఇంద్రియం ఒకటుంది. అదే మనస్సు. **పంచేంద్రియాలు** తమ జ్ఞానాన్ని ఎక్కడికైతే చేరుస్తాయో, ఎక్కడి నుంచైతే శరీరంలోని వివిధ అంగాలకు ఆదేశాలు లభిస్తాయో – అదే మనస్సు (ఇంద్రియాల్ని క్రమ శిక్షణలో ఉంచేది మనస్సు). గ్రహించేది అదే. చింతన చేసేది అదే. నిర్ణయం తీసుకునేది అదే. ఏ సైనిక అధికారి కూడా వేరుగా ఎక్కడో కూర్చొని ఆదేశాలు జారీ చెయ్యడు. అలానే మనస్సు కూడా వేరే చోట ఎక్కడో ఉండి విషయాల్ని గ్రహించదు.

ఐదు గొట్టాల్లో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు – ఈ ఐదు రంగుల పొడులు దట్టించి ఉన్నాయి అనుకోండి. వాటి క్రింద ఒక పాత్రలో నీరు ప్రవహిస్తూ

ఉందనుకోండి. ఈ ఐదు గొట్టాల కొనలు నీటిపైభాగాన ఉన్నాయి అనుకోండి. క్రింది నీటిలో ఏ గొట్టంలోని పొడి పడితే నీరు ఆ రంగులో కన్పిస్తుంది కదా! అలాగే మన కళ్ళు ఒక నల్లత్రాచుని చూస్తే అది నల్లగానే కన్పిస్తుంది. ఈ జ్ఞానం మన మనస్సుకు చేరుతుంది. ఆ క్షణంలోనే మన మనస్సులో కారణభూతమైన పాత అనుభవాల బీజం ఉంటుంది. ఈ నూతన జ్ఞానం (నల్లత్రాచు) మనస్సుపై పడడం వల్ల దాని ఆకారం 'భయం' అనే రంగులో కలసి పోతుంది. ఒకవేళ ఒక్క క్షణకాలంలో పాముని చూచి మనం ఆగినా కూడా గిరగిరా తిప్పి వదిలిపెట్టిన చక్రంలాగా అనేక క్షణాలు ఒకదాని తర్వాత మరొకటి ఉత్పన్నమై మనస్సు అదే రంగులో లీనమై పోతుంది. ప్రతి రెండో క్షణమూ మనస్సు మీద దాని ప్రభావం తగ్గిపోతూ ఉంటుంది. ఒకవేళ పాము చాల క్షణాలు కన్పిస్తూ ఉంటే, మన వైపుకు వస్తున్నట్లు అనిపిస్తే క్షణ క్షణం మనస్సులో భయం యొక్క కదలిక అధికమవుతూ ఉంటాయి. ఇది భయం గొల్పే విషయాల గురించి చెప్పుకొన్న మాట. మరి, ప్రీతికరమైన విషయాలైనా, ఇంకా ఇతర ఏ విషయాల గురించైనా ఇలాగే మనం అర్థం చేసుకోవాలి.

సరే, పైన చెప్పిన కారణాల వల్ల కళ్ళూ, ఇంకా మిగిలిన ఇంద్రియాల్నే కాకుండా వాటిని కలిపి నిర్వహిస్తున్నది, ఏదో ఒక అంతర ఇంద్రియం ఉండి ఉండాలి. అదే మనస్సు. అలా నిర్వహించేది మనస్సే అయినప్పుడు ఇక ఆత్మ అవసరం ఏముంది? అది, పాత అనుభవాలను స్మృతి రూపంలో భద్రపరస్తూ ఉంటుంది.

మనస్సు క్షణికమైంది. అంటే – మనస్సు క్షణికమైనదే అయినా, అది 'మారిన మనస్సుకు' కారణం (హేతువు) అవుతుంది. ఏ విధంగా తల్లిదండ్రుల లక్షణాలు ఆ తర్వాతి తరాల వారికి సంక్రమిస్తాయో... అదే విధంగా పూర్వపు మనస్సు తన అనుభవాల బీజాల్ని, సంస్కారాల్ని తన తర్వాతి మనస్సు కోసం వారసత్వంగా వదలి వెళ్తుంది. అదే స్మృతికి (జ్ఞాపకాలకి) కారణం. **సంస్కారం** అతి తక్కువ కాలమే అయినా క్షణిక వస్తువుల మీదకూడా అది తన ప్రభావాన్ని చూపుతుంది.

ఆత్మను 'నిత్యమని' అంగీకరిస్తే, అది అనంత కాలాల వరకూ ఎలాంటి మార్పుచెందని ఒకే స్థితిలో ఉండిపోతుంది. మంచిది. ఎప్పటికీ ఒకే స్థితి ('ఏకరసం') గా ఉండే ఆత్మమీద అనుభవాల ముద్ర ఏ విధంగా పడుతుంది? ఒకవేళ ముద్ర అంటూ పడితే, అది పడిన మరుక్షణంలో దానిలో పరివర్తన కలిగినట్లే కదా?

ఆత్మ జడ పదార్థం కాదు. బాహ్య అవయవాల మీద కూడా దాని ప్రభావం ఉంటుంది. అది చైతన్యవంతమైనది. అందువల్ల ఇంద్రియాల వల్ల కల్గిన జ్ఞానం నిరంతరం ప్రవేశిస్తూ ఉంటుంది. ఇక, అప్పుడు అది రాగం, ద్వేషం, మోహం వంటి భావాలలో ఏదోఒక రూపాన్ని సంతరించుకుంటుంది. అప్పుడది ముద్రపడక పూర్వపు ఆత్మ కానేకాదు. అందువల్ల అది మార్పులేనిది కాదు. మరి అలాంటప్పుడు అది 'నిత్యమైనది' ఎలా అవుతుంది? పోనీ... 'ఆత్మ నిత్యమైందే' అని ఒప్పుకుందాం. మరప్పుడు 'ఆ నిత్యమైన' ఆత్మపై పడిన ముద్రలు ఆ మార్పులేని నిత్యపదార్థంపై పడి అవి కూడా నశించిపోవాల్సిందే కదా? ఆ ముద్రలు కూడా చలనం లేనివై పోవాలి. అంటే, మార్పులేనివై పోవాలి. మరి, ఇలాగైతే మనం పరిశుద్ధిని పొందడం, విముక్తిని ఆశించడం అవివేకమే అవుతుంది.

"ఒకవేళ 'నిత్య ఆత్మ' అనేది లేదని అందామా? – మనస్సు క్షణికమైనది కావడం చేత, శరీరం నశించిపోయాక మంచీచెడుల 'విపాకము' ఎలా అవుతుంది?" అని ఆత్మవాదులు అంటారు. ఇక్కడ మనం మొదట తెలుసుకోవాల్సింది బౌద్ధులు **విపాకము*** (కర్మఫలితం) ను ఎలా అంగీకరిస్తారనేది. మనం మంచిచెడు పనులను చేస్తాం. ఈ కర్మల్ని రాయడానికి దేవుడు మన వెంట వేగంగా రాయగల ఒక లేఖకుణ్ణి వెనుకే ఉంచాడు – అనేదాన్ని బౌద్ధులు విశ్వసించరుగదా! మనం మంచి పనులు చేసినా, చెడుపనులు చేసినా, మాట్లాడినా, – వీటన్నిటి పుట్టిల్లు మనస్సే. ద్వేషయుక్తమైన పనులు చేయడానికి మనస్సును క్షణం ద్వేష పూరితం చేసుకోవాల్సి ఉంటుంది. రాగయుక్తమైన పని చేయడానికి మనస్సును రాగయుక్తం చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ప్రేమ పూరిత పనులు చేయడానికి మనస్సును ప్రేమమయం చేసుకోవాలి. ఎప్పుడైతే మన మనస్సులోని ఈ ధ్వనికి దానికి భిన్నమైన ప్రతిధ్వని వచ్చి చేరుతుందో, లేదా దానికి భిన్నమైనది వచ్చి సంఘర్షిస్తుందో – అప్పటివరకూ దాని 'అదే స్థితి' కొనసాగుతూనే ఉంటుంది. ఏ మనిషీ ఒకే రోజులో క్రూరునిగా మారిపోలేడు. ఆపరేషన్ చేసే డాక్టరు కూడా నెమ్మది నెమ్మదిగానే తన మనస్సుని రాయిలా గట్టి పరచుకొని ఆపరేషన్లకు సిద్ధపడతాడు. ఇక, ఖూనీకోరు గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. మనకు ఏలాంటి ఆపద కల్గించలేని, ఒక అసహాయురాలైన అనాథ బాలికను కొడుతూ ఉండడం చూచిన వారి మనస్సు తీవ్రప్రభావానికి లోను కాకుండా ఉండగలదా? – అయితే... స్వయంగా ఆ దండించేవారి మనస్సు ఎలా ఉంటుంది?

మనం ఏ పనైతే చేస్తామో దాని ప్రభావం తక్షణమే మనస్సు మీద పడుతుంది. మరి, ఎవరి మనసైతే కఠినంగా ఉంటుందో వారిలో సూక్ష్మమైన ఆలోచనా వికాసం తగ్గిపోతూ ఉంటుంది. మంచీ – చెడూ భావాలు రెండూ – ధనం, ఋణం లాంటివి. ధనరాశి పెరిగితే, ఋణరాశి తగ్గుతూ ఉంటుంది. ఈ త్రాసులో ధనరాశి తాలూకూ శిబ్బి మొగ్గు చూపుతూ ఉంటుంది. ఈ లెక్క ప్రకారమే మనస్సు క్షణ క్షణం స్వయంగా మొగ్గుతూ ఉంటుంది. ఈ మార్పుకు – నెలలు, వారాలు, రోజులు పట్టవు, వెను వెంటనే జరిగిపోతూ ఉంటుంది.

అసలు మనిషి అంటే ఏమిటి? మంచీ చెడు అనుభవాల సంయోగమే మనిషి. చాలా విషయాలు మనిషికి తన జనకుల మనస్సు నుండి వారసత్వంగా సంక్రమిస్తూ ఉంటాయి. ఈ వారసత్వం కొనసాగుతూ ఉంటుంది. మనకు బాల్యం నుండి ముసలితనం వరకూ వారసత్వం ఉంటుంది. దాన్ని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. కాని, బుద్ధుని వాదాన్ననుసరించి ఈ వారసత్వ క్రమం – జన్మకి ముందు కూడా ఉంటుంది. మరణం అనంతరం కూడా ఉంటుంది. తమ వెనుకటి అనుభవాల నుండి ఏర్పడిన పోలిక, మృత్యుక్షణంలో శరీరాన్ని వదలడానికి సిద్ధంగా ఉన్న క్షణం వరకూ ఉంటుంది. – దీన్ని, సలసల మరిగే లావా ఒక సన్నని కాలువ ద్వారా ప్రవహించి వచ్చి ఒక చిన్న కొండ చివర ఆగిపోయి ఉన్న ప్రవాహంతో పోల్చవచ్చు. ఆ కొండకు వేరొక పైపున మరో కాలువ ఉంది. ఆ కాలువ మొదలు భాగంలో అయిస్కాంత క్షేత్రం ఉంది. దాని బలానికి కొండకు ఈ చివరన కాలువ చివరన ఆగి ఉన్న ఇనుప ద్రవాన్ని తనలోకి లాక్కుపోతున్నట్లు – (మొదటి కాలువ చివర నున్న లావా ప్రవాహం, రెండో కాలువ మొదలులో పడినట్లు) – మనోప్రవాహం కూడా అలాగే ఉంటుంది. అలాగే – మృత్యు సమయంలో మనోప్రవాహం తన సంస్కారరాశితో ఈ జీవితానికి ఆవలి అంచున నిలబడి ఉంటుంది. ఆ సంస్కారాల ప్రవాహాన్ని ఆకర్షించే సమాన ధర్మం కల్గినటువంటి శరీరంలోకి లాగబడి మరలా ఆ చిత్త ప్రవాహం తన పూర్వపు పని ప్రారంభిస్తుంది. ఈ క్రమం ఎప్పటి దాకా కొనసాగుతుందో అప్పటి వరకూ కొనసాగుతూ ఉంటుంది. ఎప్పుడు కోరికలు నశిస్తాయో అప్పుడు ఈ ప్రవాహం ఆగిపోతుంది. అదే నిర్వాణం.

ఈ విధంగా కర్మ, కర్మఫలం జన్మాంతరాల వరకూ కొనసాగుతూ ఉంటుంది.

‘జీవుడు’ నిత్యమని అనుకుంటే చాలా లొసుగులు ఉంటాయి. జీవం నిత్యమని నమ్మితే దాన్ని అమరమైన దానిగానే కాకుండా ‘పుట్టడం, గిట్టడం లేనిది’ అని కూడా అంగీకరించాలి. అంతేకాదు, మన చుట్టూ ఉన్న కొన్ని మతాల వారు పునర్జన్మని అంగీకరించరు. జీవి 100 కోట్ల సంవత్సరాలే కాదు, అనాది కాలం నుండి నేటి వరకూ మౌనంగా, నిశ్చేష్టంగా పడి ఉంది. ఇక, ఇప్పుడు... ఒకటి... యాభై... లేదా నూరు సంవత్సరాల దాకా, ఏ పూర్వకర్మ లేకుండానే ఈ ప్రపంచంలో పుట్టుగ్రుడ్డివానిగా లేదా మంచి నేత్రాలు కలిగినవానిగా; జన్మతః రోగిగా లేదా ఆరోగ్యవంతునిగా; మందబుద్ధి కలవానిగా లేదా ప్రతిభావంతునిగా – ఇలా అన్ని రూపాలలో పుడుతుంది. మరలా చనిపోయాక, తిరిగి అనంత కాలం వరకూ తన మంచీ – చెడుల ఫలితాల్ని బట్టి స్వర్గం లేక నరకంలో పడవేయబడుతుంది. ఇలాంటి శాశ్వతత్వం తెలివైన పనేనా? అంగీకరించవలసినదేనా? ఎవరైతే పునర్జన్మను అంగీకరిస్తారో, ఆత్మ నిత్యమైందని అనుకుంటారో వారికీ రెండు విషయాలూ ఒకదాని కొకటి వ్యతిరేకంగా ఉంటాయి. ఆత్మ నిత్యమైనదైతే, అది నాశనం లేనిది కూడా. ఎప్పుడూ ఒకే విధంగా వుండే ఒకే స్థితిలో ఉండే వస్తువుని పరిశుద్ధమైనదిగా మనం భావిస్తే – మరి, అది జనన మరణాల చుట్టూ ఎందుకు తిరుగుతుంది? ఒకవేళ అదే అపవిత్రమైనదిగా భావిస్తే దానికి ముక్తి ఎలా లభిస్తుంది? నిత్యం (మారనిదీ) అయినప్పటికీ సంస్కారాల ప్రభావం దాని మీద పడదు అని మనం ఇంతకు ముందే చెప్పుకొన్నాం – ఈ విషయానికి సంబంధించి మనస్సును ఆమోదించినట్లైతే, ఇక, ఆత్మను అంగీకరించాల్సిన అవసరం ఏముంది?

ఒకవేళ మనస్సు, **ఆత్మ** ఒక్కటే, అవి క్షణికాలే అనుకుంటే – ‘నేను మొదట ఇలా ఉన్నాను’ ‘ఇప్పుడు ఇలా ఉన్నాను” అనే భావన ఎందుకు కలుగుతుంది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రశ్నకి సమాధానం ఇది –

“ఒక గుంపుగా కలసి ఉన్నవాటిలో ‘ఐక్యంగా కలసి మెలసి ఉండటం’ అనేది మామూలు నియమమే.”

ఈ ప్రపంచంలో ఏ వస్తువుని తీసుకొన్నా ప్రతిదీ వేలాది అణువులతో నిర్మితమైనదే. కానీ, ఆ వస్తువుల మధ్య తేడా ఉంది. ఇనుము, ప్లాటినం, వజ్రం లాంటి మూలకాలలోనే ఈ భేదాన్ని చూడొచ్చు. అలాగే దూరం నుండి చూస్తే

అడవి ఒకటిగానే కన్పిస్తుంది. దగ్గరికి పోయి చూస్తే వృక్షాల్లో తేడాలు కన్పిస్తాయి. ఈ విధంగా ప్రపంచంలో కన్పించే పదార్థాల మూలాలలోకి పోయిచూస్తే వాటిలో భిన్నత్వం కన్పించినా, అవి ఒకే రకమైనవిగా చెప్పుకోవచ్చు. లెక్కలేనన్ని అంగాలతో ఏర్పడ్డ మన దేహాన్ని 'శరీరం' అనే అంటున్నాం. అనేక చెట్లతో కూడిన దాన్ని 'అడవి' అంటున్నాం. అనేక నక్షత్రాలలో కూడినదాన్ని 'విశ్వం' అంటున్నాం.

ఔను, ఇక్కడ ఒకతేడా ఉంది.

ఇక్కడ శరీరం, అడవి, నక్షత్రం – ఈ అంశం ఒక కాలంలో ఒక ప్రదేశంలో ఉంటాయి. కానీ మనస్సు ప్రతిక్షణం ఒకదాని తర్వాత మరొకటిగా ఉద్భవిస్తూనే (పరివర్తన) ఉంటుంది. – దీనికి మంచి ఉదాహరణలు –

గిరగిరా తిరిగే కర్రపుల్లకు రెండు చివర్లలో ఉన్న మంట.

విమానం యొక్క ప్రొపెల్లర్.

వత్తిలోని కాంతి (దీపకాంతి).

కరెంటు ఫ్యాను రెక్క.

వీటన్నింటిలో వస్తువు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వేగంగా మారడం వల్ల దాన్ని మనం ప్రత్యేకంగా గ్రహించలేం. కర్ర చివర్లలోని మంట, ఫ్యాను రెక్క, దీపపు శిఖల ప్రవాహం – ఇవ్వన్నీ ఒక చక్రంగా అగుపిస్తాయి (దీన్ని అలాట చక్రం అంటారు). ఇక్కడ కాలం అనేది ఒక స్వేచ్ఛా కొలమానంగా మారి, వాటిని చక్రం రూపంలోకి తీసుకుపోతుంది. (ఒక దీప శిఖ అంతమై, దాని వెనుకే మరో దీప శిఖ ఉత్పన్నం కావడం వల్ల, ఈ చర్య అతి సూక్ష్మకాలంలో జరగడం వల్ల ఆ దీపం ఒకే శిఖలా కన్పిస్తుంది). అలాగే... మనస్సు కూడా. అది ఎంతో వేగంగా తన స్థానంలో మరో మనస్సును ఉత్పన్నం చేస్తుంది. ఆ రెండు 'మనస్సు'ల (మనోస్థితుల) మధ్య ఉన్న అంతరాన్ని మనం గుర్తించలేం ఇక్కడ కూడా మనకు చక్రంలా అగుపించే ఏకతా భావనే అన్పిస్తుంది.

అలాగే, నదీప్రవాహాన్ని కూడా చెప్పుకోవచ్చు. ఆ ప్రవాహంలోని జలం కొన్ని వేల నీటిబిందువుల చేత, ఆ బిందువులు లెక్కలేనన్ని హైడ్రోజన్, ఆక్సిజన్ అణువుల చేతా, ఆ అణువులు పరమాణువులచేత, ఆ పరమాణువులు అనేక ధన, ఋణ

విద్యుత్ కణాల చేత (ఎలక్ట్రాన్లు), అవి ఇంకా సూక్ష్మమైన న్యూట్రాన్‌ల (క్వార్క్స్?) చేత ఏర్పడ్డాయి గదా? నిజానికి ప్రపంచ వ్యాపితంగా అన్నిచోట్ల – సముదాయాల్నే ఏకవచనంతో పిలుస్తున్నారు. అలాంటప్పుడు క్షణికమైన మనోప్రవాహాన్ని సాధారణ పరిభాషలో 'అడవి', 'జలం' అన్నట్లు ఏకవచనంలో అంటే ఆశ్చర్యపడాల్సిన పనేమిటి? ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమంటే... ప్రపంచంలో 'సముదాయంగా' ఉన్నవి సామూహికం అయినప్పుడు ఆత్మ అలా సమూహం కాక 'ఒక్కటే' అని ఎలా అవుతుంది? ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది – 'ఎప్పుడైతే ఆత్మ క్షణికం అంటామో, మరో క్షణంలో అది ఉండదు. మరప్పుడు దానికి పరిపూర్ణత, పరిశుద్ధత ఎలా ఉంటుంది? – ఈ ప్రశ్నకి జవాబు ఏమిటంటే... మనం మనస్సుని 'క్షణికం' అని అంగీకరిస్తాం. కాని, మనోప్రవాహాన్ని మాత్రం క్షణికం అని అంగీకరించం. గంగాజలం, దాని ఒడ్డులు, దాని మూలం, దాని చల్లదనం, అందులోని ఇసుక – అంతా మారుతూనే ఉన్నా ప్రవాహం మాత్రం సాగుతూనే ఉంటుంది. దాన్ని గౌరవప్రదమైన గంగానది అనే పిలుస్తాం గదా!

మనోప్రవాహాన్ని పరిశుద్ధపరచి, దానికి పరిపూర్ణతని సంతరింపజేయాలి. మనోప్రవాహానికి ఎంతగా – రాగం – ద్వేషం – మోహం – ఈ మురికి నుండి విముక్తి సాధిస్తే, అంతగా మనిషి కాయిక (శారీరక), వాచిక (మాటకు సంబంధించిన), మానసిక (మానసికమైన) దోషాలు పరిశుద్ధమవుతాయి. దీనివల్ల ఆ వ్యక్తి తన వారికీ, పొరుగువారికీ ఉపకారం చేసే సమర్థుడవుతాడు. ఎప్పుడైతే అతనిలో రాగద్వేషాలు పూర్తిగా నశిస్తాయో... అతని సామర్థ్యాన్ని కుటుంబం, గ్రామం, దేశం, భూమండలం దాటించి అతని పరిధిని అనంతం దాకా విస్తరింపచేస్తుంది. ఈ అనంత పరిధిలో అతని కోరిక బంధన రహితమైపోతుంది. ఇక అప్పుడు 'కోరికల తపనే' **(తృష్ణ)*** ఉండదు. అప్పుడు అతనికి **'నిర్వాణ మార్గం'** సంసిద్ధంగా ఉంటుంది. అంతేకాదు, అతనికి బాధల బంధనాల నుండి విముక్తి లభిస్తుంది. ఆ **విముక***ని చేరడానికి, అతడు తన స్వార్థపు హద్దుల్ని చెరిపేసుకొని, లోకహితం కోసం అన్నింటినీ త్యాగం చేయాల్సి ఉంటుంది. (మీరు – జాతక కథలలో చూస్తారు. పూర్ణత్వాన్ని సాధించడానికి బోధిసత్త్వుడు ఎన్నింటిని వదులుకోవాల్సి వచ్చిందో)

కోరికను (తృష్ణ లేదా తపన) వదిలిపెట్టడం అంటే, దుఃఖమార్గాన్ని నిలిపివేయడమే. ఎందుకంటే – కోర్కెలు, స్వార్థం ఉండటంచేతే అధికంగా దుఃఖం కలుగుతుంది కదా!

ఈ విధంగా మనస్సు క్షణికం అయినప్పటికీ, మనోసంతతి (చిత్త సంతతి) క్షణికం కాదు. ఒకవేళ 'ఆత్మ' అనే పదానికి మారనిది, నిత్యమైనది అనే అర్థంలో కాకుండా, ఆ పదానికి క్షణ క్షణం ఉత్పన్నమయ్యే మనోప్రవాహం లేదా చిత్తసంతతిగా అర్థం తీసుకుంటే తప్పేమీ కాదు. అప్పుడు ఈ ఆత్మ అనే పదం మీద మనకు ఎలాంటి ద్వేషభావమూ కలగనవసరం లేదు. అప్పుడు 'ఆత్మ' అనే పదం 'నిత్య చేతనానికి' పర్యాయపదంగా వ్యవహరింపబడుతుంది. అయినా బుద్ధుడు ఆత్మ అనే పదాన్ని కాకుండా 'అనాత్మ' అనే పదాన్నే ప్రయోగించారు.

## 3. ఏదైనా ఒక గ్రంథాన్ని 'స్వతఃప్రమాణంగా' అంగీకరించక పోవడం

ఏగ్రంథమూ 'స్వతఃప్రమాణం' కాదు. అన్ని మతాలవారూ తమ తమ గ్రంథాల్ని స్వతఃప్రమాణాలుగా అంగీకరిస్తారు లేదా, అంగీకరింపజేయడానికి ప్రయత్నిస్తారు.

'ఇందులో చెప్పిన విషయాలన్నీ ప్రమాణాలే' అని చెప్పే గ్రంథం అంటూ ఏదీ ఉండదు.

బ్రాహ్మణులు వేదాల్ని **ప్రమాణం*** గా అంగీకరిస్తారు. ఇందులో చాలా విషయాల్ని ఇతర ధర్మాల వారు వ్యతిరేకిస్తారు. ప్రయోగ పూర్వకంగా అవి ప్రమాణాలు కావని నిరూపించారు. అయినా, బ్రాహ్మణులు వేదాల్నే ప్రమాణంగా భావిస్తారు. మరి వాటిని స్వతఃప్రమాణాలుగా ఎలా అంగీకరిస్తాం? **వేదాలు*** శాస్త్ర ప్రయోగాలకు వ్యతిరేకం కావు అన్నారనుకోండి – అప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఆ విషయం ఎలా తెలిసింది? అని. దాన్ని అమోదింపజేయడానికి చివరికి బుద్ధి మీద ఆధారపడాలి కదా! మరప్పుడు, వేదాల ప్రామాణికత సైతం బుద్ధి మీదే ఆధారపడింది, కాబట్టి వేదాల కన్నా బుద్ధే ప్రామాణికమైందని తేలింది. వేదాలకు అన్వయించే మాటల్నే బైబిలు, ఖుర్ఆన్, మొదలైన స్వతఃప్రమాణాలుగా చెలామణి అయ్యే గ్రంథాలన్నింటికీ అన్వయించుకోవాలి. నిజానికి ఈశ్వరుడే లేడు అనుకొంటే ఈశ్వరుని గూర్చి తెలిపే గ్రంథం ఎక్కడుంటుంది? ఎలా స్వతఃప్రమాణం అవుతుంది?

గ్రంథాల్ని స్వతఃప్రమాణాలుగా అంగీకరించడం చేత ప్రపంచంలో ఎన్నో భయంకర అత్యాచారాలు జరిగాయి. ఒకవేళ... **'బైబిల్'**నే స్వతఃప్రమాణంగా

అంగీకరించినట్లయితే **గెలీలియో*** కు దుర్గతి పట్టేది కాదు; ఎందరో శాస్త్రవేత్తలు తమ ప్రాణాల్ని పోగొట్టుకునే వారే కాదు. ముస్లిం విజేతలు **'ఖుర్ఆన్'** ని స్వతఃప్రమాణంగా అంగీకరించి ఉండక పోతే... యవన (గ్రీకు) తత్త్వవేత్తలు ఎన్నో వేల సంవత్సరాల పాటు శ్రమించి భద్రపరచిన **అలెగ్జాండ్రియా*** గ్రంథాలయాన్ని కాల్చి బూడిద చేసే వారే కాదు. అది సురక్షితంగానే ఉండేది. ఇలా ఏదో ఒక గ్రంథాన్ని స్వతః ప్రామాణికంగా అంగీకరించడంవల్ల ప్రపంచంలో వేలాది సంవత్సరాల నుండి మానవ జాతులు సరైన ధర్మాన్ని చూడలేని గ్రుడ్డివారయ్యేవారు కాదు. లేనిపోని విశ్వాసాలు, మానసిక బానిసత్వం అనే రొచ్చుగుంటలో పడేవారు కాదు. – ఈ గ్రంథాల్ని స్వతః ప్రమాణాలుగా అంగీకరించడం విజ్ఞాన విస్తరణకు అడ్డుకట్టగా నిలచింది. ఈ నేలని నెత్తుటితో తడిపింది. క్రైస్తవుల **ధర్మయుద్ధం*** ఏమిటి? బైబిలు, ఖుర్ఆన్‌లను స్వతః ప్రమాణాలుగా అంగీకరించే విషయంలో వచ్చిన తగాదాల పరిణామం కాదా?

ఏదైనా గ్రంథాన్ని స్వతః ప్రమాణంగా అంగీకరించడం అంటే – అందులోని విషయాల్ని సందేహించకుండా అంగీకరించడం. ఆ విషయాలు ముందుముందు ఉద్భవించే జిజ్ఞాసలను అడ్డుకోకుండా ఉండడం. ఎందుకంటే – జిజ్ఞాస వల్లే అనేక గొప్ప గొప్ప వైజ్ఞానిక ఆవిష్కరణలు జరిగాయి.

ఒకవేళ **గెలీలియో** బైబిల్‌లో చెప్పినట్లు 'భూమి బల్లపరుపుగా ఉంది' అనే విషయాన్ని స్వతః ప్రమాణంగా తీసుకొని ఉంటే, అతను 'భూమి గుండ్రంగా ఉంది' అనే విషయాన్ని అంగీకరించేవాడే కాదు. అలాగే **కెప్లర్*** బైబిల్ చెప్పే సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని అంగీకరించినట్లైతే భూభ్రమణాన్ని, మూడు గ్రహగతుల నియమాల్ని ఆవిష్కరించేవాడా? నిజానికి బైబిల్ గ్రంథాన్ని స్వతః ప్రమాణంగా ఆమోదించినట్లైతే **న్యూటన్*** తన గురుత్వాకర్షణ నియమాల్ని ఎలా కనుగొనేవాడు? అలాగే... **ఐన్‌స్టీన్*** కూడా తన సాపేక్షత అనే మహత్తర సిద్ధాంతాన్ని ఆవిష్కరించి ఉండేవాడు కాదు. నిజానికి విద్యాపరమైన, వైజ్ఞానికపరమైన ప్రగతి మత గ్రంథాల స్వతః ప్రమాణాన్ని తిరస్కరించడం వల్లే జరిగింది.

వ్యవహారంలో ఎవరు తమ ధర్మగ్రంథాల్ని స్వతః ప్రామాణికాలని అంగీకరిస్తారు? మత గ్రంథాలు తమ తమ కాలాల నాటి మూఢ నమ్మకాలు, తప్పుడు ఆచారాలతో

నిండి ఉంటాయి. అవి ఆ కాలం నాటి ధార్మిక (మత), సామాజిక, రాజనీతి మొదలైన వాటిని పెంచి పోషించేవిగా ఉంటాయి. కొన్ని శతాబ్దాలు గడిచాక, ఆ విషయాలు జీవం కోల్పోతాయి. అయినా అవి ఆ చచ్చిన శవాల్ని అంటిపెట్టుకొనే ఉంటాయి. **'సెయింట్ పాల్'** కాలం నాడు స్త్రీలు తమ తలల్ని కప్పుకోవడం ఒక మంచి ఫేషన్‌గా భావించి ఉండొచ్చు. – కానీ, ఆనాటి రాతలను అనుసరించి నేటి ఐరోపా ఆడవారితో చర్చిల్లోనూ, కోర్టుల్లోనూ ప్రమాణం చేసే సమయంలో తలమీద టోపీలు ధరించాలని ఎందుకు ఒత్తిడి తెస్తున్నారు? ప్రస్తుత సమాజంలో అలా చేయవలసిన అవసరం లేనప్పటికీ ఎందుకు అలా చేయవలసి వస్తోంది?

గ్రంథాలే ప్రామాణికాలైతే, గ్రంథకర్తను అన్ని దేశాల్లోనూ, అన్ని కాలాల్లోనూ, అన్ని వస్తువులకూ సంబంధించి... అతనినే సర్వం తెలిసిన వానిగా భావించాల్సి ఉంటుంది. పైగా మనం పుట్టక ముందే కొన్ని వేల సంవత్సరాలకు పూర్వమే, ఈనాడు మనం చేసే మంచీ, చెడులు ఆ గ్రంథకర్తకు తెలిసి ఉండాలి. ఇక మనం అలా చేస్తే, విధి లేక దానికి బాధ్యులమవుతాము, లేకపోతే అతని (గ్రంథకర్త) సర్వజ్ఞత తప్పు అవుతుంది. అలాంటప్పుడు మనిషి ఆ సర్వజ్ఞుని చేతిలో కీలుబొమ్మ కాడా? మరి అలాంటి కీలుబొమ్మకి మంచీ – చెడుల్ని ఎంచుకోవడం, వాటిని చేయడంలో అధికారం ఎక్కడిది? అప్పుడు ఇలాంటి ధర్మాలు, వారి ధార్మిక గ్రంథాలూ, అందులో చెప్పబడిన విద్యాపరమైన విషయాలవల్ల ఉపయోగం ఏమిటి? మచ్చలేని విధంగా స్వేచ్ఛాయుతంగా బ్రతకడానికి మనిషి స్వతంత్రుడు కావాలి. కర్మలు చేసే స్వేచ్ఛ కావాలంటే అందుకు బుద్ధిపరమైన స్వేచ్ఛ కావాలి. మరి బౌద్ధిక స్వాతంత్ర్యం ఉండాలంటే ఏదైనా ఒక (మత) గ్రంథానికి బానిసై ఉండకూడదు. ఏ గ్రంథమైనా ప్రామాణికం అని చెప్పడానికి అది వారి బుద్ధి మీద ఆధారపడి ఉంటుందా? లేక బుద్ధి యొక్క ప్రామాణికత గ్రంథం మీద ఆధారపడి ఉంటుందా?

* * *

పైన వివరించిన మూడు విషయాలూ (ఈశ్వర వాదం, ఆత్మ నిత్యతా వాదం, గ్రంథం స్వతః ప్రమాణం అని చెప్పే వాదం) ఒప్పుకోకూడని అంటే అంగీకరించలేని విషయాలు అని చెప్తుంది బౌద్ధం.

# 4. జీవన ప్రవాహం ఈ శరీరానికి ముందూ తర్వాత కూడా ఉంటుందని అంగీకరించడం

శిశువుగా పుట్టడంతో జీవి జీవనం ప్రారంభమవుతుంది. శిశువు అంటే ఏమిటి? అది శరీరం, మనస్సుల సముదాయం. శరీరానికి కూడా ఎలాంటి కొలమానం (యూనిట్) లేదు. అది ఒకే కాలంలో ఉండే అసంఖ్యాక అణువుల సమూహం. ఇందులోని ప్రతి అణువూ ప్రతిక్షణం మారుతూ ఉంటుంది. దాని స్థానంలో దానికి సమానమైన వేరొక అణువు ఉత్పన్నం అవుతూ ఉంటుంది. ఈ విధంగా క్షణ క్షణం శరీరంలో మార్పు వస్తూనే ఉంటుంది. కొన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడున్న శరీరం ఉండదు. మనకు కన్పించే ఈ మార్పు పరమాణువుల ద్వారా జరుగుతుంది. అందుకే మనం అంటాం 'అది అదే' అని. ఏ విషయాన్నైతే శరీరానికి చెప్తున్నామో అదే మనస్సుకూ వర్తిస్తుంది. తేడా ఏమిటంటే మనస్సు సూక్ష్మమైనది. దాని మార్పూ సూక్ష్మమైనదే. అలాగే దాని పూర్వ – పర (పుట్టే – గిట్టే) రూపాల భేదం కూడా సూక్ష్మమైనదే కావడం వల్ల వాటి తేడాల్ని అర్థం చేసుకోవడం కష్టం. ఆత్మ, మనస్సు ఒక్కటే. ఆత్మ క్షణ క్షణం పరివర్తన చెందుతూ ఉంటుంది.

శరీరమూ, మనస్సూ (ఆత్మ) ఈ రెండూ క్షణ క్షణం పరివర్తన చెందేవే.

ఏదో ఒక క్షణంలో ఓ పిల్లవాని జీవితాన్ని తీసుకోండి. అతడు తన పూర్వపు జీవన అంశాల ప్రభావం చేత ప్రభావితుడైనట్లు మనకు తెలుస్తుంది. 'అ' 'ఆ' లు నేర్చుకోవడంతో ప్రారంభించి, మధ్యలోని అక్షరాల్ని వదిలి పెట్టి చివరి అక్షరాల్ని నేర్చుకుంటాడా? **'ఇంటర్'** పరీక్ష ఉత్తీర్ణుడు కాని వాడు **'యం.ఏ.'** పరీక్షకు సిద్ధమవుతాడా? ఈ విధంగా కార్యకారణ సంబంధం వరుస క్రమం ఒక గొలుసులా పుట్టిన నాటి నుండి గిట్టేదాకా ఒక ఎడతెగని బంధంగా ఉంటుంది. ఇక్కడొక ప్రశ్న, అదేమంటే – జీవితం ఇంత దీర్ఘకాలం పాటు కార్యకారణ సంబంధంపై ఆధారపడ్తున్నట్లు కనిపిస్తుంది. ఏదీ 'అనుకోకుండా జరుగుతుంది' అన్పించడం లేదు. మరి అలాంటప్పుడు – జీవిత ప్రారంభదశలో ఈ కార్యకారణ సంబంధాన్ని నిరాకరించి, మనం పుట్టుకను 'అనుకోకుండా జరుగుతుంది' అని అంగీకరించడం లేదా? 'అనుకోకుండా జరగడం' అనేది ఎటువంటి సిద్ధాంతమూ కాదు. ఎందుకంటే కార్యకారణ సంబంధ నియమాలను బట్టి దాన్ని తిరస్కరించాల్సి ఉంటుంది. కార్యకారణ సంబంధం లేకుండా ఏ విషయాన్నీ ఋజువు చేయలేము.

తల్లిదండ్రుల శరీరంలాగా వారి బిడ్డ శరీరం ఉంటుంది. అలాగే వారి మనస్సుకు వలే బిడ్డ మనస్సూ ఉంటుంది. ఈ విషయం కొంత సరైనదే అయినప్పటికీ, అక్షరాలా సరైనది కాదు.

ఒకవేళ అలాగే అయితే, తెలివితక్కువ తల్లిదండ్రులకు తెలివైన బిడ్డలు కలగడం, లేదా తెలివైన తల్లిదండ్రులకు తెలివిలేని పిల్లలు పుట్టడం జరగదు కదా? పండిత పుత్రులు ఎక్కువగా మూర్ఖులుగా కన్పిస్తారు! – మనం ఈ జీవన ప్రవాహాన్ని ఈ శరీరం ధరించడానికంటే ముందు నుండే తెలుసుకోగలిగితే ఈ ఇబ్బంది వచ్చేదే కాదు. మనం ఈ విధంగా చెప్పుకోవచ్చు: "ప్రతి పూర్వ జీవితం మార్పు చెందిన మరో కొత్త జీవితాన్ని నిర్మిస్తుంది" అని.

గనుల నుండి తీసిన ముడి లోహం (ముడి ఇనుము), ముడి లోహం కరిగించగా వచ్చే శుద్ధి లోహం (ఇనుము), అనేక సార్లు కరిగించి చల్లబరచిన లోహం (ఉక్కు) – ఏదైనా ఒక్కటే. మూడూ లోహాలే. కానీ వాటి సంస్కారాల్లో ఎక్కువ తక్కువలు ఉంటాయి. అదే విధంగా మనం కూడా ఈ ఎక్కువ తక్కువ సంస్కారాల్ని పొందుతూ ఉంటాం. తెలివైన పిల్లవాని బుద్ధి ఎంతో అభ్యాసం చేత సంస్కరించబడి ఉక్కులా అవుతుంది. మానసిక అభ్యాసం, జ్ఞాపకాల (స్మృతి) రూపంలో ఎల్లప్పుడూ అదే విధంగా నిలచి ఉండడం అంత అవసరమేం కాదు. కానీ, దానికి సంబంధించిన సంస్కృతి మాత్రం పోకుండా ఉండటం చాలా అవసరం.

ఈ జన్మలోనే – మనం కాలేజీ చదువు ముగించిన తర్వాత కొద్ది సంవత్సరాలలోనే, మనం పాఠ్యపుస్తకాలలో అనేక సార్లు వల్లించిన విషయాలూ, సూత్రాలూ మర్చేపోతాం. కానీ, దీనివల్ల మన పూర్తి అధ్యయనం వ్యర్థమైపోదు. కొద్ది రోజులు నిల్వ ఉంచి తీసిన పరిశుభ్రమైన నెయ్యిలాగా, విద్యాధ్యయన సంస్కారాలు మనస్సు లోపల మిగిలే ఉంటాయి. విద్య యొక్క ఫలితం అదే. కాలేజీ వదిలిన తర్వాత కొన్నేళ్ళు గడచినప్పటికీ, చదివిన విషయాలు మరచిపోయినప్పటికీ, మనిషి మానసిక సంస్కృతి, అతని విద్యాభ్యాసానికి ప్రమాణంగా ఉంటుంది. అదే విధంగా బాల్యంలో అతనిలోంచి తొంగి చూచే ప్రతిభ అతను పూర్వం అభ్యసించిన దాని ఫలితం అని ఎందుకు అనుకోకూడదు?

అనువంశికత, వాతావరణం మానసిక శక్తి యొక్క అన్ని అంశాలకూ కారణం కాదు. అందుకు కొన్ని అంశాలే సరిపోతాయి. (మేధావితనం, మందబుద్ధితనం,

ఇలా అనేకమైన తల్లిదండ్రులకు సంబంధించని గుణాలు తరచూ మనకి కనిపిస్తూ ఉంటాయి). వీటికి కారణాలు వారి పూర్వపు జీవన ప్రవాహంలో అన్వేషించాల్సి ఉంటుంది. ఒక యువకుడు సాధనతో, అధ్యయనం చేసి ఎం.ఏ. ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడను కుందాం. ఆ ఫలితాన్ని పొందకుండానే అతను జీవితాన్ని అంతం చేసుకొన్నాడను కొందాం. అతని శ్రమ, కష్టం అతనితోనే నష్టమైపోతుందా? మరి, అది ఓ ప్రతిభావంతుడైన శిశువులో కన్పిస్తే...!

పరమ పామరులైన తల్లిదండ్రులకు అసాధారణ గణితవేత్త, సంగీతజ్ఞుడు శిశువుగా జన్మించడం మనం చూస్తున్నాం. పై క్రమంలో ఆలోచించినట్లయితే మన శరీరం యొక్క ఈ జీవన ప్రవాహం మనకు తెలుస్తుంది. ఒక సుదీర్ఘ జీవన ప్రవాహంలో మధ్యలో ఉండే ఒక చిన్న ప్రవాహపు తునక ఈ జీవితం. అది ఒక ప్రవాహంలో ఒక అంశ (భాగం) మాత్రమే. ప్రవాహం మునుపు ఎప్పటినుండో వస్తూ ఉంది, రాబోయే కాలంలో సైతం ఎంతో కాలం పాటు కొనసాగుతూనే ఉంటుంది. – కాబట్టి అది చిరకాలం అని చెప్పొచ్చు.

ఎన్నెన్నో ఏళ్ళ నుండి పోగుచేసిన రాశిలో కొన్నేళ్ళు పోగు చేసుకున్న సంస్కారాలు ఎటువంటి ప్రత్యేక ప్రభావాన్ని చూపలేవు. ఎలాగంటే... ఉప్పు సముద్రంలో చిన్న పటిక బెల్లం ముక్క పడేసినట్లుగా. ఈ జీవ ప్రవాహం ఈ శరీరానికి ఈ శరీరం కంటే ముందు నుండే ఉంది. తర్వాత కూడా ఉంటుంది. అయినప్పటికీ... ఇది అనాది కాదు, అనంతం కాదు. దీని ప్రారంభం కోరిక (తపన), స్వార్థం మీద ఆధారపడి ఉంటుంది. కోరికల తపన నశించడంతో ఇది కూడా నశిస్తుంది. జీవన ప్రవాహం ఈ శరీరానికి ముందు, తదనంతరం కాలంలో ఉన్నట్లుగా భావించితే, మనం పనికిరాని వాణ్ణే కాదు, పరమ పనికిమాలిన వాణ్ణి సైతం మహోన్నతుణ్ని చేయవచ్చు అనే ఆశ కల్పించిన వాళ్ళమవుతాం.

ఒక ఉన్నత ఆదర్శం కోసం, సమాజం కోసం, లేదా ఇతరుల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అర్పించే మహోన్నతులు తక్కువేం కాదు – మనిషి తన మంచీ, చెడుల బాధ్యతల్ని గుర్తించి, ఇతరుల నుండి తనకు అపకారం కలగకుండా చూసుకుంటాడు. సమాజ శ్రేయస్సు కోసం ఆత్మబలిదానానికి సిద్ధమవడం, సమాజానికి అపకారం చేయకుండా ఆత్మ నిగ్రహాన్ని కల్గి ఉండటం – ఈ రెండు

విషయాలూ లోకోన్నతి కోసం అనివార్యం. లోకోన్నతి సహజంగా ఈ రెండు విషయాల మీదే ఆధారపడి ఉంటుంది. లోకోన్నతి కోరే కొందరు వ్యక్తులు సమాజ శ్రేయస్సు కోసం పాడుపడటం మనం చూస్తున్నాం. వ్యక్తుల్లో ఈ పాటుపడే ప్రక్రియ ఎప్పటినుండో జీవిత ప్రవాహం నుండి వస్తున్న లక్షణం కాదు. ఆ వ్యక్తిలో కొద్దికాలం క్రితమే – అంటే ఈ జీవిత కాలంలో కొద్దికాలం నుండే వచ్చిన మార్పు. ఏదో ఒక భావం అతని జీవిత ప్రవాహాన్ని ప్రేరేపించాలి. ఈ శరీరానికి ఆది ఉంది, అంతం ఉంది అని ఒప్పుకుంటే ఈ రెండు స్థితుల్ని ప్రేరేపించే స్థితి గల ఏదో ఒక భావం లేకపోతే కొరత ఏర్పడి, మనిషి యెదుగుదలలో అంతరాయం కల్గుతుంది. దీని ఫలితంగా పతనం ఆరంభమవుతుంది.

✳ ✳ ✳

బుద్ధుని బోధనలు, దార్శనిక చింతన పైన చెప్పిన నాలుగు సిద్ధాంతాలపై ఆధారపడి ఉంటుంది. వీటిలో మొదటి మూడు సిద్ధాంతాలూ బౌద్ధ ధర్మాన్ని ప్రపంచంలో ఇతర ధర్మాలకు భిన్నంగా ఉంచుతాయి. ఈ మూడు సిద్ధాంతాలూ భౌతికవాదంలో, బౌద్ధంలోనూ ఒకటే. కానీ, నాల్గవది – అంటే, జీవన ప్రవాహానికి ఈ శరీరం మాత్రమే హద్దు కాదు అని అంగీకరించడం, భౌతిక వాదానికి భిన్నమైనది. అయితే ఇది వ్యక్తి కోసం భవిష్యత్తుని ఆశామయం చేసే ఒక అందమైన ఉపాయం. ఇది లేకుండా ఏ ఆదర్శవాదమూ కార్యరూపంలోకి మార్పు చెందదు.

ఈ నాలుగు సిద్ధాంతాల్లో మొదటి మూడూ మనిషిని బానిసత్వం నుండి విముక్తుణ్ణి చేస్తాయి. నాల్గవది ఆశాజనకమైన భవిష్యత్తును గూర్చి సందేశాన్నిస్తుంది. శీలానికీ, సదాచారానికీ పునాది వేస్తుంది.

ఈ నాలుగు సిద్ధాంతాల్ని ఒకే చోట చేర్చేదే బుద్ధ ధర్మం.

# గౌతమ బుద్ధుడు
**(క్రీ.పూ. 563-483)**

క్షణిక–అనాత్మతా వాదంగా పేరుపొందిన బౌద్ధ దర్శనం – భారతీయ దార్శనికులు రెండు వేల సంవత్సరాలకు పైగా మేధోపరిశ్రమతో సాధించిన అత్యున్నత ఫలితం. ఈ దర్శన ప్రవాహ ప్రభావం చాలా కాలం వరకూ భారతీయ దార్శనికుల మీద పనిచేసింది. ఈ సజీవ దార్శనిక ధార ఎంతోకాలంగా కొనసాగుతూ వచ్చింది. బుద్ధుని తర్వాత బౌద్ధ దర్శన విరివనంలో ప్రభవించిన **నాగార్జునుడు, అసంగుడు, వసుబంధు, దిఙ్నాగుడు, ధర్మకీర్తి** – మొదలైన మహోన్నత దార్శనికుల ప్రతిభా పరిమళాలు ఈ సజీవ ధార నుండే పుట్టుకువచ్చాయి. ఇక, ఆ తర్వాత భారతదేశంలో పుట్టుకొచ్చిన దార్శనికులందరూ వీరు మిగిల్చిన 'ఎంగిలి' తిని బ్రతికిన వారే!

## 1. బుద్ధుని జీవితం

**సిద్ధార్థుడు** క్రీ.పూ. 563లో జన్మించాడు. తండ్రి శాక్యవంశ **శుద్ధోధనుడు**. ఇతణ్ణి జశాక్యుల రాజు అనేవారు. శుద్ధోధనునితో పాటు ఇదే శాక్యవంశానికి చెందిన బద్ధియు[1], దండపాణి[2] మొదలైన వారిని కూడా శాక్యరాజులుగా పిలవడం మనం గమనిస్తాం. అంటే – ఇక్కడ 'రాజు' అనేది కేవలం ఒక చక్రవర్తికే కాకుండా – గణసంస్థ సభ్యులందర్నీ 'రాజు' పేరుతోనే పిలుస్తారని తెలుస్తుంది. ఇలాంటి సంప్రదాయం ఒక్క శాక్యగణంలోనే కాకుండా ఇతర గణాలలో కూడా ఉంది. **లిచ్ఛవీ*** గణసంస్థ సభ్యుల్ని కూడా 'రాజు' అనే బిరుదు నామంతోనే పిలిచేవారు.

సిద్ధార్థుని తల్లి **మాయాదేవి**. ఆమె పురుటికి పుట్టింటికి వెళ్తూ, శాక్యుల రాజధాని **కపిలవస్తు** నుండి బయలుదేరింది. కానీ, దారిలోనే **లుంబినీ** అనే సాలవనంలో ప్రసవించింది. సిద్ధార్థుడు జన్మించిన ఆ ప్రదేశంలో ఆ తర్వాత 318 సంవత్సరాలకు, తాను సింహాసనం అధిష్ఠించిన ఇరవై ఏళ్ళకు అశోకుడు ఒక రాతి స్థంభం నెలకొల్పాడు. ఆ స్తంభం ఈనాటికీ అక్కడ ఉంది.

సిద్ధార్థుడు పుట్టిన ఏడో రోజు, మాయాదేవి మరణించింది. ఆ తర్వాత పినతల్లి – సవతితల్లి అయిన **ప్రజాపతి గోతమి*** సిద్ధార్థుణ్ణి ప్రేమతో సాకింది.

సిద్ధార్థుడు పెరిగి పెద్దవాడయ్యాడు. యుక్తవయస్సులో కూడా ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి కనపరచేవాడు కాదు. దీనితో తన కుమారుడు 'ఎక్కడ విరాగి అవుతాడో? ఎక్కడ సాధువుల్లో కలసిపోతాడో? ఎప్పుడు ఇల్లూ వాకిలీ వదలిపోతాడో?' అనే భయం శుద్ధోధనునికి పట్టుకొంది. కుమారునికి పెళ్ళి చేయాలని అనుకొన్నాడు. తమ పొరుగున ఉన్న – **కొలియ** గణానికి చెందిన, సౌందర్య రాశి, **బద్దకాపిలాయని*** (యశోధర) తో వివాహం జరిపించాడు. కొన్నాళ్ళు సిద్ధార్థుడు ఇంటి ధ్యాసతోనే గడిపాడు. ఇంతలో వారికి **రాహులుడు** జన్మించాడు. విశాలత్వంలో ఉదయించే తన భావాలనే చంద్రుణ్ణి అడ్డుపడటానికి పుట్టిన రాహువుగా తన బిడ్డను భావించాడు సిద్ధార్థుడు. ఈ దశలో... ఓ రోజు ఒక వృద్ధుణ్ణి, రోగినీ, శవాన్నీ, సన్యాసినీ చూశాడు. వీరిని చూడటంతో తనలో చిన్నప్పటి నుండి నుండి దాగి ఉన్న వైరాగ్య భావాలు తిరిగి పైకి లేచాయి. ఒక రాత్రి తన వారికి ఎవ్వరికీ చెప్పకుండా భార్యాబిడ్డల్ని వదలి ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. ఈ విషయాన్నే తెలియజేస్తూ బుద్ధుడు – ఆ తర్వాత ఓ మారు వత్సరాజు ఉదయనుడి కుమారుడు బోధి రాకుమారునితో **చునారు** (సుంసుమారగిరి) లో ఇలా అన్నారు –

"రాకుమారా, బుద్ధుణ్ణి కాక ముందు నాకూ అలాగే అనిపించేది. అప్పుడు నేనూ అనుకొనేవాణ్ణి – "సుఖంలో సుఖం దొరకదు. దుఃఖంలోనే సుఖం దక్కుతుంది" అని. అలా అనుకొని, మంచి యౌవనంలో ఉన్నప్పుడే, నా తల నీలాలు నల్లగా అందంగా ఉన్నప్పుడే, భోరున విలపిస్తున్న తల్లిదండ్రుల్ని వదలి వెళ్ళిపోయాను. పరివ్రాజకుణ్ణయ్యాను. అలా వెళ్ళిన నేను మొదటి గా **అలార కాలాముడు*** అనే ముని వద్దకు చేరాను".

ఆ విధంగా... అలార కాలాముని దగ్గరకు చేరిన సిద్ధార్థుడు, కాలాముని వద్ద యోగులు ఆచరించే కొన్ని విధుల్ని తెలుసుకున్నారు. దీనివల్ల సిద్ధార్థుని జిజ్ఞాస తీరలేదు. అక్కడి నుండి సిద్ధార్థుడు **ఉద్దక రామపుత్త*** అనే యోగి వద్దకు వెళ్ళారు. కొంత యోగాభ్యాసం నేర్చుకొన్నారు. అయినా అతని జ్ఞాన దాహం తీరలేదు. అక్కడి నుండి గయకు చేరారు. ఉపవాసాలతో ఆరేళ్ళు కఠోర సాధన సాగించారు.

తాను సాగించిన ఆ సాధన గురించి **బుద్ధుడు*** ఇలా చెప్పారు[4] ...

"నా శరీరం దుర్బలమైపోయింది. ఆ బలహీనతలో దాదాపుగా చావును సమీపించాను. ఎనభై ఏళ్ళ వృద్ధుని నరాల్లా నా నరాలన్నీ పట్టుదప్పాయి. శరీరంలో ప్రతి భాగం చచ్చుబడిపోయింది. పొట్ట వెన్ను కంటింది. డొక్కలు పీక్కుపోయి, పక్కటెముకలు ఒంటె గిట్టల్లా పైకి తేలాయి. ఆ ఎముకలన్నీ ఎన్నో లెక్కపెట్టవచ్చు కూడా. నూతిలో లోతుగా ఉన్న నీటిలో ప్రతిఫలించి కన్పించే చుక్కల్లా నా కళ్ళు పీక్కుపోయాయి. నా తల మీద చర్మం తయారుకాని బూడిద గుమ్మడి కాయను కోసి ఎండలో పడేసినట్లు ముడతలు పడిపోయింది. నెత్తి మీద వెంట్రుకలన్నీ ఊడిపోయాయి. చర్మం నల్లబారింది."

"ఇంత కఠోరంగా సాధన చేసినా నాకు అంతిమ జ్ఞానం లభించలేదు. దాన్ని తెలుసుకోలేకపోయాను. జ్ఞానాన్ని పొందడానికి, వేరే దారి మరేదైనా ఉందేమో?' అనిపించింది[5]. బాల్యంలో ఒకప్పుడు నేను మా పొలంలో ఉన్న నేరేడు చెట్టు క్రింద ధ్యానం చేశాను. ఇప్పుడు కూడా అదే సరైన మార్గమేమో అనిపించింది. కానీ, ఇంత బలహీనమైన స్థితిలో నేనెలా ధ్యానాన్ని నిర్వర్తించగలను? ధ్యానం వల్ల కలిగే ప్రశాంతతని, ఆనందాన్ని ఎలా అనుభవించగలను? అనిపించింది. ఇక, నేను మెల్ల మెల్లగా పప్పు-అన్నాన్ని ఆహారంగా తీసుకోసాగాను. అప్పుడు నాతో పాటు ఐదుగురు భిక్షువులు ఉండేవారు. నేను ఆహారాన్ని గ్రహించడం చూచి, చాలా నిరాశపడి, నన్ను విడిచి వెళ్ళిపోయారు."

ఆ తర్వాత తన జీవితాన్ని గూర్చి బుద్ధుడు ఇలా చెప్పారు[6]:

"అది ఒక సుందర రమణీయమైన వనం. ఆ వనంలో ప్రవహిస్తుంది నెరంజనా అనే నది. దాని తీరం తెల్లగా, అందంగా ఉంటుంది. ఆ ప్రశాంత ప్రదేశం నా ధ్యానానికి సరైనది అనిపించి, అక్కడే ధ్యానానికి కూర్చొన్నాను. చావు పుట్టుకల

పరిణామాల్ని తెలుసుకొన్నాను. జ్ఞానోదయం అయింది. జ్ఞానాన్ని దర్శించాను. పరమ నిర్వాణాన్ని తెలుసుకోగలిగాను. ఇక అప్పుడు నా మనస్సు శాంతించింది. ఇదే ఆఖరి జన్మ. ఇక మరో జన్మ కలగదు".

సిద్ధార్థుడు పొందిన ఆ జ్ఞానం ఇదే –

**దుఃఖం ఉంది.**

**ఆ దుఃఖానికి కారణం ఉంది.**

**ఆ దుఃఖం వినాశనం అవుతుంది.**

**ఆ దుఃఖం వినాశనానికీ ఒక మార్గం ఉంది.**

ధర్మాలు (వస్తువులూ, ఘటనలూ) ఉన్నాయి. అవి ఉత్పన్నమవడానికి కారణాలూ ఉన్నాయి. బుద్ధుడు ఆ ధర్మాల్ని, వాటి కారణాల్ని, వాటి నిరోధ మార్గాల్నీ చెప్పారు[7]. సిద్ధార్థుడు... క్రీ.పూ. 534 లో తన ఇరవై తొమ్మిదో ఏట ఇల్లు విడిచి వెళ్ళారు. క్రీ.పూ. 528 లో తన ముప్పై ఆరో యేట బోధిని పొంది బుద్ధుడయ్యారు. ఆ తర్వాత నలభై ఐదేళ్ళ పాటు అనేక ప్రాంతాలు తిరుగుతూ తన దర్శనాన్ని ఉపదేశిస్తూ... చివరకు క్రీ.పూ. 483లో కుసీనగరం[8] లో పరినిర్వాణం పొందారు.

## 2. సాధారణ చింతన

బుద్ధుడు – తాను కనుగొన్న 'జ్ఞానాన్ని' అంతకుముందు తనను వదిలిపెట్టి వెళ్ళిన ఐదుగురు భిక్షువులకూ మొదటిగా ఉపదేశించాలి అనుకొన్నారు. వాళ్ళు కాశీ దగ్గర **ఋషిపతనం** దగ్గర మృగదావనంలో ఉన్నారని తెలుసుకొని వారి దగ్గరకు వెళ్ళారు. తన పట్ల వారి మనస్సుల్లో దాగివున్న అనుమానాల్ని తొలగించాలనుకొని, మొదటిగా ఉపదేశాన్ని వారికే ఇచ్చారు. వారితో బుద్ధుడు ఇలా చెప్పారు[9] – "భిక్షువులారా, కామ సుఖాలలో మునిగి తేలడం, శరీరాన్ని అతిగా కష్టపెట్టడం – ఈ రెండూ అతి మార్గాలు. వీటిని విడనాడండి. నేను వీటికి భిన్నమైన మధ్యమ మార్గాన్ని కనుగొన్నాను. నేను దర్శించిన మార్గం ముక్తినిస్తుంది. జ్ఞానాన్ని కల్గిస్తుంది. శాంతి నొసగుతుంది." ఇదే మధ్యమమార్గం – ఇదే అష్టాంగ మార్గం.

i. సరైన చూపు (సమ్యక్ దృష్టి, సమ్యక్ దర్శనం)

ii. సరైన నిర్ణయం (సమ్యక్ సంకల్పం)

iii. సరైన మాట (సమ్యక్ వచనం, సమ్యక్ వాక్కు)

iv. సరైన పని (సమ్యక్ కర్మ)

v. సరైన జీవనం (సమ్యక్ జీవనం)

vi. సరైన ప్రయత్నం (సమ్యక్ ప్రయత్నం)

vii. సరైన ఎరుక (సమ్యక్ స్మృతి)

viii. సరైన ఏకాగ్రత (సమ్యక్ సమాధి) – ఇవే "అష్టాంగాలు."

## I. నాలుగు ఆర్య సత్యాలు

i. దుఃఖం (దుఃఖ సముదయం)

ii. దుఃఖ కారణం

iii. దుఃఖ నిరోధం

iv. దుఃఖ నిరోధ మార్గం –

ఈ నాలుగూ ఆర్య సత్యాలు. ఇవే శ్రేష్ఠమైన సత్యాలూ!

**i. దుఃఖం :** దుఃఖం సత్యం అనే విషయాన్ని గూర్చి బుద్ధుడు ఇలా చెప్పాడు: "జన్మ దుఃఖం. ముసలితనం దుఃఖం. మరణం దుఃఖం. శోకం, రోదన, మనోవేదన, మనోవ్యాకులత ఇవన్నీ దుఃఖాలే. ఇష్టమైనవారి వియోగం, ఇష్టం లేనివారి సంయోగం దుఃఖాలే. కోరుకున్నది అందకపోవడం దుఃఖమే. ఇవేకాక ఐదు'స్కంధాలు' (స్కంధ పంచకం) – రూపం, వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం – ఇవన్నీ దుఃఖాలే[10].

**రూపం*** : నేల, నీరు, నిప్పు, గాలి అనే ఈ నాలుగు మహాభూతాలు రూప స్కంధం.

**వేదన*** : మనకు వస్తువులతో ప్రత్యక్ష అనుబంధం వల్ల గానీ, లేదా ఆ వస్తువుల తాలూకూ మనం పొందే భావనలు (feeling) గానీ మనలో సుఖ–దుఃఖాల్ని లేదా సుఖదుఃఖాలు లేని తటస్థ(న్యూట్రల్)స్థితిని కల్గిస్తాయి. అదే వేదన.

**సంజ్ఞ** : గతంలో తెలుసుకున్న విషయాల వల్ల మన మెదడులో నిలచివున్న గుర్తింపే సంజ్ఞ. 'ఇతడు ఆ దేవదత్తుడే' అనేది సంజ్ఞ.

**సంస్కారం*** : రూపం, వేదన, సంజ్ఞల వలన ఆలోచన మీద పడే ముద్రే సంస్కారం. దేని కారణంగా 'ఇతడు ఆ దేవదత్తుడే' అని గుర్తించగలుగుతున్నామో ఆ కారణమే సంస్కారం.

**విజ్ఞానం** : చైతన్యం లేదా మనస్సే విజ్ఞానం.

వ్యక్తి తృష్ణ వల్ల (కోరికల తపన వల్ల) ఎప్పుడైతే ఈ ఐదు స్కంధాలు దగ్గరకు వస్తాయో అంటే మమేకం అవుతాయో అప్పుడు వీటిని ఉపాదాన స్కంధాలు అంటారు. బుద్ధుడు ఈ ఐదు ఉపాదాన స్కంధాలనే దుఃఖరూపం అన్నారు.

**ii. దుఃఖ కారణం :** దుఃఖానికి కారణం కోరికల తపన లేక తృష్ణ. ఇది మూడు విధాలు – కామ (భోగ) తృష్ణ, ప్రాపంచిక (భవ) తృష్ణ, ప్రపంచ రాహిత్య (విభవ) తృష్ణ. ఇంద్రియాలకు తనకు ఇష్టమైన వాటి మీద కోరిక కల్గుతుంది, లేదా వాటి తాలూకు ఆలోచనల వల్ల కోరిక కల్గుతుంది.

ఈ ఇష్టమైన వాటిని అనుభవించడం కోసం లేదా వాటి మీద కోరిక వల్లే – ఒక రాజు మరోరాజుతో యుద్ధం చేస్తాడు. క్షత్రియుడు క్షత్రియునితో, బ్రాహ్మణుడు బ్రాహ్మణునితో, వైద్యుడు వైద్యునితో, తల్లి తనయునితో, తనయుడు తల్లితో, సోదరుడు మరో సోదరునితో, ఒక సోదరుడు సోదరితో, సోదరి సోదరులతో, మిత్రుడు మిత్రునితో తగాదాలు పడతారు, తన్నుకొంటారు. అస్త్రశస్త్రాలు ఉపయోగిస్తారు. చస్తారు. లేదా చావుకు సమానమైన దుఃఖాన్ని అనుభవిస్తారు.

**iii. దుఃఖ నిరోధం :** పైన చెప్పిన కోరికల తపనను వదలిపెట్టడం, ఆ తపన దగ్గరకు రాకుండా చేయడమే దుఃఖ నిరోధం. అంటే దుఃఖాన్ని అడ్డుకోవడం. ఇష్టమైన వాటి మీద వాంఛలూ, సుఖాలూ – వీటన్నిటినీ అడ్డుకోగల్గినప్పుడే కోరికను జయించగలం. అంటే నాశం చేయగలం.

కోరిక ఎప్పుడైతే నశిస్తుందో – సుఖాల్ని సమకూర్చుకోవాలన్న లంపట నశిస్తుంది. అంటే ఇంద్రియాల్ని జయిస్తాం. దానితో జన్మకు (పునర్జన్మకు) అడ్డుకట్ట వేయడం తేలికవుతుంది. ఎప్పుడైతే ఈ చావు పుట్టుకల జన్మ నిరోధించబడుతుందో – వృద్ధాప్యం, మరణం, రోగం, శోకం, రోదన, దుఃఖం, మనోవేదన, మనోవ్యాకులతలు – ఇవన్నీ నశిస్తాయి. ఈ విధంగా దుఃఖాన్ని అడ్డుకోవచ్చు. అంటే దరిచేరకుండా చూడవచ్చు.

ఈ దుఃఖ నిరోధ – దుఃఖ వినాశన – సూత్రమే బుద్ధుని దర్శనానికంతటికీ కేంద్ర బిందువు.

**iv. దుఃఖ నిరోధ మార్గం :** దుఃఖాన్ని అడ్డుకొనే మార్గం ఏమిటి? అష్టాంగ మార్గమే ఆ మార్గం. ఈ **'అష్టాంగమార్గం'** ముఖ్యంగా మూడు భాగాలు –

A) జ్ఞానం లేదా ప్రజ్ఞ
B) సదాచారం లేదా శీలం
C) యోగం లేదా సమాధి

| | | |
|---|---|---|
| A) జ్ఞానం (లేదా) ప్రజ్ఞ | : | 1. సరైన చూపు (సమ్యక్ దృష్టి) |
| | | 2. సరైన నిర్ణయం (సమ్యక్ సంకల్పం) |
| | | 3. సరైన మాట (సమ్యక్ వాక్కు) |
| B) సదాచారం లేదా శీలం | : | 4. సరైన పని (సమ్యక్ కర్మ) |
| | | 5. సరైన జీవనం (సమ్యక్ జీవనం) |
| | | 6. సరైన ప్రయత్నం (సమ్యక్ ప్రయత్నం) |
| C) యోగం (లేదా) సమాధి | : | 7. సరైన ఎరుక (సమ్యక్ స్మృతి) |
| | | 8. సరైన ఏకాగ్రత (సమ్యక్ సమాధి) |

**A) జ్ఞానం లేదా ప్రజ్ఞ :** మనం శారీరకంగా, మానసికంగా, మాటలపరంగా చేసే పనుల్లో మంచి పనులేవో, చెడ్డపనులేవో సరిగా తెలుసుకొనే జ్ఞానమే సరైన జ్ఞానం. మంచీ–చెడు పనులు ఈ విధంగా ఉంటాయి.

| | **చెడ్డ పనులు** | **మంచి పనులు** |
|---|---|---|
| శారీరకంగా | 1. హింసచేయడం | 1. అహింస |
| చేసే పనులు | 2. దొంగతనం చేయడం | 2. దొంగతనం చేయకపోవడం |
| | 3. వ్యభిచరించడం | 3. వ్యభిచరించకపోవడం |
| | 4. అబద్ధం చెప్పడం | 4. నిజాలు పల్కడం |
| మాటల రూపంగా | 5. చాడీలు చెప్పడం | 5. చాడీలు చెప్పకపోవడం |
| చేసే పనులు | 6. పరుషంగా పలకడం | 6. సౌమ్యంగా మాట్లాడటం |

| | | |
|---|---|---|
| | 7. వ్యర్థ ప్రేలాపన | 7.వ్యర్థ ప్రేలాపన చేయకపోవడం |
| | 8. లోభం చూపించడం | 8. లోభం లేకపోవడం చేసే |
| మానసికంగా | 9. ప్రతిహింస చేయడం | 9. ప్రతిహింస చేయకపోవడం |
| పనులు | 10. దురభిప్రాయం ఏర్పరచుకోవడం | 10. సరైన అభిప్రాయం ఏర్పరచుకోవడం |

**సరైనచూపు (సమ్యక్ దృష్టి) :** దుఃఖం, దుఃఖానికి కారణం, దుఃఖ నిరోధం,దుఃఖ నిరోధ మార్గం – వీటిని గూర్చిన సరైన జ్ఞానాన్ని కలిగి ఉండడం సమ్యక్ దృష్టి.

**సరైన నిర్ణయం (సమ్యక్ సంకల్పం) :** సరైన సంకల్పం అంటే హింసలేని, ప్రతిహింసలేని, వ్యామోహంలేని నిర్ణయాన్ని ఎంచుకోవడం.

**B) సదాచారం లేదా శీలం**

**సరైన మాట (సమ్యక్ వాక్కు) :** అబద్ధాలు, చాడీలు, కఠిన పలుకులు, అర్థంపర్థం లేని మాటలు, అనవసర ప్రసంగాలు – ఇవన్నీ లేకుండా మాట్లాడే మాటలు.

**సరైన పని (సమ్యక్ కర్మ) :** హింసలేని, దొంగతనం లేని, వ్యభిచారం లేని పనులు సరైన పనులు.

**సరైన జీవనం (సమ్యక్ జీవనం) :** చెడ్డగా బ్రతికే విధానాన్ని వదలిపెట్టి, మంచి జీవన విధానాల్లో బ్రతకడం సరైన జీవనం. అంటే బ్రతకడం కోసం, సంపాదన కోసం చెడ్డ మార్గాలు, తప్పుడు విధానాలు –అవలంబించకపోవడం ఆనాటి పాలకవర్గాలు ఆమోదించిన – ఆయుధాల వ్యాపారం, ప్రాణుల వ్యాపారం, మాంసం వ్యాపారం, మద్యం వ్యాపారం, విషపదార్థాల వ్యాపారంపై వ్యాపారాల్ని, వృత్తుల్ని చెడ్డవిగా పేర్కొన్నారు బుద్ధుడు.[11]

**C) యోగం లేదా సమాధి**

**సరైన ప్రయత్నం (సమ్యక్ ప్రయత్నం) :** వ్యాయామం, ఇంద్రియాల్ని అదుపులో పెట్టుకోవడం ద్వారా చెడ్డ ఆలోచనలు రాకుండా చేసుకోవడం. ఇలా నిరోధించడం వల్ల మంచి ఆలోచనలు పుట్టేలా చేయడం. అలా పుట్టిన మంచి ఆలోచనల్ని స్థిరపరచుకోవడమే సరైన ప్రయత్నం.

**సరైన ఎరుక (సమ్యక్ స్మృతి) :** శరీర ధర్మాలు, వేదన, చిత్తం, మనస్సు– వీటి ధర్మాలు క్షణక్షణం నశిస్తూ, ఉత్పత్తి అవుతూ ఉంటాయి. ఈ విషయాల్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవడమే, అవగాహన చేసుకోవడమే సరైన ఎరుక.

**సరైన ఏకాగ్రత (సమ్యక్ సమాధి) :** మనో ఏకాగ్రతను సమాధి అంటారు[12]. మనస్సు అటూ, ఇటూ చలించడాన్ని నిరోధించేది, అన్ని మానసిక వృత్తుల్ని అరికట్టేదే సరైన సమాధి. బుద్ధుడు ప్రబోధించిన

ఉపదేశాలలో ఒకచోట ఇలా ఉంది –

"ఏలాంటి చెడునూ చేయకుండా ఉండడం. మంచిని పెంపొందించుకోవడం. ఓర్పును కల్గి ఉండటం." సంక్షిప్తంగా ఇదే బుద్ధుని ఉపదేశాల సారం. ఈ ఉపదేశాల ప్రయోజనం ఏమిటి? దానిని గురించి బుద్ధుడు ఈ విధంగా చెప్పారు[13] –

"భిక్షువులారా, ఈ భిక్షుజీవనం కేవలం లాభం కోసం కాదు. సత్కారాలు, ప్రశంసల కొరకే కాదు. సదాచారం (సత్‌శీలం) కొరకే కాదు. సమాధిని పొందడానికే కాదు. జ్ఞానం కోసమే కాదు. అవిచ్ఛిన్నము, శాశ్వతమూ అయిన చిత్త ముక్తి కొరకు మాత్రమే భిక్షు జీవనాన్ని అభ్యసించండి. గడపండి. ఇదే అంతిమ సారం!" బౌద్ధ దర్శనాన్ని – బుద్ధుని దార్శనిక అభిప్రాయాల్ని తెలుసుకొనేముందు మనం ఇంతకుముందు వదిలిపెట్టిన బుద్ధుని జీవితంలోని మిగిలిన విషయాల్ని తెలుసుకోవాలి.

(...మృగదావనంలో ఉన్న ఐదుగురు తన సహచర భిక్షువులకు తాను కనుగొన్న విషయాల్ని– అష్టాంగ మార్గాన్ని– ఉపదేశించారు. ఆ తర్వాత...)

బుద్ధుడు **ధర్మప్రచారం*** ప్రారంభించారు. తన తొలి ధర్మోపదేశాన్ని **సారనాథ్***లో చేశారు. ఆ వర్షాకాలం అక్కడే గడిపారు. ఆ నాల్గునెలల్లో 60 మంది ఆయన శిష్యులుగా మారారు. ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్తూ తన శిష్యులతో బుద్ధుడు[14] –

"భిక్షువులారా, పర్యటించండి. బహుజనుల సుఖం కొరకు, వారి హితం కొరకు, పర్యటించండి. లోకం మీద దయను పెంపొందించడం కోసం పర్యటించండి. దేవ–మానవ శ్రేయస్సు కోసం పర్యటించండి. పర్యటనలో ఒకేమారు (ఒకే ప్రదేశానికి) ఇద్దరు వెళ్ళకండి... ఒక్కొక్కరుగా వెళ్ళండి... నేను **ఉరువేల***, సేనాని గ్రామాలకు ధర్మోపదేశం కోసం వెళ్తున్నాను..." అని చెప్పారు.

ఆ తర్వాత బుద్ధుడు వర్షాకాలం మూడు నెలలు మినహా మిగతా కాలమంతా ప్రజలకు ధర్మాన్ని గూర్చి బోధిస్తూనే గడిపారు.[15] బుద్ధుడు బుద్ధత్వాన్ని పొందిన తర్వాత తాను జీవించిన 44 సంవత్సరాల్లో ఈ క్రింది ప్రదేశాల్లో వర్షాకాలంలో మూడు నెలలను గడిపారు.

| | | |
|---|---|---|
| **బుద్ధుని జననం** | లుంబిని | క్రీ.పూ. 563 |
| **బుద్ధత్వాన్ని పొందడం** (జ్ఞానోదయం) | బుద్ధగయ | క్రీ.పూ. 528 |
| **ధర్మచక్ర ప్రవర్తనం** | | |
| మొదటిసం॥ | ఋషిపతనంలో (సారనాథ్) | క్రీ.పూ. 528 |
| 2,3,4 సం॥లు | రాజగృహంలో | క్రీ.పూ. 527-525 |
| 5వ సం॥ | వైశాలిలో | క్రీ.పూ. 524 |
| 6వ సం॥ | మంకుల పర్వతం(విహార) | క్రీ.పూ. 523 |
| 7వ సం॥ | త్రయాత్రింశ | క్రీ.పూ. 522 |
| 8వ సం॥ | శుంశుమారగిరి (చునార్) | క్రీ.పూ. 521 |
| 9వ సం॥ | కౌశాంబి (అలహాబాద్) | క్రీ.పూ. 520 |
| 10వ సం॥ | పారిలేయక్(మీర్జాపూర్) | క్రీ.పూ. 519 |
| 11వ సం॥ | నాలా (విహార్) | క్రీ.పూ. 518 |
| 12వ సం॥ | వైరంజా (కనౌజ్, మధురల మధ్య) | క్రీ.పూ. 517 |
| 13వ సం॥ | చాలియ పర్వతం (విహారం) | క్రీ.పూ. 516 |
| 14వ సం॥ | శ్రావస్తి (గోండ) | క్రీ.పూ. 515 |
| 15వ సం॥ | కపిలవస్తు | క్రీ.పూ. 514 |
| 16వ సం॥ | ఆల్వి (అవవల్) | క్రీ.పూ. 513 |
| 17వ సం॥ | రాజగృహం | క్రీ.పూ. 512 |
| 18వ సం॥ | చాలియ పర్వతం (విహారం) | క్రీ.పూ. 511 |
| 19వ సం॥ | చాలియ పర్వతం (విహారం) | క్రీ.పూ. 510 |

| | | |
|---|---|---|
| 20వ సం॥ | రాజగృహం | క్రీ.పూ. 509 |
| 21-45 సం॥లు | శ్రావస్తి | క్రీ.పూ. 509-484 |
| 46వ సం॥ | వైశాలి | క్రీ.పూ. 483 |
| | కుసీనగరంలో నిర్వాణం | క్రీ.పూ. 483 |

వర్షావాసం (3 నెలలు) మినహా మిగతా కాలమంతా బుద్ధుడు విస్తృతంగా తిరుగుతూ ధర్మోపదేశం చేశారు. ఆయన తన జీవిత కాలంలో యుక్తప్రాంతం (ఉత్తర ప్రదేశ్, నేపాల్), బీహార్ ప్రాంతంలోనే సంచరించారు. ఆ ప్రదేశాలు దాటి బయటికి వెళ్ళలేదు.

## II. జనతంత్ర వాదం (ప్రజాతంత్ర వాదం)

బుద్ధుడు అతిభోగవంతమైన విలాస జీవనాన్ని ఒప్పుకోలేదు. దానిని అసహ్యంగా భావించారు. అలాగే శరీరాన్ని అతిగా ఎండబెట్టే కఠిన ఉపవాసాల్నీ అంగీకరించలేదు. దీన్నీ మూర్ఖత్వంగానే భావించారు. భక్తి, కర్మకాండలకన్నా జ్ఞానానికీ, బుద్ధివాదానికే ప్రాముఖ్యతనిచ్చారు. ఆయన జ్ఞానం వైపే మొగ్గారు. బుద్ధుడు తన దర్శనం యొక్క గొప్పతనం వల్ల ఆ తర్వాతి కాలంలో ఎందరో ప్రతిభావంతుల్ని సైతం ఆకర్షించగలిగారు. మగధకు చెందిన **సారిపుత్రుడు***, **మౌద్గల్యాయనుడు***, **మహాకాశ్యపుడు***, ఉజ్జయినీకి చెందిన రాజపురోహితుడు, బ్రాహ్మణ విద్వాంసుడైన **మహాకాత్యాయనుడు*** ఆయన శిష్యులైనారు. బ్రాహ్మణ ధర్మానికీ, బ్రాహ్మణులకు, వారి స్వార్థాలకీ పూర్తిగా వ్యతిరేకమైన బౌద్ధ ధర్మం పట్ల బ్రాహ్మణులకు ఎంతో ద్వేషభావం కలగాల్సి ఉంది. కానీ, పైన పేర్కొన్న శిష్యుల వల్ల తొలి రోజుల్లో బౌద్ధానికి బ్రాహ్మణుల నుండి ఎక్కువగా ప్రతిఘటన ఎదురు కాలేదు. బౌద్ధానికి అతి వ్యతిరేకత రాకుండా వీళ్ళు అడ్డుకున్నారు!

మగధరాజు **బింబిసారుడు*** బుద్ధుణ్ణి అనుసరించాడు. కోసలరాజు **ప్రసేనజిత్తు*** కూడా బుద్ధుణ్ణి ఎంతో అభిమానించాడు. బుద్ధుడు, 'ప్రసేన జిత్తు'లు ఇద్దరూ కోసల క్షత్రియులే. ప్రసేనజిత్తు బుద్ధునికి మరింత దగ్గరవాడనిపించుకోవాలని శాక్యవంశ స్త్రీని వివాహమాడాడు కూడా. **శాక్యులు***, **మల్లులు***, **లిచ్ఛవీ***లు మొదలైన గణతంత్రాల వారు ఎంతోమంది బుద్ధుణ్ణి అనుసరించారు. బుద్ధుని జననం ఒక శాక్యగణ తంత్రంలో జరిగింది. ఆయన మరణం మల్లగణతంత్రలో సంభవించింది.

గణతంత్ర వ్యవస్థ అంటే బుద్ధునికి ఎంతో ఇష్టం. మగధరాజు **అజాతశత్రువు***తో తనకు మంచి సంబంధం ఉన్నప్పటికీ, మగధకు శత్రువులైన వైశాలి, లిచ్ఛవీ గణాల వారిని బుద్ధుడు ఎంతో పొగిడేవారు. గణతంత్ర రాజ్యాలు అజేయంగా నిలబడటానికి ఏడు సూచనల్ని చేశాడు.[16] అవి:

1. కలసి మెలసి ఉంటూ, అందరూ కలసి నిర్ణయాలు తీసుకోవాలి.
2. ఆ నిర్ణయాల్ని అందరూ కలసి నిర్వహించాలి.
3. రాజ్య శాసనాల్ని పాటించాలి. దానిపట్ల వినయ విధేయులై ఉండాలి.
4. వృద్ధుల్ని గౌరవించాలి.
5. స్త్రీలను అణచివేయకూడదు.
6. జాతీయతా ధర్మాన్ని పాటించాలి.
7. ధర్మాచార్యులను గౌరవించాలి.

పై సూచనల్లో – అందరూకలసి నిర్ణయాలు తీసుకోవడం, కలసి కర్తవ్యాన్ని పాటించడం, స్త్రీ స్వాతంత్ర్యం – ఈ మూడూ ప్రగతిశీలమైనవి. మిగిలినవి రాజ్యానికి సంబంధించినవి. అయినా బుద్ధుడు అవి కూడా చెప్పాడంటే – ఆనాటి వ్యవస్థలో జోక్యం కల్గించుకోవడం బుద్ధునికి ఇష్టమైన పని కాదని తెలుస్తుంది.

వ్యక్తిగత కోరికల వల్ల కలిగే ఫలితాల్ని బుద్ధుడు చూశారు. భోగించాలనే కోరికే దుఃఖానికి కారణమని గ్రహించారు. ఆ దుఃఖాన్ని వివరిస్తూ ఇలా అన్నారు[17] –

“ఎంతో కాలంగా మీరు – తల్లీ, తండ్రీ, కొడుకు, కూతురుల మరణాల్ని చూస్తున్నారు. భోగాలతో, రోగాలతో బాధపడుతున్నారు. ఇష్టమైన వారిని వదలడం, ఇష్టం లేనివారిని కలవడంలాంటి పనులవల్ల ఏడుస్తూ, మొత్తుకుంటూ కాలం వెళ్ళదీస్తున్నారు. మీరు కార్చిన కన్నీరు నాలుగు సముద్రాలను మించే ఉంటుంది.” పై విషయాన్ని బట్టి బుద్ధుడు దుఃఖాన్ని, దాని కారణాల్ని వ్యక్తిగతంగానే చూడగలిగారు. సామాజికంగా చూడలేకపోయారు. భోగాల్ని అనుభవించాలనే కాంక్షతో– రాజులూ, క్షత్రియులు, బ్రాహ్మణులూ, వైశ్యులూ – ఎదుటివార్ని చంపడానికీ, లేదా తాము చావడానికి సైతం సిద్ధపడటం బుద్ధుడు చూస్తూనే ఉన్నారు. అయినా, ఈ ‘కోర్కె’ సమాజపరమైంది అని అనుకోలేదు. ఆ చెడును సమాజం నుండి పెకిలించి వేయాల్సి

ఉండగా, దాన్ని వ్యక్తుల నుండే తీసేయడానికి ప్రయత్నించారు. ప్రపంచం అంతా ముళ్ళతో పరచుకొని ఉంది. ఆ ముళ్ళను ఎటూ తను తొలగించలేడు. ఆనాటి స్థితి, పరిస్థితి బుద్ధునికి అంతకంటే అవకాశాన్ని ఇచ్చి ఉండదు. నేనెందుకిలా అంటున్నానంటే బుద్ధుడు ఆచరణవాద దార్శనికుడు. అయినా సామాజిక రుగ్మతలకు, చికిత్సను చెప్పలేకపోయారంటే – ఆనాటి కాలం అందుకు అనుకూలమైంది కాదని చెప్పుకోవాల్సి ఉంటుంది. ఏదేమైనా వ్యక్తిగత ఆస్తిహక్కుల వల్ల కలిగే అనర్థాలు బుద్ధునికి బాగా తెలుసు. కాబట్టే తన సంఘానికి (బుద్ధ సంఘానికి) సంబంధించినంత వరకు వ్యక్తిగత ఆస్తిని తొలగించారు.

## III. దుఃఖ వినాశనా మార్గంలోని లోపాలు

బుద్ధుని దర్శనం క్షణికవాదం. 'క్షణ కాలం కంటే ఏదీ ఉనికిలో ఉండదు' అంటుంది ఈ వాదం. ఐతే, ఈ దార్శనిక దృష్టిని సమాజానికీ, ఆర్థిక వ్యవస్థకీ అన్వయించాలనుకోలేదు బుద్ధుడు. సంపన్నులైన దోపిడీ పాలకవర్గాలకి ఇలాంటి శాంతి కాముకులైన, ప్రతిభావంతులైన దార్శనికులపైన సమాజంలోని ప్రజల్లో గౌరవభావాల్ని కల్గించడం, వాటిని పెంపొందించడం తప్పనిసరి అయ్యింది. తన చుట్టూ ఉన్న దానిని గ్రహించి కంద దుంప ఊరినట్టుగా దోపిడీ వర్గాలు తయారయ్యాయి. ధనిక పురోహిత వర్గానికి చెందిన కూటదంతుడు, సోణదండుడు లాంటి బ్రాహ్మణులు బుద్ధుని శిష్యులయ్యారు. రాజులు బుద్ధుణ్ణి సత్కరించడానికి పోటీ పడ్డారు. ఈనాడు భారతదేశంలో వ్యాపారవర్గం గాంధీ ముందు తమ డబ్బును కుమ్మరిస్తున్నట్లు బుద్ధుని పాదాల ముందు ఆనాటి వ్యాపార కుబేర వర్గం ధనరాశుల్ని కుమ్మరించింది.

**శ్రావస్తి***కి చెందిన ధనిక శ్రేష్ఠుడైన సుదత్తుడు (**అనాథ పిండికుడు***) బుద్ధుని కోసం, అతని శిష్యగణం కోసం ఎంతో ధనాన్ని వెచ్చించి **జేతవనం**లో ఓ ఆరామాన్ని నిర్మించాడు. శ్రావస్తికే చెందిన మరో వర్తక శ్రేష్ఠి భార్య **విశాఖ*** ఎంతో వ్యయంతో బుద్ధునికి కానుకగా అక్కడే **పూర్వారామం** (పుబ్బారామం) అనే పేరుతో మరో ఆరామాన్ని నిర్మింపజేసింది. అలాగే దక్షిణ భారతదేశానికి, నైరుతి భారతదేశానికి, **కోశాంబి**కి చెందిన ముగ్గురు కుబేరులైన వ్యాపారులు, విహారాలు నిర్మించి ఇచ్చారు. నిజం చెప్పాలంటే – రాజుల కంటే వ్యాపారవర్గమే బౌద్ధాన్ని వ్యాపింప చేయడంలో

ముందుంది. ఆనాటి సమకాలీన సమాజాన్ని ప్రశ్నించినట్లయితే బుద్ధునికి ఈ సహకారం అందేదా?

## 3. దార్శనిక చింతన

'అనిత్యం, దుఃఖం, అనాత్మ'[18] ఈ ఒక్క సూత్రంలోనే బౌద్ధ దర్శనం మొత్తం ఇమిడి ఉంది.

### I. క్షణిక వాదం

బుద్ధుడు ఈ సమస్తాన్నీ 1) స్కంధాలు 2) ఆయతనాలు 3) ధాతువులు అని మూడు భాగాలుగా విభజించారు.

**i. స్కంధాలు :** రూపం, వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం – ఈ ఐదూ స్కంధాలు. నేల, నీరు, నిప్పు, గాలి – ఈ నాల్గు భూతాలూ **రూపం**. మనస్సు లేదా చైతన్యమే **విజ్ఞానం**. సుఖదుఃఖాల అనుభవమే **వేదన**. గతవిషయాల్ని గుర్తుంచుకోవడాన్ని **సంజ్ఞా** అంటారు. మనస్సుపై నిలచి ఉండే అనుభూతి తాలూకు వాసనల్ని **సంస్కారాలు** అంటారు.

వేదన, సంజ్ఞా, సంస్కారాలనేవి విజ్ఞానం, రూపంతో సంపర్కం చెందడం వల్ల కల్గిన భిన్న భిన్న స్థితులు.[19] ఈ స్కంధాల్ని బుద్ధుడు అనిత్యాలనీ – (ప్రతీత్య సముత్పన్నాలు – క్షయ ధర్మం కల్గినవి – వ్యయమైపోయేవి) నిరోధాలు (వినాశాలు) అనీ అన్నారు.[20]

**ii. ఆయతనాలు :** బయటకు కన్పించే **ఇంద్రియాలు*** ఆరు. వాటి విషయాలు ఆరూ. మొత్తం ఆయతనాలు పన్నెండు.

| **ఇంద్రియాలు** | | **విషయాలు** | |
|---|---|---|---|
| కళ్ళు | ... | రూపం | (ఆకారం) |
| చెవులు | ... | శబ్దం | (వినికిడి) |
| ముక్కు | ... | గంధం | (వాసన) |
| నాలుక | ... | రసం | (రుచి) |
| చర్మం | ... | స్పర్శ | (తాకుడు) |
| మనస్సు | ... | ధర్మం | (వేదన, సంజ్ఞా, సంస్కారాలు) |

**iii. ధాతువులు :** ధాతువులు పద్దెనిమిది. పైన చెప్పిన ఇంద్రియాలు ఆరు, వాటి విషయాలు ఆరు. ఈ ఇంద్రియాల, విషయాల సంపర్కం వల్ల కలిగే జ్ఞానాలు ఆరు. (చూపు, వినికిడి, వాసన, రుచి, తాకుడు, మనోవిజ్ఞానం). విశ్వంలోని అన్ని వస్తువులు తప్పకుండా – స్కంధం, ఆయతనం, ధాతువు – ఈ మూడింటిలో ఏదో ఒక దానికి చెందినవై ఉంటాయి. ఇవన్నీ నామరూపాలతో విభజింపబడి ఉంటాయి. ఈ 'నామం' విజ్ఞానానికి పర్యాయ పదం. ఇవన్నీ అనిత్యాలే. "ఇది దృఢమైన నియమం. రూపం, వేదనా, సంజ్ఞా, సంస్కారం, విజ్ఞానం – ఈ సంస్కారాలు అన్నీ అనిత్యాలే."

"ఈ రూపం, వేదనా, సంజ్ఞా, సంస్కారం, విజ్ఞానం (ఈ పంచ స్కంధాలు) నిత్యాలు కావు. స్థిరమైనవి కావు. శాశ్వతాలు కావు. అవికారములు (నశించనివి) కావు. ఇది లోకంలోని పండితులంతా ఒప్పుకోన్నవే. నేను కూడా అదే చెప్తున్నాను. ఎందరు చెప్పినా, ఎంత చెప్పినా ఎవరు అర్థం చేసుకోలేరో వారిని మూర్ఖులు, గ్రుడ్డివారు, ఏమీ తెలియనివారు అని అంటాం. వారి కోసం నేను ఏమి చేయగలను?" అన్నారు బుద్ధుడు.[22]

రూపం (భౌతిక పదార్థం) క్షణికత్వాన్ని తేలికగా అర్థం చేసుకోవచ్చు. మనస్సు అనేది రూపం కంటే క్షణభంగురం. ఈ విషయాన్ని విశదపరుస్తూ బుద్ధుడు –

"భిక్షువులారా, తెలియనివాడు ఈ నాల్గు భూతాల్ని (నేల, నీరు, గాలి, నిప్పు) శాశ్వతమైనవి, నిత్యమైనవి అనుకోవచ్చు.[23] వీటిలో మార్పును వెంటనే చూడలేము. ఒకటో... రెండో... మూడో... నాల్గో... ఐదో... ఆరో... ఏడో... ఎనిమిదో... ఇలా కొన్ని సంవత్సరాలకుగానీ చూడలేం. కానీ మనస్సు (చిత్తం, విజ్ఞానం) చెందే మార్పు ఒక పూటలోనో, ఒక రోజులోనో చూడగలం (ప్రతి క్షణం నశిస్తూ, పుడుతూ ఉంటుంది)."

బుద్ధుని దర్శనంలో 'అనిత్యత' (క్షణికత) అనేది తిరుగులేని నియమం. దీని విషయంలో ఏలాంటి మినహాయింపూ లేదు.

బుద్ధుడు చెప్తున్న అనిత్యతావాదం బయట జరిగే మార్పు కాదు. అంటే ఏదో ఒక స్థిర పదార్థంలో బయటకు కన్పించే మార్పు కాదు. ప్రతిక్షణం ఒకటి పూర్తిగా నశిస్తుంది. దాని స్థానంలో రెండోది కొత్తగా పుట్టుకొస్తుంది. బుద్ధుని కార్యకారణం

– 'నిరంతర' లేదా 'అవిచ్ఛిన్నత'ను అంగీకరించదు (ఆత్మ శాశ్వతమైనదీ, మార్పు లేనిదీ అనే వాదాన్ని అంగీకరించదు).

## II. ప్రతీత్య సముత్పాదం

కార్యకారణ సంబంధాన్ని బుద్ధుడు ఎడతెగని సంతతిగా అంగీకరించనప్పటికీ "ఇది జరగడం వల్ల ఇది అవుతుంది"[24] అని అంటారు. ఒకటి పూర్తిగా నశించాక, రెండోది ఉత్పత్తి అవుతుంది. అంటే ఇంకోదానిపై ఆధారపడి పుట్టడం.

ఇది ఉంటే ఇది ఉంటుంది (ఇదం సతి ఇదం హోతి).

ఇది ఉండకపోతే ఇది ఉండదు (ఇదం అసతి ఇదం నహోతి).

దీన్నే "ప్రతీత్య సముత్పాదం" అంటారు బుద్ధుడు. ఈ ఉత్పత్తికి ఏదో ఒక ప్రత్యయం ఉంటుందని బుద్ధుడు అంగీకరించరు. **'ప్రత్యయం'** అనే పదానికి సాధారణ అర్థం **హేతువు** లేదా **కారణం**. కానీ బుద్ధుని 'ప్రత్యయా' నికి వేరే అర్థం ఉంది. ఇతర తత్త్వవేత్తలు 'ప్రత్యయం' అనే పదాన్ని (హేతువు లేదా కారణం) ఏ అర్థంలో వాడతారో బుద్ధుడు మాత్రం ఆ పదాన్ని ఆ అర్థంలో వాడలేదు.

ఒక వస్తువు గానీ, ఘటన గానీ, పుట్టుకురావడానికి క్రితం క్షణం వరకూ ఉండి, ఇప్పుడు పూర్తిగా విలుప్తం చెందే దాన్ని ప్రత్యయం అంటారు బుద్ధుడు. ప్రతీత్య సముత్పాదంలోని కార్యకారణ నియమం ఒక అవిచ్ఛిన్న (నశించని) పరంపర కాదు. అది **విచ్ఛిన్న ప్రవాహ**[25] పరంపర అని అంటారు బుద్ధుడు.

ఈ విచ్ఛిన్న ప్రవాహపరంపరని ఆధారం చేసుకొనే ఆ తర్వాతి కాలంలో **ఆచార్య నాగార్జునుడు** తన **శూన్యవాద** దర్శనాన్ని వికసింపజేశారు. ప్రతీత్య సముత్పాదం – బుద్ధుని దర్శనానికి ఆధారం. ఆ దర్శన పేటికను తెరచే తాళం చెవి.

ఈ విషయాన్ని గూర్చి బుద్ధుడే స్వయంగా చెప్పారు[26] –

'ఎవరైతే ప్రతీత్య సముత్పాదాన్ని దర్శిస్తారో వారు బుద్ధుని దర్శనాన్ని దర్శిస్తారు. ఎవరు బుద్ధుని దర్శనాన్ని దర్శిస్తారో, వారు ప్రతీత్య సముత్పాదాన్ని దర్శిస్తారు. రూపం, వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం – ఈ ఐదు ఉపాదానస్కంధాలూ ప్రతీత్య సముత్పాదాలే. ఈ ప్రతీత్య సముత్పాదాన్ని మానవులకు ఆపాదించేప్పుడు

బుద్ధుడు దానిని 12 భాగాలుగా విభజించారు. వాటిని **ద్వాదశాంగ ప్రతీత్య సముత్పాదాలు** అంటారు.

పూర్వం ఉపనిషత్ దార్శనికులు, ఇంకా ఇతర ఆచార్యులూ ఎంతో మంది, నిత్యమైన దానిని, స్థిరమైన దానిని, నశించని తత్వం గల దానిని 'ఆత్మ' అన్నారు. కానీ, బుద్ధుని ప్రతీత్య సముత్పాదంలో 'ఆత్మ' కు ఎటువంటి స్థానం లేదు. అందువల్ల బుద్ధుడు ఆత్మవాదాన్ని "గొప్ప అవిద్య" (అజ్ఞానం) అన్నారు.

బుద్ధుడు ఒక ఉపదేశంలో ఈ విషయాన్ని చాలా చక్కగా అర్థమయ్యేట్టు చెప్పారు. **సాతికేవట్టపుత్త** అనే భిక్షువుకు ఒక చెడు భావన ఉండేది. 'నేను బుద్ధ భగవానుని

ఉపదేశాన్ని ఎంతో చక్కగా అర్థం చేసుకున్నాను. ఇతరులెవరూ అర్థం చేసుకోలేనంతగా అర్థం చేసుకున్నాను' అనుకొనేవాడు. బుద్ధుడు తన ఉపదేశంలో 'ఒకే జీవుడు తిరిగి తిరిగి పుడుతుంటాడు' అని చెప్పినట్లుగా తప్పుగా అర్థం చేసుకున్నాడు సాతికేవట్ట పుత్త. ఈ విషయం గ్రహించి బుద్ధుడు అతణ్ణి పిలిచి అడిగారు: "సాతికేవట్టపుత్తా, నిజంగా నీకీ చెడు అభిప్రాయం ఉందా?"

"అవును. ఒకే జీవుడు (విజ్ఞానం), సంసరణ, సంధావన (చచ్చి, తిరిగి పుట్టడం) చెందుతుంది"(అంటే – ఒకే జీవుడు మళ్ళీ మళ్ళీ పునర్జన్మ పొందడం).

"జీవుడు (విజ్ఞానం) అంటే ఎవరు?"

"భంతే, మంచీచెడుల ఫలితాన్ని అక్కడికక్కడే అనుభవిస్తూ – మళ్ళీ మళ్ళీ చస్తూ... పుడుతూ ఉండేవాడే జీవుడు".

"మూర్ఖుడా, చెపలచిత్తుడా, నేను ఎవరికి ఇలా ఉపదేశిస్తూ ఉండగా నీవు విన్నావు? అనేకానేక ఉదాహరణలతో విజ్ఞానం (జీవుడు) ప్రతీత్యసముత్పాదమని చెప్పాను గదా!" నశించకుండా విజ్ఞానం పుట్టదు. (అంటే, ప్రత్యయం పూర్తిగా నశించకుండా మరొకటి ఉత్పన్నం కాదు). ఓ మంద బుద్ధీ! నీవు సరిగా అర్థం చేసుకోలేక ఆ లోపాన్ని నాకు ఆపాదిస్తున్నావు" అన్నారు. మరలా భిక్షువుల్ని సంబోధిస్తూ ఇలా అన్నారు – "భిక్షువులారా, ఏయే కారణాలవల్ల జీవునిలో మార్పు ఉత్పన్నమవుతుందో, అదే దానికి పేరుగా ఉంటుంది. కనుల వల్ల కలిగే విజ్ఞానాన్ని 'చక్షుర్విజ్ఞానం' అంటే 'చూపు' అంటారు. అదేవిధంగా... వినికిడి, వాసన, రుచి,

తాకుడు, మనోవిజ్ఞానాలు. ఏయే ప్రత్యయం (నిమిత్తం) చేత మాట ఉత్పన్నం అవుతుందో ఆయా పేర్లు ఉంటాయి. ఉదాహరణకు కట్టెల్ని కాల్చడం వల్ల వచ్చే నిప్పుని 'కట్టెనిప్పు' అనీ, గడ్డిని కాల్చడం వల్ల వచ్చే మంటని 'గడ్డిమంట' అనీ, కామం (కోరిక) వల్ల వచ్చే దాన్ని 'కామాగ్ని' అనీ అంటాం. పైన చెప్పినవి ఐదు స్కంధాలు కదా! మరి వాటిలో ఆత్మ ఎక్కడుంది? ఇప్పుడు మీ సందేహం తీరింది కదా?"

"అవును. తీరింది **భంతే!***."

"భిక్షువులారా, స్కంధాలనబడే ఈ పంచేంద్రియాలు (నేల, నీరు, నిప్పు, గాలి, మరియు మనస్సు). భౌతిక తత్వాలు. ఇవి పుట్టుక కలవి. మనం ఆహారం తీసుకోవడం వల్లే ఇవి పుట్టాయి. ఆహారం తీసుకోకపోతే నశిస్తాయి. సరిగ్గా, చక్కగా ఆలోచిస్తే ఈ విషయం తెలుస్తుంది. అలా తెలుసుకోవడమే సరైన చింతన. మీరు తెలుసుకున్నారు కదా!"


"తెలుసుకున్నాం భంతే!"

"భిక్షువులారా, మీరు ఈ సరైన చింతన (పరిశుద్ధ దృష్టి) పట్ల కూడా ఆసక్తులు కాకండి. దానిలోనే మునిగి ఉండకండి. "ఇది నా ఘనత" – అనుకొని అజ్ఞానులు కాకండి. మమతను పెంచుకోకండి. ఓ భిక్షువులారా, నా ఉపదేశాన్ని ఒడ్డుకు చేర్చే ఒక తెప్పలా భావించండి. ఆ తెప్ప ఒడ్డుకు చేర్చడానికే గానీ, నెత్తిన పెట్టుకొని మోయడానికి కాదని తెలుసుకోండి." సాతికేవట్టపుత్త మనస్సులో ఏ 'ఆత్మ' భావం ఉందో (ఆత్మ ఉందనే భావం ఉందో) – అలా అనుకోవడమే **అవిద్య***. అజ్ఞానం."

ఇలాంటి అవిద్య కలగడానికి కారణాన్ని బుద్ధుడిలా అర్థమయ్యేట్టు చెప్పారు.

"అన్ని రకాల మనుగడలకు కారణం (నిదానం) కోరిక లేక **తృష్ణ**. ఆ కోరికకు కారణం వేదన. వేదనకి **స్పర్శ*** కారణం. ఆ స్పర్శకు ఆరు ఆయతనములు (పంచేంద్రియాలు మరియు మనస్సు) కారణం. వాటికి కారణం **నామ – రూపం**. ఈ నామ రూపాలకు కారణం **విజ్ఞానం**. దానికి కారణం **సంస్కారం**. దానికి కారణం **అవిద్య**. అవిద్య పన్నెండు భాగాలుగా త్రిప్పుతూ, తిరుగుతూ ఉంటుంది.

దీన్నే ద్వాదశాంశ ప్రతీత్య సముత్పాదం అంటారు.




తృష్ణ ఎలా పుట్టుకొస్తుందో చెప్తూ బుద్ధుడిలా అన్నారు -
"భిక్షువులారా, మూడు విషయాల కలయికతో గర్భధారణ జరుగుతుంది.

1. స్త్రీపురుషుల కలయిక
2. స్త్రీ ఋతుమతి కావడం
3. గంధబ్బ (beings to be born) సిద్ధంగా ఉండడం.

స్త్రీ గర్భాన్ని ధరిస్తుంది. తొమ్మిది లేక పది నెలలకు కంటుంది. పుట్టినవారికి స్త్రీ తన రక్తాన్ని పాలుగా మార్చి పెంచుతుంది. ఎప్పుడైతే ఆ పిల్లవాడు పెద్దవుతాడో... ఆ పిల్లవాడు గడియారం, బొంగరం, చింగులియా, తరాజు, బండి, ధనుస్సు - మొదలైన ఆట వస్తువులతో ఆడుకొంటాడు. పెరిగి పెద్దవుతాడు. అప్పుడు ఐదు రకాల విషయ భోగాలలో (రూపం, శబ్దం, రసం, గంధం, స్పర్శ) మునిగి తేలుతాడు. అతడు వాటి అనుకూల, ప్రతికూల పరిస్థితుల కారణంగా రాగంలో పడి సుఖదుఃఖాల్ని అనుభవిస్తాడు. ఇదే వేదన. ఈ వేదన వల్ల విరుద్ధమైన అనుభూతుల్ని పొందుతాడు. ఆ అనుభూతుల్ని ఆహ్వానిస్తాడు. అభినందిస్తాడు. ఈ అనుభూతి వల్ల కోరిక జనిస్తుంది. అనుభూతే కోరిక (తృష్ణ)కు కారణం. ఈ కోరికే **ఉపాదానం.**

(*ఇక్కడ ఉపాదానం అంటే వదలకుండా పట్టుకు వేళ్ళాడడం అని అనువాదకుడు*)

## III. అనాత్మవాదం

బుద్ధునికి ముందు ఆత్మ దర్శనాన్ని ఉపనిషత్ ఋషులందరూ తెగ ప్రచారం చేశారు. అదే సమయంలో చార్వాకుని లాంటి భౌతికవాద దార్శనికుడూ ఉన్నాడు.

ఆత్మ నిత్యం అని చెప్పే నిత్యతావాదులను బుద్ధుడు రెండు వర్గాలుగా విభజించారు[28] ఒకరు : ఆత్మకు రూపం ఉంది. అది కన్పిస్తుంది – అని చెప్పేవారు.

మరొకరు : ఆత్మకు రూపం లేదు. ఇంద్రియాలకు అందనిది – అని చెప్పేవారు. ఈ రెండు వర్గాలకు చెందిన వారిలోనే కొందరు – ఆత్మ అనంతమైనదనీ, అసాంతమనీ అంటే మరికొందరు ఆత్మ అనంతమైనదీ, సాంతమైనదీ అన్నారు. మళ్ళీ వీళ్ళలోనే ఇంకొందరు ఆత్మ నిత్యమైందని అంటే మరికొందరు ఆత్మ అనిత్యమైందని అన్నారు.

**ఆత్మ (సత్కాయం)**

- **రూపంగలది** (గోచరం)
  - **అంతం కలది** (సాంతం)
    - **నిత్యం**
    - **అనిత్యం**
  - **అంతం లేనిది** (అనంతం)
    - **నిత్యం**
    - **అనిత్యం**
- **రూపలేనిది** (అగోచరం)
  - **అంతం కలది** (సాంతం)
    - **నిత్యం**
    - **అనిత్యం**
  - **అంతంలేనిది** (అనంతం)
    - **నిత్యం**
    - **అనిత్యం**

బుద్ధుడు ఆత్మవాదాన్ని **'సత్కాయదృష్టి'** అన్నారు. ఈ రెండో శబ్దాన్ని (సత్కాయదృష్టి) కూడా ఎక్కువగా వాడుకలోకి తెచ్చారు. సత్కాయం అంటే 'కాయంతో కూడి ఉన్నది' (శరీరంలో ఉండేది) అని. ఇక్కడే కేవట్టపుత్త తప్పుడు అవగాహనను – జీవుల పుట్టుక పరంపరల గురించి మాట్లాడినప్పుడు దాన్ని బుద్ధుడు ఎంతో తప్పుపట్టారు. తన ఆలోచనను, తన సిద్ధాంతాన్ని అందరికీ అర్థయమ్యే విధంగా వివరించి చెప్పారు.

ఈ సత్కాయదృష్టి, ఆత్మభావన – దర్శనానికి సంబంధించినంత వరకు పెద్ద అభ్యంతరకరమైనదని బుద్ధుడు భావించారు. నిజమైన జ్ఞానం పొందడానికి ఆత్మ ఉందన్న అవిద్య నుండి ముక్తి పొందడం అన్నిటి కన్నా చాలా అవసరం అని భావించారు. బుద్ధుని శిష్యురాలు **పండిత ధమ్మదిన్నా** తన ఉపదేశంలో ఇలా అన్నారు[29] – "ఐదు ఉపాదాన స్కంధాలూ – సత్కాయమే" అని. అంటే ఆత్మ అనేది వేరుగా లేదు అని చెప్పారు. చచ్చి మళ్ళీ మళ్ళీ పుట్టాలనే కోరికే సత్కాయదృష్టికి కారణం అని అన్నారు.

అవిద్య, తృష్ణ (కోరిక) ఈ రెండే మానవుల అన్ని ప్రవృత్తులకూ కారణం అంటారు బుద్ధుడు.

బుద్ధుడు 'ఆత్మ ఉందన్న నమ్మకం అసహజమైంది' అంటారు. అంతేకాదు, ఆత్మకు ఏలాంటి ఉనికి లేదని భావించారు.[30]

బుద్ధుడు ఒకసారి ఇలా అన్నారు – "ఏమీ తెలియని చిన్నపిల్లలు ఆత్మవాదం గూర్చి ఏ కొంతైనా తెలుసుకోలేరు కదా! ఆత్మ అనేది ఒకటి ఉందనేదే వారికి తెలియదు. మరి వారికి సత్కాయదృష్టి ఎక్కణ్ణుంచి వస్తుంది?[31]"

ఉపనిషత్తుల్లో ఎంతో కష్టపడి, ఎంతో గొప్పదైనదిగా కీర్తించబడ్డ ఆత్మవాదాన్ని ప్రతీత్య సముత్పాదవాది అయిన బుద్ధుడు చాలా తుచ్ఛమైన దృష్టితో చూశారు.[32]

"ఆత్మ నిత్యమైంది. స్థిరమైంది. శాశ్వతమైంది. మారనిది. మన మంచీ–చెడులకు అదే కర్త. ఆత్మ అనంతకాలం ఉంటుంది" అని అనుకోవడం గొప్ప మూర్ఖత్వం. మూఢత్వం.

తన దర్శనంలో బుద్ధుడు **'అనాత్మతావాదాని'** కి గొప్ప స్థానం కల్పించారు. అలాగని బుద్ధదర్శనం వస్తుగతమైందికాదు అని అనుకోకూడదు. ఉపనిషత్తుల్లో ఆత్మ నిత్యమైందీ, స్థిరమైందీ, వస్తుగతమైనదీ, సత్యమైనదీ అని చెప్పబడింది. దీనికి బుద్ధుడు ఇలా సమాధానం ఇచ్చారు –

**ఉపనిషత్తులు***: ఆత్మ – నిత్యమైంది. స్థిరమైంది. సత్యమైంది. వస్తుగతమైంది.

**బుద్ధుడు** : అనాత్మ – అనిత్యం, అధృవం, వస్తుసత్యం.

ఇంకా బుద్ధుడు ఇలా అంటారు –

"రూపం అనాత్మే, వేదన కూడా అనాత్మే, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం... సమస్త ధర్మాలూ అనాత్మలే.[33]"

బుద్ధుడు ఆవిష్కరించిన మహోన్నతమైన, మహా విస్తృతమైన 'ప్రతీత్య సముత్పాదం' అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి, ఆనాటి భాష ఆ ప్రచారానికి తగినంతగా ఎదగలేదు. అందువల్ల బుద్ధుడు తన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడానికి

'ప్రతీత్య సముత్పాదం" "సత్కాయం" వంటి ఎన్నో కొత్త పదాలు ఉపయోగించవలసి వచ్చింది. అంతేకాదు, ఎన్నో పాత పదాలను కొత్త అర్థంతో ప్రయోగించారు. దీనికి ఉదాహరణ "**ధర్మము**". ఈ శబ్దాన్ని ఆయన మామూలు అర్థంలో కాకుండా ప్రత్యేక అర్థంలో వాడారు. మామూలుగా 'ధర్మాలు' అంటే కారణాల చేత ఉత్పన్నమైనవి. కానీ బౌద్ధంలో 'ధర్మాలు' అంటే – విచ్ఛిన్న ప్రవాహం కల్గిన విశ్వం యొక్క తరంగ భాగాలని చెప్పబడింది.

ఈనాడు సైన్స్ భాషలో 'ఘటన' అంటే పదార్థం అని వాడుతున్నాం. బుద్ధుడు 'ఘటన' అనే పదాన్ని 'ధర్మాలు' అనే పదానికి పర్యాయపదంగా వాడారు.

## IV. అభౌతికవాదం

ఆత్మను బుద్ధుడు తీవ్రంగా వ్యతిరేకించారు. మంచిదే, కానీ, బుద్ధుణ్ణి భౌతిక వాది అని కూడా అనలేము. బుద్ధుని కాలంలో **కోసల** దేశంలో సాలవిక నగరంలో **'లౌహిత్యుడు'** అనే బ్రాహ్మణ సామంతు ఉండేవాడు. ఆనాడు ఉన్న మత ధర్మాల పట్ల అతనికి చాలా దురభిప్రాయం ఉండేది.[34]

"ఈ ప్రపంచంలో 'ఈ ధర్మమే మంచిది, దీన్నే ఆచరించండి' అని చెప్పే శ్రమణుడు గానీ, బ్రాహ్మణుడు గానీ లేడు. ఎందుకంటే కొత్త ధర్మాలు (మతాలు) పుట్టుకొస్తున్నాయి. పాత వాటిని తోసేసి కొత్తవి వస్తున్నాయి. ఇవ్వన్నీ మానవుని కాళ్ళకు బంధనాలుగా మారుతున్నాయి. పాపం – లోభం వల్లనే ఈ ధర్మాలు ఇలా పుట్టుకొస్తున్నాయి" – అనేవాడు లౌహిత్యుడు.

బుద్ధుడు తన **శీలం*, సమాధి*, ప్రజ్ఞ***లకు చెందిన ఉపదేశాల ద్వారా లౌహిత్యునికి చెప్పడానికి ప్రయత్నించారు.

కోసల రాజ్యంలో మరో సామంతుడు ఉన్నాడు. సేతవ్య పాలకుడు పాయసి. అతని అభిప్రాయం ఇలా ఉండేది[35] –

"ఇది కాదు. పరలోకం కూడా కాదు. జీవుడు మరణించిన తర్వాత తిరిగి పుట్టడు. మంచికీ, చెడ్డకీ ఎటువంటి ఫలితం ఉండదు".

**పాయసి** ఎందుకు పరలోకాన్నీ, పునర్జన్మనీ అంగీకరించలేదో తెలుసా? దీనికి కారణం ఉంది. వీటిని అంగీకరించకపోవడానికి అతని వద్ద మూడు ప్రశ్నలున్నాయి. అవి బుద్ధుని శిష్యుడు **కుమార కాశ్యపు**ని ముందుంచాడు –

**1వ ప్రశ్న :** చచ్చిపోయిన వాడెవడూ తిరిగొచ్చి రెండో లోకం ఒకటుందని ఇంతవరకు చెప్పలేదు.

**2వ ప్రశ్న :** ధర్మాత్ముడైన ఆస్తికునికి కూడా స్వర్గం లభిస్తుందని తెలిసినా, చావడానికి సిద్ధపడడు.

**3వ ప్రశ్న :** జీవం వదిలిపోయిన తర్వాత మృత కళేబరం బరువు ఏ మాత్రం తగ్గదు. మరి, ఎంతో జాగ్రత్తగా గమనించినప్పటికీ, చనిపోయిన వ్యక్తి నుండి జీవం బయటకు పోవడం మనం చూడలేం.

బుద్ధుడు ఆత్మవాదాన్ని వ్యతిరేకించినట్లుగానే, భౌతిక వాదాన్ని వ్యతిరేకించారు. ఎందుకంటే ఈ రెండు వాదాలూ బ్రహ్మచర్యాన్నీ, సమాధినీ ఆధ్యాత్మిక అభ్యాసాన్ని వ్యతిరేకిస్తాయి.

"జీవుడూ – శరీరం, రెండూ ఒకటే[36]" అనుకుంటే బ్రహ్మచర్యవాసం అనవసరం. "జీవుడు వేరు శరీరం వేరు" అనుకున్నా అంతే. బ్రహ్మచర్యం సాధ్యం కాదు. అనవసరమే. మనిషి బ్రహ్మచర్యవాసం (సాధు జీవనం) ఎప్పుడు చేస్తాడంటే ఈ జీవితం తర్వాత పొందే మరో జీవితంలో ఫలితం పొందాలని లేదా ఆ ఫలితం కోసం చేసే పని జీవితానంతరం పూర్తి చేయాలనీ. కాబట్టి శరీరం, జీవుడు వేరు వేరు అని చెప్పే ఆత్మవాదం వల్ల కూడా బ్రహ్మచర్యం అనవసరమే అవుతుంది. అలాగే... నిత్యమైన, స్థిరమైన, నిశ్చలమైన ఆత్మలో **బ్రహ్మచర్యం** వల్ల ఏలాంటి మార్పు రాదు. తేలేము.

ఇక **భౌతిక వాదం*** జీవితం తర్వాత ఏమీ ఉండదని చెప్తుంది. కాబట్టి భౌతికవాదాన్ని అంగీకరిస్తే బ్రహ్మచర్యం అనవసరం.

కనుక, బుద్ధుడు **ఆత్మవాది కాదు , భౌతికవాదీ కాదు**.

## V. నిరీశ్వర వాదం

ఇప్పటి వరకు మనం బుద్ధుని దర్శనాన్ని (అనిత్యం, అనాత్మ, ప్రతీత్య సముత్పాదం) చూశాం. ఈ దర్శనంలో ఈశ్వరుడు లేదా బ్రహ్మకు స్థానం లేదు, ఆత్మకు లేనట్లే. బుద్ధుడు తన దర్శనంలో అనాత్మతా వాదం మీద చేసినన్ని వ్యాఖ్యలు నిరీశ్వరవాదం మీద చేయలేదు. దీన్ని సాకుగా తీసుకొని పేరుపొందిన భారతీయ

ఆచార్యులు కొందరు "బుద్ధుడు ఈశ్వరుణ్ణి గూర్చి మౌనంగా ఉండటం వలన ఉపనిషత్తుల సిద్ధాంతాన్ని పూర్తిగా అంగీకరించినట్లే" అని చెప్తారు.

ఈశ్వరుడు అంటే, ఈ విశ్వాన్ని నిర్మించినవాడు. పోషించేవాడు. హరించేవాడు. (సృష్టి–స్థితి–లయ కారకుడు). మరి అలాంటి ఈశ్వరునికి బుద్ధుని సిద్ధాంతం ప్రతీత్య సముత్పాదంలో స్థానం లభించాలంటే ఈశ్వరుడు క్షణికవాది కావాలి. నిత్యపరివర్తనాశీలుడు కావాలి. ప్రతీత్యసముత్పాది అయినవాడు ఎలా ఈశ్వరుడు కాగలడు?

ఉపనిషత్తుల్లో ఈశ్వరుని గురించిన ప్రస్థావన ఇలా ఉంది –

"ప్రజాపతి, ప్రజల కోర్కె మీద తపస్సు చేసి, ఒక జంటను సృష్టించాడు[37.]"

"బ్రహ్మకు ఒక కోరిక కలిగింది. తపస్సు చేసి విశ్వాన్ని సృష్టించాడు.[38]"

"ఆత్మ (పురుషుడు) మొట్టమొదట ఒంటరిగా ఉంది. అతడు లోకాల్ని సృష్టించాలనుకున్నాడు. సృష్టించాడు.[39]"

దాదాపు ఉపనిషత్తులన్నీ బ్రహ్మనో, ఈశ్వరుణ్ణో, ఆత్మనో సృష్టికి కర్తగా చెప్పాయి – ఈ విషయంపై బుద్ధుడు ఏమంటున్నారో చూద్దాం –

మల్ల ప్రజాతంత్ర రాజధాని **అనుపియా**[40]. ఆ నగరంలో భార్గవ గోత్రానికి చెందిన ఒక పరివ్రాజకునితో ఇలా అన్నారు –

"భార్గవా, బ్రహ్మనే పరమాచార్యునిగా, శ్రేష్ఠునిగా నమ్మే బ్రాహ్మణుల దగ్గరకు వెళ్ళి నేనిలా అడుగుతాను 'నిజంగా మీరు ఈశ్వరుడే కర్త' అనే భావాన్ని గొప్పదనుకుంటున్నారా?"[41]

వాళ్ళు 'అవును' అంటారు. తరువాత మళ్ళీ అడుగుతాను.

'మీరు ఈశ్వరుడే కర్త అని ఎలా చెప్పగలరు? ఈశ్వరుడు చేసిన పని శ్రేష్ఠమైనదని ఎలా చెప్పగలరు?" నేను అలా అడిగిన మీదట వాళ్ళే నన్ను తిరిగి అడుగుతారు. నన్నే సమాధానం చెప్పమంటారు. అప్పుడు నేనిలా చెప్తాను.

"చాలా కాలానికి ప్రళయం వస్తుంది. ఈ లోకం నాశనం అవుతుంది. ఆ తర్వాత ఎన్నో యేళ్ళు గడిచాక ఈ లోకం తిరిగి పుడుతుంది. అందులోంచి

బ్రహ్మ నివాసం పుడుతుంది. మొదట అది ఖాళీగా, శూన్యంగా ఉంటుంది. అందులో ఎటువంటి ప్రాణీ ఉండదు. అప్పుడు ఆయువు తీరి, పుణ్యం నశించిన ఎవరో ఒకడు బ్రహ్మ నివాసంలో పుట్టుకొస్తాడు[42]. అక్కడే ఒంటరిగా చాన్నాళ్ళు ఉంటాడు. అలా ఎంతో కాలం ఒంటరిగా ఉండటం వల్ల అతని మనస్సు విసిగిపోతుంది. వేరొక ప్రాణి కూడా ఇక్కడికి వస్తే బాగుండును అనుకుంటాడు. అప్పుడు మరికొందరు ప్రాణులు కూడా ఆయువుతీరో, పుణ్యం నశించో ఆ బ్రహ్మ నివాసంలో పుడతారు. అపుడు మొట్టమొదట పుట్టినవాడు తనలో తాను ఇలా అనుకుంటాడు–

"నేను బ్రహ్మను! నేను మహాబ్రహ్మని! నేను విజేతను! నేను ఓటమి ఎరుగని వాడను! నేను సర్వం తెలిసిన వాడిని! నేను నిర్మాతను! నేనే యశోవర్తిని! నేనే కర్తను! శ్రేష్ఠుణ్ణి నేను! త్రికాలాలలో ప్రాణులందరికీ స్వామిని (తండ్రిని) నేనే! నేనే వీళ్ళందర్నీ సృష్టించాను! ఎలాగంటే నా మనస్సులోనే కదా ఈ ఆలోచన కల్గింది. ఇతర ప్రాణులు కూడా ఇక్కడకు రావాలనే తలపు నాకు కల్గింది. అందువల్ల నా మనస్సులో పుట్టిన ఈ ఆలోచనతో ఈ ప్రాణులు ఇక్కడకు వచ్చాయి" అని[43].

అప్పుడు మిగిలిన వాళ్ళు ఇలా అనుకున్నారు :

"ఇతడే బ్రహ్మ! ఈశ్వరుడు! కర్త! ఎలాగంటే... మనకంటే ముందుగా ఇక్కడికి వచ్చాడు. మేము వచ్చేసరికే ఇక్కడ ఉన్నాడు. కాబట్టి ఇతడే బ్రహ్మ!..." పై కథ ద్వారా మానవుల అజ్ఞానమే బ్రహ్మ పుట్టుకకు దారి తీసిందని చెప్తారు బుద్ధుడు.

బుద్ధుడు బ్రహ్మవాదాన్ని ఎగతాళి చేసిన సందర్భం ఒకటి చూద్దాం –

"చాన్నాళ్ళ క్రితం ఒక భిక్షువు మనస్సులో ఈ ప్రశ్న ఉదయించింది. నేల, నీరు, నిప్పు, గాలి అనే ఈ నాల్గు భూతాలూ ఎక్కడకు వెళ్ళి అంతమవుతున్నాయి?" అని. అతను ఈ ప్రశ్నను **చాతుర్మహారాజిక** దేవత దగ్గరకు వెళ్ళి అడిగాడు".

"నాకు తెలియదు అన్నాడు. నాకన్నా గొప్పవారు నలుగురు మహారాజులున్నారు. బహుశా వారికి తెలుసునేమో?" అన్నాడు.

అప్పుడు ఆ భిక్షువు ఆ **నలుగురు మహారాజులు**[44] దగ్గరకు వెళ్ళాడు. వాళ్ళూ 'మాకు తెలియదు' అన్నారు. మాకంటే గొప్పవారు **త్రయత్రింశ దేవతలు** – "యామ, సుయామ, తుషిత (దేవగణ), సంతుషితదేవపుత్ర, నిర్మాణరతి (దేవగణం), సునిర్మిత

వశవర్తి అను పేరుగల దేవపుత్రులు, బ్రహ్మకాయిక పేరుగల దేవత – వారికి తెలియవచ్చు" అన్నారు. ఆ భిక్షువు త్రయత్రింశ దేవతల దగ్గరకు వెళ్ళి అడిగాడు. అప్పుడు వారిలో బ్రహ్మకాయిక దేవత ఇలా అన్నాడు "మాకు తెలియదు. మా కంటే గొప్పవాడు మహాబ్రహ్మ ఉన్నాడు. అతడు సృష్టికర్త. అతణ్ణి అడుగు" అన్నాడు.

ఆ భిక్షువు 'ఆ మహాబ్రహ్మ ఎక్కడుంటాడు' అని అడిగాడు.

"మాకు తెలియదు" అన్నారు వాళ్ళు. ఆ తర్వాత బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు.

భిక్షువు మహాబ్రహ్మను అడిగాడు. "ఈ నాలుగు మహాభూతాలు ఎక్కడికి వెళ్ళి అంతమవుతున్నాయి?" అని.

మహాబ్రహ్మ చెప్పాడు – "నేనే బ్రహ్మను. నేనే ఈశ్వరుణ్ణి. నేనే తండ్రిని".

అప్పుడు భిక్షువు రెండోసారి కూడా మహాబ్రహ్మను అడిగాడు 'నీవు బ్రహ్మవా? ఈశ్వరుడివా? నీవే తండ్రివా?' అని నేను అడగలేదు. నేను ఏమడిగానంటే... ఈ నాల్గు భూతాలూ ఎక్కడికి వెళ్ళి అంతమవుతున్నాయి? లేక లయమవుతున్నాయి?" అని.

బ్రహ్మ మరలా అదే సమాధానం చెప్పాడు. మరలా అదే ప్రశ్న భిక్షువు మూడోసారి అడిగాడు. అప్పుడు ఆ బ్రహ్మ ఆ భిక్షువు చేతులు పట్టుకొని, ఆ దేవతల సభ నుండి ఒక ప్రక్కకు తీసుకొని వెళ్ళి ఈ విధంగా చెప్పాడు –

"ఓ భిక్షూ, ఈ దేవతలంతా ఇప్పటి వరకు నాకు తెలియనిది, నేను చూడనిది ఏదీ లేదని అనుకుంటున్నారు. అందుకని నేను వారి ఎదుట ఈ విషయం చెప్పలేదు. ఎందుకంటే... నీ ప్రశ్నకు సమాధానం నాకూ తెలియదు. ఇది నా తప్పే. బుద్ధుణ్ణి వదలిపెట్టి ఈ లోకం ఎందుకు వచ్చావు?" అన్నాడు. "ఆయన దగ్గరకే వెళ్ళు. ఆయన ఏది చెబితే అదే గొప్ప. అలాగే అనుకో" అన్నాడు.

ఇక్కడ ఒక విషయాన్ని గుర్తించుకోవాలి. ఈనాడు **ఈశ్వరుడు (దేవుడు)** అనే పదం ఏ అర్థంలో వాడుతున్నామో ఆనాడు **'బ్రహ్మ'*** అనే పదం అదే అర్థంలో వాడుకలో ఉంది. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. అప్పటికింకా శివుడు, విష్ణువు శబ్దాలు బ్రహ్మకంటే గొప్పవిగా భావించబడటం లేదు. ఇప్పుడు ఆ శివుడు, విష్ణువు అనే శబ్దాలు బ్రహ్మ కంటే పైన ఉన్నాయి.

బుద్ధుడు చెప్పిన ఈ హాస్య కథలో బ్రహ్మ స్థానంలో అల్లాను, భగవాన్ బుద్ధుని స్థానంలో మార్క్స్‌ను, భిక్షువు స్థానంలో ఓ మార్క్స్ అనుయాయినీ ఉంచి ఈ కథను ఊహించండి. అపుడు ఈ కథలోని పరిహాసం అర్థం అవుతుంది. నమ్మలేని ఎన్నో విషయాల్ని గ్రుడ్డిగా నమ్మే తన కాలం నాటి మూర్ఖుల్ని ఉద్దేశించి బుద్ధుడు ఇలా చెప్పారు:

"నువ్వు చెప్తున్న బ్రహ్మ నిత్యమైనవాడు, స్థిరమైనవాడూ కాదు. అతను ఈ విశ్వాన్ని సృష్టించనూ లేదు. నశింపజేయనూ లేదు. అతడూ ఇతర ప్రాణుల్లా జనన మరణాలు కల్గినవాడే. అతడూ అనేక దేవతలలో కేవలం ఒక దేవత మాత్రమే." ఈ విధంగా బుద్ధుడు బ్రహ్మ వెనుక లాఠీ ఝుళిపించారు.

ఇప్పుడు మరో కథ చదువుదాం. ఈ కథలో బుద్ధుడు స్వయంగా భగవంతుణ్ణి నిరసిస్తారు[45] –

"ఒకానొక సమయంలో బ్రహ్మకు ఒక చెడ్డ అపోహ కలిగింది[46]. నా ఈ బ్రహ్మలోకం నిత్యమైంది. స్థిరమైంది. శాశ్వతమైంది. శుద్ధమైంది. అత్యుత్తమమైంది. ముసలితనం తెలియంది. అమరమైంది. వ్యక్తం చేయలేనిది. తిరిగి ఉత్పన్నం చేయలేనిది. ఈ లోకాన్ని మించిన లోకం మరొకటి లేదు" అన్న గర్వం కల్గింది.

అపుడు నేను బ్రహ్మలోకం వెళ్ళాను.

బ్రహ్మ నన్ను దూరాన్నుండి చూచి, నాతో ఇలా అన్నారు – "రా, మిత్రమా, స్వాగతం. చాలాకాలం తర్వాత కలిశావు. మీ రాకకు గల కారణం ఏమిటి? నా ఈ బ్రహ్మలోకం నిత్యమైంది. శాశ్వతమైంది. ఇక్కడ ముసలితనానికి తావులేదు. చావుకుచోటులేదు." అన్నాడు బ్రహ్మ.

అపుడు నేనిలా అన్నాను "అహో! బ్రహ్మ! ఎంత అజ్ఞానంలో ఉన్నావు. ఏదైతే అనిత్యమైనదో... దాన్ని నిత్యమనుకుంటున్నావు. ఏది అశాశ్వతమైనదో దాన్ని శాశ్వతం అనుకుంటున్నావు". అలా చెప్పిన మీదట బ్రహ్మ ఈ విధంగా అన్నాడు –

"మిత్రమా, నేను నిత్యాన్నే నిత్యం అంటున్నాను."

"బ్రహ్మా! నీవు వేరొక లోకం నుండి ఇక్కడికి వచ్చావు కదా! ఆ విషయం మరచావా?" అని అన్నాను. బ్రహ్మ నోరు మూశాడు.

బ్రాహ్మణులు గ్రుడ్డివారి వెంట వెళ్ళే గ్రుడ్డివాళ్ళలాగా బ్రహ్మను గురించి, అతని లోకాన్ని గురించి గుడ్డిగా నమ్ముతున్నారు. అలాంటి వారి గుడ్డినమ్మకాల్ని అర్థమయ్యేట్టు బుద్ధుడీ కథ చెప్పారు[47].

వశిష్ఠుడనే బ్రాహ్మణుడు బుద్ధుడితో ఇలా అన్నాడు – "ఓ గౌతమా, బ్రహ్మలోకాన్ని చేరే అనేక మార్గాలు ఐతరేయ బ్రాహ్మణం, ఛాందోగ్య బ్రాహ్మణం, ఛందావా బ్రాహ్మణంలో తెలిపారు. ఏదైనా ఒక ప్రదేశాన్ని లేదా ఒక గ్రామాన్ని చేరడానికి అనేక దారులు ద్వారా చేరవచ్చు కదా!"

"వశిష్ఠా, అన్ని విద్యలు తెలిసిన బ్రాహ్మణుల్లో ఏ ఒక్క బ్రాహ్మణుడైనా ఇంత వరకు బ్రహ్మను చూశాడా? లేదు కదా. ఏడేడు తరాల ఆచార్యులలో ఏ ఒక్కరూ ఇంతవరకు బ్రహ్మను చూడనేలేదు. బ్రాహ్మణుల్లో పూర్వీకులు, ఋషులు[48], మంత్రకర్తలు, మంత్ర ప్రవక్తలు – అష్టకుడు, వామకుడు, వామదేవుడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, అంగిరస, భరద్వాజుడు, వశిష్ఠుడు, కశ్యపుడు, భృగువు... వీళ్ళల్లో ఎవరైనా బ్రహ్మను తమ కళ్ళతో చూశారా? వశిష్ఠా, ఎవరి గురించి మనకు తెలియదో, ఎవరినైతే మనం చూడలేదో, వారి మార్గంలో వెళుతూ, వారి ఉపదేశాల్ని వింటున్నాం. వశిష్టా, గుడ్డివాళ్ళు ఒకరి ననుసరించి ఒకరు వెళ్తున్నారు. మొదటివాడు చూడలేదు. రెండో వాడు చూడలేదు. మధ్యవాడు చూడలేదు. వెనుక వాడూ చూడలేదు!"

(పైన సూచించిన 48వ ఫుట్‌నోటు వివరాలు ఈ గ్రంథం చివర ఉన్న 'అనుబంధం'లో చూడండి.)

## VI. పది అవ్యాకతాలు – అవ్యాకృతాలు (unanswerable) (చెప్పడానికి వీలులేని పది అంశాలు)

బుద్ధుడు కొన్ని విషయాల్ని అవ్యాకృతాలు – అంటే 'వ్యక్తం చేయడానికి వీలు లేనివి'(అంటే చెప్ప వీలు లేనివి)అన్నారు. దీన్ని ఆధారంగా తీసుకొని కొందరు భారతీయ 'సంకరజాతి' మేధావులు ఈ విధంగా చెప్తున్నారు –

"బుద్ధుడు ఆత్మను గురించి, ఈశ్వరుణ్ణి గురించి మౌనంగా ఉన్నారు. మౌనంగా ఉన్నారంటే వాటి ఉనికిని తిరస్కరించారని కాదు. వారు ఏవైతే చెప్ప వీలుకానివి అన్నారో – ఆ చెప్పవీలుకాని విషయాల వివరాలను తెలియజేయలేదు. కాబట్టి బుద్ధుడు 'దేవుడు లేడు – ఆత్మ లేదు' అంటున్నాడనుకోవడం పొరపాటు" – అని.

ఐతే, బుద్ధుడు చెప్పనవసరం లేదన్న విషయాలు పది మాత్రమే. అవి లోకం, జీవుడు, శరీరం, ముక్తిని గూర్చినవి.

| | |
|---|---|
| 1) లోకం | 1. లోకం నిత్యమా? |
| | 2. లోకం అనిత్యమా? |
| | 3. లోకానికి అంతం ఉందా? |
| | 4. లోకానికా అంతం లేదా? |
| 2) జీవుడూ శరీరాల ఐక్యత | 5. జీవుడూ, శరీరం ఒకటేనా? |
| | 6. జీవుడూ, శరీరం వేరు వేరా? |
| 3) నిర్వాణం తరువాతి అవస్థ | 7. మరణానంతరం తథాగతుడు ఉంటాడా? |
| | 8. మరణానంతరం తథాగతుడు ఉండడా? |
| | 9. మరణానంతరం తథాగతుడు ఉంటాడూ, ఉండడూనా? |
| | 10. మరణానంతరం తథాగతుడు ఉండడూ అనికాదు, ఉంటాడనీ కాదూనా? |

మాలుంక్యపుత్త – పైన ఉదహరించిన పది అనవసరవిషయాల్ని గురించి బుద్ధ భగవానుణ్ణి ఇలా ప్రశ్నించాడు –

"భంతే, మీకు వీటి గురించి తెలుసా? తెలిస్తే చెప్పవచ్చు కదా! లేక తెలియదా? అయినా అర్థమయ్యేట్టు చెప్పడానికి ఇవేమైనా తిన్నవైన విషయాలా? చక్కగా చెప్పగలిగే విషయాలా...?"

దానికి బుద్ధుడిలా సమాధానమిచ్చారు. "నేను వీటిని అవ్యాకృతాలు అని ఎందుకు చెప్పానంటే వీటి గురించి చెప్పడం అనవసరం. ఇవి భిక్షు చర్యకూ, వైరాగ్యానికీ, దుఃఖ నిరోధానికీ, శాంతికీ, పరమ జ్ఞానానికీ, నిర్వాణానికీ – దేనికీ ఉపయోగపడేవి కావు. అందుకే ఇవి 'చెప్పనవసరం లేనివి' అన్నాను".

**i. సర్ రాధాకృష్ణన్ తప్పుడు రాతలు :** ఆత్మ, బ్రహ్మ, ఈశ్వరుడు – ఈ మూడింటికి బౌద్ధ దర్శనంలో ఏమాత్రం అవకాశమే లేదు. ఇవి నిత్యం, సత్యం, శాశ్వతమనే అభిప్రాయమూ లేదు.

ఉపనిషత్తులు, బ్రాహ్మణులు సత్, చిత్, ఆనందాలుగా కీర్తించిన తత్వానికి వ్యతిరేకంగా బౌద్ధదర్శనంలో **అసత్తు** (అనిత్యం, ప్రతీత్య సముత్పాదం) గా, **అచిత్తు** (అనాత్మ) గా, **అనానందం** (దుఃఖం) గా అంటే – అనిత్యం, దుఃఖం, అనాత్మలుగా చెప్పినప్పటికీ కూడా, సర్ రాధాకృష్ణన్ లాంటి రచయితలు బాధ్యతా రహితంగా బౌద్ధ దర్శనాన్ని గూర్చి వక్రీకరిస్తున్నారంటే ఏమనాలి? ధర్మకీర్తి మాటల్లో చెప్పాలంటే "దిగ్ వ్యాపకం తమః" (దిక్కులన్నీ చీకటి (అజ్ఞానం) వ్యాపించింది) అనాల్సి ఉంటుంది.

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ చూపించిన కొన్ని తప్పుడు అభిప్రాయాలివి –

1. బుద్ధుడు ధ్యానం చేశాడు. ప్రార్థనా మార్గం ఎంచుకొన్నాడు[50] అంటారు ఆయన. మరి, బుద్ధుడు ఎవర్ని ప్రార్థించారో చెప్పగలడా? అయ్యా రాధాకృష్ణన్ గారూ! బుద్ధుని మార్గం ప్రతీత్య సముత్పాదం. క్షణికవాదం[51]. ప్రతి ధర్మం (పదార్థం) మారేదే. క్షణికమైనదే. తమకి ఈ విషయం తెలియదా! భలే వ్యాఖ్యానించారే!

2. బుద్ధుడు బ్రహ్మ గురించి ఔనని గానీ, కాదని గానీ స్పష్టంగా చెప్పలేదు. కాబట్టి బుద్ధుడు 'బ్రహ్మ'ను తిరస్కరించారు అనడానికి వీలు లేదు అనుకోవచ్చు. అలాగే బుద్ధుడు ఈ ప్రపంచంలో ఈ విశ్వమనే నిరంతర ప్రవాహంలో ఏ వస్తువు కూడా నిత్యమైందని చెప్పలేదు. సమస్త విశ్వాన్ని ఆవహించి ఉన్న అశాంతిలో ఆత్మకు (అంటే మానవ హృదయానికి) విశ్రాంతి నివ్వగల ఏదో ఒక 'విరామ' స్థానాన్ని గూర్చి బుద్ధుడు ఆలోచించలేదా?[52] – అంటారు రాధాకృష్ణన్.

రాధాకృష్ణన్‌గారు ఈ విషయంలో తన తప్పుడు అభిప్రాయాల్ని మసిపూసి మారేడు చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. దానికి బుద్ధుడు చెప్పిన **'నిర్వాణాన్ని'** పరమసత్తుగా, **'విరామ స్థలం'** గా ఒప్పించడానికి తెగ ప్రయత్నించారు. బౌద్ధులు చెప్పే **'నిర్వాణం'** భావాత్మక వస్తువు కాదు. అది అభావాత్మకం. బుద్ధుడు ఆత్మలేదనీ, లేని ఆత్మను ఉందనుకోవడం గొప్ప 'అవిద్య' అనీ అనేక సార్లు చెప్పారు గదా! ఆత్మవాదం గొప్ప మూర్ఖత్వం అని బుద్ధుడు చెప్పారు. తాను లేదని చెప్పిన ఆ 'ఆత్మ'కు విశ్రాంతి కోసం – తానే ఎలా వెతుకుతారు? ఆ లేనిదానికి విశ్రాంతినిచ్చే పనేదో అయ్యా, రాధాకృష్ణన్‌గారూ, తమరే చేయొచ్చు కదా!

"ఈ నిరంతర ప్రవాహంలో ఏ ఘటనా (ఏ వస్తువూ) స్థిరమైంది కాదు. నిత్యం కాదు. విజ్ఞానం, నామం, రూపం, భౌతిక తత్వం ఏదీ స్థిరమైంది కాదు[53]" అని

బుద్దుడు చెప్పారని, మీరే చెప్పారు గదా! 'ఆత్మ' విషయంలో బుద్ధుడు మౌనం వహించడానికి మరో కారణం ఉంది[54]. ఉపనిషత్తుల్లో వర్ణించిన ఆత్మను గురించి మాత్రమే మౌనంగా ఉన్నారు. బుద్ధుడు ఆత్మను తిరస్కరించలేదు, అంగీకరించనూలేదు[55]" అంటారు.

లేదయ్యా! రాధాకృష్ణన్ గారూ, మసిపూసి మారేడు చేయకండి! అసలు బుద్ధుని దర్శనం పేరే 'అనాత్మవాదం'. ఉపనిషత్తుల్లోని శాశ్వతమైన, స్థిరమైన 'ఆత్మ'కు బుద్ధుడు 'అన్' అనే ప్రత్యయాన్ని చేర్చాడు. (ఆత్మకు 'అన్' చేర్చితే అనాత్మ) **"అనిత్యం – దుఃఖం – అనాత్మ"** అని చెప్పిన బుద్ధుని గురించి మీరు పై విధంగా చెప్పడం ఎంత మోసం! మీ రాతలు చదివాక మీకు దర్శనశాస్త్రంపై ఏ మాత్రం అవగాహన లేదని, మీరు పూర్తిగా అందుకు యోగ్యత లేనివారని అనవలసి వస్తుంది.

రాధాకృష్ణన్‌గారు ఇంకా ఇలా అంటారు – "అంతర్నిహితమై ఉన్న తత్త్వం లేకుండా – జీవితాల్ని వాఖ్యానించలేము – అందుకే బుద్ధుడు 'ఆత్మ లేదు' అనే వాదాన్ని వ్యతిరేకించారు[56]".

***"ముఖమస్తీతి వక్తవ్యం దశహస్తా హరీతకీ"*** – అన్నట్లుగా.

రాధాకృష్ణన్‌గారూ, మీరీ మసిపూసిన మాటలు బుద్ధుని ముందు కూయాల్సింది. మీకు ఏ గతి పట్టి ఉండేదో! అయినా, ఇది సంభవం కాదనుకోండి...! అలాచేస్తే మాలుంక్యపుత్తకి లభించిన చివాట్లు మీకూ లభించేవి![57]

**ii. మిళింద ప్రశ్న : యవన** రాజైన **మినందార్‌కు** బౌద్ధ దర్శనాన్ని గూర్చి అతి తేలిక పద్ధతిలో వివరించాడు 'మిళింద ప్రశ్న' రచయిత **నాగసేనుడు** (క్రీ.పూ. 150). ఆ నాగసేనుని గురించి సర్ రాధాకృష్ణన్‌గారు ఇలా అన్నారు –

"నాగసేనుడు, బుద్ధుని తత్త్వాన్ని, దాని మూల శాఖ (ఉపనిషత్తులు) నుండి వేరు చేసి, శుద్ధమైన బౌద్ధిక క్షేత్రంలో నాటారు.[58]"

మరి, ఇంకా ఇలా అన్నారు...

"ఉపనిషత్తుల్లో ఉన్న శ్రేష్ఠమైన **విజ్ఞాన వాదాన్ని*** తీసుకొని, దానిని నిత్య జీవితంలో అనుదినం దైనందిన అవసరాలకు అనుగుణంగా మలిచాడు బుద్ధుడు. చారిత్రకంగా చూస్తే... ఉపనిషత్తుల సిద్ధాంతాన్ని సులభంగా ప్రజల్లో ప్రచారం చేయడమే బౌద్ధ దర్శనం[59]".

ఔరా! రాధాకృష్ణన్‌గారు! ఎంత బుద్ధి కుశలత మీది! – బుద్ధుని సమకాలికులూ, ఇంకా వారి ప్రధాన అనుయాయులూ, శిష్యులూ అయిన నాగసేనుడు (క్రీ.పూ. 150), నాగార్జునుడు (క్రీ.శ. 175), అసంగుడు (క్రీ.శ. 375), వసుబంధు (క్రీ.శ. 400), దిజ్నాగుడు (క్రీ.శ. 425), ధర్మకీర్తి (క్రీ.శ. 600), ధర్మోత్తర, **శాంతరక్షిత***(క్రీ.శ. 750), జ్ఞానశ్రీ (క్రీ.శ. 1200), శాక్యశ్రీభద్రుడు (క్రీ.శ. 1200) – వీరంతా ఏ రహస్యాన్నైతే తెలుసుకోలేకపోయారో దాన్ని అన్వేషించి, సాధించిన ఘనత సర్ రాధాకృష్ణన్‌కే దక్కింది మరి! వారు అనాత్మవాది అయిన బుద్ధుణ్ణి ఉపనిషత్తుల ఆత్మవాద ప్రబోధకులుగా ఋజువు చేశారు మరి! 2500 సంవత్సరాలుగా భారతదేశం, శ్రీలంక, బర్మా, శ్యామ (సయామ్–థాయిలాండ్), చైనా, జపాన్, కొరియా, మంగోలియా, టిబెట్, మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్ – మొదలైన ఎన్నో దేశాలలో వ్యాప్తి చెందింది బౌద్ధం. ఈ దేశ దేశాలలోని ప్రజలంతా ఇంతకాలం ఎంతటి భ్రమలో పడి ఉన్నారు? వాళ్ళంతా బుద్ధుణ్ణి నిరీశ్వరవాది, అనాత్మవాది అనే అనుకొన్నారు. అనుకొంటున్నారు. అంతేకాదు... **అక్షపాదుడు***, **బాదరాయణుడు***,**వాత్స్యాయనుడు***, **ఉద్యోతకారుడు***, **కుమారిలుడు***, **వాచస్పతి***, **ఉదయనుడు*** – ఇలాంటి బ్రాహ్మణ పండితులు కూడా బుద్ధుణ్ణి అలాగే (అనాత్మవాదిగానే) అర్థం చేసుకున్నారు. మరి, వీళ్ళంతా ఎంతటి 'అవిద్య' లో పడిపోయారు?! రాధాకృష్ణన్‌గారు ఒక్కరే బుద్ధుణ్ణి అర్థం చేసుకున్నారు. పైవారెవరికీ అర్థం కాలేదు కాబోలు!

## VII. భావ స్వాతంత్ర్యం

ప్రతీత్య సముత్పాద సిద్ధాంత ప్రవక్తకు 'భావస్వాతంత్ర్యం' సహజం. స్వాభావికం.

బౌద్ధ దార్శనికులు, బౌద్ధదర్శన ప్రవక్త అయిన బుద్ధుని ఉపదేశానుసారమే ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం కాకుండా మరో ప్రమాణాన్ని అంగీకరించలేదు. మిగిలినవాటిని తిరస్కరించారు కూడా. భావ స్వాతంత్ర్యాన్ని గూర్చి తన ఉపదేశాల్లో బుద్ధుడు ఈ విధంగా చెప్పారు[60] –

"భిక్షువులారా, నావలాగా ఒడ్డుకు చేర్చేందుకే నేను చెప్పిన ధర్మోపదేశాలు గానీ, వాటిని పట్టుకొని కూర్చోడానికి కాదు. భిక్షువులారా, మానవుడు ఒక మహా భయంకరమైన జల సాగరంలో పడి అపాయ స్థితిలో ఉన్నాడు. భయంతో

ఉన్నాడు. ఆవలి ఒడ్డు భయం లేనిదిగా, క్షేమకరంగా ఉంది. కానీ, ఆ ఒడ్డుకు చేరుకోడానికి అతనికి దారిలేదు. నావ లేదు. వంతెన లేదు. ఆ స్థితిలో తనకు దొరికిన గడ్డి, గాదం, ఆకులు పోగుజేసుకొని వాటితో ఒక తెప్పను తయారుచేసుకున్నాడు. దాని సాయంతో నానా కష్టాలు పడి తన చేతులు, కాళ్ళు నీటిలో ఆడిస్తూ అవతలి తీరానికి చేరాడు. చేరాక అతని మనస్సులో ఇలా అనిపించింది –

"ఈ తెప్ప నాకు చాలా ఉపయోగపడింది. దాని సాయంతో నేను ఒడ్డుకు చేరగలిగాను. ఇది నాకు మేలు చేసింది. కాబట్టి, దాన్ని ఇంతటితో వదలక తలపై పెట్టుకొని ఎందుకు తీసుకు వెళ్ళకూడదు?" అనుకొన్నాడు. అలా చేస్తేనే ఆ మనిషి ఆ తెప్ప పట్ల తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వాడవుతాడా? లేదు... భిక్షువులారా, లేదు. అలా చేస్తే వాడు ఆ తెప్ప వల్ల దుఃఖాన్ని పొందేవాడే అవుతాడు."

ఒకసారి బుద్ధుడు కేశవపుత్ర అనే గ్రామానికి వెళ్ళాడు. అక్కడ **కాలాములు** (కోసల రాజ్యంలో ఉండే కేసపుత్త నగర వాసుల్ని కాలాములంటారు. వీరు క్షత్రియులు). బుద్ధ భగవానునితో ఇలా అన్నారు.[61]

"భంతే, వివిధ రకాల మతవాదాలు చెప్పే సిద్ధాంతాలలో ఏది నిజం? ఏది అబద్ధం?... భంతే, శ్రమణుడైనా, బ్రాహ్మణుడైనా ఇక్కడకు వస్తారు. వారి వారి మతాభిప్రాయాలు వ్యక్తపరుస్తూ ఉంటారు. ఇతర మతాల మీద కోపగించుకుంటారు. ఆ మతాల్ని నిందిస్తూ ఉంటారు. ఇలా ప్రతివారూ ఇతర మతాలపట్ల ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటారు. మరి, అవి విన్న మాకు సందేహం కలుగుతుంది? వీటిలో ఏది సత్యం? ఏది అసత్యం?" అని.

అప్పుడు బుద్ధుడు...

"కాలాములారా, మీ సందేహం సరైనదే. మీకు సందేహం పుట్టవలసిన చోటే పుట్టింది. కానీ, ఓ కాలాములారా, ఒకరు చెప్తున్నారు కాబట్టో, తర్కిస్తున్నారు కాబట్టో ఏదో ఒక కారణాన్ని చూపిస్తున్నారు కాబట్టో మీరు దానిని విశ్వసించవద్దు. అలాగే... మీకు చెప్పేవాడు మంచి ఆహార్యం కలవాడనో, లేదా అతను మీరు అనుకొనే విషయాన్నే చెప్పాడనో ఆ విషయాల్ని కూడా విశ్వసించవద్దు. అంతేకాదు... ఆ విషయం చెప్పేవాడు మంచి వేషం వేసుకున్నాడు (బ్రాహ్మణ వేషం) కాబట్టి

నమ్మకండి. 'ఈ శ్రమణుడు మన గురువు, ఇతను చెప్పాడు కాబట్టి నమ్మాలి' అనుకొని నమ్మకండి. ఎదుటివాడు చెప్పేది మంచో, చెడో మీరే స్వయంగా తెలుసుకోండి. ఏ ధర్మం మంచిదో, దోషం లేనిదో, విజ్ఞుల చేత నిందించబడనిదో దానిని నమ్మండి. దానినే గ్రహించండి. దేనినైతే గ్రహిస్తే సుఖం, హితం, చేకూరుతాయో దానినే నమ్మండి. ఆ ధర్మాన్నే గ్రహించండి" – అన్నారు బుద్ధుడు.

## VIII. అన్నీ తెలుసు అనుకోవడం, ఎంతో తప్పు (సర్వజ్ఞత తప్పు)

బుద్ధుని సమకాలికుడైన **వర్ధమానుణ్ణి** అందరూ సర్వజ్ఞుడు, సర్వదర్శి అనేవారు. ఈ ప్రభావం బుద్ధుని శిష్యుల మీద, బుద్ధుని అనుయాయుల మీద కూడా పడింది. వారూ బుద్ధుణ్ణి 'సర్వజ్ఞుడు' (అన్నీ తెలిసినవాడు) అనేవారు.

బుద్ధుడు ఈ విషయాన్ని వ్యతిరేకించారు. ఒకసారి వత్సగోత్రుడు (వచ్ఛగొత్త) ఇలా అన్నాడు[62] "భంతే, విన్నారా! శ్రమణ గౌతముడు 'సర్వజ్ఞుడు, సర్వదర్శి' అంటున్నారు. ఇది యథార్థమా? వాళ్ళనేది సత్యమేనా?" అని అడిగాడు. దానికి బుద్ధుడు[63] –

"వత్సా, ఎవరైనా నా గురించి అలా అంటే... నా గురించి వారు నిజం చెప్పినట్లు కాదు. అది అసత్యం. ఈ అసత్యంతో నన్ను నిందించడమే. వత్సా, శ్రమణుడైనా, బ్రాహ్మణుడైనా అంతా తెలిసిన వారు, సర్వం చూడగలిగినవాడు ఎవ్వడూ లేడు."

## IX. నిర్వాణం

**నిర్వాణం*** అంటే 'ఆరిపోవుట' అని. దీపం లేదా మంట మండుతూ ఆరిపోవడం లాగా. ప్రతీత్య సముత్పన్నాలైన (విఛ్చిన్న ప్రవాహం చేత ఉత్పన్నమైన) నామం, రూపం (విజ్ఞానం మరియు భౌతికతత్వం), కోరికలు కలసి వీటి బలిమితో ఒక జీవన ప్రవాహం రూపధారణ చెంది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ జీవన ప్రవాహం పూర్తిగా విఛ్చిన్నం అవడమే నిర్వాణం. మొదటిగా దీపాన్ని వెలిగించిన వొత్తి, నూనెలు అయిపోయినా, కొత్తగా వొత్తి, నూనెలను వేయకపోతే దీపం ఆరిపోతుంది.

అదే విధంగా చిత్త మాలిన్యాలు (కామభోగం, పునర్జన్మ మరియు ఆత్మ నశించదు అనే భావనలు) నశించాక, ఇక వాటి రాకడ ఆగిపోతుంది. అదే నిర్వాణం. బుద్ధుడు

ఈ విశేషమైన భావాన్ని చెప్పడానికి ఈ 'నిర్వాణ' శబ్దాన్ని ఎన్నుకున్నారు. నిర్వాణం పొందినవాడు (తథాగతుడు) మరణం తర్వాత ఏమవుతాడు? అనే ప్రశ్నకు బుద్ధుడు జవాబు చెప్పలేదు[64].

కాగా... అనాత్మవాద దర్శనం దృష్ట్యా నిర్వాణం తర్వాత ఏమి ఉంటుంది? ఐతే, మరణించాక ఇంక ఏమీ ఉండదు? అనే భావన అజ్ఞానుల్ని భయపెడుతుంది (బాలానం తాజనకం). కనుక బుద్ధుడు సమాధానం ఇవ్వకుండా మౌనం వహించాడు. దాన్ని ఆధారంగా చేసుకొని కొందరు నిర్వాణం అంటే ఒక "భావాత్మక బ్రహ్మలోకం" (ఊహాజనితం) అని చిత్రీకరించాలనుకుంటారు[65].

"ఓ భిక్షువులారా, **పుట్టుకలేనిది, ఉనికిలేనిది, చేయబడనిది, సంస్కరింపనిది**" అనే స్థితి నిర్వాణ స్థితి. ఈ స్థితే లేకపోతే... పుట్టుక లేనటువంటి, ఉనికి లేనటువంటి, చేయబడనటువంటి, సంస్కరింపబడనటువంటి భవస్థితి నుండి తప్పుకోవడం కుదరదు. ఈ 'పుట్టుకలేని, ఉనికిలేని, చేయబడని, సంస్కరింపబడని' స్థితి ఉన్నది కాబట్టే ఆ స్థితి నుండి నిర్వాణం పొందటం వీలవుతుంది".

"ఓ భిక్షువులారా, ఎక్కడైతే కోరిక నశిస్తుందో అక్కడే చిత్తమాలిన్యాలు ఉండవు."

ఈ చిత్త మాలిన్యాలు సమస్తమూ నశించడమే **నిర్వాణం**[66].

## 4. బౌద్ధ దర్శనం - ఆనాటి సామాజిక స్థితి

'దర్శనం' అనేది బుద్ధికి సంబంధించిన వస్తువు. అది బుద్ధి నుండి పుట్టింది. రక్తమాంసాలతో నిర్మితమై ఉన్న సమూహాలకూ, సమాజాలకూ ఈ దర్శనంతో సంబంధమే లేదు. అది కేవలం మనస్సు యొక్క ఉన్నత స్థితి. మనోమయ జగత్తులో పండిన పంట. కాబట్టి బౌద్ధిక అంతస్తు నుండే దర్శనాన్ని చూడాలి – ఈ రకమైన ఆలోచనలున్నవారిని తూర్పు, పశ్చిమ దేశాల్లో కోకొల్లలుగా చూస్తూ ఉంటాం. వారి అభిప్రాయంలో... 'దర్శనం' అనేది ఈ భౌతిక విషయాలకంటే అతీతమైనది. యూనానీ (గ్రీకు) దర్శనంలో కూడా చూస్తాం – దర్శనం మనోగతమే అయినప్పటికీ "మూడు లోకాలలో మహోన్నతమైనది" అని. మనస్సు అనేది భౌతిక పంట. అంటే మనస్సంటే భౌతిక పదార్థం. (**యాజ్ఞవల్క్యుని** గురువు **ఉద్దాలక ఆరుణి** మనస్సు

గురించి ఇలా అంటారు – "మనస్సు అన్నమయ మయినది" అని. అంటే – మనం తిన్న ఆహారంలోని సూక్ష్మాంశం పైకి వెళ్ళి మనస్సుగా రూపుదాలుస్తుంది[67]. ఇది ఆరుణి మాట). ఇక, నా మరో గ్రంథం **'మానవ సమాజం'** లో మనోవికాసాన్ని గూర్చి సమగ్రంగా చర్చించాను. మనిషి శ్రమ సాధనాలైన చేతులు, అవి చేసే పనులు, అంటే – మనిషి వ్యక్తిగత శ్రమ, దానికితోడు సామాజిక సంబంధాలు ఇవే మనిషి మనోనిర్మాణానికి కారణాలు.[68] వీటివల్ల మనోవికాసం జరుగుతుంది అని ఆ గ్రంథంలో చర్చించాను. మానవుని ఉన్నతికి సమాజం ఎలా కారణమో, మనోవికాసానికీ సమాజమే కారణం. మనిషి వలే మనస్సు కూడా సమాజానికి ఎంతో ఋణపడి ఉంటుంది. కాబట్టి మనస్సు యొక్క పంట అయిన దర్శనం సమాజానికి అతీతమైంది ఎలా అవుతుంది?

కంటిని సజీవంగా చూడాలంటే దాన్ని శరీరం నుండి వేరు చేయకూడదు. అలా వేరుచేస్తే అది సజీవంగా ఉండలేదు. అదే విధంగా దర్శనం కూడా. దర్శనాన్ని సజీవంగా చూడాలంటే దాని పుట్టుకకు మూలమైన సమాజాన్నుండి దూరం చేసి దాన్ని చూడకూడదు. దర్శన శాస్త్రానికి కార్యరంగమైన సామాజిక పరిస్థితుల్లో దాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఉపనిషత్తుల్లో మనం చూశాం. ఆనాటి సామాజిక స్థితిలో ఉన్న ధర్మాల (వైదిక కర్మకాండలు, పూజలు) మీద ప్రజలకు నమ్మకం సడలడంతో వాటి ఉనికికే ఎసరు వచ్చే పరిస్థితి వచ్చింది. దానితో పాలకవర్గాలు భయపడ్డాయి. పాలక, పురోహిత వర్గాలు రంగంలోకి దిగి బ్రహ్మవాదాన్ని, పునర్జన్మ వాదాన్ని వెలుగులోకి తెచ్చాయి. సామాజిక అసమానతలకు కారణమైన యజ్ఞం, వైదిక కర్మకాండలు, పూజా విధానాలు గొప్ప కార్యాలుగా ఉపనిషత్తులు ప్రచారం సాగించాయి.

**1) తార్కిక పద్ధతిలో విశ్లేషిస్తే ఇలా ఉంటుంది;**

| | |
|---|---|
| **వాదం** (ఉపనిషత్తులు) | : యజ్ఞం, వైదిక కర్మకాండలు, పూజాపాఠం శ్రేష్ఠమైనవి. |
| **ప్రతివాదం** (చార్వాకం) | : యజ్ఞాలు, కర్మకాండలు, పూజాపాఠాలు, ఓటిపడవలు. ఇవి ఒడ్డుకు చేర్చలేవు. |

**సంవాదం** (బౌద్ధం) : జ్ఞానమే శ్రేష్ఠమైనది. కర్మ దానికి సహాయకారిగా ఉంటుంది.

**2) అలాగే దర్శనాన్ని గురించి;**

**వాదం** (ఉపనిషత్) : ఆత్మవాదం.

**ప్రతివాదం** (చార్వాకం) : అనాత్మవాదం. భౌతికవాదం.

**సంవాదం** (బౌద్ధం) : అనాత్మవాదం, అభౌతికవాదం.

ఇదీ... రెండు విషయాలపై వారి వారి ఆలోచనల పరంపర. వారి వారి భావాలు. ఆ భావాలకు మూలమైన సామాజిక స్థితిని చూద్దాం.

ఆనాటి సమాజంలో వైదికధర్మం సంపన్న వర్గాల్ని రక్షించి, శ్రామిక, బానిస (దాస), నిమ్నవర్గాలను అంకుశంతో అణచి వేయాలనుకొంది. రక్తపిపాసకులైన పాలకవర్గానికి కొమ్ముకాచింది. సమాజం పట్ల ఇంత విశ్వాస ఘాతుకానికిగాను పురోహితవర్గానికి, వైదికధర్మ చర్యలకు దోపిడి సొమ్ములో వాటా లభించింది.

పీడిత ప్రజలు తమ వెనుకటి స్థితిని మర్చేపోయారు. గత కాలంలో వారు స్వతంత్రులు. అప్పటిది వర్గ రహిత సమాజం. వారు ఆ విషయాల్ని ఇప్పుడు మరచేపోయారు. మత పురోహిత వర్గాల కల్లబొల్లి మాటలలో, కుటిలత్వంలో పడిపోయారు. దైవం తమకు ఇలాంటి జీవితాన్నే రాసిపెట్టాడని నమ్మసాగారు. పీడిత వర్గాలకు నిజమైన న్యాయం కలగాలంటే – వారిని దోపిడీ, ధార్మిక ప్రపంచం నుండి విముక్తుల్ని చేయాలి. ఈ పని కోసం **నాస్తికవాదం*, భౌతికవాదం*** ఉనికిలోకి వచ్చాయి. అయినా బ్రాహ్మణులు (పురోహితులు) దక్షిణల్ని పోగుజేసుకొనే పనిలో తలమునకలై ఉండి, ఎండు గడ్డిలో నిప్పురవ్వలా వ్యాపిస్తున్న నాస్తిక, భౌతిక వాదుల్ని పట్టించుకోలేదు. లెక్క చేయలేదు.

ధార్మిక మంత్రాలూ, కర్మకాండలూ ఎప్పటి నుండో ప్రచారంలో ఉన్నాయి. వీటి ప్రచారకులైన పురోహితవర్గం ఆ మంత్రాలు ముక్తి కోసమే అని నమ్మాయి. పురోహితవర్గం సమాజ పరివర్తనకు సుముఖంగా లేకపోవడానికి ఇది ఒక కారణం. అయితే, పీడిత ప్రజల మనోభావాల్ని పురోహిత వర్గం కంటే రాచరిక పాలకులే ముందుగా పసిగట్టారు. ప్రజల బుద్ధికి, ఉచ్చులా మారిన ధార్మిక విషయాలకు

తోడు **బ్రహ్మవాదం, పునర్జన్మ**లను జోడించారు. ఇలా రాచరిక వర్గం బ్రహ్మవాదాన్ని, పునర్జన్మను కలిపి ధార్మిక విషయాలకు చేర్చడాన్ని తొలిరోజుల్లో బ్రాహ్మణ పురోహితవర్గం ఎంతగానో తిరస్కరించింది. కోపగించుకొంది. పురోహితవర్గం ధ్వనింప చేసిన ఈ ప్రతిధ్వని మనకు జైమిని – కుమారిలుడి **మీమాంసా దర్శనం***లో వినిపిస్తుంది.

ఈ మీమాంసా దర్శనంలో వారు బ్రహ్మజ్ఞానాన్ని స్వీకరించలేదు. తిరస్కరించారు. వేదాలు అపౌరుషేయాలనీ, అవి ప్రకృతిలాగానే 'స్వయంభువులు' (స్వయంగా ఏర్పడ్డాయి) అనీ, వాటిని ఎవరూ రాయలేదని చెప్పారు. వేదాలు చెప్పే విషయం ఏమంటే కర్మఫలాన్ని, పరలోకాన్ని తప్పనిసరిగా పొందడమే. వేదాలు కర్మకాండల్ని వాటి విధానాల్ని నిర్వర్తిస్తాయి. అవి స్తుతి, నింద, పొగడ్త, ప్రశంసలకు అతీతాలు – అన్నారు.

అయినప్పటికీ, ఈ వైదిక కర్మకాండల విధానానికి దెబ్బ తగిలింది. **కౌటిల్యుని** అర్థశాస్త్రాన్ని బట్టి **లోకాయత వాదం*** (నాస్తికవాదం) శాసక వర్గానికి అయిష్టం కాదని తెలుస్తుంది. పాలక వర్గాలు దీర్ఘకాలిక స్వార్థపరత్వాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల్లో వచ్చిన మార్పుకు ఆహ్వానం పలికాయి. మత సంబంధమైన మూఢత్వాన్ని తిరస్కరించి – మార్పును స్వాగతించాయి. అయితే, ఈ స్వాగతం ప్రజాభ్యుదయానికి కాదు. ప్రజల్ని వంచించి తమ ఖజానాను మరింత నింపుకోడానికే. తమ దోపిడీని నిరాటంకంగా సాగించడానికే ప్రజల్లోని ధార్మిక విషయాల్ని పాలక వర్గాలు వాడుకొంటాయి అని కౌటిల్యుని **అర్థశాస్త్రం** చదివితే అర్థమవుతుంది.

ప్రజల్లోని ధార్మిక మిథ్యావిశ్వాసాలను ఆసరాగా చేసుకొని దైవికమైన చమత్కారాల ద్వారా తమ బొక్కసం నింపుకోమనీ, తమ బలాన్ని పెంచుకోమనీ అర్థశాస్త్రం పాలకులకు సలహా ఇచ్చింది. **'దశకుమార చరిత్రం*'** కాలంలో (క్రీ.శ. 6వ శతాబ్దం) ప్రభుత్వ గూఢచారులు ధార్మిక వేషాల్లో రాజ్యంలో సంచరిస్తూ ఉండేవారు. ఈ విధంగా గూఢచారులు సంచరించడం చాణక్యుని కాలంలోనూ, అంతకుముందున్న కాలంలో కూడా జరిగింది. ఏమాత్రం సందేహంలేని విషయం ఏమంటే – పాలకవర్గం తమ స్వార్థ ప్రయోజనాల కోసమే 'భౌతిక వాదాన్ని' వాడుకున్నారనేది. "ఋణం కృత్వా ఘృతం పీబేత్" అన్నట్లు తమ స్వార్థమనే నీచ ఉద్దేశ్యంతోనే వారు భౌతికవాదాన్ని వాడుకున్నారు.

కాని, **శ్రామిక వర్గం** మాత్రం భౌతిక వాదాన్ని తమ వ్యక్తిగత స్వార్థం కోసం ఉపయోగించుకోలేదు. తమ వర్గశ్రమ ఫలితాన్ని అందరూ న్యాయంగా పొందడానికీ, తమ శ్రమ ఫలాల్ని తామే అనుభవించడానికీ, దోపిడీని అంతం చేయడానికే వారు భౌతిక వాదాన్ని ఆశ్రయించారు.

బుద్ధుని **దర్శనం*** (ప్రతీత్య సముత్పాదం) మౌలికంగానే పెనుమార్పును తీసుకొచ్చింది. అది విప్లవాత్మకమైంది. ప్రపంచం, సమాజం, మనుష్యుడు... అన్నీ ప్రతిక్షణం పరివర్తన చెందేవే అని ప్రకటించారు బుద్ధుడు. గతించిన రోజులు మళ్ళీ తిరిగిరావు అని దుఃఖిస్తూ కూర్చోక, పరివర్తన ననుసరించి మారే ప్రపంచంతో పాటు మారడానికి సిద్ధంగా ఉండాలని బోధించారు. ఆయన తన దర్శనాన్ని ఒడ్డుకు చేర్చే నావగానే చూడాలన్నారు. నెత్తిన కెత్తుకొని తిరిగే బరువు చేటు పని కాదన్నారు. అలా నెత్తికెత్తుకొని తిరగడాన్ని తప్పుబట్టారు కూడా.

అయినప్పటికీ, ఈ విప్లవాత్మకమైన దర్శనం తనలోని సామాజిక ప్రగతిని నిరోధించే తత్వాన్ని తొలగించుకోలేకపోయింది. ఆత్మ ఒక శరీరం నుండి మరో శరీరానికి మారుతుంది అనే పునర్జన్మ వాదాన్ని బుద్ధుడు అంగీకరించలేదు. కానీ, మరో విధంగా చూస్తే – పరలోకాన్ని, పునర్జన్మను అంగీకరించారు. ఎలాగంటే, ఈ శరీరం, జీవనం ఒక విచ్ఛిన్న ప్రవాహం. అంటే నశించడం, పుట్టడం అనే రూపంలో నిరతరం కొనసాగుతూ ఉంటుంది. ఈ నిరంతర విచ్ఛిన్న ప్రవాహం మరణానంతరం (శరీరం అంతమయ్యాక) కూడా కొనసాగుతుంది – అంటారు బుద్ధుడు.

తన పునర్జన్మ సిద్ధాంతాన్ని బుద్ధుడు తాత్వికంగా కూడా పట్టిష్టం చేశారు. సంస్కృతి, సంధి అనే కార్యం ద్వారా అది జరుగుతుందన్నాడు. నిరంతరం శరీరం మారుతూ ఉంటుంది. ఈ మారే క్రమంలో మనస్సు కూడా మారుతుంది. ఇలా మారిన మనస్సు ఒక కొత్త శరీరంలోకి (మారిన శరీరంలోకి) ప్రవేశిస్తుంది. దీన్నే **పునర్జన్మ** లేదా **ప్రతిసంధి** అన్నారు.

ప్రపంచాన్ని వ్యాఖ్యానించడానికి క్షణిక వాదం (ప్రతీత్య సముత్పన్నవాదం) సరిపోతుంది అనడానికి ఎలాంటి సందేహం లేదు. ఐతే, దేవుని పని సామాజిక అసమానతల్ని కాపాడుతూ, దోపిడీని నిరాటంకంగా కొనసాగించేలా చూడటం. నిరీశ్వరవాదియైన బుద్ధుడు దేవుడు చేయాల్సిన పై పనిని కొనసాగించడానికీ, రాచరిక

వ్యవస్థను కాపాడడానికి – కర్మ సిద్ధాంతాన్ని పటిష్టం చేశారు. పుట్టడానికీ, ధనవంతుడవడానికీ, పేదరికానికీ కర్మే కారణం. ఆ కర్మకు 'కర్తవు కూడా నీవే' అన్నారు. 'నీ కర్మ నీ చేతి నుండి వెలువడే బాణంలా ఉంది' అని కూడా అన్నారు బుద్ధుడు.

ఈ రకంగా బుద్ధుని ప్రతీత్య సముత్పన్న వాదాన్ని చూచి భయభీతులు చెందిన ఆనాటి ప్రభు వర్గాలు, అతని ప్రతిసంధి (పునర్జన్మ), కర్మ సిద్ధాంతాన్ని చూశాక స్థిమిత పడ్డాయి. ఈ కారణం వల్లే పెద్ద పెద్ద రాజవంశాలు, చక్రవర్తులు, ధనిక శ్రేష్ఠులు, షావుకార్లు బుద్ధుని పతాకం క్రిందకు వచ్చారు. భారతదేశంలోనే కాదు, శ్రీలంక, చైనా, జపాన్, టిబెట్ మొదలైన దేశాలలోని రాజులంతా బౌద్ధాన్ని స్వీకరించడానికి ముందుకు వచ్చారు. విస్తరింపజేశారు.

"ఈ ధర్మం సామాజిక విద్రోహానికి పాల్పడి, సామాజిక తిరుగుబాటుకు కారణం కాదు, సరికదా యథాస్థితిని కాపాడుతుంది. తమకు ఎంతో ఉపయోగకారిగా ఉంటుంది" అని భావించారు. రాజ్య విస్తరణలు చేయడానికి జాతుల హద్దులు, దేశాల సరిహద్దుల్ని దాటడానికి బౌద్ధధర్మం రాజవర్గాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడింది. సమాజంలో ఆర్థిక అసమానతల్ని తొలగించలేకపోయింది. కానీ, వర్ణవ్యవస్థను తొలగించడానికి ప్రయత్నించింది. జాతి, కుల హెచ్చు తగ్గుల్ని తిరస్కరించింది. ఈ విధంగా నిమ్నవర్గాల మనసుల్లో స్థానం పొందింది. బౌద్ధం పట్ల నిమ్నవర్గాలు సద్భావన చూపాయి. పాలకవర్గం, వారి ఏజంట్ల మౌలిక స్వార్థాల్ని తొలగించకుండానే సామాజిక న్యాయం కోరుకున్నది బౌద్ధం.

అసలు సిద్ధార్థ గౌతముడు తన దర్శనాన్ని – క్షణిక వాదాన్ని అంటే ప్రతీత్య సముత్పన్నవాదాన్ని – ఎందువల్ల ఆవిష్కరించారు? దీనికి ఆనాటి సమకాలీన భౌతిక పరిస్థితులేమిటి? ఏ పరిస్థితుల వల్ల ఇలా చేశారు? ఈ ప్రశ్నలు తలెత్తుతాయి. ఇక్కడ మనం దృష్టిలో ఉంచుకోవాల్సిన విషయం ఇది – వ్యక్తి మీద సమాజం యొక్క భౌతిక పరిస్థితుల ప్రభావం పడుతుంది. అలాగే వ్యక్తి కూడా తన వ్యక్తిగతమైన ప్రభావాన్ని సమాజం మీద వేయడమూ జరుగుతుంది. ఈ విషయంగా బుద్ధుని వ్యక్తిగత భౌతిక పరిస్థితులు అతని సిద్ధాంతం మీద ఎంతవరకు పనిచేశాయి? కొంచెం ఈ విషయాన్ని గూర్చి కూడా ఆలోచించడం అవసరమే.

అప్పటికి బుద్ధుడు శారీరకంగా చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ప్రశాంతంగా, గంభీరంగా, తీక్షణంగా, ప్రతిభావంతమైన మానసిక స్థితిలో ఉన్నారు. ఒక ప్రతిభాశాలి తన భవితవ్యం పట్ల ఎలాంటి ఆలోచనలు కల్గి వుంటాడో, బుద్ధుడూ అలాంటి ఆలోచనలే కల్గివున్నారు. తన దార్శనిక భావాల నిజాయితీ పట్ల ఎంతో విశ్వాసంతో ఉండేవారు. 'ప్రతీత్య సముత్పాద' సిద్ధాంతంలోని గొప్పతనమూ అతనికి తెలుసు. అయినా, తన భావాల్ని ప్రచారం చేసుకోడానికి ఉత్సాహం చూపేవాడు కాదు – బహుశా, ఇలా ఎందుకున్నారంటే... తన సిద్ధాంతానికీ, ఆనాటి పాలక వర్గానికీ సఖ్యత కుదురుతుందన్న విషయం బుద్ధునికే తెలిసి ఉండకపోవచ్చు.

బౌద్ధ దర్శనంలో అనిత్యం, అనాత్మలకే కాదు 'దుఃఖవాదాని' కీ చోటుంది. బుద్ధుడు తన దర్శనంలో దుఃఖవాదానికి చోటివ్వడానికి కారణాలు నాటి సామాజిక జీవితంలోనూ బుద్ధుని వ్యక్తిగత జీవితంలోనూ కన్పిస్తాయి. బుద్ధుడు పసితనంలోనే తల్లిని పోగొట్టుకున్నారు. పినతల్లి ప్రజాపతి స్నేహ వాత్సల్యాలు పొందుతూ పెరిగారు. ఇంట్లో అతనికి ఏలాంటి ఇబ్బందికానీ, బాధగానీ కలిగినట్లు చూడం. ఒక ధనికస్వామి పుత్రునికి ఏ విధంగా సుఖభోగాలు ఆ కాలంలో లభిస్తాయో అవన్నీ అతనికి అందుబాటులోనే ఉన్నాయి. కానీ, సమాజంలో జరిగే సంఘటనలు ఆయన మీద చురుకుగా ప్రభావాన్ని చూపేవి.

వృద్ధుణ్ణి, రోగినీ, శవాన్నీ చూచి వైరాగ్య భావాన్ని ఏర్పరుచుకొన్నాడనే విషయాన్ని బట్టి మనకీవిషయం తెలుస్తుంది. ఇంతే కాదు, దుఃఖ మూలాల్ని వెదకడానికి మరో కారణం కూడా ఉండొచ్చు. ఆనాడు దాసుల (బానిసల) బాధలు ఇంతింత అని చెప్పలేము. బాధామయ జీవితాల్ని సాగించేవారిని చూచి కూడా చలించిపోయి ఉంటాడు. శిల్పకారుల దరిద్రం చెప్పనలవి కానిది. ఇవన్నీ అతని హృదయాన్ని తాకే ఉంటాయి. బుద్ధునిలో వచ్చిన వైరాగ్యానికి ఇవి కారణాలని చెప్పక పోయినా (అలాంటి ఆధారాలేవీ దొరకలేదు) ఇవి తప్పక అతనిపై ప్రభావాన్ని చూపే ఉంటాయి.

సమాజం నుండి దరిద్రాన్ని, బానిసత్వాన్ని రూపు మాపే విధానాలు అతని సిద్ధాంతంలో లేవు. కానీ, దారిద్ర్యాన్ని, బానిసత్వాన్ని కొద్దిగానైనా సంస్కరించే విధానం తొలి నాళ్ళలోని బౌద్ధ సంఘాల్లో కన్పిస్తుంది.

అప్పు తీర్చలేని వారిని వడ్డీ వ్యాపారులు బానిసలుగా కొనుక్కొనేవారు. ఈ బాధ నుండి తప్పించుకోడానికి ఋణగ్రస్తులు భిక్షువులుగా మారేవారు. ఈ కార్యం వల్ల బుద్ధసంఘానికి వడ్డీ వ్యాపారులతో విరోధం ఏర్పడేది. దాని నివారణ కోసం బుద్ధుడు ఇలా ప్రకటించారు[69] –

"ఋణగ్రస్తుడు భిక్షుదీక్షకు అనర్హుడు" అని.

అలాగే బానిసల్ని భిక్షువులుగా మార్చడం వల్ల బానిస యజమానులు గొడవ చేయడంతో ఆ విషయం మీద కూడా బుద్ధుడు ఇలా ప్రకటించారు[70] –

"భిక్షువులారా, బానిసలకు (దాసులకు) భిక్షు దీక్ష (ప్రవ్రజ్య – పరివ్రాజకం) ఇవ్వకండి".

**మగధ**రాజు **బింబిసారుడు** బుద్ధుని అభిమాని. అనుయాయి. అతని సైనికులు కొందరు యుద్ధానికి వెళ్ళడం ఇష్టంలేక, యుద్ధ ప్రమాదాన్నుండి తప్పించుకొనే నెపంతో భిక్షువులయ్యేవారు. ఇది చూచి మగధ సైన్యాధిపతికి భయం వేసింది. బింబిసారుడూ బాధపడ్డాడు. ఇలా సైనికులు భిక్షువులైతే 'రాజ్యం' ఎలా? దాని అస్తిత్వమే అంతం అవుతుంది. ఎవరెన్ని చెప్పినా రాజ్యం యొక్క ఉనికి దాని సైనిక శక్తిమీదే కదా ఆధారపడేది.

బింబిసారుడు తన అధికారుల్ని అడిగాడు: "రాజసైనికుల్ని సాధువులుగా మార్చే వారికి ఏ శిక్ష విధించాలి?" అని[71].

అందుకు అధికారులు "దేవా, సైనికుల్ని సాధువులుగా మార్చే గురువు తల కొట్టాలి. భిక్షుదీక్ష ఇచ్చేపుడు విధివాక్యాలు చదివేవారి నాలుక తెగ్గొయ్యాలి. ఇంకా, ఇలా దీక్ష నిచ్చిన సంఘం బాధ్యుల ఎముకలు విరిచెయ్యాలి" అన్నారు.

ఈ విషయాన్ని స్వయంగా బింబిసారుడు బుద్ధునికి విన్నవించాడు. వెంటనే బుద్ధుడు ఇలా ప్రకటించారు–

"భిక్షువులారా, సైనికులకు భిక్షుదీక్ష ఇవ్వకండి[72]".

ఈ రకంగా బుద్ధుడు దుఃఖం సత్యం అనే విషయాన్ని గ్రహించారు. కానీ, దుఃఖహేతువును సమాజం నుండి లేకుండా చేసే ప్రయత్నానికి నీళ్లొదిలారు. దీనితో బౌద్ధదర్శనంలో భౌతికపరమైన విలువలు పోయి కేవలం ఆధ్యాత్మికమైన విలువలు

మాత్రమే మిగిలిపోయాయి. బౌద్ధం కోరలు పీకిన పాము అయ్యింది. కాబట్టి సంపన్న వర్గాలు, పాలక వర్గాలు బౌద్ధం వల్ల తమకు ఏలాంటి హాని జరగదని తెలుసుకున్నాయి.

మొత్తంగా చూస్తే మనం ఈ విధంగా చెప్పుకోవచ్చు –

ఆనాటి బానిసత్వం, దారిద్ర్యం, సమాజంలో వేళ్ళూనుకుపోయిన దోపిడీ – ఇవే బుద్ధుడు దుఃఖసత్యాన్ని తెలుసుకోడానికి ఉపయోగపడ్డాయి. దుఃఖాన్ని తెలుసుకున్న బుద్ధుడు దుఃఖ నివారణా మార్గాల్ని తెలుసుకున్నారు. ఆ క్రమంలోనే ప్రతీత్య సముత్పన్నం అనే వాదాన్ని తెలుసుకొన్నారు. ఐతే, భౌతికంగా తన సిద్ధాంతాన్ని సమాజానికి అన్వయించి, దుఃఖాన్ని నివారించే పని చేయలేక పోయారు. అందుకే దుఃఖానికి 'అలౌకికమైన' అనే వ్యాఖ్య చేసి వదిలేశారు.

# పాద సూచికలు

1. చుల్లవగ్గ (వినయ పిటకం), 7; (బుద్ధ చరియ. పే.60)
2. మజ్ఝిమ నికాయ అట్ఠకథ 1/2/8
3. నేపాల్లో ఉంది. ప్రస్తుత పేరు రుమ్మిన్దేయీ.
4. మజ్ఝిమ నికాయ 2-4-5
5. మజ్ఝిమ నికాయ 2-4-5
6. మజ్ఝిమ నికాయ 1-3-6 ---?
7. యే ధర్మ హేతు ప్రభవా హేతుం తేషా తథాగతోహ్యావదత్
   తేషాం చ యో నిరోధ ఏవం వాదీ మహాశ్రమణః
8. గోరఖ్పూర్ జిల్లాలోని కసయా.
9. ధర్మచక్ర ప్రవర్తన సూత్రం - సంయుత్తనికాయ 55/2/1
10. మహాసతిపట్ఠాన - సుత్త. (దీఘ నికాయ) 2-9-1
11. అంగుత్తర నికాయ - 5.
12. మజ్ఝిమ నికాయ - 1/5/4.
13. మజ్ఝిమ నికాయ - 1/3/9
14. సంయుత్త నికాయ - 4-1-4.
15. బుద్ధుని జీవితం మరియు ఉపదేశాలు - ప్రాచీన విషయాల ఆధారాలు నా 'బుద్ధచరియ' లో సంగ్రహంగా దొరుకుతాయి.
16. మహాపరినిర్వాణసుత్త (దీఘ నికాయ 2/3)
17. సంయుత్త నికాయ 14.
18. అంగుత్తర నికాయ 3-4-34
19. మహావేదల్ల సుత్త (దీఘ నికాయ 1-5-3)
20. మహానిదాన సుత్త (దీఘ నికాయ 2-15)
21. అంగుత్తర నికాయ - 3-1-34
22. సంయుత్త నికాయ 16
23. సంయుత్త నికాయ 12/7
24. "అస్మిన్ సతి ఇదం భవతి" (మజ్ఝిమ నికాయ 1-4-8)
25. Discontinuous continuity
26. మజ్ఝిమ నికాయ 1-3-8

27. మహాతణ్హా - సంకయ - సుతున్త (మజ్ఝిమ నికాయ - 1-4-8)
28. మహా నిదాన సుత్త (దీఘ నికాయ 2-15)
29. చులవదల్ల సుత్త (మజ్ఝిమ నికాయ 1-5-4)
30. మహా మాలుంక్య సుత్త (మజ్ఝిమ నికాయ 2-2-4)
31. వైజ్ఞానిక భౌతిక వాదం (ఇది: రాహుల్‌జీ రచన. పేజీ 99-100)
32. మజ్ఝిమ నికాయ 1-1-2
"అయం భిక్కవో! కేవలోం పరిపూరో బాల - ధమ్మో"
33. చూల సచ్చక సుత్త (మజ్ఝిమ నికాయ 1-4-5)
34. ధర్మనికాయ 1-12
35. దీఘ నికాయ 2-10
36. అంగుత్తర నికాయ - 3
37. ప్రశ్నోపనిషత్ - 1/3 - 13
38. తైత్తిరీయోపనిషత్ - 2/6
39. ఐతరేయోపనిషత్ - 1/1
40. ఛపరా జిల్లాలో అనోమా నదీ సమీపాన ఉంది.
41. పాథిక సుత్త
42. బుద్ధుని, బ్రహ్మల సంవాదం బృహదారణ్యకం 1/4/1-2. "మొదట ఆత్మ ఉంది. తనకు తోడు వేరొకటి లేనందున భయపడింది. మరో మనిషి ఎవరైనా తోడుంటే బావుండును అని కోరుకుంది".
43. కేవట్ట సుత్త (దీఘ నికాయ 1/11)
44. ధృతరాష్ట్రుడు, విరూఢకుడు, విరూపాక్షుడు, వైశ్రవణాయనుడు (కుబేరుడు)
45. బ్రహ్మానిమన్తిక సుత్త (మజ్ఝిమ నికాయ 1-5-9)
46. యాజ్ఞవల్క్య, గార్గిల సంవాదం. బ్రహ్మలోకం తర్వాత ఏ లోకం ఉంది అని ఆమె అడిగితే... "తల లేచి పోతుంది" అని యాజ్ఞవల్క్యుడు అంటాడు - బృహదారణ్యకం 3/6
47. తేవిజ్జ సుత్త (దీఘ నికాయ 1-13)
48. ఈ పుస్తకం చివర ఉన్న అనుబంధం-2 లో చూడండి.
49. మజ్ఝిమ నికాయ 2-2-3
50. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 (1st edition) p.355.
51. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 (1st edition) p.378.
52. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 (1st edition) p.379.

53. It is a perpectual process with nothing permanent nothing here is permanent, neither name nor form - మహావగ్గ (వినయ పిటకం)

54. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 p.385.

55. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 p.387.

56. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 p.389.

57. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 p.389.

58. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 p.390.

59. Indian Philosophy by Sir S. Radhakrishna Vol.1 p.471.

60. మజ్ఝిమ నికాయ 1-3-2

61. అంగుత్తర నికాయ 3-7-5

62. మజ్ఝిమ నికాయ 1-3-1

63. మజ్ఝిమ నికాయ 2-4-10

64. ఇతివృత్తక 2-2-6

65. ఉదాన 8-3

66. ఉదాన 8/12

‘దుద్దసం అనతం నామ నహిసచ్ఛం సృదస్తనం
పటి విద్ధ్యా తణ్హా జానతో పస్సతో నత్థి కించన”!

67. ఛాందోగ్యోపనిషత్ 6-6-1-5

68. ‘మానవ సమాజం’ (రాహుల్‌జీ రచన) పేజీ 4-6

69. మహావగ్గ 1-3-4-8 (నా “వినయ పిటకం” (హిందీ) పేజీ 118)

70. మహావగ్గ 1-3-4-9 (నా “వినయ పిటకం” (హిందీ) పేజీ 118)

71. మహావగ్గ 1-3-4-2 (నా “వినయ పిటకం” (హిందీ) పేజీ 116-117)

72. మహావగ్గ 1-3-4-7 (నా “వినయ పిటకం” (హిందీ) పేజీ 116-117)

# నాగసేనుడు (క్రీ.పూ. 150)

## 1. సామాజిక పరిస్థితి

బుద్ధుని పుట్టుకకు కొంతకాలం ముందు నుండే భారతదేశంలోని రాజులు తమ రాజ్య విస్తరణ కోసం యుద్ధాలు ప్రారంభించారు. **కోసల** రాజు అప్పటికి రెండు మూడు తరాలకు ముందే **కాశీ** జనపదాన్ని ఆక్రమించాడు కూడా. బుద్ధుని సమకాలీనుడైన మగధరాజు బింబిసారుడు **అంగ**రాజ్యాన్ని తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. ఆనాటికి మగధ రాజ్య సరిహద్దు **అవంతీ** (ఉజ్జయినీ) వరకూ విస్తరించి ఉండేది. అలాగే ఆనాటి రాచరిక రాజ్యంలో **వత్స** (కోశాంబి, నేటి అలహాబాద్ ప్రాంతం) రాజ్యం కూడా ఒకటి. ఆనాడు ఉత్తరావనిలో బలీయంగా ఉన్న రాజ్యాలు ఐదింటిలో ఈ కోసల, మగధ, వత్స, అవంతీ రాజ్యాలు నాలుగూ, ఇవిగాక గణతంత్ర రాజ్యమైన వైశాలి ప్రజాతంత్రం ఐదోది.

మొదట్లో ఆర్యులు చిన్న చిన్న జనావాసాల్ని జయించారు. తొలి రోజుల్లో **ఆర్యులు** ఆ జనావాసాల్లో మొదటి నుండి జీవిస్తూ వచ్చే వారిలో ఎంతో తీవ్రంగా క్రూరంగా సంఘర్షణలకు దిగవలసి వచ్చేది. పరాజితులతోనే కాదు, ఒక్కోసారి తమ సాటి ఆర్యులతో కూడా ఈ సంఘర్షణలు తప్పేవి కావు. ఇలా నిరంతర ఘర్షణలతోనే ఆర్యులు తమ వ్యవస్థను బలీయం చేసుకొన్నారు. ఎన్నో శతాబ్దాల పాటు ఆర్య జనాంగాలన్నీ ఇటు ప్రజాతంత్ర విధానంతోనో, అటు రాజ్యతంత్ర వ్యవస్థలుగానో ఉంటూ వచ్చాయి.

ఉపనిషత్తుల కాలానికి ఆర్య జనాంగాలు ఈ రెండు విధాలుగా ఉన్నప్పటికీ, అప్పటికే గణతంత్ర వ్యవస్థ క్రమేపి రూపు మాసిపోతూ, రాచరికాలు లేదా సామంత వ్యవస్థ బలీయమవుతూ వచ్చింది. బుద్ధుని కాలానికి రాచరికాలు బలంగా వేళ్ళూనుకొన్నాయి. కాశీ-కోసల, అంగ-మగధ లాంటి రాజ్యాలు ఎన్నో జనపదాల్ని కలిపేసుకున్నాయి. ఇలా జనపదాల సరిహద్దుల్ని విచ్ఛిన్నం చేసింది ఆనాటి వ్యాపార వర్గమే. తమ వ్యాపార స్వార్థంతో స్వతంత్రంగా జీవించే జనపదాల్ని కాలరాసి రాచరిక రాజ్యాలుగా రూపొందడానికి వ్యాపార వర్గాలు తమ పూర్తి మద్దతునిచ్చారు. మగధకు చెందిన **ధనుంజయుడు** అనే వ్యాపార శ్రేష్ఠి (విశాఖ తండ్రి) **సాకేత** (అయోధ్య) లో ఒక పెద్ద కోటనే నిర్మించుకో గలిగాడు[1].

ఈ విధంగా ఒక వైపు వ్యాపార వర్గం తమ వ్యాపార స్వార్థంతో, మరో వైపున రాచరిక వర్గం తమ సైనికశక్తితో జనపదాల స్వేచ్ఛ స్వాతంత్ర్యాల్ని హరిస్తూ వచ్చాయి. వారి దోపిడికి అనుకూలమైన భావజాలాన్ని పెంచి పోషించే దర్శనాలకు, ధార్మిక భావాలకీ ఎక్కువగా ప్రచారం ఇచ్చారు. వారా భావజాలాన్ని అలా పెంచి పోషించడం సహజమే కదా! ఎలా జరిగినా, ఏది ఏమైనా, బౌద్ధ ధర్మం కూడా ఆనాటి పాలకుల, వ్యాపారుల అవసరాలకు బాగానే ఉపయోగపడింది. ఆ కారణం చేతనే రాజులూ, ధనిక శ్రేష్ఠులూ బౌద్ధ ధర్మాన్ని భుజాన వేసుకొని ఎంతో ప్రచారం చేశారు.

బుద్ధుడు నిర్వాణం పొందిన మూడేళ్ళ తరువాత (క్రీ.పూ. 480) మగధరాజు **అజాతశత్రువు** లిచ్ఛవీ గణతంత్రాన్ని నాశనం చేసి, తన రాజ్యంలో భాగంగా చేసుకొని తన రాజ్య సరిహద్దుల్ని తూర్పు, పడమరలలో **కోసీ నది** నుండి **యమునా** నదీతీరం వరకూ, ఉత్తర దక్షిణాలలో **హిమాలయాల** నుండి **వింధ్య** వరకూ విస్తరింపజేశాడు. బుద్ధుని విధానం జాతి, కుల, ప్రాంతీయతలకు ఏలాంటి ప్రాధాన్యతా ఇవ్వదు. మరి, బుద్ధుని సమకాలీనులైన ఆరుగురు తీర్థంకరులు కూడా ఈ విధానాల్నే ప్రవచించినప్పటికీ, ఆ కాలానికి చెందిన మేధావుల్లోనూ, ప్రజల్లోనూ బౌద్ధ ధర్మానికే ఎక్కువ ఆదరణ లభించింది. ఎందుకంటే, ఆ ప్రత్యేకత ఆ విధానంలోనే ఉంది. ఆడంబరాలు లేని, త్యాగ పూరితమైన బౌద్ధ భిక్షువుల జీవన విధానం ఆనాటి వారిని విశేషంగా ఆకర్షించగలిగింది. బ్రాహ్మణుల్లో, క్షత్రియుల్లో ఎంతో మంది బౌద్ధాన్ని స్వీకరించి, బుద్ధుని అనుయాయులు కావడానికి బుద్ధుని దర్శనమే కారణం.

ఈ విధంగా బుద్ధ దర్శనం - బుద్ధుని కాలంలోనూ, బుద్ధుని అనంతర కాలంలోనూ జనపదాల స్థానే విశాల రాచరికాలు ఏర్పడటానికి తన సహకారాన్ని - ఆ యుగధర్మంగా అందించింది.

బింబిసారుని అనంతరం **నందవంశ** రాజులు వచ్చారు. వారు తమ సామ్రాజ్యాన్ని పశ్చిమంగా **సట్లేజ్** నదీతీరం వరకూ విస్తరింపజేశారు. నందరాజ వంశం గతకాలపు రాజవంశంలా బౌద్ధ ధర్మాన్ని పూర్తిగా అంగీకరించలేదు. బౌద్ధ సంఘాలతో గత రాజవంశం వారికి ఉన్న దగ్గరి సంబంధాలూ లేవు. అయినప్పటికీ, బౌద్ధంలోని కొన్ని ప్రత్యేక లక్షణాలు నందవంశానికి కూడా అనుకూలించాయి. ప్రజాతంత్ర జనపదాల్ని జయించి, తమ సువిశాల రాజ్యంలో కలుపుకోడానికి ఆ లక్షణాలు సహకరించాయి. జనపదాల స్వతంత్ర (వ్యక్తిగత) భావాల్ని తిరస్కరించి, విశాల రాచరిక భావాల్ని ప్రచారం చేశాయి. ఈ ప్రచారం అటు వ్యాపార వర్గానికి, ఇటు రాజరిక వర్గానికీ అనుకూలమైన విషయమే! దీన్ని నందవంశం ఎలా మరచిపోతుంది!

బుద్ధుడు జీవించిన కాలంలోనే, మగధలో బౌద్ధధర్మం బహుళ ప్రచారం, విశేష ప్రజాదరణ పొందింది. అది రాజధర్మంగా కూడా అభివృద్ధి చెందింది. మగధ రాజ్య విస్తరణతో పాటే బౌద్ధధర్మమూ విస్తరించింది.

నందవంశం ఆఖరినాళ్ళలో గ్రీకు రాజు **సికందర్** (అలెగ్జాండర్) పంజాబ్ మీద దాడి చేశాడు. పంజాబ్‌లో గ్రీకు (యునాన్) ల పాలన అతి తక్కువ కాలమే కొనసాగినా, గ్రీకు సైనికులు, వ్యాపారులూ, శిల్పులూ లక్షలాదిగా ఇక్కడే స్థిరపడి పోయారు. అభిమానవంతులైన ఆ **మ్లేచ్ఛ*** జాతీయులను భారతీయ స్రవంతిలో కలిపే ప్రయత్నంలో, బౌద్ధం మొదట వరుసలో నిలబడింది. యవన (గ్రీకు) రాజైన **మినందర్ (మిళిందుడు*)**, శక రాజైన **కనిష్కుడు*** బౌద్ధాన్ని స్వీకరించడం ఏదో అనుకోకుండా జరిగిన సంఘటన కానే కాదు. గణతంత్ర జనపదాలు రాజ్యాలుగా మారడానికీ, **'మ్లేచ్ఛులు'** భారతీయ స్రవంతిలో మిళితం కావడానికీ - బౌద్ధధర్మం ఎంతో బలీయంగా పనిచేసింది.

## 2. యవన-భారతీయ దర్శనాల కలయిక

ఆనాటికి, యవనులు కూడా భారతీయుల్లాగా గొప్పవారే. దర్శన శాస్త్రాల్లో, కళల్లో, వ్యాపారంలో, రాజనీతిలో భారతీయులకు ఏమాత్రం తీసిపోనివారు యవనులు (గ్రీకులు). అయితే, నాట్యకళ, శిల్పకళల్లో భారతీయుల్ని అధిగమించిన వారు కూడా.

ఈ క్రింద చెప్పిన సిద్ధాంతాల్ని యవన దార్శనికులు ఆవిష్కరించారు. ఆ తరువాతి కాలంలో భారతీయులు వాటిని తమవిగా చెప్పుకొన్నారు.

| వాదం | దర్శన కర్త | కాలం (క్రీ.పూ.) |
|---|---|---|
| ఆకృతివాదం | **పైథాగరస్*** | 570–500 |
| క్షణికవాదం | **హేరాక్లిటీజ్*** | 534–475 |
| బీజవాదం | **అన్‌ఖాగోర్*** | 500–428 |
| పరమాణువాదం | **డెమోక్రటీజ్*** | 460–370 |
| విజ్ఞానం (ఆకృతి) | ప్లేటో | 427–347 |
| విశేషం | ప్లేటో | 427–347 |
| సామాన్యం | ప్లేటో | 427–347 |
| మూలస్వరూపం | ప్లేటో | 427–347 |
| సృష్టికర్త వాదం | ప్లేటో | 427–347 |
| ఉపాదాన కారణం | ప్లేటో | 427–347 |
| నిమిత్త కారణం | ప్లేటో | 427–347 |
| తర్కశాస్త్రం | ఆరిస్టాటిల్ | 384–322 |
| ద్రవ్యవాదం | ఆరిస్టాటిల్ | 384–322 |
| గుణం | ఆరిస్టాటిల్ | 384–322 |
| కర్మ | ఆరిస్టాటిల్ | 384–322 |

| | | |
|---|---|---|
| దిశ | అరిస్టాటిల్ | 384–322 |
| కాలం | అరిస్టాటిల్ | 384–322 |
| పరిమాణం | అరిస్టాటిల్ | 384–322 |
| ఆసనం | అరిస్టాటిల్ | 384–322 |
| స్థితి | అరిస్టాటిల్ | 384–322 |

ఈ యవన దర్శన ప్రభావం భారతీయుల మీద, వారి దర్శనాల మీద ఏ మేరకు పడిందో ముందు ముందు చూద్దాం. హేరాక్లిటీజ్, ప్లేటో, అరిస్టాటిల్ – ఈ గ్రీకు దార్శనికుల గ్రంథాల్ని అధ్యయనం చేసిన గ్రీకు పండితులు ఎందరో ఆనాటి పంజాబ్‌లో ఉండిపోయారు. వీరు ఇక్కడ బౌద్ధ దర్శనాన్ని కూడా అధ్యయనం చేశారు. దాని మహోన్నతిని కూడా అవగతం చేసుకొన్నారు.

## 3. నాగసేనుని జీవితం

నాగసేనుని జీవితానికి సంబంధించిన సమాచారం కొంత **'మిళిందప్రశ్న'**[2] లో దొరుకుతుంది. హిమాలయ పాదపీఠ భాగంలోని పంజాబ్ ప్రాంతంలో **కజంగల్** అనే గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో నాగసేనుడు జన్మించారు. తనింట్లో తండ్రి దగ్గరే వేద వ్యాకరణాది బ్రాహ్మణ విద్యల్ని బాల్యంలోనే అభ్యసించారు. **వతనీయం**(వర్తనీయం) అనే ప్రదేశంలో ఉండే రోహణుడు అనే భిక్షువు పరిచయంతో నాగసేనుడు బౌద్ధం వైపుకు మళ్ళారు. ఆ భిక్షువు గొప్ప పండితుడు. అతడే బౌద్ధధర్మాల్ని తొలిగా నాగసేనుడికి బోధించాడు.

రోహణునికి నాగసేనుడు శిష్యుడయ్యారు. వారిద్దరూ విజంబవత్థు (విజృంభవస్తు) మీదుగా హిమాలయాల్లోని రక్షితతలం అనే ప్రదేశానికి వెళ్ళారు. అక్కడ రోహణుడు ఆనాటి పద్ధతిననుసరించి తాను కంఠస్తం చేసిన బౌద్ధ వాఙ్మయాన్నంతటినీ నాగసేనునికి నేర్పించాడు. అయినా నాగసేనుని జ్ఞానతృష్ణ తీరలేదు. గురువుగారి ఆజ్ఞతో కాలి నడకన బయలుదేరి వర్తనీయ అనే చోటుకు చేరి, అక్కడ అశ్వగుప్తుడనే విద్వాంసుని దగ్గర శిష్యునిగా చేరారు.

కొత్త శిష్యునికి జ్ఞానబోధ సాగిస్తూ ఉన్నాడు **అశ్వగుప్తుడు.** ఈలోగా ఒక సంఘటన జరిగింది. వారిద్దరూ ఒక ఇంటికి భోజనానికి వెళ్ళారు. భిక్షువులు భోజనానంతరం గృహస్థులకు తప్పక ఏదేని ఒక ధర్మోపదేశం చేయాలి. ఆ రోజు ఆ ఇంట్లో ధర్మోపదేశం చేసే పనిని నాగసేనునికి అప్పజెప్పాడు అశ్వగుప్తుడు. ఆనాటి ఉపదేశం విని నాగసేనుడి ప్రతిభాపాటవాలు గుర్తించారు గురువు గారు, తన శిష్యునికి ఇంకా జ్ఞానం అవసరం అని గ్రహించి, శిష్యుణ్ణి మరింత యోగ్యుణ్ణి చేయాలని తలచి **పాట్నా** (పాటలీపుత్రం) లో ఉన్న **అశోకారామం***లో ఉన్న **ధర్మరక్షితు**డనే ఆచార్యుని వద్దకు పంపారు.

పాట్నా అక్కడికి నూరు యోజనాల దూరం. అంత దూరం కాలి నడకన వెళ్ళడం అంత తేలిక కాదు. అయితే వర్తనీయ నగరానికీ, పాట్నా నగరానికీ మధ్య భిక్షువుల రాకపోకలు జరుగుతూ ఉంటాయి. నాగసేనుణ్ణి తనతో తీసుకుపోవడానికి ఒక **సార్థవాహుడు*** (యాత్రికుడు) అంగీకరించాడు. యువ విద్వాంసుడైన నాగసేనుడి బాధ్యతలు తీసుకుని ఆ సార్థవాహుడు నాగసేనుణ్ణి పాట్నా తీసుకువెళ్ళాడు.

పాట్నాలో అశోకారామంలో **ధర్మరక్షిత** దగ్గర బౌద్ధ తత్త్వ జ్ఞానాన్ని, పిటకాల్ని సంపూర్ణంగా అధ్యయనం చేశారు. ఇంతలో పిలుపు రావడంతో తిరిగి పంజాబు చేరుకొని, అక్కడి నుండి మరోమారు హిమాలయాల్లోని **రక్షితతలం** వెళ్ళారు.

అప్పుడు... **యవన*** రాజైన మినందర్ రాజ్యం యమునా నది నుండి **అమూదరియా** (వక్షు నది) వరకూ విస్తరించి ఉండేది. అతని రాజ్యానికి రెండు రాజధానులున్నాయని ప్రతీతి. ముఖ్య రాజధాని **సాగల్** (శ్యాల్‌కోట్, సియాల్‌కోట), రెండోది **బలఖ్** (బాహ్లీకం).

**ప్లూటార్క్** ఇలా రాశాడు...

“మినందర్ (మిళిందుడు) గొప్ప ప్రజారంజకుడైన రాజు. న్యాయమైన పాలకుడు. మంచి విద్వాంసుడు. పండితుడు. అతని మరణానంతరం అతని అస్థికల కోసం ప్రజలు తగాదాలు పడ్డారు. కొట్టుకొన్నారు. ఆ అస్థికలమీద పెద్ద పెద్ద స్తూపాలు నిర్మించారు. మినందర్‌కు పండితుల (శాస్త్ర) చర్చలు అంటే మహా ఇష్టం. తనూ స్వయంగా చర్చిస్తాడు. ఒక మాదిరి పండితులు అతని ముందు వాదానికి నిలబడ లేరు”.

భిక్షువులు "నాగసేనా, మిళంద మహారాజు వాద వివాదాల్లో ఘటికుడు. అనేక రకాల ప్రశ్నలు వేస్తూ భిక్షుసంఘాన్ని కించపరుస్తూ ఉంటాడు. కాబట్టి నీవు వెళ్ళు. వాదించు. మిళిందుని ఓడించు" అన్నారు.

భిక్షు సంఘం కోరిక మేరకు నాగసేనుడు సాగల్ నగరం వెళ్ళారు. అక్కడ **అసంఖేయ్య** అనే **పరివేణం** (బౌద్ధావిహారం) చేరాడు. అప్పటికే అక్కడి **ఆయుపాలుడు** అనే భిక్షువుని మిళిందుడు పండిత చర్చలో ఓడించాడు.

నాగసేనుడు వచ్చాడన్న వార్త నగరం అంతా వ్యాపించింది. మిళిందుడు కూడా తన మహామంత్రి అయిన దేవమంత్రిని (ఇతడు బహుశ యవన **'దిమిత్రి'** అయి ఉండవచ్చు) నాగసేనుని వద్దకు పంపాడు.

దేవమంత్రి నాగసేనునితో 'మినందర్ మహారాజు తమ దర్శనాన్ని కోరుతున్నారు' అని చెప్పాడు. మహారాజు విహారానికి వచ్చి తనను కలుసుకోడానికి నాగసేనుడు ఒప్పుకొన్నారు. ఐదు వందల మంది యవనులు వెంటరాగా, మిళింద మహారాజు రథంపై అసంఖేయ్య విహారానికి తరలి వచ్చాడు. నాగసేనునికి నమస్కరించాడు. ఆ తరువాత... మిళిందుడు నాగసేనుణ్ణి ప్రశ్నించడం ప్రారంభించాడు. ఈ ప్రశ్నలే **మిళింద ప్రశ్నలు*** అనే గొప్ప గ్రంథంగా రూపొందాయి.

'మిళింద ప్రశ్నలు' అనే గ్రంథం ఆరు పరిచ్ఛేదాలున్న మహాగ్రంథం. అయితే ఆ ఆరింటిలో మూడు మాత్రమే ప్రాచీనమైనవి. మిగిలిన మూడూ ప్రక్షిప్తాలు. ప్రాచీనమైన మూడు పరిచ్ఛేదాలే చైనా భాషలోకి అనువదించబడ్డాయి.

మొదటరోజు రాజే విహారానికి వచ్చి నాగసేనుణ్ని ప్రశ్నలడిగాడు. రెండో రోజు నాగసేనుణ్ణి తన రాజమహలుకు పిలుపించుకొని తన ప్రశ్నలపరంపర కొనసాగించాడు.

## 4. దార్శనిక చింతన

మిళిందుని ప్రశ్నలకు నాగసేనుడు తనిచ్చిన సమాధానాల్లో బౌద్ధ దర్శనంలోని అనాత్మవాదం, కర్మ-పునర్జన్మ, నామం-రూపం (మనస్సు-భౌతికతత్త్వం), నిర్వాణం మొదలైన విషయాలను గూర్చి విపులంగా వివరించారు.

## I. అనాత్మవాదం

ముందుగా మిళిందుడు అనాత్మవాదానికి సంబంధించి ఇలా ప్రశ్నించాడు.[4]

(అ)

ప్రశ్న : 'భన్తే, తమరు ఏ **నామం**తో తెలుసుకోబడుతున్నారు?"

"నాగసేనుడు... అనే నామంతో నన్ను పిలుస్తారు. ఇది కేవలం వ్యవహారికమైన పేరు మాత్రమే. నిజానికి నాగసేనుడనే పేరున్న పురుషుడు (ఆత్మ) అనేవాడు ఎవడూ లేడు."

'భన్తే, అలాంటి పురుషుడు (ఆత్మ) లేకపోతే, మీరు ధరించే వస్త్రం ఎవరికి చెందుతుంది? మీరు తినే ఆహారం ఎవరికి చెందుతుంది? మీరు మీ శీలాన్ని (సదాచారాన్ని) కాపాడుకొంటున్నారు గదా! అది ఎవరిది? ధ్యానం చేసేది ఎవరు? అభ్యాసం చేసేది ఎవరు? ఆర్యమార్గ ఫలమైన నిర్వాణాన్ని పొందేదెవరు? పురుషుడు – (ఆత్మ) లేకపోతే పాపపుణ్యాలే ఉండవు కదా! అలాంటప్పుడు పాపం చేసేవాడూ ఉండడు. చేయించేవాడూ ఉండడు. వాటి సంబంధ ఫలమూ ఉండదు. ఎవడైనా మిమ్మల్ని చంపాడే అనుకోండి, ఎవర్నీ చంపినట్టు కాదు కదా! ఇంతా చేసి అసలు నాగసేను డెవరు? ఈ తలవెంట్రుకలు నాగసేనుడా?"

"రాజా, కాదు"

"ఈ రోమాలు నాగసేనుడా?"

"కాదు మహారాజా"

"ఈ గోళ్ళు, దంతాలూ, చర్మం, మాంసం, స్నాయువులు, ఎముకలు, మూలుగ, వృక్క, హృదయం, కాలేయం, క్లోమం, ప్లీహం, పుపుసం, పేగులు, చిన్నప్రేవులు, పొట్ట, మలం, పిత్తం, కఫం, చీము, నెత్తురు, చెమట, కన్నీరు, కొవ్వు, చొంగ, చీమిడి, గుమిలి, మెదడు – వీటిలో ఏది నాగసేనుడు?"

"ఏదీ కాదు, మహారాజా!"

"మరి, రూపం (భౌతిక తత్వం), వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం – ఏది నాగసేనుడు?"

"రాజా, ఏదీ కాదు"

"అయితే... రూపం, విజ్ఞానం ఆదిగా గల ఈ పంచస్కంధాలకు భిన్నమైనది ఏమైనా ఉందా నాగసేనుడంటే?"

"లేదు మహారాజా"

'భన్తే, మిమ్మల్ని అడిగి అడిగి అలసిపోయాను. 'నాగసేనుడు' అంటే ఎవరో తెలియనే లేదు. నాగసేనుడు అనేది కేవలం శబ్దమేనా? ఆఖరికి...నాగసేనుడంటే ఎవరు?"

"మహారాజా, మీరు ఇక్కడికి ఎలా వచ్చారు? కాలి నడకన వచ్చారా? ఏదైనా వాహనం మీద వచ్చారా?"

"భన్తే, నేను రథం మీద వచ్చాను."

"రాజా, మీరు రథం మీద వచ్చారా? మీరు వచ్చిన 'రథం' ఎక్కడుంది? ఏది రథం? ఇరుసు రథమా?"

"కాదు భన్తే"

"నాభి రథమా"

"కాదు భన్తే"

"చక్రాలు రథమా"

"కాదు భన్తే"

"చట్రం?... తాళ్ళు?... కళ్ళెం?... కొరడా?... ఇవి రథమా?"

"కాదు భన్తే కాదు"

"మహారాజా, ఇరుసూ మొదలైనవన్నీ కలిపి రథమా?"

"కాదు భన్తే"

"మహారాజా, మిమ్మల్ని అడిగి అడిగి అలసిపోయాను. ఏది "రథం" అనేది తేల లేదు. అసలు రథం అనేది ఎక్కడుంది? అది కేవలం ఒట్టి శబ్దమేనా? ఇంతకూ

అసలు రథం అంటే ఏమిటి? రథం లేదని అబద్ధం పలుకుతారెందుకు? **జంబూద్వీపం**(భారతదేశం) మొత్తానికీ తమరు మహారాజులు కదా! ఎవర్ని చూచి భయపడుతున్నారు? అబద్ధం ఆడుతున్నారు?"

"భన్తే నాగసేనా, నేను అబద్ధం చెప్పడం లేదు. ఇరుసు, ఇంకా మిగిలిన భాగాలన్నింటి కలయికతో ఏర్పడిన ఒక వాహనాన్ని – ఏదో ఒక పేరుతో పిలుచుకోవడం అవసరం కాబట్టి దాన్ని 'రథం' అని పేరు పెట్టుకొన్నాం. అంతే. భన్తే".

"సరిగ్గా చెప్పారు మహారాజా! రథం అంటే ఏమిటో తెలిపారు. అలాగే... నా తల, మొండెం మొదలైన శరీర భాగాలన్నీ కలసిన నాకు కేవలం గుర్తింపుగా పిలుచుకోవడం కోసం 'నాగసేనుడు' అని పేరు పెట్టారు. అంతేగాని, నాగసేనుడన్న పురుషుడు (ఆత్మ) ఎవడూ లేడు. ఇదే విషయమై భిక్షుణి **వజ్ర** బుద్ధ భగవానునితో ఇలా అంది –

"అనేక భాగాల కలయికను 'రథం' అని చెప్పుకొన్నట్లు, ఇదే విధంగా స్కంధాల (రూపం మొ॥వి) కలయికను 'జీవం' అంటాం. అంతేగానీ, నిజానికి జీవం అనేది ఏదీ లేదు[5]".

(ఆ)[6]

"మహారాజా, 'తెలుసుకోవడం' విజ్ఞానానికి గుర్తు. సరిగ్గా అవగాహన చేసుకోవడం 'ప్రజ్ఞ' కు గుర్తు. అంతేగానీ, 'జీవం' అనేది ఏదీ లేదు."

"భన్తే, జీవం అనేది ఏదీ లేనప్పుడు, మరి మనలో ఉండి కంటి ద్వారా 'రూపాన్ని' చూచేదెవరు? చెవి ద్వారా శబ్దాన్ని వినేదెవరు? ముక్కు ద్వారా వాసన గ్రహించేదెవరు? నాలుక ద్వారా రుచి తెలుసుకొనేదెవరు? శరీరం ద్వారా స్పర్శను పొందేదెవరు? మనసు ద్వారా విషయాల్ని అర్థం చేసుకొనేదెవరు?"

"మహారాజా, మీరు చెప్పినట్లు – శరీరానికి భిన్నమైనదేదో జీవం అనేది ఒకటి ఉంటే అది శరీరంలో ఉండి కంటి ద్వారా బాహ్య ప్రపంచాన్ని చూస్తూ ఉన్నదనుకొంటే... కంటిని తీసేసినా – ఆ రంధ్రం గుండా ఇంకా స్పష్టంగా బాహ్య దృశ్యాల్ని చూడాలి గదా! అలాగే ముక్కును కోసినా, చెవిని తొలగించినా, నాలుక

తెగ్గోసినా... పై ఆటంకాలు తొలగి జీవుడు హాయిగా ఆయా జ్ఞానాలు పొందాలి. చర్మాన్ని ఒలిచినా, జీవుడు హాయి అనుభూతినే పొందాలి కదా! మరి అలా జరుగుతుందా?"

"లేదు భన్తే, లేదు. అలా జరగదు".

"మహారాజా, కాబట్టి మనలో 'జీవం' అనే ప్రత్యేక పదార్థం అంటూ ఏదీ లేదు."

## II. కర్మ – పునర్జన్మ

ఆత్మ లేదు అనుకొన్న తర్వాత మనం చేసే మంచీ–చెడులకు బాధ్యులెవరు? వాటి ఆధారంగా పరలోకంలో అనుభవించాల్సిన సుఖదుఃఖాలు ఎవరు అనుభవించాలి? వాటి మాటేమిటి? – ఈ విషయాలపై చర్చ ప్రారంభిస్తూ మిళిందుడు ఇలా అన్నాడు –

"భన్తే, జన్మను పొందేది ఎవరు?"

"మహారాజా, నామం (విజ్ఞానం, మనస్సు)[7], రూపం (పదార్థం)[8]..?"

"అంటే... నామరూపాలు తిరిగి మరలా జన్మిస్తాయా?"

"మహారాజా, ఈ నామరూపాలే తిరిగి మరలా పుట్టవు. మనిషి ఈ నామరూపాల వల్ల పాపాలో, పుణ్యాలో చేస్తాడు – ఆ కర్మల కారణంగా మరో నామరూపాలు జన్మిస్తాయి".

"భన్తే, అయితే మొదటి నామం రూపం తన కర్మల నుండి విముక్తి పొందినట్టే కదా?"

"మహారాజా, అది తిరిగి మరలా పుట్టకపోతే ముక్తి పొందినట్టే, కానీ మళ్ళీ పుట్టుతుంది. కాబట్టి, ముక్తి పొందనట్టే".

"... ఉదాహరణతో వివరించండి".

### i. మామిడి పండు దొంగ[9]

ఒకడు మరొకడి మామిడిచెట్టు పండును దొంగిలించాడు. ఆ చెట్టు యజమాని దొంగిలించిన వాణ్ణి పట్టుకొని రాజు దగ్గరకు తీసుకొని వెళ్ళి –

"రాజా, ఇతను నా చెట్టు మామిడిపండును దొంగిలించాడు. కనుక తగిన దండన విధించండి" అని విన్నవించుకొన్నాడు.

అప్పుడు ఆ దొంగ "రాజా, ఇతను అబద్ధాలు చెప్తున్నాడు. నేను ఇతని మామిడి పండును దొంగిలించలేదు. చెట్టు మొలవడానికి కారణమైన ఇతను నాటిన మామిడి పండు వేరు. నేను కోసుకొన్న పండు వేరు. అతను నాటిన పండు కాదిది" అన్నాడు.

'మహారాజా, ఇప్పుడు చెప్పండి. ఆ దొంగను శిక్షించాలా? వదిలివేయాలా? – అని ప్రశ్నించాడు నాగసేనుడు మిళిందుని.

"భన్తే, శిక్షించాలి".

"ఎందుకని?"

"భన్తే, అతని వాదం ఏదైనా కావొచ్చు. మొదటి పండును కాకపోతే, మరొక పండునైనా దొంగిలించాడు కదా!"

"రాజా, మానవుడూ అలాగే. మనుషులు ఈ నామ రూపాలతో కర్మలు చేస్తున్నారు. ఆ 'కర్మ' ల కారణంగానే మరో నామరూపాలు జన్మిస్తాయి. కాబట్టి కర్మ విముక్తి కాలేదు.

### ii. అగ్ని ప్రవాసం

మహారాజా, ఒకడు చలి కాగడానికి చలిమంట వేసుకొని, చలి కాగాక, ఆ మంటను ఆర్పివేయకుండా వెళ్ళిపోయాడు. కొంతసేపటికి ఆ మంట రగిలి, పెద్దదై ఆ ప్రక్కనే ఉన్న పంట పొలాన్ని తగులబెట్టింది. ఈ విషయం రాజుగారి దగ్గరకు విచారణకు వచ్చింది. ఆ మంట వేసినవాడు ఇలా అన్నాడు...

"నేను వేసిన మంట ఆ పంట పొలాన్ని తగులబెట్టలేదు. నేను వేసిన మంట వేరు. తగలబెట్టిన మంట వేరు. కనుక నేను శిక్షార్హుడను కాను".

"మరి, మీరు చెప్పండి మహారాజా, వాడు శిక్షార్హుడా? కాడా?"

"భంతే, తప్పక శిక్షార్హుడే. అతను ముట్టించిన మంటే గదా, పెరిగి చివరకు పొలాన్ని తగులబెట్టింది. కాబట్టి తప్పక శిక్షించాలి".

### iii. దీపాగ్నితో ఆహుతి కావడం

"మహారాజా, ఒకడు దీపాన్ని తీసుకొని వెళ్ళి ఇంటి మంచె మీద భోజనం చేశాడు. ఆ దీపం కారణంగా మంచె మీద ఉన్న గడ్డిపరకలు అంటుకొన్నాయి. క్రమేపి ఆ మంట పెరిగి ఇల్లు తగలబడింది. ఆ ఇంటి వల్ల ఊరంతా తగలబడింది. గ్రామస్థులు ఆ వ్యక్తిని పట్టుకొని, ఊరెందుకు తగుల బెట్టావు?" అని గద్దించారు.

అప్పుడతడు "ఊరిని నేను తగులబెట్టలేదు. నేను భోజనం సమయంలో ఉన్న దీపం మంట వేరు. ఊరిని తగులబెట్టిన మంట వేరు" అన్నాడు.

"మరి, మీరు దీనికి న్యాయం ఎలా చెప్తారు?"

"భంతే, గ్రామస్థులు చెప్పిందే సరైనది..."

"కాబట్టి, మహారాజా, ఈ విధంగానే... చావుతో ఒక నామం, ఒక రూపం లయమవుతాయి. జన్మతో కొత్త నామరూపాలు పుట్టుకొస్తాయి. అయినా, ఈ కొత్త నామరూపాలు పాత వాటికి చెందినవే కాని వేరైనవి కాదు. కాబట్టి నామరూపాలు వెనుకటి కర్మల నుండి వేరు పడినవి కావు."

### iv. వివాహిత కన్య

మహారాజా, ఒక వ్యక్తి కన్యాశుల్కం చెల్లించి ఒక చిన్నపిల్లను వివాహం చేసుకొని, తాను దూరప్రాంతం వెళ్ళి పోయి, చాలా ఏళ్ళ తర్వాత తిరిగి వచ్చాడు. ఈలోగా ఆ పిల్ల పెరిగి పెద్దయింది. పెద్దయిన తర్వాత మరో వ్యక్తి ఆమెకు కన్యాశుల్కం చెల్లించి వివాహమాడాడు.

ఈ విషయం తెలుసుకొని, మొదటివాడు రెండోవానితో –

'నా భార్యను నీవు ఎందుకు తెచ్చుకొన్నావు?' అని ప్రశ్నించారు.

అప్పుడు రెండోవాడు...

"లేదు లేదు. నేను నీ భార్యను తెచ్చుకోలేదు. నువ్వు పెండ్లాడిన ఆ చిన్నపిల్లను నేను తెచ్చుకోలేదు. నీవు పెండ్లాడిన వ్యక్తి వేరు. నేను తెచ్చుకొన్న ఈమె వేరు" అన్నాడు.

“రాజా, వాళ్ళిద్దరూ అలా ఘర్షణపడుతూ మీ దగ్గరకు వస్తే, మీరు ఏం తీర్పునిస్తారు?’ అని నాగసేనుడు అడిగారు.

దానికి మినందర్...

“మొదటి వ్యక్తి తరపునే న్యాయం చెప్తాను” అని జవాబు చెప్పాడు. మరలా

**(ఇ)**[10]

మరలా ఇలా ప్రశ్నించాడు –

“భన్తే, జన్మించేవాడు కొత్తవాడా? లేక వెనుకటి వాడా?” అని ప్రశ్నించాడు.

“రెండూ కాదు.”

(1) పుట్టినప్పుడు మీరు చాలా పసివారు. వెల్లికిలా పడుకొని ఉండేవారు. ఇప్పుడు పెద్దయ్యారు. పెరిగారు. ఇప్పటికీ ఆ పసివాడే అవుతారా?”

“కాను భన్తే, కాను. నేను ఇప్పుడు ఆ పసివాణ్ణి కాలేను. మరో వ్యక్తిగా మారి పోయాను.”

“మహారాజా, మీరు ఆ పసివాడివి కాకపోతే అప్పుడింక మీకు తల్లీలేదు, తండ్రీ లేడు. గురువూ లేడు. ఎందుకంటే చిన్ననాడు తల్లి, తండ్రి, గురువుల్ని కల్గిన ఆనాటి పసివాడు మీరు కాదు గదా! మీ భిన్న భిన్న పరిస్థితుల్లో భిన్న భిన్న తల్లులూ ఉండి వుండాలి. పెద్దవాళ్ళయ్యాక చిన్నప్పటి కన్నతల్లి, మీ తల్లి కాదు. శిల్పకళను నేర్చుకొనే విద్యార్థి వేరు. నేర్చుకొన్నాక నైపుణ్యం కల్గిన నిపుణుడూ వేరు. అపరాధం చేసేవాడు ఒకడు. ఆ అపరాధం క్రింద శిక్ష అనుభవించే వాడు వేరొకడు అవుతాడు”.

“భన్తే, తమరు దీని ద్వారా ఏం చెప్పాలనుకొంటున్నారు?”

“మహారాజా, నేను పసితనంలో ఒకర్ని, పెద్దయ్యాక వేరొకర్ని అయినప్పటికీ ఇంతటి మార్పుకూ కారణమైన పరిస్థితులు ఈ శరీరంలోనే సంభవించాయి. కాబట్టి ఈ శరీరం అప్పుడూ–ఇప్పుడూ ఒకటే అనాల్సివస్తుంది.”

(2) “ఒకడు ఒక జ్వాలను వెలిగించాడనుకొందాం. అది రాత్రంతా వెలుగుతూ ఉంటుంది కదా!”

"...రాత్రంతా వెలుగుతూంది."

"మహారాజా, మొదటి జాములో ఉన్న వెలుగే, రెండు, మూడు జాముల్లో కూడా ఉంటుందా?

"ఉండదు భన్తే"

"మహారాజా, ఆ దీపం మొదటి జాములో ఒకటిగా, ఆ తర్వాతి రెండు, మూడు జాముల్లో వేరొకటిగా అవుతుందా?"

"లేదు భన్తే, ఆ దీపమే రాత్రంతా వెలుగుతూ ఉంటుంది".

"మహారాజా, మీరు చెప్పినట్లే సరిగ్గా, ఒక వస్తువుకు తాను ఉనికిలో ఉండే క్రమంలో తొలిగా ఒక స్థితి ఉత్పన్నమవుతుంది. మరో స్థితి లయమవుతుంది. ఈ క్రమం ఒక ప్రవాహంగా ఇలా కొనసాగుతూనే ఉంటుంది. ఒక వస్తువు యొక్క, రెండు స్థితుల మధ్య దూరం ఒక రెప్పపాటు కాలం కూడా ఉండదు. ఎందుకంటే ఒక స్థితి లయమవుతూనే మరో స్థితి ఉత్పన్నమవుతూ ఉంటుంది. దీనివల్లే ఆ వస్తువు ఇప్పటిదీ అవుతుంది, వెనుకటిదీ అవుతుంది. ఒక స్థితికి చెందిన చిట్టచివరి చైతన్యం నశించగానే, రెండో స్థితికి చెందిన తొట్టతొలి చైతన్యం పుడుతుంది."

**(ఈ)**

"భన్తే, ఒక నామం-రూపం కొన్ని మంచి పనులో, చెడ్డపనులో చేస్తుంది. మరి రెండో జన్మలో వీటి కర్మలు ఏమవుతాయి[11] ? "

"మహారాజా, అవి నీడలా ఎన్నటికీ వీడకుండా వెంటాడుతూనే ఉంటాయి."

"భన్తే, అయితే ఆ కర్మలు "ఇవిగో ఇవి" అని చూపించడానికి వీలవుతుందా?"

"మహారాజా, వీలుకాదు. ఒక వృక్షానికి కాయని కాయల్ని మనం ఎలా చూపించడం వీలుకాదో, అలాగే ఈ కర్మల్నీ చూపించలేం."

## III. నామం-రూపం

బుద్ధుడు ఈ విశ్వం మూలతత్త్వాన్ని విజ్ఞానం (నామం) అనీ, దాని భౌతిక తత్త్వాన్ని రూపం అనీ అన్నాడు. ఈ **'నామం-రూపం'** ల గురించి మినాందర్ ఇలా ప్రశ్నించాడు.

"భన్తే, నామం అంటే ఏమిటి? రూపం అంటే ఏమిటి?"

"మహారాజా, కన్పించే స్థూల రూపాలన్నీ 'రూపాలు'. కనిపించని సూక్ష్మమైన మానసిక ధర్మాలన్నీ 'నామాలు'. ఈ రెండు ఒకదానికి మరొకటి ఆశ్రయాలు. ఒకటి లేకుండా మరొకటి ఉండదు. ఎల్లప్పుడూ అవి రెండూ అంటిపెట్టుకొనే ఉంటాయి. కోడి గర్భంలో బీజరూపంలో పిల్ల లేకపోతే గ్రుడ్డే ఉండదు. పిల్లా-గ్రుడ్డూ ఈ రెండూ పరస్పర ఆశ్రితాలు. ఒకటి లేక పోతే మరోటి ఉండదు. ఎల్లప్పుడూ ఇలా జరుగుతూనే ఉంటుంది..."

## IV. నిర్వాణం

నిర్వాణాన్ని గురించి మినందర్ ఇలా అడిగాడు -

"భన్తే, నిర్వాణమంటే నిరోధమేనా?[12] "(అంటే... జీవప్రవాహం ఆగిపోవడమేనా?)

"అవును మహారాజా, నిరోధమే (ఆగిపోవడమే) **నిర్వాణం**. అజ్ఞానులంతా విషయ భోగాల్లో పడి, వాటితోనే ఆనందం పొందుతుంటారు. ఆ ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటారు. పుడతారు... పెద్దవారవుతారు... చనిపోతారు...

దుఃఖిస్తుంటారు... రోదిస్తూ ఉంటారు. దుఃఖం, అశాంతి, బాధలలో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటారు. ఆ ఏడ్చే వాళ్ళకి ఏడుపే మిగులుతుంది. కానీ, మహారాజా, జ్ఞానులు విషయ భోగాల్లో పడరు. ఈ కారణం చేత వారిలో కోరికలు పుట్టవు. అవి ఆగిపోతాయి. ఇలా కోరికలు ఆగిపోవడం వల్ల **భవం** (తిరిగి పుట్టాలనే కోరిక) ఆగిపోతుంది. ఇలా తిరిగి పుట్టాలనే కోరిక ఆగిపోవడం వల్ల జన్మబంధాలన్నీ ఆగిపోతాయి. పుట్టుక... ముసలితనం... మరణం... మొదలైన దుఃఖాలన్నీ ఆగిపోతాయి. మహారాజా, ఇలా 'ఆగిపోవటమే' నిర్వాణం[13]."

"...అలా అయితే.. మరిప్పుడు బుద్ధుడు ఎక్కడున్నారు?"

"మహారాజా, భగవానుడు పరమ నిర్వాణాన్ని పొందారు. వారు ఆ స్థితిని పొందాక, ఇక వారి వ్యక్తిత్వంలో మిగిలి ఉండాల్సింది ఏదీ లేదు."

"భన్తే, ఉదాహరణ ద్వారా సెలవియ్యండి."

"మండి, ఆరిపోయిన మంటను చూపగలమా?"

"లేదు భన్తే! ఆరిపోయిన మంటను తిరిగి చూపలేము. అది ఆరిపోయింది గదా!"

నాగసేనుడు మినాందర్‌కు తనిచ్చిన సమాధానాల ద్వారా బుద్ధ దర్శనానికి సంబంధించిన కొత్త విషయాలేవీ చెప్పలేదు. కానీ, చాలా తేలికగా, ఎంతో చక్కగా విడమరచి చెప్పాడు – అని పైన తెలుసుకున్న విషయాన్ని బట్టి తెలుస్తుంది. ఇక్కడ మనం మరో విషయాన్ని గుర్తుంచుకోవాలి. హిందూ, యవన సామ్రాజ్యాలకూ, స్నేహానికీ కూడలి అయిన **సయాల్‌కోట** (సాగల్) లో నాగసేనుడు పుట్టాడు. ఇటు భారతీయ విజ్ఞానంతోపాటు అటు యవన విజ్ఞానాన్ని కూడా సముపార్జించి ఉండటం చేతనే మినాందర్ లాంటి తార్కికునికి జవాబులు చెప్పగల సత్తా నాగసేనుడు సంపాదించారు.

మినాందర్ – నాగసేనుల ప్రశ్నోత్తరాలు – చరిత్రలో హిందూ–యవన ప్రతిభా పాటవాలకు ఓ చిన్న మచ్చుతునక మాత్రమే! ఈ భారత–యవన దేశాల మేధోసంపద వల్ల భారతదేశంలో ఒక నూతన **భావధార** (ఆలోచనా విధానం) పుట్టుకొచ్చింది

# పాద సూచికలు

1. 'మానవ సమాజం' – (హిందీ) పేజీ 136–38
2. 'మిళింద ప్రశ్న' (హిందీ అనువాదం భిక్షు జగదీశ్ కాశ్యప్ క్రీ.శ.1937)
3. వర్తనీయం – కజంల మరియు శాయద్ విజృంభవస్తు, శ్యాల్‌కోట జిల్లాలో ఉన్నాయి.
4. మిళింద ప్రశ్న 2–1
5. సంయుత్త నికాయ 5–10–6
6. సంయుత్త నికాయ 3–4–44
7. Mind
8. Matter
9. సంయుత్త నికాయ 2–2–14
10. సంయుత్త నికాయ 2–2–9
11. సంయుత్త నికాయ
12. సంయుత్త నికాయ 3–1–6
13. సంయుత్త నికాయ 3–2–118

# బౌద్ధ సంప్రదాయం

## 1. బౌద్ధ ధార్మిక సంప్రదాయం


బుద్ధుడు ఆత్మవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. దానితోపాటుగా భౌతికవాదాన్ని కూడా వ్యతిరేకించారు. ఈ విషయాన్ని గూర్చి ఇంతకుముందే చెప్పుకున్నాం.

మౌర్య వంశపాలన కడపటి వరకూ బౌద్ధదర్శనానికి మగధ కేంద్రంగా ఉండేది. ఆ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తర్వాత బౌద్ధదర్శనానికీ లేదా ధర్మానికీ మగధ తన కేంద్రస్థానాన్ని కోల్పోవటం అటుంచి, కనీసం బౌద్ధ సంప్రదాయంలో ఏదేని ఒక ముఖ్యశాఖకు (నికాయానికి) కూడా కేంద్రంగా నిలబడలేక పోయింది.

బౌద్ధధర్మ కేంద్రం తూర్పు నుండి క్రమంగా పశ్చిమానికి మారుతూ వచ్చింది. ఈ స్థాన పరివర్తనలో భాగంగానే ఒక బౌద్ధ ధార్మిక శాఖ అయిన, **సర్వాస్తివాదం***(సర్వాస్తివాద శాఖ) **మగధ** నుండి మధురలోని **ఉరుముండ** (గోవర్ధన) పర్వతానికి చేరింది.

దానికి పూర్వం, యవన రాజుల పాలన కాలంలో బౌద్ధ దర్శనం **పంజాబ్**లో విశేష ప్రాచుర్యం పొందింది. **కనిష్కుని** కాలంలో, క్రీస్తు శకం 1వ శతాబ్దం మధ్యలో **కాశ్మీరు – గాంధార** ప్రాంతాలు బౌద్ధదర్శన కేంద్రాలుగా నిలదొక్కుకున్నాయి. ప్రధాన కేంద్రాలైనాయి. ఇక్కడే యూనానీ కళలు, ఆలోచనా సరళి బౌద్ధ సంప్రదాయంతో మమేకమవుతూ వచ్చాయి.

అశోకుని కాలం నాటికి, క్రీ.పూ. 269 వరకు బౌద్ధధర్మం ఈ క్రింద తెల్పిన శాఖలుగా విడిపోయి ఉంది[1].




దీన్నిబట్టి అర్థమయ్యేదేమంటే... బుద్ధుని నిర్వాణం (క్రీ.పూ. 483) తర్వాత నూరేళ్ళ (క్రీ.పూ. 380) కు బౌద్ధ ధర్మాన్ని అనుసరించేవారు **స్థవిర వాదులు***(బుద్ధుని మార్గాన్ని అనుసరించేవారు), **మహాసాంఘికులు*** అను రెండు ప్రధాన శాఖలుగా విడిపోయారు. ఆ తర్వాత 125 సంవత్సరాల్లో మహా సాంఘికులు ఆరు నికాయాలుగా, స్థవిరవాదులు 12 నికాయాలుగా, మొత్తం 18 శాఖలు (నికాయాలు లేదా సంప్రదాయాలు) పుట్టుకొచ్చాయి. సర్వాస్తివాదం స్థవిరవాదంలో అంతర్గత శాఖ అయ్యింది. ఈ పద్దెనిమిది సంప్రదాయాల లోని **పిటకాలు*** (సూత్రపిటకం, వినయపిటకం, అభిధమ్మపిటకం) వేరైనప్పటికీ కొన్ని సామీప్యతలూ ఉన్నాయి.

సూత్రపిటకం, వినయపిటకాల్లో ఎక్కువ సామీప్యతలు ఉన్నాయి. కానీ, అభిధమ్మ పిటకంలో అభిప్రాయ భేదాలు లేవుగానీ, వాటి పుస్తకాలు ప్రతిశాఖకూ విడివిడిగా ఉన్నాయి. స్థవిర వాదులు ఈ క్రింద తెలిపిన 8 శాఖల అభిప్రాయాల్ని తమ అభిధమ్మ (కథావస్తు) పుస్తకంలో ఖండించారు. ఆ ఎనిమిది శాఖలు, ఇవి :

| | | | |
|---|---|---|---|
| 1. మహాసాంఘిక | 2. గోకులిక | 3. కాశ్యపీయ | 4. భద్రయాణిక |
| 5. మహీశాసక | 6. వాత్సీపుత్రీయ | 7. సర్వాస్తివాద | 8. సామ్మితీయ. |

**'కథావస్తువు' (కథావత్థు)** ను అశోకుని గురువు **మొగ్గలిపుత్త తిస్స*** రచించిన గ్రంథం అంటారు. అయితే, ఈ గ్రంథంలో వర్ణించిన 214 కథావస్తువులలో (వాదానికి సంబంధించిన విషయాలలో) కేవలం 73 మాత్రమే ప్రాచీన సంప్రదాయాలకు (శాఖలకు) సంబంధించినవి ఉన్నాయి[2]. దానర్థం ఏమంటే మొగ్గలిపుత్తతిస్స కాలం నాటికి ఉన్న 73 వాద విషయాల్ని మాత్రమే ఆయన రాశారు. మిగిలినవి అశోకుని తర్వాతి కాలానికి చెందిన ఎనిమిది శాఖలకూ చెందినవి.

ఆ ఎనిమిది శాఖలూ, ఇవి :

| | |
|---|---|
| 1. అంధక | 2. అపరశైలీయ |
| 3. పూర్వశైలీయ | 4. రాజగిరిక |
| 5. సిద్ధార్థక | 6. వైపుల్యవాద |
| 7. ఉత్తరాపథక | 8. హేతువాద |

*( చైత్యవాదం, దానిలోంచి పుట్టిన శాఖలు వీటన్నింటిని కలిపి 'అంధకవాదులు' అన్నారు బుద్ధఘోషుడు. పై ఎనిమిదింటిలో అంధకశాఖ అంటూ ప్రత్యేకంగా లేదు. అలాగే వైపుల్యవాద, హేతువాద శాఖలు అంధకవాదానికి చెందనివి. ఇకపోతే వీరు ప్రతిపాదించిన 72 ప్రతిపాదనలు 3వ బౌద్ధసంగీతిలోనే చర్చించడం జరిగింది. ఇవి అశోకుని తర్వాతవి కావు – అనువాదకుడు )*

## 2. బౌద్ధ దార్శనిక సంప్రదాయం

ఈ పురాతన నికాయాల (సంప్రదాయాల) దార్శనిక చింతన గురించి ఇక్కడ వివరించి చెప్పనవసరం లేదని అనుకొంటున్నాను. కానీ, గుర్తుంచుకోవలసిన విషయం ఏమంటే వాటిలో నాలుగు బౌద్ధ దర్శన శాఖలు అతి ప్రాచీనమైనవి అనేది.

అందులో...


1. సర్వాస్తివాదం
2. సౌత్రాంతిక దర్శనం
3. యోగాచారం
4. మాధ్యమిక

(అతి పురాతన 18 నికాయాలకు సంబంధించినవి. ఈ 18 నికాయాలు క్రీస్తుశకం మొదటి శతాబ్దానికే వచ్చినవి)

వాటి వికాస క్రమం గురించి నేను **"మహాయాన బౌద్ధ ధర్మ ఉత్పత్తి[3]"** అనే పుస్తకంలో రాశాను.

మహా సాంఘీకులలోని ఒక సంప్రదాయం పేరు **చైత్యవాదం***. దీని కేంద్ర స్థానం ఆంధ్ర సామ్రాజ్యంలోని **ధాన్యకటక*** మహాచైత్యం. దాని కారణాంగానే ఈ సంప్రదాయానికి 'చైత్యవాదం' అనే పేరు వచ్చింది. ఆంధ్ర సామ్రాజ్య పశ్చిమ భాగంలో (మహారాష్ట్ర ప్రాంతంలో) **సామ్మితీయ** సంప్రదాయం బలీయంగా ఉండేది. ఈ రెండు సంప్రదాయాల నుండి (చైత్యవాద, సామ్మితీయ) **మహాయాన సంప్రదాయం** పుట్టి పెరిగింది.

మహాయాన వికాసం ఈక్రింది విధంగా జరిగింది.




**'యోగాచారాన్ని'** బలీయంగా సమర్థించింది **'లంకావతార సూత్రం'**. ఈ లంకావతార సూత్రం వైపుల్య పిటకానికి సంబంధించినది. నాగార్జునుని **మాధ్యమిక (శూన్యవాదం)** వాదాన్ని సమర్థిస్తూ **ప్రజ్ఞాపారమితలు**, అదే విధంగా ఇంకొన్ని సూత్రాలూ రచించబడ్డాయి. కానీ, నాగార్జునుని, ఆయన దర్శనాన్ని సమర్థించడానికి వీటి అవసరం ఏమీ లేదు. ఎందుకంటే, ఆయన **మాధ్యమిక వాదానికి*** ఆధారం ప్రతీత్య సముత్పాదం సిద్ధాంతం. ఈ సిద్ధాంతం మీదే **మాధ్యమిక దర్శనం** అభివృద్ధి చెందింది.

'కథావస్తు' గ్రంథంలో చెప్పిన అర్వాచీన సంప్రదాయాలలో మనకు **'ఉత్తరపథం', 'హేతువాద'** అనే రెండు సంప్రదాయాల పేర్లు వినవచ్చాయి. ఇందులో, ఉత్తరపథ సంప్రదాయం కాశ్మీర-గాంధార ప్రాంతాలకు చెందింది. ఇందులో సందేహమే లేదు. ఇక, రెండోదైన హేతువాద సంప్రదాయానికి సంబంధించిన సరైన సమాచారం తెలియడంలేదు.

ప్లేటో విజ్ఞాన వాదానికి, ప్రతీత్యసముత్పాదాన్ని కలిపినట్లయితే అది, **యోగాచార విజ్ఞాన వాదం** అవుతుంది. కానీ, ఇప్పుడు మనకు దానికి సంబంధించిన ప్రమాణాలేవీ లేవు. ఐతే, యోగాచార-విజ్ఞానవాద దర్శనకారుడైన అసంగుని జన్మస్థలం **గాంధారం** (పెషావర్). నాగార్జునుని తర్వాత బౌద్ధ దర్శన వికాసంలో చెప్పుకోతగ్గ వారు గాంధార ప్రాంత పఠాన్ సోదరులైన **అసంగుడు, వసుబంధులు**. అంతే కాదు, నాగార్జునునికి ఒక శతాబ్దం ముందు వాడు, గొప్ప బౌద్ధ ధార్మిక కవిపండితుడైన **అశ్వఘోషుడు**[4]* కూడా గాంధార వాసే అని తెలుస్తుంది. గాంధారం యవన రాజుల పాలన క్రింద ఉన్నది కాబట్టి, బౌద్ధ దర్శనం మీద యవన ప్రభావం పడటం అనివార్యం.

అశ్వఘోషుడు మహాయాన శాఖీయుడంటారు. దానికి సాక్ష్యంగా మహాయాన సంప్రదాయకులు **'మహాయాన శ్రద్ధోత్పాదం'** అనే గ్రంథాన్ని అశ్వఘోషుని కృతిగా చెప్తారు. కానీ, అశ్వఘోషుని **'బుద్ధచరితం', 'సౌందర నందం', 'సారి పుత్త-ప్రకరణం'** మొదలైన నాటకాల్ని, టిబెట్టు భాషలోకి అనువాదం పొందిన ఇతని 'సర్వస్తివాద' సూత్రాల్ని చదివిన వారికి అశ్వఘోషుడు సర్వస్తివాది అని అంగీకరిస్తారు. సర్వాస్తివాద ఆచార్యుల కోసం మహారాజైన **కనిష్కుడు** ఒక మహాచైత్యాన్ని నిర్మించి ఇచ్చాడు. త్రిపిటకాలకు వ్యాఖ్యానాల్ని (విభాషల్ని) రాయించడం కోసం సర్వాస్తివాద ఆచార్యుల సభను ఏర్పాటు చేశాడు. ఆ ఆచార్యుల్లో అశ్వఘోషుడున్నాడు. కాబట్టి అశ్వఘోషుణ్ణి సర్వాస్తివాద స్థవిరునిగా గాక మరో విధంగా చెప్పలేము.

సరే, యూనానీయ శకాన్ని (గ్రీకుల పాలనా కాలాన్ని) మనం పరిశీలించినట్లయితే ఆ కాలానికి చెందిన బౌద్ధ సంప్రదాయాల (**నికాయాలు***) గురించి సమాచారం సాధించగలిగితే, ఒక్క నికాయాల గురించే కాకుండా, మొత్తం భారతీయ దార్శనికత గురించి, చారిత్రక విషయాల గురించి, కొంతలో కొంతైనా తెలుసుకోగలం. రాబోయే తరాల వారు ఎవరైనా ఈ పరిశోధన సాగించితే, వారికి

చైనా, టిబెట్, భాషల్లోకి అనువదించబడిన బౌద్ధ సాహిత్య అనువాదాలూ, గోబీ ఎడారి (మంగోలియా) ఎంతో సహాయపడతాయి కూడా.

భారతీయ, యవన దార్శనిక **చింతన**ల కలయిక గాంధారంలో జరిగింది. దానికి అశ్వఘోషుడు తన నూతన దార్శనిక చింతనను, తన కావ్యాలూ, నాటకాల ద్వారా మెరుగులు దిద్దాడు. వీటి పరిచయం నాగార్జుననికీ కలిగే ఉంటుంది.

నాగార్జునుని కృషి వల్ల – అతని దార్శనిక ప్రచారం వల్ల భారతీయ దార్శనిక భావన ఓ మహోన్నత రూపాన్ని సంతరించుకొంది.

## నాగార్జునుడు (క్రీ.శ. 175)
## 3. నాగార్జునుని శూన్యవాదం

### I. జీవిత విశేషాలు

నాగార్జునుడు **విదర్భ** (బరార్) వాసి. ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు. అతని బాల్యాన్ని గూర్చి మనం కొంత సమాచారం చూచాయగా చెప్పగలం. నాగార్జునుడు ప్రతిభావంతుడైన విద్యార్థి. బ్రాహ్మణ గ్రంథాల్ని అవుపోసనం పట్టారు. భిక్షువుగా మారాక బౌద్ధ గ్రంథాల్ని ఆమూలాగ్రం అధ్యయనం చేశారు. పెద్దవాడయ్యాక **శ్రీపర్వతం** (నాగార్జునకొండ – గుంటూరు జిల్లా) తన నివాసంగా మార్చుకున్నారు. కాలక్రమంలో అతని ఖ్యాతి విస్తరించింది.

నాగార్జునుడు వైద్యశాస్త్రంలో, రసాయనశాస్త్రంలో కూడా ఆచార్యుడనీ ఆ శాస్త్రాలలో దిట్ట అని అంటారు. నాగార్జునుడు రాసిన **'అష్టాంగ హృదయం'** టిబెట్టులో ఈనాటికీ వైద్యశాస్త్రంలో ఒక ప్రామాణిక గ్రంథం.

ఆ తర్వాతి కాలంలో బౌద్ధ సాహిత్యంలో సిద్ధి (మంత్ర–తంత్రాలు) ని నాగార్జుననికి అంటగట్టారు. మహాత్మ్యాలను అంటగట్టారు. కానీ దర్శనకారులు నాగార్జుననికి, ఆ మహాత్మ్యాలకీ, మంత్ర తంత్రాలకీ సంబంధం లేదని తేల్చారు.

నాగార్జునుడు, ఆంధ్రరాజు **గౌతమీపుత్ర యజ్ఞశ్రీ** (క్రీ.శ. 166–196) సమకాలికుడని ఆంగ్ల పరిశోధకుడు **వింటర్ నిట్జ్**[5] అభిప్రాయాన్ని బట్టి తెలుస్తుంది. నాగార్జునుని పేరుతో ఎన్నో గ్రంథాలు పేరుగాంచాయి. కానీ, ఈ క్రింద తెల్పిన గ్రంథాలే అతని నిజమైన కృతులు. అవి –

1. మాధ్యమిక కారికా

2. యుక్తి షష్టికా

3. ప్రమాణ విధ్వంసన

4. ఉపాయ కౌశల్యం

5. విగ్రహ వ్యావర్తని[6]

ఇందులో మొదటి రెండు, మరియు ఆఖరి గ్రంథం – ఈ మూడు గ్రంథాలూ మూల సంస్కృత భాషలో లభిస్తున్నాయి.

## II. దార్శనిక చింతన

నాగార్జునుడు తన గ్రంథం 'విగ్రహ వ్యావర్తని' లో వ్యతిరేక తర్కాల్ని ఖండించి, కాంట్ చెప్పిన వస్తుసార తత్వానికి వ్యతిరేకంగా 'శూన్యతను' ప్రకటించారు. వస్తువుల లోపలి భాగం స్థిరతత్వం కల్గినది కాదని, అది విచ్ఛిన్న ప్రవాహం మాత్రమేనని చెప్పారు. ఋజువు పరిచారు.

i. **శూన్యత : కారికా***శైలి విధానానికి నాగార్జునుడు ప్రవక్త. ఈ శైలి ప్రత్యేకత ఏమంటే – ఇది పద్యం లాగా తేలికగా గుర్తుంచుకోవచ్చు. అలాగే సూత్రాల వలే ఎక్కువ సమాచారాన్ని తక్కువ పదాలతో చెప్పే విధానమూ ఉంది. నాగార్జునుని మూడు గ్రంథాలు (మాధ్యమికకారికా, యుక్తిషష్టికా, విగ్రహ వ్యావర్తనీ) ఈ కారికాశైలిలోనే ఉన్నాయి. విగ్రహ వ్యావర్తనిలో 72 కారికాలున్నాయి. వీటిలో చివరి రెండు కారికలలో ఒక కారిక గ్రంథ మహాత్మ్యాన్ని, రెండోది నమస్కారాల్ని తెలిపే కారికలు. ఈ రెండూ పోతే మిగిలిన 70 కారికలు మూలగ్రంథానికి సంబంధించినవి. ఆ కారికలు 'శూన్యత' కు సంబంధించినవే. కాబట్టి 'విగ్రహ వ్యావర్తని' కి **'శూన్యతాసప్తతి'** అనే పేరు.

ఈ కారికల మీద నాగార్జునుల వారే స్వయంగా, సరళంగా వ్యాఖ్యానాలు రాశారు.

నాగార్జునుడు తన గ్రంథాలలో మొదట్లో నమస్కార శ్లోకంగానీ, గ్రంథ ప్రయోజనాన్ని తెలిపే శ్లోకాలు కానీ రాయలేదు. ఇదే ఆచారం ఆ తర్వాత బౌద్ధ

గ్రంథాల్లో, బౌద్ధేతర గ్రంథాలలో సాధారణ పద్ధతి అయ్యింది. 71వ కారికలో శూన్యత యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ ఇలా రాశారు –

"ఎవరైతే, ఈ శూన్యతను తెలుసుకొంటారో వారు సమస్త అర్థాల్నీ తెలుసుకొంటారు. అలాగే, ఎవరైతే శూన్యతను అర్థం చేసుకోలేరో, వారు ఏమీ అర్థం చేసుకోలేరు."

ఈ కారికకు వ్యాఖ్యానాన్నిస్తూ ఆచార్య నాగార్జునులు ఈ విధంగా చెప్పారు[7] –

"ఎవరైతే, ఈ శూన్యతను తెలుసుకొంటారో, వారు ప్రతీత్య సముత్పాదం (విచ్ఛిన్న ప్రవాహ రూపంలో జరిగే ఉత్పత్తి) తెలుసుకొంటారు. ప్రతీత్య సముత్పాదాన్ని తెలుసుకొన్నవారు నాలుగు ఆర్య సత్యాలను తెలుసుకుంటారు. ఆ ఆర్యసత్యాలు తెలుసుకొన్నాక కోరికల్ని ఆర్పేసుకుని నిర్వాణం పొందగలుగుతారు."

ప్రతీత్య సముత్పాదాన్ని తెలుసుకొన్నవారు – ధర్మం ఏమిటి? ధర్మానికి హేతువు ఏమిటి? ధర్మఫలం ఏమిటి? అని తెలుసుకొంటారు. అలా తెలుసుకొన్నవారే... అధర్మం ఏమిటి? అధర్మహేతువు ఏమిటి? అధర్మ ఫలమేంటి అనేది కూడా తెలుసుకొంటారు. క్లేశం (చిత్తమలం) అంటే ఏమిటి? క్లేశానికి హేతువు, దాని వస్తువు ఏమిటి? – ఇదంతా తెలుసుకొంటారు.

ఇంకా, సుగతి అంటే ఏమిటి? దుర్గతి అంటే ఏమిటి? సుగతిని లేదా దుర్గతిని పొందే మార్గం ఏమిటి? సుగతి నుండి లేదా దుర్గతి నుండి బయటపడే మార్గం ఏమిటి? అనేవి కూడా తెలుసుకొంటారు.

శూన్యతకు నాగార్జునుడిచ్చిన అర్థం ఏమంటే[8] – ప్రతీత్య సముత్పాదం – అంటే విశ్వం యొక్క సమస్త జడ, చేతనా పదార్థం ఏదైనా కూడా ఈ మహావిశ్వంలో స్థిరమైనదీ, అచలతత్వం (ఆత్మగానీ, ద్రవ్యంగానీ) కల్గినదీ ఏదీ లేదు. ఈ విశ్వం వస్తు ప్రధానమైంది కాదు. ఘటనా ప్రధానమైంది కాదు. ఇదే శూన్యం.

ఆచార్య నాగార్జునుడు తన గ్రంథం మొదటి 20 కారికల్లో పూర్వపక్షం వారి ఆక్షేపణల్ని తెలిపాడు. మరి, ఆ గ్రంథం ఉత్తర భాగంలో వాటికి సమాధానాల్నిస్తూ శూన్యతను సమర్థించాడు.

సంక్షిప్తంగా నాగార్జునుని తర్క ప్రణాళిక ఇలా ఉంటుంది.

**పూర్వ పక్షం**

**A) వస్తుతత్వాన్ని తిరస్కరించడం గురించి :** శూన్యవాదం సరైంది కాదు. ఎందుకంటే

a) ఏ శబ్దాలనైతే నీవు వాదానికి ఉపయోగిస్తున్నావో అవి కూడా శూన్యాలే కదా! నిస్సారాలే కదా!

b) అంతేకాదు నీ మొదటి మాట 'అన్ని వస్తువులు శూన్యాలే అనేది' అబద్ధం అవుతుంది.

c) శూన్యవాదాన్ని ఋజువు పరచుకోవడానికి ఎటువంటి ప్రమాణాల్ని ఇవ్వగలిగారు?

**B) అన్ని భావాలు :** అన్ని భావాలూ అంటే అన్ని వస్తువులూ వాస్తవికమైనవి.

ఎలాగంటే –

a) మంచినీ, చెడునీ అందరూ అంగీకరిస్తారు.

b) వస్తువే లేదనుకొంటే దానికి పేరే ఉండదు కదా!

c) ఎంత వాదించినా 'ఉన్నదాన్ని లేదని చెప్పడం' కుదరదు కదా!

d) అంతా శూన్యమే అయితే లేనిదానిని 'లేదు' అని కూడా తెలుసుకోలేము కదా!

**ఉత్తర పక్షం**

**A) అన్ని భావాలూ (సత్తాలూ, పదార్థాలు) శూన్యమైనవి. అంటే ప్రతీత్య సముత్పాదాలేనని ఋజువైంది. ఎలాగంటే...**

a) విశ్వంలోని అవాస్తవికతను స్వీకరించడానికి శూన్యతా సిద్ధాంతం విరుద్ధం కాదు.

b) అందువల్ల ఇది మన శూన్యవాదానికి విరుద్ధం కాదు.

c) ఏ ప్రమాణాలలో భావాల (పదార్థం) వాస్తవికతను ఋజువు పరుస్తామో, ఆ ప్రమాణాలను నిరూపించలేము.

ఎలాగంటే...

- ప్రమాణమే లేకపోతే దాన్ని వేరొక ప్రమాణంతో ఎలా ఋజువు చేస్తాం? ఎందుకంటే అటువంటి అవస్థలో అది ప్రమాణం కాలేదు – అంటే... ఒక ప్రమాణాన్ని నిరూపించడానికి మరొక ప్రమాణాన్ని తీసుకొచ్చినప్పుడు, మొదటి ప్రమాణం, ప్రమాణం కాకుండా పోతుంది. ఆ ప్రమాణం, **ప్రమేయం** అవుతుంది. (దేనినైతే ఇప్పటివరకూ ప్రమాణం చేత ఋజువు చేయలేదో, అది ప్రమేయం).
- అది (ప్రమాణం) నిప్పులా తనను తానే ఋజువు చేసుకోగలగాలి.
- అది ప్రమేయం చేత నిరూపింప బడకూడదు. ఎందుకంటే ప్రమేయం స్వయంగా నిరూపింపబడదు. ప్రమేయం **సాధ్యమే** కాని **సాధనం** కాదు.
- దానిని సంయోగం వల్లనూ ప్రమాణీకరించ లేము. ఏమంటే... సంయోగం ప్రమాణం కాదు.

**B) భావా (సత్తా, పదార్థా) లలో శూన్యత సత్యం. ఎందుకంటే... (అ)ఇవి (శూన్యత) మంచీ, చెడ్డల భేదాన్ని నిరోధించవు. ఈ భేదాన్ని తెలుసుకోవాలంటే ప్రతీత్య సముత్పాదం కారణంగానే సాధ్యం. అలాగాక మంచీ చెడులు మాహాత్మ్యంతో కూడుకొన్నవి, విశ్వపరిణామక్రమంతో వాటికి సంబంధం లేదు అనుకొంటే – బ్రహ్మచర్యం లాంటివి సత్ఫలితాల నియ్యలేవు.**

a) శూన్యానికి పేరు ఉంటుంది అనేది పొరపాటు. ఎందుకంటే నామం కూడా పరివర్తన చెందుతుంది.

b) 'లేనిదాన్ని' ఋజువుపరచలేము అనేది సరికాదు. 'ఉన్నదాన్ని' స్పష్టం చేయలేము.

అక్షపాదుని న్యాయసూత్రంలోని ప్రమాణ సిద్ధిప్రకరణం. నాగార్జునుని విగ్రహ వ్యావర్తని, ఈ రెండు గ్రంథాలూ ఒకే విషయానికి చెందిన పక్ష విపక్షాలు (పక్షం – ప్రతిపక్షం)[9]. వాద ప్రతివాదాలు. ఈ విషయాన్నే నేను మరో చోట చెప్పాను. అక్షపాదుడు తన న్యాయసూత్రాల్లో నాగార్జునుని అభిప్రాయాల్ని ఖండించాడు.

తన గ్రంథం 'విగ్రహవ్యావర్తని' చివరిలో నాగార్జునుడు ఇలా అన్నారు.

"ఎవరైతే... శూన్యవాదాన్ని, ప్రతీత్య సముత్పాదాన్ని, అనేక అర్థాలు కల్గిన మధ్యేమార్గాన్ని చెప్పారో – ఆ ప్రతిభాశాలి, అనన్య బుద్ధిశాలి అయిన బుద్ధునికి అనేక ప్రణామాలు చేస్తున్నాను[10]."

## III. ప్రమాణ విధ్వంసన

నాగార్జునుడు తన గ్రంథం **'ప్రమాణ విధ్వంసన'**లో **'పరమార్థ'** విషయంలో ప్రమాణాన్ని ఖండించారు. వ్యవహారిక అర్థంలో ప్రమాణాన్ని ఒప్పుకొన్నారు. ఐతే, శక్తివంతమైన తార్కిక శక్తితో పరమార్థ ప్రమాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీని పరిణామం ఏమయిందంటే, **'మాధ్యమిక దర్శనం'** వ్యవహార సత్యం మీద ఆధారపడే దర్శనంగా గాక నాస్తికవాదమయ్యింది.

అక్షపాదుని వలెనే, నాగార్జునుడు తన ప్రమాణ విధ్వంసనలో ప్రమాణం, ప్రమేయం మొదలైన పద్దెనిమిదింటిని సంక్షిప్తంగా వర్ణించారు.[11] అదే విధంగా **'ఉపాయకౌశల్యం'**లో కూడా శాస్త్రార్థాలకు సంబంధించిన విషయాలైన నిగ్రహం, స్థానాలు, జాతి మొదలైన వాటిని గూర్చి వివరించారు. ఇవన్నీ కూడా అక్షపాదుని సూత్రాల్లో లభ్యమవుతాయి. **'ఉపాయ కౌశల్యం'** అనువాదం చైనా భాషలో క్రీ.శ. 472 లోనే జరిగింది.[12] దీన్ని బట్టి ఏమి తెలుస్తుందంటే... అక్షపాదుని అనుయాయులు ఎవరో నాగార్జునుని గ్రంథాలలోని విషయాల్ని తరువాత అక్షపాదుని రచనల్లో ఇరికించి ఉంటారు.

### i. మాధ్యమిక కారికా – దార్శనిక చింతన

దార్శనికుల అభిప్రాయాల్లో నాగార్జుని రచనల్లో విగ్రహ వ్యావర్తిని, మాధ్యమిక కారికల స్థానం ఉన్నతమైంది. నాగార్జుని అభిప్రాయంలో శూన్యత అంటే ప్రతీత్య సముత్పాదమే. దీన్ని మనం విగ్రహవ్యావర్తనిలో చూశాం. నాగార్జునుడు ప్రతీత్య సముత్పాదానికి రెండు అర్థాలు చెప్పారు.

**A)** ప్రత్యయం ప్రత్యయం నుండే ఉత్పన్నమవుతుంది. ప్రత్యయం అంటే హేతువు లేదా కారణం. హేతువుకి హేతువే ఆధారం. అంటే కారణం కారణం నుండే పుడుతుంది. అన్ని పదార్థాలూ ప్రతీత్య సముత్పాదాలే. అంటే అన్ని వస్తువులూ తాము పుట్టడానికి మరో హేతువును ఆశ్రయిస్తాయి. అంటే పరాశ్రితాలవుతాయి. అంటే ఇతర వాటిపై ఆధారపడతాయి.

**B)** ప్రతీత్య సముత్పాదం యొక్క రెండో అర్థం **'క్షణికత్వం'.** అన్ని వస్తువులూ క్షణ కాలంలో నశించిపోతాయి. అదే క్షణంలో మరో వస్తువు లేదా సంఘటన పుడుతుంది. అంటే ఉత్పత్తి అనేది ఒక విచ్ఛిన్నప్రవాహం.

ప్రతీత్య సముత్పాదం మధ్యమ మార్గం అనీ, బుద్ధుడు ఆత్మవాది కాదనీ, అలాగే భౌతిక వాదీ కాదని ఆయన మార్గం ఆ రెండింటికీ మధ్యమ మార్గమనీ చెప్పుకొన్నాం. ఆయన విచ్ఛిన్న ప్రవాహాన్ని చెప్పారు. ఆత్మ వాదులు **'శాశ్వతమైనది'** అని చెప్పేదాని స్థానే – దానికి విరుద్ధంగా ఆయన **'విచ్ఛిన్నం'** లేదా **'ప్రతీత్యం'** ఉంచారు. అలాగే భౌతిక వాదులు చెప్పే **'వినాశనానికి'** విరుద్ధంగా, దాని స్థానంలో **'ప్రవాహం'** అన్నారు. ఇదే **'విచ్ఛిన్న ప్రవాహం'.**

మరో దానిపై ఆధారపడి పుట్టే వాటికి నాగార్జునుడు ఇలా అర్థం చెప్పారు. దేనికైతే పుట్టుక, మనుగడ, గిట్టడం ఉంటుందో దానికి 'పారమార్థికత్వాన్ని' ఆపాదించలేము.

నాగార్జునుడు మాధ్యమిక దర్శనంలో వస్తువుల పారమార్థికతను తిరస్కరిస్తూ ఇలా చెప్పారు:

"సత్తు లేదు. అసత్తు లేదు. అసత్తు – సత్తు రెండూ లేవు."

**'కారణం'** ఉంది. ఇది **'కర్మ'** యొక్క **'నిమిత్తం'** (ప్రత్యయం) చేత ఉంటుంది. కర్మ ఉంది. ఇది కారణం యొక్క నిమిత్తం చేతే ఉంటుంది. ఈ విధంగా కర్మ, కారణాలు ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. విడి విడిగా రెండింటిలో ఏ ఒక్కదానికీ అస్తిత్వంలేదు.[13] ఎందుకంటే, స్వయంగా తనకే అస్తిత్వం లేనిది వేరేదాన్ని ఎలా నిరూపిస్తుంది? దీన్ని ఆధారం చేసుకొని నాగార్జునుడు న్యాయాన్ని గూర్చి ఇలా చెప్పారు:

'దేనికి ఉనికి లేదో, దానిని ఋజువు పరచలేము. ప్రతి ఒక్కదాని అస్తిత్వం మరోదానితో ముడి వేసుకొని ఉంది. విడివిడిగా గానీ, కలసిగానీ ఏ ఒక్క దాని అస్తిత్వాన్ని ఋజువు చేయలేము. అస్తిత్వం, అస్తిత్వం లేకపోవడం (సత్తు, అసత్తు) అంటే "ఉండటం" "ఉండకపోవడం" రెండు స్థితులు ఒక దాని మీద మరొకటి ఆధారపడి ఉండటం వల్లే ఋజువు చేయబడతాయి'.

కర్త, కర్మల్ని నిషేధిస్తూ నాగార్జునుడు ఈ విధంగా చెప్పారు.

సత్‌రూప కారణం సత్‌రూప కర్మను చేయదు. ఎందుకంటే ఆ సత్‌రూపం ఏదీ ఏ క్రియనూ చేయదు. కాబట్టి కర్మకు కర్తతో అవసరం లేదు. కర్తకు కర్మతో పని లేదు. ఈ విధంగా పరస్పరాశ్రితాలైన సత్ రూపాలైన పదార్థాలతో కర్త, కర్మ, కారణం, క్రియల్ని ఋజువు చేయ లేము.[14] ఎక్కడా కూడా ఏ సత్ (ఉనికి, అస్తిత్వం)కూడా తనది కాదు. ఇతరులదీ కాదు. తనదీ, ఇతరులదీ అయినదీ కాదు. మరి, హేతువుకు కారణం కూడా కాదు.[15]

కార్యకారణ సంబంధాన్ని ఖండిస్తూ నాగార్జునుడు ఇలా రాశాడు: "ఒక వేళ పదార్థం 'సత్' అయితే దానికి కారణం అవసరం లేదు. ఒకవేళ అసత్ అయితే – దానికీ కారణం అవసరం లేదు".

**'అసత్'** పదార్థానికి కారణంతో పనేముంది (గాడిద కొమ్ముల్లా)? **'సత్'*** పదార్థాలకు (తన అస్తిత్వం కొరకు) కారణంతో పనేముంటుంది?[16]

పుట్టడం, మనడం, గిట్టడం – వీటిని రుజువుపరచడానికి కార్యం, కారణం, సత్తా, అసత్తా (అస్తిత్వం – అనస్తిత్వం) వీటి గూర్చి ఆలోచిస్తే చివరికి మనకు ఇవి "ఒకదానిపై మరొకటి ఆధారపడినవే" అనే విషయం తెలుస్తుంది[17]. ఆ స్థితిలో వాటిని ఋజువు పరచలేమని కూడా తెలుస్తుంది.

బౌద్ధ దర్శనంలో పదార్థాన్ని సంస్కృత, అసంస్కృత (conditioned, unconditioned) అనే రెండు భాగాలుగా విభజించి, మొత్తం పదార్థాలను (అస్తిత్వంలోనివి) సంస్కృత అనీ, నిర్వాణాన్ని **అసంస్కృత*** అనీ చెప్పారు. నాగార్జునుడు ఈ సంస్కృత, అసంస్కృత విభజనల్ని ఖండిస్తూ ఈ విధంగా చెప్పారు[18].

పుట్టడం, మనడం, గిట్టడం అనేవి ఋజువు చేయబడిన తరువాత సంస్కృత, అసంస్కృత అనేవి ప్రామాణీకరించబడవు. సంస్కృత అనేది నిరూపించబడకపోతే, ఇంక అసంస్కృత ఎలా ఉంటుంది?

జగత్తు, దానిలో పదార్థాల్ని ఎండమావులతో పోలుస్తూ నాగార్జునుడు ఇలా చెప్పారు.

"ఎడారిలోని ఇసుక మీది అలల్ని నీరుగా భ్రమించి, అక్కడికి వెళ్ళిచూచి ఇది జలం కాదు" అని అనుకొన్నవాడు మూర్ఖుడే, ఆ విధంగా ఎండమావుల్లాంటి

ఈ ప్రపంచం 'ఉన్నది' అనుకొనేవాడి 'అజ్ఞానం' కంటే 'ఉన్నది లేదు' అనుకొనేవాడి అజ్ఞానం అజ్ఞానమైందేమీ కాదు.

ఈ విధంగా సమస్త వస్తువులూ పరాశ్రిత ఉత్పాదం (ప్రతీత్యసముత్పాదం) అనుకొన్న తరవాత, ఒక వస్తువును ఋజువు చేయడం – చేయక పోవడం, ఉన్నదని చెప్పడం – చెప్పలేకపోవడం కుదరదు. అలాగే ప్రతీత్య సముత్పాదం అర్థాన్ని విచ్ఛిన్న ప్రవాహ రూపంలో తీసుకుని ఉత్పత్తి అవుతుందని అనుకొంటే, అప్పుడు కూడా కార్యం, కారణం, కర్మ, వీటికీ స్థానం ఉండదు. ఎందుకంటే ఒకటి అక్షరాలా పూర్తిగా నశించాకే, రెండోది ఉనికిలోకి వస్తుంది.

## ii. ఉపదేశాలు

ఆంధ్రరాజులలో శాలివాహనులు లేదా **'శాతవాహన'**[19] వంశ రాజులు ఒకరు. ఈ 'శాలివాహన' 'శాతవాహన' అనే పదాలు ఆంధ్రులకు బిరుదునామాలుగా మారాయి. ఈ శాతవాహనులలో...**యజ్ఞశ్రీ గౌతమీపుత్రుడు** ముఖ్యుడు. గౌతమీపుత్రుడు ఆచార్య నాగార్జునుడి **'సుహృదయుడు'** అంటే సఖుడన్న మాట. ఈ సఖుడు సాదాసీదా రాజు కాదు. రాజాధిరాజు. చక్రవర్తి. నాగార్జునుని తరువాత నాలుగు వందల సంవత్సరాలకు రచించబడిన బాణుని **హర్షచరితం**[20]లో ఇలా ఉంది: "నాగార్జునుడనే పేరు గల భిక్షువు ఏకావళి అనే హారాన్ని నాగరాజు దగ్గర స్వీకరించాడు. ఆ తరువాత ఆ హారాన్ని మూడు సముద్రాలకూ అధిపతి అయిన, తన సుహృదుడైన శాతవాహన మహారాజుకు ఇచ్చాడు" అని.

పై ఉదాహరణను బట్టి శాతవాహన మహారాజు మూడు సముద్రాలకూ అంటే అరేబియా సముద్రం, హిందూ మహా సముద్రం, బంగాళాఖాతంలకు అధిపతియని, అతను నాగార్జునునికి మంచి మిత్రుడనీ తెలుస్తుంది. నాగార్జునుడు లాంటి ప్రతిభాశాలి, ధీశాలి తన రాజ్యం (విదర్భ)లో ఉంటే ఇక ఆ రాజ్యాధిపతి అతనికి స్నేహాన్ని ప్రకటించకుండా ఉండగలడా? నాగార్జునుడు తన సుహృదుడైన గౌతమీపుత్రుని పేర ఉపదేశాత్మకమైన ఉత్తరం **సుహృల్లేఖ*** రచించారు. ఈ సుహృల్లేఖని ఆనాడే టిబెట్టు, చైనా భాషల్లోకి అనువదించారు. ఆ అనువాదాలు ఈనాటికీ లభిస్తున్నాయి.

ఈ ఉత్తరాల్లో, నాగార్జునుడు తన సుహృదునికిచ్చిన సందేశాలు కొన్ని ఈ క్రింద ఉదహరిస్తున్నాను–

**6 వ ఉపదేశం** : “ధనం నిలకడ లేనిది. సారం లేనిది. ఇది తెలుసుకొని, ధర్మానుసారంగా దానిని భిక్షువులకూ, బ్రాహ్మణులకూ, దరిద్రులకూ, మిత్రులకూ దానం చేయి. దానం కంటే గొప్ప మిత్రుడెవరూ లేరు.”

**7 వ ఉపదేశం** : దోషం లేని, ఉత్తమమైన, కల్తీలేని, కళంకం లేని సదాచారాన్ని (శీలాన్ని) కార్యరూపంలో ఆచరించు. ఈ చరాచరాలన్నింటికీ భూమి ఆధారమైనట్లు సర్వపాలకులకూ శీలమే ఆధారం.

**21 వ ఉపదేశం** : “పరస్త్రీలను కన్నెత్తి చూడకు. చూచినా, వారి వయస్సులను బట్టి తల్లిగానో, సోదరిగానో, కూతురిగానో భావించు”.

**29వ ఉపదేశం** : నీకీ ప్రపంచాన్ని గూర్చి తెలుసు. ఈ లోకానికి చెందిన ఎనిమిది విషయాల పట్ల నిర్లిప్తత కల్గి ఉండు. అవేమంటే: లాభం–నష్టం, సుఖం–దుఃఖం, మానం–అవమానం, స్తుతి–నిందలు. ఈ ఎనిమిదింటినీ సమానంగా భావించు. ఇవి మన ఆలోచనా పరిధికి చెందని విషయాలు.

**37వ ఉపదేశం** : భార్యని గౌరవించు. నీ కుటుంబానికంతటికీ అధిపతి అయిన దేవిలా గౌరవించు. ఆమె... సోదరిలా మంజులంగా ఉంటుంది. స్నేహితునిలా విజయిని అవుతుంది. నీ హితాన్ని కోరుకుంటుంది తల్లిలా. నీ ఆజ్ఞల్ని పాటిస్తుంది సేవకునిలా.

**49వ ఉపదేశం** : ‘నా యీ రూపం (భౌతికతత్త్వం) నేను కాదు’ అని నీవు అనుకొంటే, అప్పుడు నీవు ఈ రూపం ఆత్మకాదనీ, ఆత్మ ఈ రూపం (భౌతికతత్త్వం)లో లేదనీ, ఆత్మ, రూపం ఈ రెండూ నీలో లేవనీ గ్రహించగలుగుతావు. ఇదే విధంగా మిగిలిన నాలుగు స్కంధాల గురించీ తెలుసుకొంటావు.

**50వ ఉపదేశం** : ఈ స్కంధాలు కోర్కెల వలన, కాలం వలన, ప్రకృతి వలన,

స్వభావం వలన, ఈశ్వరుని వలన, హేతువు వలనా పుట్ట లేదు. కేవలం అవిద్య, కోరికల వల్లే స్కంధాలు పుట్టాయి.

**51వ ఉపదేశం** : పూజలు శీలవ్రతాల పట్ల, తప్పుడు దర్శనాల పట్ల సంశయాత్మకత పట్ల ఆసక్తి – ఈ మూడూ బంధనాల (శృంఖలాలు, బేడీలు)ని తెలుసుకో.[21]

నాగార్జునుని దర్శనం (శూన్యవాదం) ప్రపంచ వాస్తవికతను వ్యర్థమైందని అంటుంది. ప్రపంచం శూన్యమైందనుకొని, సమస్యలనుండి ముఖం చాటేయడానికి ఇంతకు మించిన దర్శనం లేదు. కాబట్టి ఇలాంటి దార్శనికునికి, రాజాధిరాజు యజ్ఞశ్రీ గౌతమీపుత్రుడు – సుహృదయుడు కావడంలో ఆశ్చర్యమేముంది?

## IV. యోగాచారం – ఇతర బౌద్ధ దర్శనాలు

**'మాధ్యమిక వాదం', 'యోగాచారం'** – ఈ రెండూ మహాయానానికి చెందిన దర్శనాలు. **'సర్వాస్తి వాదం,'** సౌత్రాంతిక (స్థవిర వాదం) వాదం – ఈ రెండూ హీనయాన దర్శనాలు. ఈ నాలుగు బౌద్ధ దర్శనాల్ని నింగి నుండి నేల మీదికి దించితే ఇలా ఉంటాయి :

| వాదం | పేరు | ఆచార్యుడు |
|---|---|---|
| 1. శూన్యవాదం | మాధ్యమిక వాదం | నాగార్జునుడు, **ఆర్యదేవుడు***, చంద్రకీర్తి, భవ్య, **బుద్ధపాలిత*** |
| 2. విజ్ఞానవాదం | యోగాచారం | అసంగుడు, వసుబంధు, దిఙ్నాగుడు, ధర్మకీర్తి, శాంత రక్షిత. |
| 3. బాహ్య అర్థవాదం | సౌత్రాంతిక వాదం | |
| 4. బాహ్య అభ్యంతర అర్థవాదం | సర్వాస్తి వాదం | సంఘభద్ర, వసుబంధు (అభి ధర్మ కోశం) |

యోగాచార దర్శనానికి మూలం వైపుల్య సూత్రంలో దొరుకుతుంది. దీనికి చెందినవే లంకావతార సూత్రం, సంధి నిర్మోచన సూత్రం.

వీటిలో బాహ్యజగత్తును తిరస్కరించి, విజ్ఞానమే (అభౌతికతత్వం, మనస్సు) పదార్థమని ప్రకటించబడింది. **"ఏది క్షణికమైనది కాదో అది ఉండదు"** అనేది బౌద్ధదర్శన మూల సూత్రం. బౌద్ధ దర్శనంలో దీనికి వేరే వాదం ఉండదు. కాబట్టి యోగాచార విజ్ఞానం క్షణికమైందే! అనేక వాదాల ప్రవక్తలూ, అనేక మతాల ప్రవక్తల గురించి ఎలా తెలియదో, ఈ యోగాచార వాదాల ప్రవక్త గురించీ తెలియ లేదు.

నాలుగో శతాబ్దం వరకూ ఈ యోగాచార దర్శనం కుంటుకుంటూ నడిచింది. క్రీస్తుశకం నాలుగో శతాబ్దంలో పెషావర్‌లో **అసంగుడు**, **వసుబంధుడు** అనే ఇద్దరు సోదరులు పుట్టారు. వాళ్ళు గొప్ప దార్శనికులయ్యారు. వారి గ్రంథాల ప్రభావంతో ఈ యోగాచార దర్శనానికి ఎంతో ప్రచారం లభించింది.

అసంగుడు రాసిన **"యోగాచార భూమి"**[22] అనే మహా గ్రంథాన్ని బట్టి కూడా ఈ వాదానికి ఈ పేరు వచ్చి ఉండొచ్చు. ఎందుకంటే ఈ గ్రంథం యోగాచార వాదానికి మూలమైన, మౌలికమైన గ్రంథంగా ప్రసిద్ధి పొందింది.

నాగార్జునుడూ, అతని ముందున్న దార్శనికులూ విజ్ఞానవాదాన్ని ఆమోదించారు. గాంధార దేశంలో స్థిరపడ్డ యవన ప్రావాసుల వల్ల ప్లేటో దార్శనిక భావజాలం విజ్ఞానవాదం మీద బాగానే పడింది.

## i. ఆలయ విజ్ఞానం

**ఆలయ విజ్ఞానం** అనే సముద్రం నుండి ప్రవృత్తి విజ్ఞానం అనే తరంగాలు లేస్తూ ఉంటాయి.[23] విశ్వమూలాన్ని ఈ దర్శనంలో ఆలయ విజ్ఞానం అన్నారు. ఈ విజ్ఞానం (సముద్రం) నుండి పంచేంద్రియాలు, మనస్సు – ఈ ఆరూ పుడతాయని చెప్తారు. వీటిని **'ప్రవృత్తి విజ్ఞానం'** అంటారు.[24]

"గాలి అనే కారణం (హేతువు) వల్ల ఏ విధంగా సముద్రంలో నాట్యమాడే అలలు పుడతాయో... ఆ అలల ప్రవాహం నిరంతరం కొనసాగుతుందో, ఆ విధంగా కోర్కెలు అనే గాలి వలన లేచే విజ్ఞాన తరంగాలతో ఆలయం (సముద్రం) నిరంతరం కదులాడుతుంది".

దీనర్థం ఏమంటే... లోపల ఉండే **జ్ఞేయ*** (అభౌతిక) విజ్ఞానమే అసలైన పదార్థం. పైకి కన్పించే సమస్త పదార్థమూ లోపలి విజ్ఞానం యొక్క ప్రతిరూపమే.

స్కంధాలు, ప్రత్యయాలు, అణువులు, భౌతిక తత్వాలు – ఇవన్నీ విజ్ఞానాలే.

ఈ ఆలయ విజ్ఞానం కూడా ప్రతీత్య సముత్పాదమే (విచ్ఛిన్న ప్రవాహం వల్ల ఉత్పన్నమైనదే). క్షణ క్షణం మారేదే. ఇలా మారడం వల్ల సమస్త జగత్తూ ప్రతిక్షణమూ నూతన రూపాన్ని పొందుతూ ఉంటుంది.

ప్రకృతిలోని మార్పులన్నీ ఈ క్షణక్షణ పరివర్తన కారణంగానే సంభవిస్తుంది – అని చెప్తుంది ఆలయ విజ్ఞానం.

## సర్వాస్తి వాదం

సర్వాస్తి వాద సిద్ధాంతం, గతంలో చెప్పుకొన్న బుద్ధుని సిద్ధాంతమే. బాహ్య రూపం, అంతర్గత విజ్ఞానమూ, ఈ రెండూ ప్రతీత్య సముత్పన్నాలే – అంటుంది సర్వాస్తి వాదం.

## సౌత్రాంతిక వాదం

బుద్ధుని సూత్రాల్ని (ఉపదేశాన్ని) అనుసరించే వారి వాదం. వీరు బాహ్య విజ్ఞాన వాదానికి పూర్తి వ్యతిరేకమైన బాహ్య పదార్థవాదాన్ని ఒప్పుకొంటారు. పదార్థం యొక్క క్షణిక రూపమే **'మౌలిక తత్త్వం'** అంటారు.

## పాదసూచికలు

1. చూడండి “పురాతత్త్వ – నిబంధావళి’ (రాహుల్‌జీ రచన) పేజీ 121. ఇంకా, కథావత్థు – అట్ఠకథ.
2. “పురాతత్త్వ – నిబంధావళి” (రాహుల్‌జీ రచన) పేజీ 126. ఇంకా – టిప్పణి
3. “పురాతత్త్వ – నిబంధావళి” (రాహుల్‌జీ రచన) పేజీ 127.
4. పోయి – ఖంగ్ (టిబెట్టు) లోని ఒక సంస్కృత తాళపత్ర గ్రంథంలో దొరికిన ఆధారాన్ని బట్టి అశ్వఘోషుడు సర్వాస్తి వాద భిక్షువు అని నిర్ధారించడం జరిగింది. (చూడండి నేను వెలువరించిన సూచీ పత్రాల జె.బి.ఓ.ఆర్.ఎస్.లో)
5. History of Indian Literature. Vol.II Page 346-48
6. Journal of the Bihar and Orissa Research Society, Patna, Vol. XXIII.
7. ప్రభవతిచ శూన్య తేయం యస్య ప్రభవన్తి తత్ సర్వార్థా!
   ప్రభవతి న తస్య కించిత్ న భవతి శూన్యతా యస్య!
8. విగ్రహ వ్యావర్తిని, 22 – “ఇహ హియః ప్రతీత్య భావనాం భావః సా శూన్యతా. కస్మాత్? నిఃస్వభావత్వాత్. యేహి ప్రతీత్య సముత్పన్న భావాస్తే న సస్వభావా భవన్తి స్వభావాభావాత్. కస్మాత్? హేతు ప్రత్యయా పేక్షత్వాత్. యది హి స్వభావతో భావా భవేయుః ప్రత్యార్థా యపి హేతు ప్రత్యయం భవేయుః
9. విగ్రహ వ్యావర్తిని యొక్క భూమిక (Preface) లో అక్షపాదుడు నాగార్జునిని ఈ అభిప్రాయాన్ని ఖండించారని ఉంది.
10. విగ్రహ వ్యావర్తిని 72. “యః శూన్యతాం ప్రతీత్య సముత్పాదం. మధ్యమం ప్రతిపదమ నేకార్థం నిజగాద ప్రణామామి తమప్రతిమ సంబుద్ధం”.
11. సర్వదర్శన సంగ్రహం, బౌద్ధ దర్శనం
12. Nanji 0-1257
13. మాధ్యమిక కారికా 62
14. మాధ్యమిక కారికా – 58, 59
15. మాధ్యమిక కారికా – 4
16. మాధ్యమిక కారికా –22
17. మాధ్యమిక కారికా –56
18. మాధ్యమిక కారికా – 56

19. బైస్ రాజపుత్రులు తాము సాలవాహన వంశస్థులమని, పైఠన్ నగరం నుండి వచ్చామని చెప్తారు. ఈ పైఠన్ లేదా ప్రతిష్టానం (మహారాష్ట్ర) అనే నగరం శాతవాహనుల రాజధాని.

20. "...తామే కావలీం...తస్మాన్నగ రాజాత్ నాగార్జునో నామ్... భిక్షురభిక్షతు లేభే చ... త్రిసముద్రాధి పతయో శాతవాహన నామ్నే నరేంద్రాయ సహృదె సదౌ తావ్. – హర్షచకిత – 7

21. సంగీతి పరియాయ సుత్త (దీఘ నికాయ 3/10)

22. దర్శన్ – దిగ్దర్శన్ – పేజీ 704–37

23. లంకావతార సూత్రం 51

24. లంకావతార సూత్రం 51

# బౌద్ధ దర్శన అంతిమ వికాసం

(క్రీ.శ. 600)

## 1. అసంగుడు (క్రీ.శ. 350)

భారతీయ దర్శనం ఉన్నతికి ప్రధాన కారకులైన వారు పెషావర్‌కు చెందిన పఠాన్ సోదరులు అసంగుడు, వసుబంధులు. వారిలో పెద్దవాడైన అసంగుడు **'యోగాచార భూమి',**[1] **'ఉత్తర తంత్రం'**[2] అనే రెండు గొప్ప గ్రంథాల్ని రాసి, విజ్ఞాన వాదాన్ని గట్టిగా సమర్థించారు. తమ్ముడు వసుబంధు, అన్న కంటే బుద్ధి కుశలత గలవాడు. ఇతడు బౌద్ధదర్శనానికి చెందిన 'సర్వోత్కృష్టమైన' **అభిధమ్మకోశం** * అనే గ్రంథకర్త. అతడు ఆ గ్రంథాన్ని రాయడమే గాకుండా, దానికి విస్తృతమైన భాష్యాన్ని కూడా తానే రాశారు. ఇంకా, తన అన్నగారైన అసంగుని విజ్ఞానవాద ప్రయత్నాన్ని స్థిరపరచే ప్రయత్నంలో భాగంగా విజ్ఞాన వాదానికి చెందిన **"విజ్ఞప్తి మాత్రతాసిద్ధి"** గ్రంథాన్ని రచించి, దానికి వింశికనూ (ఇరవై కారికలు గలది), త్రింశికనూ (ముప్పై కారికలు గలది) రాశారు. వీటితో పాటు **"వాద విధానం"** అనే న్యాయశాస్త్ర (తర్కశాస్త్ర) గ్రంథాన్ని రాశారు. ఈ గొప్ప గ్రంథంలో భారతీయ న్యాయశాస్త్రానికి నాగార్జునుడు అందించిన ప్రేరణను మరింతగా ఇనుమడింప చేశారు. వసుబంధు చేసిన మరో గొప్ప కార్యం ఏమంటే **"మధ్యయుగాల న్యాయ శాస్త్ర పితామహుడు"** అని కీర్తించబడ్డ దిఙ్నాగుణ్ణి భావితరాలతో చదివించడం. దీనివల్ల తన ప్రయత్నాలన్నింటినీ ఓ మహాప్రవాహంగా ముందుకు తీసుకెళ్ళ గలిగారు.

బౌద్ధుల విజ్ఞాన వాదానికి (క్షణిక విజ్ఞానవాదం) **శంకరాచార్యుడు**, అతని గురువు **గౌడపాదుడు** ఎంతగానో ఋణపడి ఉన్నారు. వాస్తవానికి గౌడపాదుడు రాసిన **మాండూక్య కారిక** సుస్పష్టంగా అది బౌద్ధుల విజ్ఞానవాద గ్రంథమే. ఇక, విజ్ఞానవాదానికీ, అసంగునికీ ఉన్న సంబంధం విడదీయరానిది. ఎంతో లోతైనదీ. ఇతని **'యోగాచార భూమి'** గ్రంథం కారణంగానే విజ్ఞానవాదం పేరు యోగాచారవాదంగా పేర్గాంచింది.

**అసంగుని జీవితం :** అసంగుడు పెషావర్‌కు చెందిన ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు. ఇతని తమ్ముడు వసుబంధు బౌద్ధ జగత్తులో ప్రముఖ దార్శనికుడు. వసుబంధుడు రాసిన గ్రంథాలు కొన్ని కాలగర్భంలో కలసి పోయాయి. అసంగుడు రాసిన గొప్ప గ్రంథం 'అభిధమ్మకోశం'. ఐతే ఇది సర్వాస్తివాదానికి చెందిన ఒక క్రమబద్ధ సమీక్ష లాంటిది. అందుకనే దాన్ని గూర్చి ఇక్కడ నేను ఎక్కువగా చర్చించ తలచుకోలేదు. కానీ, అన్నగారి 'అభిధమ్మకోశం' మీద తమ్ముడు వసుబంధు వివరంగా భాష్యాన్నే రాశారు. నా భాగ్యం కొద్దీ ఆ భాష్యం సంస్కృత ప్రతి ఒకటి నాకు నా టిబెట్టు యాత్రలో దొరికింది. పుస్తకం మొత్తాన్ని ఫొటోలు తీయించాను. ఫొటో రూపంలో ఉన్న ఆ గ్రంథం పుస్తక రూపంలో రాడానికి ఎదురు చూస్తోంది. అసంగుడు రాసిన "విజ్ఞప్తి మాత్రతాసిద్ధి" గ్రంథానికి వసుబంధు "వింశిక", "త్రింశిక" అనే పేర్లుతో ఇరవై కారికల, ముప్పై కారికల భాష్య గ్రంథాల్ని రాశాడని చెప్పుకొన్నాం. పైన చెప్పిన సంస్కృత గ్రంథ ప్రతిలో ఈ వింశిక, త్రింశికలు కూడా ఉన్నాయి.

వసుబంధు "మధ్య యుగాల న్యాయ శాస్త్ర పితామహుడు"గా పేర్గాంచిన దిఙ్నాగుని గురువు. వసుబంధు 'వాద విధానం' అనే న్యాయశాస్త్ర గ్రంథాన్ని రాశాడని చెప్పుకొన్నాం. అయితే, శిష్యుడైన దిఙ్నాగుని గ్రంథాల ముందు వసుబంధు గ్రంథం వెలవెల బోతుంది. వసుబంధు సముద్రగుప్తుని కొడుకైన చంద్రగుప్తుని (విక్రమాదిత్యుని) గురువు కూడా. దీన్ని బట్టి చూస్తే వసుబంధు క్రీస్తుశకం నాలుగో శతాబ్దం చివరివాడని చెప్పవచ్చు.[3]

అసంగుని జీవితానికి సంబంధించిన విశేషాలు మనకు ఎక్కువగా దొరకలేదు. యోగాచార దర్శనానికి తొలి ఆచార్యుడనీ, వసుబంధు అన్నగారనీ, పెషావర్ వాసి

అని మాత్రమే తెలుస్తుంది. అతని కాలం క్రీ.శ. 350 అవుతుంది. నాగార్జునుని తర్వాత 250 సంవత్సరాలకి ఇతడు పుట్టారు. నాగార్జునుని గ్రంథాలు భారతీయ **న్యాయ శాస్త్రానికి** చెందిన తొలి రూపాలనవచ్చు. కాలక్రమంలో యవన దేశానికి చెందిన అనేక వాదాలు భారతీయ దర్శనంలో కలసిపోయాయి. అయితే, ఇవి ఎలా ఏ కారణంగా భారతదేశంలోకి వచ్చాయో మనకు తెలియరావడం లేదు. అలాగే నాగార్జునికీ, అసంగునికీ, వసుబంధులకూ ఏర్పడిన సంబంధాలూ తెలియడం లేదు. అసంగునికి న్యాయశాస్త్ర పరిచయం ఎంతో ఉంది. ఇది అతని 'యోగాచార భూమి' అనే గ్రంథాన్ని బట్టి తెలుస్తుంది.

**అసంగుని గ్రంథాలు :** ఇప్పటికి తెలిసిన అసంగుని ప్రముఖ దార్శనిక గ్రంథాలు ఇవి.

1. మహాయానోత్తర తంత్రం.
2. సూత్రాలంకారం.
3. యోగాచార భూమి.
4. యోగాచార భూమి వస్తు సంగ్రహణి.
5. బోధిసత్త్వ పిటకావవాదం.

వీటిలోని చివరి రెండు గ్రంథాల గురించి యోగాచార భూమిలో ఉదహరించడం జరిగింది. మిగిలిన మూడు గ్రంథాల చైనా, టిబెట్ అనువాదాలు లభిస్తూనే ఉన్నాయి.

## I. యోగాచార భూమి

అసంగుని **"యోగాచార భూమి"** పదిహేడు భూమికలుగా విభజించబడిన గ్రంథం. అవి :

1. విజ్ఞానభూమి
2. మనోభూమి
3. సవితర్క - సవిచారాభూమి
4. అవితర్క విచార మాత్రాభూమి

10. శృతమయిాభూమి
11. చింతామయిాభూమి
12. భావనామయిాభూమి
13. శ్రావకభూమి[4]

5. అవితర్క – అవిచారాభూమి
6. సమాహితాభూమి
7. అసమాహితాభూమి
8. సచిత్తకులభూమి
9. అచిత్తకులభూమి
14. ప్రత్యేక బుద్ధులభూమి
15. బోధిసత్త్వభూమి[5]
16. సోపధికులభూమి
17. నిరూపధికులభూమి

**"యోగాచార – భూమి"**లో అసంగుడు అనేక విషయాల్ని విశదీకరించారు. (ఈ పుస్తకం చివర ఉన్న అనుబంధంలోని 5వ పాదసూచికవల్ల ఆ విషయాలు తెలుస్తాయి.)

## II. దార్శనిక చింతన

అసంగుడు **క్షణిక – విజ్ఞానవాది**. ఈ విజ్ఞానవాదం అసంగుని కంటే ముందే **'లంకావతార సూత్రం', 'సంధి నిర్మోచన సూత్రం'** లాంటి మహాయాన గ్రంథ సూత్రాల్లోనే ఉంది. ఈ సూత్రాల్ని **'బుద్ధ వచనం'** అనేవారు. బుద్ధవచనాలుగా ప్రచారం పొందిన ఈ సూత్రాలు చాలా బుద్ధుడు చెప్పినవి కావు. **'లంకావతార సూత్రాల'**ను బుద్ధుడు దక్షిణ ప్రాంతంలోని **లంకాద్వీపం** (సిలోన్)లోని ఒక పర్వతం **(శమంతకూట)** మీద ఉపదేశించారని అంటారు. కానీ, బుద్ధుడు తన పర్యటనలో అసలు దక్షిణ భారత దేశమే రాలేదు. ఈ విషయంలో ఉత్తరంలోని గాంధార పర్వతాన్ని చెప్పితే బాగుండేది.

బుద్ధుడు చెప్పిన **'అన్నీ అనిత్యాలే' – 'సబ్బం అనిచ్చం** (సర్వం అనిత్యం) – అనే సిద్ధాంతాన్నీ, యవన (గ్రీకు) దార్శనికుడు ప్లేటో చెప్పిన విజ్ఞానవాదం (స్థిరతా వాదం) కలగలిపితే ఆ తరువాతి కాలంలో బౌద్ధులు చెప్పిన క్షణిక విజ్ఞానవాదం అవుతుంది. ఈ కలగలుపు గాంధార దేశంలోనే జరిగింది. ఇక్కడ భారతీయ, యవన కళలు కలిసిపోవడం వలన **'గాంధార'** శిల్పకళ అవతరించింది. విజ్ఞాన వాదం విజ్ఞానాన్నే పరమార్థతత్త్వంగా అంగీకరిస్తుందని చెప్పుకొన్నాం.

మరి ఈ విజ్ఞానవాదం ఐదు ఇంద్రియాలూ, వాటి ఐదు విజ్ఞానాలూ; ఈ ఐదింటితోపాటు ఆరోదైన మనస్సుకు చెందిన మనోవిజ్ఞానాన్ని, ఇంకా, ఏడోదైన ఆలయ విజ్ఞానాన్ని కూడా అంగీకరిస్తుంది. ఆలయ విజ్ఞానం అలలతో నిండిన

మహాసముద్రం లాంటిది. సముద్రంలోని అలల్లా, ఈ జగత్తులోని అన్నీ జడ, చేతన పదార్థాలూ ఆలయం (సముద్రం) నుండే పుడతాయి. నశిస్తాయి. ప్రవాహ తత్వాన్ని కలిగివుంటాయని అంటారు బౌద్ధ విజ్ఞానవాదులు.

ఇక్కడ మనం అసంగుని దార్శనిక అభిప్రాయాల్ని చూద్దాం. వాటిని అతని **'యోగాచార భూమి'** లోని విషయాల ఆధారంగా చూడడం సమంజసం. ఇక్కడ గుర్తుంచుకోవాల్సినదేమంటే... **'యోగాచార భూమి',** అచ్చంగా దార్శనిక గ్రంథం కాదు. అది బుద్ధఘోషుని **'విసుద్ధిమగ్గ'** (విశుద్ధిమార్గం) లాగా ఎక్కువగా బౌద్ధసదాచారం, యోగం, ధర్మతత్త్వాలను గురించే వివరించింది. అసంగుడు, కుర్రవాడైన బుద్ధఘోషునిలా బుద్ధుని ఏదో ఒక గాథను ఆధారంగా తీసుకొని ఈ గ్రంథాన్ని రాయలేదు. **"గాధార్థప్రవిచయ"**[6]లో 178 గాథలున్నాయి. ఇవి హీనయాన, మహాయానాల రెండింటికీ చెందినవి. బుద్ధసూత్రాల భాషనూ, శైలినీ బుద్ధఘోషునిలాగా అసంగుడు కూడా అనుసరించాడు. ఎంతబాగా అనుకరణ సాగిందంటే, ఆ రోజులు సంస్కృత గ్రంథాల రోజులు. అయినా ఆ గ్రంథం పిటక కాలానికి చెందిన గ్రంథంలా ఉంటుంది. పాలీ గ్రంథంలా అనిపిస్తుంది.

బుద్ధఘోషుడు తన గ్రంథాన్ని పాలీ భాషలో రాశారు. వసుబంధు, కాళిదాసుల కాలం నాటి సంస్కృతంలాగా భాషను సంస్కరించాల్సిన అవకాశం బుద్ధఘోషునికి అప్పటికి లభించలేదు. కాబట్టి బుద్ధఘోషుడు తప్పక పాళీ భాషను, శైలినీ అనుసరించాల్సి వచ్చింది. అయితే, అసంగునికి అలాంటి తప్పనిసరి పరిస్థితి ఏమీ లేదు. తన కృతులను బుద్ధుడి పేరుతో (బుద్ధుడే చెప్పినట్లు) ప్రచారం చేసుకోవాలనే కోరికా అసంగునికి లేదు. మరి అలాంటప్పుడు అలాంటి భాషనూ, శైలినీ ఎందుకు స్వీకరించారు? విషయాన్ని ఎందుకు సంక్షిప్తంగా చెప్పలేక పోయారు? బహుశ... సూత్రాల శైలికి అలవాటుపడ్డ పాఠకులకు సులభంగా ఉండడం కోసం అసంగుడు ఆవిధంగా చేసి ఉండొచ్చు.

నేనిక్కడ **'యోగాచార భూమి'** పూర్తి గ్రంథాన్ని గురించి సమాచారం ఇవ్వబోవడం లేదు. కేవలం **జ్ఞేయం** (ప్రమేయం), విజ్ఞాన వాదం, ప్రతీత్య సముత్పాదం, హేతువిద్యా, పరవాద ఖండన, ద్రవ్య-పరమాణులకు సంబంధించి విషయాల్ని మాత్రమే ఇస్తాను.

**i. జ్ఞేయం (ప్రమేయం) :** పరీక్షణీయ పదార్థాన్ని జ్ఞేయం[7] అంటారు. లేదా ప్రమేయం అంటారు. ఇది నాలుగు రకాలు.

A. సత్తు (సత్) లేక భావరూపం

B. అసత్తు (అసత్) లేదా అభావ రూపం

C. అస్తిత్వం,

D. నాస్తిత్వం

**A. సత్తు లేక భావ రూపం :** ఇది ఐదు రకాలు.

a. స్వలక్షణ సత్ (తన స్వరూపంలోని సత్తు)

b. సామాన్య లక్షణ సత్ (జాతి మొదలైన రూపంలోని సత్తు)

c. సంకేత లక్షణ సత్ (సంకేతాన్నిచ్చే రూపంలోని సత్తు)

d. హేతు లక్షణ సత్ (ఇష్టం, అనిష్టం మొదలైన హేతు రూపాలలోని సత్తు)

e. ఫల లక్షణ సత్ (పరిణామ రూపంలోని సత్తు)

**B. అసత్తు లేదా అభావ రూపం :** అసత్తు కూడా ఐదు రకాలు.

a. అనుత్పన్న అసత్ (ఏదైతే పదార్థం కాదో అలాంటి అసత్తు)

b. నిరుద్ధ అసత్ (ఏది ఉత్పన్నమై నాశనమవుతుందో లేదా నష్టమై పోతుందో – అలాంటి అసత్తు)

c. అన్యోన్య అసత్ (ఆవు గుర్రం కాదు, గుర్రం ఆవు కాదు – అనే అసత్తు)

d. పరమార్థ అసత్ (మూలం తెలిసిన అనంతర అసత్తు)

e. అత్యంత అసత్ (గొడ్రాలి కొడుకు – ఇలాంటి అసత్తు)

**C. అస్తిత్వం :** ఇది కూడా ఐదు రకాలు.

a. **పరినిష్పన్న లక్షణం :** ఏది అస్తిత్వానికి మూలమై ఉంటుందో అది. (అసంగుని అభిప్రాయంలో విజ్ఞానం. భౌతికవాదుల అభిప్రాయంలో మూల భౌతికతత్త్వం).

b. **పరతంత్ర లక్షణ అస్తిత్వ ప్రతీత్య సముత్పన్నం :** (ఫలానాది అయిన తర్వాత ఫలానిది ఉనికిలో ఉంటుంది)

c. **పరికల్పిత లక్షణ అస్తిత్వం :** సంకేతం దేనికైతే (Convention) అంగీకరిస్తామో అది.

d. **విశేష లక్షణ అస్తిత్వం :** (కాలం, జన్మ, మృత్యువు మొ॥లైన వాటి సంబంధం కల్గినటువంటిది.)

e. **అవక్తవ్య లక్షణ అస్తిత్వం :** దీనిలో "అవును" "కాదు" లేదా 'రెండూ కాదు' అని చెప్పేది. (బౌద్ధ దర్శనంలో పుద్గల (చేతన) అనేది స్కంధాల నుండి 'వేరు' అని చెప్పలేము. 'ఒకటే' అనీ చెప్పలేము).

**D. నాస్తిత్వం :** ఇదీ అయిదు రకాలే.

a. పరమార్థ రూపేణ నాస్తిత్వం.

b. స్వతంత్ర రూపేణ నాస్తిత్వం.

c. సర్వే సర్వా రూపేణ నాస్తిత్వం.

d. అవిశేష రూపంలోని నాస్తిత్వం.

e. అవక్తవ్య రూపంలోని నాస్తిత్వం.

పరమార్థతను పైన చెప్పిన సత్, అసత్, అస్తిత్వం, నాస్తిత్వాలను వివరించి చెప్పడానికి అసంగుడు **"పరమార్థగాథ"** పేరుతో మహాయాన సూత్రాలలోని అనేక గాథలను (శ్లోకాలను) ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఆ ఉదాహరణల్లో...

• వస్తువుల లోపల ఏ రకమైనటువంటి స్థిరతత్త్వం లేదు. 'ప్రతిదీ శూన్యమే'. బాహ్య, మానసిక తత్త్వాలు కూడా శూన్యమైనవే. క్షణం క్షణం నశించేవే...

• ఎవరైనా (ఈశ్వరుడు మొదలైన) పుట్టించే వాడుగానీ, నాశనం చేసేవాడు గానీ లేదు. ఈ జగత్తులోని పదార్థాలన్నీ స్వభావ సిద్ధంగా క్షణ భంగురాలు. వాటి సహజ స్వభావం వల్లే అవి నశిస్తాయి. రూపం (Matter), వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం ఈ ఐదు పంచ స్కంధాలలోని స్థిరత్వం, ఉనికి కేవలం భ్రమే! నిజానికవి నురుగు, బుడగలు, ఎండమావులు, **కదలీగర్భం***, మాయ–లాగా నిస్సారమైనవే![8]...

• "మానసిక జగత్తు శూన్యమే!
బాహ్య జగత్తూ శూన్యమే!
ఏది శూన్యతాను భావాన్ని కల్గి ఉంటుందో"....
అలాంటిదేదీ (ఆత్మ) లేనే లేదు!

• "ఆత్మ అనేది ఏదీ లేదు. కేవలం అది కల్పన. విరుద్ధమైన కల్పన. ఇక్కడ ఏదీ సత్యమైంది గానీ, ఆత్మ గానీ లేదు. ఈ ధర్మం (పదార్థం) తనకు తానే కారణం"

• సంస్కారాలన్నీ (ఉత్పన్నమైన పదార్థాలన్నీ) క్షణికాలే...

• "దీన్ని (పదార్థాన్ని) ఎవడూ ఉత్పత్తి చేయడు. స్వయంగా వాటికవి ఉత్పన్నమూ కావు. ప్రత్యయం పుట్టేపుడు (పదార్థం) పాతదానిలా కాక, అక్షరాలా కొత్త కొత్తగా పుడ్తుంది.

• "కొన్ని పదార్థాల్ని ఎవడూ నాశనం చేయలేడు. స్వయంగా వాటికవి నాశనమూ కావు. పూర్వ కారణంగానే పదార్థం పుట్టుకొస్తుంది. అంతలోనే స్వయంగానే క్షణ కాలంలోనే గిట్టిపోతుంది".

• "**రూపం** (భౌతిక తత్వం) నురుగు లాంటిది. **వేదన** (స్కంధం) గాలి బుడగ లాంటిది".

• **సంజ్ఞ** ఎండమావి లాంటిది. **సంస్కారం** కదలీగర్భం లాంటిది **విజ్ఞానం** మాయ లాంటిది – అని చెప్పాడు... సూర్యవంశజుడు (బుద్ధుడు).

## ii. విజ్ఞానవాదం

**A. ఆలయ విజ్ఞానం :** బయటకు కనిపించే పదార్థమైనా, కనిపించని పదార్థమైనా, జడ పదార్థమైనా, చైతన్యం కలిగిన పదార్థమైనా... ఏవైతే పదార్థాలు ఈ జగత్తులో ఉన్నాయో అవన్నీ విజ్ఞానం యొక్క పరిణామాలే. విజ్ఞాన సమష్టిని **ఆలయ*** విజ్ఞానం అంటారు. నిరంతరం కదిలే తరంగాల్లా జగత్తూ, అందులోని సమస్త వస్తువులూ ఉత్పన్నమయ్యాయి. ఈ **విశ్వ విజ్ఞానం**[9] నుండి (ఆలయ విజ్ఞానం నుండి) ఎలాగైతే జడ జగత్తు పుట్టిందో అలాగే పంచేంద్రియాల తాలూకు పైకి వ్యక్తమయ్యే ప్రవృత్తి విజ్ఞానం కూడా ఉద్భవించింది. వీటితో పాటుగా ఆరవ ఇంద్రియమైన మనస్సుకు సంబంధించిన మనోవిజ్ఞానం కూడా పుట్టుకొచ్చింది.

**B. పంచేంద్రియ విజ్ఞానం :** ఇంద్రియాల వల్ల ఏ విజ్ఞానం, ఏ చేతనలు కలుగుతాయో అది పంచేంద్రియ విజ్ఞానం. ఈ విజ్ఞానానికి ఆశ్రయాలైన పంచేంద్రియాలననుసరించే ఈ ఇంద్రియ విజ్ఞానం కూడా ఐదు రకాలుగా ఉంటుంది.

**a. చక్షు - విజ్ఞానం**[10] **:** (కనుల వల్ల తెలుసుకొనేది)

• **స్వభావం :** చక్షువుల (కన్నుల) వల్ల ఏ విజ్ఞానాన్ని అయితే పొందుతామో దాన్ని చక్షు విజ్ఞానం అంటాము. ఇదే చక్షు - విజ్ఞాన స్వభావం.

• **ఆశ్రయాలు :** చక్షువిజ్ఞాన మూడు విషయాలపై ఆధారపడి ఉంటుంది. చక్షువుతో పాటు ఉనికిలోకివచ్చి, విలీనమై పోయేది **'సహభు ఆశ్రయం',** దాని తర్వాత మనస్సులో ఏ విజ్ఞానం అయితే ఆశ్రయం అవుతుందో అది **'సమనంతర ఆశ్రయం'.** రూపం, ఇంద్రియాలు, మనస్సు పూర్తి జగత్తు యొక్క బీజం దేనితో ఉంటుందో దానిని **'సర్వబీజ ఆశ్రయం'** అంటారు. అదే ఆలయ విజ్ఞానం. ఈ మూడు ఆశ్రయాలలో చక్షు రూపం (భౌతిక) మాత్రమే **రూప ఆశ్రయం.** మిగిలినవి **అరూపాశ్రయాలు.**

• **ఆలంబనలు :** అంటే విషయాలు. ఇవి వర్ణం (రంగు), సంస్థానం (ఆకృతి), విజ్ఞప్తి (క్రియ) లకు చెందిన విషయాలు.

• **వర్ణాలు :** నీలం, పసుపు, ఎరుపు, తెలుపు, నలుపు, ఛాయ, ధూపం, ప్రకాశం, అంధకారం, మంద్రం, ధూమం, రజం, మహిక (మట్టి రంగు), ఆకాశ వర్ణం మొదలైనవి.

• **సంస్థానాలు (ఆకృతులు) :** ఇవి పొడవు, పొట్టి, వృత్తాకారం, పరిమండలం, అణువు, స్థూలం, సాత్, విసాత్, ఉన్నతం, అవనతం మొదలైనవి.

• **విజ్ఞప్తులు :** ఇవేమంటే... తీసుకోవడం, విసిరివేయడం, ముడుచుకుపోవడం, విస్తరించడం, ఆగడం, కూర్చోవడం, పడుకోవడం, పరిగెత్తడం మొదలైన క్రియలు.

• **సహాయాలు :** సహాయ-చక్షువిజ్ఞానంతో పాటు ఉత్పన్నమయిన విషయమే చైతసిక ధర్మం (చేతసిక ధర్మం).

• **కర్మ :** ఇవి ఆరు.

క. స్వవిషయ - అవలంబాలు.

ఖ. స్వలక్షణాలు

గ. వర్తమాన కాలం

ఘ. ఒక క్షణం

ఇ. మంచి, చెడు కర్మల పరిణతి, ఈ రెండు కర్మల సహజదృష్టి.

చ. ఇష్ట, అనిష్ట ఫలితాలు పొందడం.

**b. శృతాది విజ్ఞానాలు :** ఇదే విధంగా (చక్షువిజ్ఞానం వలే) వినికిడి (చెవులు), వాసన (ముక్కు), రుచి (నాలుక), తాకుడు (చర్మం), విజ్ఞానాలూ ఉంటాయి.

**C. మనో విజ్ఞానం :** ఇది ఆరో విజ్ఞానం. దీని స్వభావం... ఆశ్రయం... మొదలైనవి చూద్దాం.

**a. స్వభావం :** చిత్తం లేదా మనోవిజ్ఞానాలు దీని స్వభావాలు లేదా స్వరూపాలు.

• అన్ని బీజాలు (మూల కారణాలు) కలిగిన ఆశ్రయ స్వరూపమే ఆలయ విజ్ఞాన చిత్తం.

• మనస్సులో అవిద్య, "నేను ఆత్మను" అనే దృష్టి, అస్తిమానం, కోరిక ఈ నాలుగు క్లేశాలూ (చిత్త మాలిన్యాలు) ఉంటాయి.

• విజ్ఞానం యొక్క విషయం ఏదైతే ఉందో అది క్రియల్లోనే ఉంటుంది.

**b. ఆశ్రయం :** మనస్సు సమానాంతర ఆశ్రయం. దీని అర్థం ఏమంటే... కనులు మొదలైన ఇంద్రియాల నుండి విజ్ఞానం పుట్టుకొస్తుంది. మనస్సు కూడా ఈ విజ్ఞానాల ఆశ్రయమై ఉంటుంది. బీజం – ఆశ్రయం – అన్ని బీజాలలో ఉంటే ఆలయ విజ్ఞానం అవుతుంది.

**c. ఆలంబన :** అంటే విషయం. పంచేంద్రియాల విజ్ఞానాలే మనస్సు యొక్క ఆలంబన అనొచ్చు. దీనినే **'ధర్మం'** అని కూడా చెప్పొచ్చు.

**d. సహాయాలు :** మనస్సు సహాయాలు అనేకాలు. వీటిలో కొన్ని – స్పర్శ,[11] వేదన, సంజ్ఞ, చేతన, స్మృతి, ప్రజ్ఞ, శ్రద్ధ, లజ్జ, నిర్లజ్జత, అలోభం, అద్వేషం, పరాక్రమం, ఉపేక్ష, అహింస, రాగం, సందేహం, క్రోధం, ఈర్ష్య, మూర్ఖత్వం, హింస మొదలైన చేతనత్వం కల్గిన ధర్మాలు.

**e. కర్మ :** మొదటిగా... తనకు కాని విషయాలకు చెందిన క్రియలు ఆరు విధాలుగా వ్యక్తమవుతాయి.

• విషయానికి చెందిన సామాన్య స్వరూప విజ్ఞప్తి.

- మూడు కాలాలలో విషయానికి చెందిన విజ్ఞప్తి.
- క్షణ కాల క్రమంలో దాని విజ్ఞప్తి.
- ప్రవృత్తి లేక అనువృత్తి (శుద్ధ – అశుద్ధ) ధర్మ కర్మల విజ్ఞప్తి.
- ఇష్టమైన – అనిష్టమైన ఫలితాన్ని గ్రహించడం.

**రెండవ విషయం :** విజ్ఞాన – సముదాయాల ఉత్తాపనం. రెండోవిధంగా ఆలోచించిన మీదట మనస్సులో ప్రత్యేకంగా (విశేష) కర్మలు (వైశేషిక కర్మలు) కలుగుతాయి. ఆ ప్రత్యేక (విశేష) కర్మలు ఏవంటే...

- విషయ భ్రాంతి.
- విషయ చింతన (ఉపనిధ్యానం)
- ఉల్లాసంగా ఉండడం
- ఉన్మాదంలో ఉండడం.
- నిద్రలో మునిగిపోవడం
- మేల్కోవడం.
- మూర్ఛ పోవడం
- మూర్ఛ లోంచి లేవడం
- శారీరకంగా, మాటల రూపంగా కర్మలు చేయడం
- వైరాగ్యం పొందడం
- వైరాగ్యాన్ని వదలడం
- మేలు మరవడం
- మేలు మరవకపోవడం
- శరీరాన్ని వదిలి పెట్టడం (మరణం)
- శరీరాన్ని తిరిగి పొందడం (జననం)

ఈ కర్మల్లో కొన్నింటిని గూర్చి అసంగుడు ఈ విధంగా చెప్పాడు.[12]

కొన్ని కర్మల చేత – శరీరం శిథిలమవుతుంది. భయం వల్ల, మర్మస్థానంలో గాయం వల్ల, భూత – ప్రేత పిశాచాల భయం వల్ల, పిచ్చి ప్రేలాపనలు పుట్టుకొస్తాయి.

శారీరక దుర్బలత్వం వల్ల, కష్టపడడం వల్ల వచ్చే అలసట వల్ల, మితిమీరి భుజించడం వల్ల నిద్ర వస్తుంది.

వాత పిత్త దోషాల వల్ల, అతి మలమూత్ర విసర్జనల (విరోచనాలు లేక బేదులు) వల్ల, ఎక్కువగా రక్తం పోవడం (అధిక రక్తస్రావం) వల్ల మూర్ఛలు వస్తాయి.

**D. మనస్సు మరణం లేదా ఉత్పత్తి:** బౌద్ధ దర్శనం మనస్సును క్షణక్షణ పరివర్తన శీలమైనదని చెప్తుంది. అంతేకాకుండా **'జీవాత్మ'** నిత్యంగా ఉండదనీ అంగీకరిస్తుంది. మరణం అర్థం ఏమంటే – ఒక శరీర ప్రవాహం నుండి ఒక మనో ప్రవాహానికి మారడం. (శరీరం క్షణక్షణమూ మారుతూ ఉండడం చేత, అది ఒక వస్తువు కాదు. అది ఒక ప్రవాహం).

అదే విధంగా... ఉత్పన్నం అంటే అర్థం ఏమంటే... ఒక మనో ప్రవాహం నుండి వేరొక శరీర ప్రవాహంలోకి మారడం.

**a. మరణం :** మరణం మూడు రకాలుగా సంభవిస్తుంది. ఆయుష్షు అయిపోవడం; పుణ్యం[12] అయిపోవడం; శరీరంలో విషమ క్రియలు[13] జరగడం – అంటే భోజన విషయంలో పరిమాణం, కాలం మొ॥ నిర్దిష్టత పాటించక పోవడం (అకాల భోజనం), పథ్యాన్ని పాటించక పోవడం, ఔషధ సేవనం చేయక పోవడం – కాల నియమం లేకుండా కామ క్రీడలో అతిగా పాల్గొనడం వల్ల మృత్యువు కలుగుతుంది. చెడ్డపనులు చేసిన పాపులకు శరీరంలో హృదయ పైభాగంలో మొదట చల్లబడి, ఆ తర్వాత శరీరం మొత్తం చల్లబడుతుంది.

**b. అంతరాభవం :** మనస్సు, ఒక శరీరాన్ని వదిలి, మరో శరీరంలో ఉత్పన్నమయ్యే మధ్యకాలాన్ని అంతరాభవం అంటారు. (భవం అంటే జీవుడు) దీన్ని **గంధర్వం, గంధబ్బ, మనోమయం** అని కూడా అంటారు.

మరో శరీరంలో ఇది ఒక ఆకారాన్ని పొందుతుంది. మనస్సు ఈ ప్రయాణంలో అంతరాభవ స్థితిలో ఏడు రోజులు దాకా ఉంటుంది.

c. **ఉత్పత్తి :** (పుట్టుక లేదా జన్మ) మరణకాలంలో మనస్సు తన మంచి పనుల్ని, చెడ్డ పనుల్ని తనకు తానుగా చూస్తుంది. ఆ కర్మల్ని బట్టి అంతరాభవ రూపాన్ని ధరిస్తుంది. మనస్సు ఏదో ఒక శరీరంలో ఉత్పన్నమవడానికి (పుట్టడానికి) మూడు విషయాలు అవసరం.

• స్త్రీ ఋతుమతి కావాలి. (శోణితం ఉండాలి)

• పురుషుడు బీజవంతుడై ఉండాలి. (శుక్లం ఉండాలి)

• అంతరాభవుడు లేదా గంధబ్బ (గంధర్వుడు) ఉండాలి. (శుక్ల శోణితాలకు తోడు).

*అంతేకాదు, వీటితోపాటు యోని, బీజం, కర్మ – వీటిలో ఏ దోషమూ లేకుండా ఉండాలి.*

• **గర్భంలో లింగ భేదం :** అంతరాభవం స్త్రీ, పురుషుల మైథున క్రియను చూస్తుంది. ఆ సమయంలో దానికి స్త్రీ అవ్వాలని అనిపిస్తే అది పురుష వాంఛను పెంచుకొంటుంది. అలాగే... పురుషునిగా జన్మించాలి అని అనుకొంటే తన మనస్సులో స్త్రీ వాంఛను పెంచుకొంటుంది.

• **గర్భా దానం :** గర్భాదాన సమయంలో మైథున క్రియ అంతంలో రక్తంతో కూడిన బీజ కణాలు వెలువడుతాయి. పురుష బీజకణాలు (శుక్రకణాలు), స్త్రీ శోణితం (అండ కణం) ఈ రెండూ తల్లి యోనిలో కలిసిపోతాయి. కాగి చల్లారిన పాలలా నిశ్చల స్థితికి చేరి పిండంగా మారతాయి.

ఆ పిండంలోని కణాలన్నింటితో ఆలయవిజ్ఞానం కలిసి పోతుంది. అంతరాభవం వెళ్ళి కలసి దానికి ఆకారాన్ని సంతరింప చేస్తుంది. దీన్ని గర్భం కలల అవస్థ (ప్రాథమిక దశ) అంటాము. ఈ అవస్థలో ఏ ప్రదేశంలో **'విజ్ఞానం'** జోడింప బడుతుందో అదే దానికి **హృదయ స్థానంగా** మారుతుంది. ఈ కలల అవస్థ (ప్రారంభ స్థితి) తర్వాత పిండం మరో ఏడు దశల్ని ధరిస్తుంది – అంటే మొత్తం ఎనిమిది దశలు.అవి :

• కలల స్థితి (ప్రాథమిక దశ)

• అర్బుద స్థితి (మాంసంలా మారే దశ)

• పేశీయ స్థితి (గ్రుడ్డు దశ)

• ఘన స్థితి (గట్టి ముద్దలా మారే దశ)

• ప్రశాఖ స్థితి (శరీర భాగాలు ఏర్పడే దశ)

• కేశ, రోమ, నఖ స్థితి (వెంట్రుకలు, జుత్తు, గోళ్ళు ఏర్పడే దశ)

• ఇంద్రియ స్థితి (జ్ఞానేంద్రియాల జ్ఞానం ప్రారంభమైన దశ)

• లింగ భేద స్థితి (ఆడ, మగ భేదం ఏర్పడే దశ)

పై అవస్థలలో – కలల అవస్థలో ప్రారంభమైన గర్భం అర్బుద స్థితిలో పెరుగులా చిక్కబడుతుంది. అది ఏమాత్రం మాంస వ్యవస్థకు చేరని స్థితి. ఇక ఆ తర్వాత పేశీ (జల్లీ) వ్యవస్థలో మెత్తటి మాంసం (క్రైమా)లా మారుతుంది. ఆ తర్వాత ఘన స్థితిలో మాంసం గట్టి పడుతుంది. ఇక ఆపై ప్రశాఖీయ స్థితిలో ఆ గట్టి మాంసం ముద్ద నుండి కాళ్ళు, చేతులు మొదలైన శాఖలు పుట్టుకొస్తాయి.

**d. రంగులు మొదలైనవి :** చెడ్డ పనుల వల్ల, లేదా తల్లి క్షార లవణాల్ని (పులుపు, కారం, ఉప్పు) అధికంగా తీసుకోవడం వల్ల పిల్లల కేశాలలో (వెంట్రుకలు) అనేక రంగులు వస్తాయి. శిశువు ఎర్రగానో, నల్లగానో ఉండడానికి చెడ్డ కర్మలతో పాటు ఈ క్రిందివీ కారణాలే. తల్లి ఎక్కువ వేడి, ఎండల్లో ఉండటం వల్ల శిశువు నల్లగా ఉంటుంది. ఒకవేళ తల్లి అతి చల్లని ప్రదేశంలో ఉన్నట్లైతే ఆ శిశువు తెల్లగా పుడతాడు. అలా కాకుండా తల్లి ఎక్కువ వేడి పదార్థాలు తిన్నట్లైతే శిశువు ఎర్రగా ఉంటాడు. తల్లి అతిగా రతిలో పాల్గొంటే చర్మ రోగాలు, కుష్ఠ మొదలైన వికారాలు శిశువుకు కల్గుతాయి. తల్లి ఈదినా లేక పరుగులు తీసినా, దూకినా శిశువు వికలాంగాలతో పుడుతుంది. గర్భంలో శిశువు ఆడపిల్ల అయితే, ఈ శిశువు తల్లి గర్భంలో ఎడమ వైపున, మగ శిశువు అయితే తల్లి గర్భంలో కుడివైపున ఉంటుంది.

ప్రసవ సమయంలో తల్లి గర్భంలో భరించ లేని కష్టాన్ని కల్గించే (నొప్పులు) ఒకరకమైన గాలి పుట్టు కొస్తుంది. అది గర్భాన్ని తలను క్రిందకు కాళ్ళను పైకి లేపుతుంది.

## III. అనిత్యతా వాదం – ప్రతీత్య సముత్పాదం

ఒక దానిని మరొకటేదో పుట్టించదు. దానికది స్వయంగానూ పుట్టలేదు. కారణం వల్ల వస్తువులు, జీవుడు పాత రూపంలో కాకుండా అక్షరాలా కొత్త కొత్త రూపాలలో పుడుతూ ఉంటాయి. అలా పుట్టాక స్వయంగా క్షణ భంగురమవుతాయి.[13]

మహాయాన సూత్రాలలోని గాథల (శ్లోకాల) ద్వారా అసంగుడు బౌద్ధ దర్శన సిద్ధాంతమైన అనిత్యతా వాదాన్ని (క్షణిక వాదాన్ని) చెప్పాడు. ప్రతీత్య సముత్పాదాన్నే[14] అయన **'క్షణిక వాదం'** అన్నారు.

**ప్రతీత్య సముత్పాదం :** ప్రతీత్యసముత్పాదాన్ని వివరిస్తూ అసంగుడు ఇలా అన్నారు[15]: **"ప్రతి గమనం చేస్తూ ప్రత్యయం (హేతువు) గతి శీల వినాశనాలతో పాటుగా ఉత్పత్తి చెందడమే ప్రతీత్యసముత్పాదం"** అన్నారు. అంటే... ఒక ప్రవాహంగా కదిలే వస్తువు కదులుతూ, నశిస్తూ, తిరిగి మరోలా పుట్టడమే ప్రతీత్యసముద్పాదం అని అర్థం. అంటే... ఒక 'ముగింపు' తర్వాత, అదే వస్తువు 'రెండవదానిగా' ఉత్పత్తి చెందడమే ప్రతీత్యసముత్పాదం. ఇది **క్షణికం***. అనిత్యం.

ఇంకా[16] ప్రతీత్యసముత్పాదం అంటే ఏమిటంటే...

**అనాత్మ** అనే అర్థంలో చూస్తే ఆత్మ నిత్యమైంది కాబట్టి అనాత్మ **అనిత్యం** అవుతుంది. అది అనిత్యం అయితే మారుతుంది కాబట్టి, అది **గతిశీలం** అవుతుంది.

గతిశీలమైతే అంటే మారేది కాబట్టి, మరోదానిపై ఆధారపడాలి కాబట్టి అది **పరతంత్రం** అవుతుంది. పరతంత్రమైతే అది తప్పక **నిరీహం** (కోర్కెలు లేనిది) అవుతుంది.

నిరీహం అయితే అంటే... కోర్కె లేనిది అయితే **కార్యకారణ** (హేతు–ఫల) సంబంధాన్ని నిరోధించడమవుతుంది. ఈ నిరోధం అనుకూల **కార్యకారణ ప్రవృత్తి** అవుతుంది. ఈ అనురూప కార్యకారణ ప్రవృత్తి **కర్మస్వభావ**మవుతుంది.

అనిత్యం, దుఃఖం, శూన్యం, నైరాత్మ్యం. (నైరాత్మ్యం అంటే ఆత్మ యొక్క సత్తాను అంగీకరించకపోవడం. అంటే అనాత్మతా భావం) – ముఖ్య సిద్ధాంతంగా కలది కాబట్టి ప్రతీత్యా సముత్పాదాన్ని గూర్చి భగవాన్ బుద్ధుడు ఇలా చెప్పారు[17] – "ప్రతీత్య

సముత్పాదం గంభీరమైనది. వస్తువులు ప్రతి క్షణం కొత్తకొత్త రూపాలలో జీవన యాత్ర సాగిస్తాయి. ప్రతీత్య సముత్పాదం క్షణభంగురం".[18]

## IV. హేతు విద్య

అసంగుడు విద్యల్ని ఐదు రకాలుగా వర్గీకరించారు.

1. **ఆధ్యాత్మిక విద్య :** దీనిలో బుద్ధుడు చెప్పిన సూత్రాలు, వినయాలు, మాతృకలు ధర్మాలు అంటే త్రిపిటకాల్లో చెప్పిన విషయాలు కలగలసి ఉంటాయి.
2. **'చికిత్సా విద్య' (వైద్య శాస్త్రం).**
3. **'హేతు విద్య' లేదా 'తర్కశాస్త్రం.**
4. **'శబ్ద విద్య'** : దీనిలో ధర్మం, అర్థం, పుద్గలం (జీవం), కాలం, సంఖ్యలు, వ్యాకరణం మొదలైన వాటి విజ్ఞానం ఉంటుంది.
5. **'శిల్ప కర్మస్థాన విద్య' (శిల్ప శాస్త్రం).**

**i. హేతు విద్య : 'హేతు విద్య'**ను అసంగుడు సువిస్తారంగా చర్చించాడు. ఆ విద్యను ఆరు భాగాలుగా విభజించాడు.

A. వాదం
B. వాద - అధికరణం
C. వాద - అధిష్టానం
D. వాద - అలంకారం
E. వాద - నిగ్రహం
F. వాద - ఉపయోగం

**A. వాదం :** మాట్లాడడం లేదా సల్లాపాలను వాదం అంటారు. ఇది మరలా ఆరు రకాలు.

a. **వాదం** : ఏదైతే నోటితో మాట్లాడతామో, అది వాదం.

b. **ప్రవాదం** : లోకశృతులు లేదా జనశృతులు (లోకోక్తులు).

c. **వివాదం** : భోగ భాగ్య సంబంధమైన, దర్శనా సంబంధమైన, భావ సంబంధమైన విషయాలపై జరిగే వాగ్యుద్ధమే వివాదం.[20]

d. **అపవాదం** : అంటే నిందలు.

e. **అనువాదం** : ధార్మిక సంబంధ విషయాల్లో ఏర్పడిన సందేహాల్ని తీర్చడానికి చేసే వాదం.

f. **అవవాదం** : తాత్త్విక వాదం. (తత్త్వజ్ఞానాన్ని పెంపొందించేది).

పై వాటిలో వివాదం, అపవాదాలను త్యజించాలి. అనువాదం, అవవాదాలను స్వీకరించాలి.

**B. వాద – అధికరణం :** అంటే వాదనకు తగిన అధికరణలు (స్థానాలు). అవి రెండు. మొదటిది రాజాస్థానం లేదా యోగ్యత కల్గిన కుల పెద్దల పరిషత్తు. రెండోది ధార్మిక శాస్త్ర నిపుణులైన బ్రాహ్మణ సభ లేదా శ్రమణుల సభ.

**C. వాద – అధిష్టానం :** అంటే వాదం యొక్క ముఖ్య విషయం. ఇవి రెండు రకాలు. మొదటిది **సాధ్యం**. రెండోది సాధ్యాన్ని నిరూపించే సాధనాలు. ఈ సాధనాలు 8 రకాలు. ఈ సాధ్యం యొక్క సత్ – అసత్ రూపాల్ని, నిత్య – అనిత్యతలను, భౌతిక – అభౌతికతల్ని సాధనాల ద్వారా నిరూపించాలి.

*అష్ట సాధనాలు : సాధ్య వస్తువును నిరూపించడానికి ఉపయోగించే* ***సాధనాలు*** *ఎనిమిది.*

a. **ప్రతిజ్ఞ :** రెండు రకాలైన సాధ్యాలను (విషయాలను) తీసుకొని వాద – ప్రతివాదులు తమ తమ విషయాలలో మంచి వాదనా పటిమ కల్గి ఉండటాన్ని ప్రతిజ్ఞ అంటారు. ఇది తన ప్రతిభ చేత కానీ, లేదా ప్రతివాదిని ఎదుర్కోవడం వల్ల గానీ, లేదా శాస్త్రీయ పరిశోధనవల్ల గానీ, తత్త్వజ్ఞానంవల్ల గానీ, ఎదుటి పక్షాన్ని దూషించడం చేతగాని, లేదా ప్రతివాది పరాజయం చేతగానీ, ప్రతిజ్ఞ నెరవేరుతుంది.

b. **హేతువు :** పైన చెప్పిన ప్రతిజ్ఞను రుజువుపరచడం కోసం పోలిక కల్గిన ఉదాహరణల వల్లగానీ, లేదా పోలికలేని ఉదాహరణల వల్లగానీ నిరూపించడమే హేతువు. అలాగే, **ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం** లేదా **ఆప్త ప్రమాణం** (శబ్ద ప్రమాణం), **ఆగమ ప్రమాణం** (గ్రంథప్రమాణం) కూడా హేతువులే.

c. **ఉదాహరణం :** ప్రతిజ్ఞ కల్గిన విషయాన్ని ఋజువు చేయడానికి హేతువుకు తగిన సుప్రసిద్ధమైన వస్తువును ఆధారంగా తీసుకొని మాట్లాడడం.

d. **సారూప్యం :** ఒక వస్తువును మరో వస్తువు మాదిరిగా పోల్చి చెప్పడం. రెండు వస్తువులకూ మధ్య పోలికలు చెప్పడం సారూప్యం. ఇది ఐదు రకాలు.

• వర్తమాన కాలంలో గానీ, భూత కాలంలో గానీ చూసిన ఒక వస్తువును పోలికగా తీసుకొని వేరొక వస్తువుతో పోల్చడం. దాన్ని 'లింగ సారూప్యం' అంటారు.

• పరస్పర స్వరూప (లక్షణ) సాదృశ్యం. రెండు వస్తువులు పరస్పరం ఒకే లక్షణాలు కల్గి ఉన్న వాటిని ఒకదానితో మరొకటి పోల్చడం. దాన్ని 'స్వభావ సారూప్యం' అంటారు.

• పరస్పరం ఒకే రకమైన కర్మల్ని (పనుల్ని) కల్గి ఉండడం. దీన్ని 'కర్మ సారూప్యం' అంటారు.

• పరస్పరం ఒకే విధమైన గుణాల్ని (ధర్మాల్ని) కల్గి ఉంటే దాన్ని 'ధర్మ సారూప్యం' అంటారు.

ఉదా : అనిత్యం – దుఃఖం
దుఃఖం – అనాత్మ
అనాత్మ – జన్మ – ఇవి ధర్మ సారూప్యాలు.

• పరస్పరం ఒకదానికొకటి కార్యకారణం కావడం – 'హేతుఫల సారూప్యం'.

e. **వైరూప్యం :** ఒక వస్తువుకూ, మరో వస్తువుకూ పోలిక లేకపోవడం – **'వైరూప్యం'** అవుతుంది.

వైరూప్యం కూడా సారూప్యం లాగానే లింగ, స్వభావ, కర్మ, ధర్మ, హేతుఫల – వైరూప్యాలని ఐదు రకాలుగానూ ఉంటుంది.

f. **ప్రత్యక్షం : అ–పరోక్షం** (పరోక్షంలో లేనిది – అంటే ఎదురుగా ఉన్నది. అంటే ఇంద్రియాలకు అందేది), **అనభ్యూహితం** (కల్పనకు తావులేనిది – అంటే ఊహించనిది), **అ–భ్రాంతం** (భ్రాంతి కానిది – అంటే నిజమైనది)[21] – అయిన దానిని ప్రత్యక్షం అంటాం. అంటే ఇంద్రియాల సమక్షంలో ఉన్నది. **'ప్రత్యక్షం'** వస్తువుల స్థితి మీద ఆధారపడి ఉంటుంది.[22] భ్రాంతుల నుండి విముక్తి పొందింది. ఈ భ్రాంతులు ప్రధానంగా ఐదు రకాలు – అవి:

• **సంజ్ఞా భ్రాంతి :** ఎండమావుల్లో నీరు ఉందన్న **భ్రాంతి** *.

• **సంఖ్యా భ్రాంతి :** ఒకే చంద్రబింబం రెండుగా కన్పించడం (కళ్ళు ఉన్నా మసక బారడం వల్ల)

• **సంస్థాన భ్రాంతి:** ఆకార సంబంధమైన భ్రాంతి. ఉదా॥ రెండు చివర్లలో మండుతున్న కర్రను మధ్యలో పట్టుకుని గిరగిరా త్రిప్పితే ఆ మంట ఒక చక్రంలా కన్పిస్తుంది. (అలాట చక్రభ్రాంతి)

• **వర్ణ భ్రాంతి :** కామెర్ల రోగికి అన్ని వస్తువులూ పసుపు పచ్చగానే కన్పిస్తాయి.

• **కర్మ భ్రాంతి :** వేగంగా ముందుకు పోయే వాడికి దారి ప్రక్కనే ఉన్న చెట్లు వెనక్కి పోతున్నట్లు కన్పిస్తాయి. ఇది కర్మ భ్రాంతి. [*నిజానికి భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుంటే చూడ్డానికి సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నట్లు కన్పించడం -- అనువాదకుడు*]

• **చిత్త భ్రాంతి :** పైన చెప్పిన ఐదు రకాల భ్రాంతుల్లో చిత్తం (మనస్సు) పడిపోవడం చిత్త భ్రాంతి.

• **దృష్టి భ్రాంతి :** పైన చెప్పిన ఐదు రకాల భ్రాంతుల్లో ఇష్టం, ఆసక్తి, అదే మంచిది అనుకోవడం, దాన్లోనే నిమగ్నమై పోవడం దృష్టి భ్రాంతి.

ఇక, అసలు విషయానికొస్తే...

ప్రత్యక్షం నాల్గు విధాలు. అవి :

• రూప ప్రత్యక్షం లేదా భౌతిక ప్రత్యక్షం లేదా ఇంద్రియ ప్రత్యక్షం.

• మనో ప్రత్యక్షం లేదా అనుభవ ప్రత్యక్షం.

• లోక ప్రత్యక్షం.

• శుద్ధ ప్రత్యక్షం.[23]

వీటిలో ఇంద్రియ ప్రత్యక్షం, అనుభవ ప్రత్యక్షాన్ని కలిపి లోక ప్రత్యక్షం అంటారు కొందరు. దీన్ని అసంగుడు కూడా అంగీకరించారు.[24] ఆయన ప్రత్యక్షాలు మూడే

రకాలంటారు. దీనినే ధర్మకీర్తి, దిఙ్నాగుడు, దిఙ్నాగుని గురువైన వసుబంధు కూడా అంగీకరించారు.

ధర్మకీర్తి వీటిని **ఇంద్రియ ప్రత్యక్షం, మానస ప్రత్యక్షం "యోగీ ప్రత్యక్షం"** అన్నారు. అయితే, లోక ప్రత్యక్షానికి బదులు **'స్వయం సంవేదనా ప్రత్యక్షా'**న్ని కలిపి ప్రత్యక్షాలు నాలుగేనంటే వసుబంధు అభ్యంతరం పెట్టరు. ఈ రకంగా ప్రత్యక్షం అపరోక్షమూ, అభ్రాంతమూ, అభ్యూహితమూ (కల్పనా రహితం) అయిన ఇంద్రియ, మానస, యోగీ ప్రత్యక్షాలు మూడూ బౌద్ధ న్యాయ శాస్త్రాలలో ప్రాముఖ్యతను పొందాయి. బౌద్ధ న్యాయ శాస్త్రకారుల్లో ఆఖరి వాడైన **'జ్ఞానశ్రీ'** మొదలుకొని, వెనక్కు పోతే అసంగుని వరకు పై ప్రత్యక్షాల్ని చూస్తాము. అసంగుని నుండి నాగార్జుని వరకు, అక్కడి నుండి అశ్వఘోషుని వరకూ ఇదే ప్రత్యక్షాన్ని చూస్తునే ఉంటాం.

౨. **అనుమానం :** యే ఊహచేత, అభ్యూహితమైన (కల్పనా రహితమైన), తర్కనీయమైన విషయాన్ని తర్కించబోతున్నామో దాన్ని **'అనుమానం'** అంటారు. (అనుమాన – ప్రమాణం) అనుమానం కూడా ఐదు రకాలే.

• ధ్వజాన్ని (జెండాను) బట్టి రథాన్ని, రాజునుబట్టి రాష్ట్రాన్ని, భర్తను బట్టి భార్యనూ, కొమ్ముల్ని బట్టి జంతువునూ ఊహించడం **'లింగ అనుమానం'.**

• చిన్న అంశాన్ని బట్టి మొత్తం అంశాన్ని ఊహించడం. ఉదా॥ ఒక మెతుకుని పట్టి చూచి, కుండలోని మెతుకులన్నీ ఉడికాయని చెప్పడం. ఇది **'స్వభావ అనుమానం'.**

• శరీరాంగాల కదలికల్ని బట్టి పురుషుడనీ, స్త్రీ అనీ ఊహించడం, కాళ్ళను బట్టి ఏనుగును, శరీరంలోని మెలికల గతిని బట్టి పామును, సకిలింపును బట్టి గుర్రాన్ని, రంకెను బట్టి ఎద్దుని, దృశ్యాల్ని బట్టి కంటినీ, వినికిడిని బట్టి చెవినీ, వాసనను బట్టి ముక్కునూ, స్పర్శను బట్టి చర్మాన్ని (త్వక్), తెలుసుకోవడాన్ని బట్టి మనస్సును ఊహించడం. అలాగే చూపుకు అవరోధాన్ని కల్గించడం వల్ల నేలనూ, నాచువల్ల నీటినీ, బూడిదను చూచి నిప్పునూ, చెట్ల కదలికలను బట్టి గాలినీ ఊహించడం – ఇది **'కర్మ అనుమానం'.**

• అనిత్యం వల్ల దుఃఖం కల్గుతుంది అనే అనుమానం. దుఃఖం వల్ల అనాత్మకం అయ్యే అనుమానం. ఇది గుణం వల్ల కలిగే అనుమానం కాబట్టి దీన్ని **'ధర్మ – అనుమానం'** అంటారు.

• కార్యం వల్ల కారణాన్ని ఊహించడం. లేదా కారణాన్ని బట్టి కార్యాన్ని ఊహించడం. ఎలాగంటే రాజుగారిని సేవించడం వల్ల ఎక్కువ డబ్బు వస్తుంది అనుకోవడం. అలాగే మహా ఐశ్వర్యం వల్ల రాజు సేవ లభిస్తుందని భావించడం. అలాగే అధిక భోజనం వల్ల తృప్తి కల్గుతుంది అనుకోవడం. తృప్తిగా తేన్చడం వల్ల భోజనం అధికమయ్యింది అని అనుకోవడం. – అలాగే కలుషిత భోజనం చేత అనారోగ్యం, అనారోగ్యం వల్ల కలుషితాహారం తీసుకున్నారనే అనుమానం. ఈ అనుమానం **'కార్యాకారణ – అనుమానం'.**

h. **ఆప్తాగమనం :** (ఆప్త వచనం) ఇది శబ్ద ప్రమాణం మరియు గ్రంథ ప్రమాణం. అంటే... శబ్దాన్ని (వేదాన్ని) ప్రమాణంగా తీసుకోవడం. అలాగే... ఒక గ్రంథాన్ని ప్రమాణంగా తీసుకోవడం. మనం ఇప్పటిదాకా హేతువిద్యలో భాగాలైన వాదం, వాద–అధికరణం, వాద–అధిష్ఠానాలను చూశాం. ఇక, వాద–అలంకార, వాద–నిగ్రహం, వాద–నిస్సరణలను చూద్దాం.

**D. వాద – అలంకారం**

వాదించే వారికి కొన్ని యోగ్యతలు అవసరం. అవి వారికి ఆభరణాల్లాంటివి. ఈ యోగ్యతలు ఐదు రకాలు. అవి :

a. **స్వ – పర – సమయజ్ఞత :** తాను వాదించే విషయంలోనే కాక, ఎదుటివారి అభిప్రాయాల పట్ల కూడా లోతైన జ్ఞానం కల్గి ఉండడం.

b. **వాక్కు – కర్మల సంపన్నత :** వాక్కులు సంపూర్ణంగా, సభ్యతగా ఉండడం. మాట్లాడడంలో నైపుణ్యం. అందరికీ అర్థమయ్యే పదాలు ఉపయోగించడం. మనం ఏ విషయాన్నయితే వాదిస్తున్నామో ఆ విషయాన్నే మాట్లాడడం.

**c. వైశారద్యం :** సభలో దీనంగా ఉండకుండా, భయపడకుండా, ముఖం పాలిపోకుండా, గొంతు బొంగురు పోకుండా, దీనంగా మాట్లాడకుండా వాదించడం.

**d. స్థైర్యం :** సమయాన్ని దృష్టిలో పెట్టుకొని తొందరపడకుండా మాట్లాడడం.

**e. దాక్షిణ్యం :** మిత్రునిలాగా ఎదుటి వారితో హృదయానురాగంగా మాట్లాడడం.

**E. వాద – నిగ్రహం**

వాదంలో పట్టు ఉండాలి. వాదంలో ఓడిపోయేట్టు మాట్లాడకూడదు. ఇది మూడు రకాలు.

**a. కథాత్యాగం :** చెప్పే విషయాన్ని వదిలిపెట్టి వాదించకూడదు.

**b. కథామాదం :** ఆ విషయాల్ని, ఈ విషయాల్ని కలిపి ఏవేవో విషయాలు చెప్పకూడదు.

**c. కథాదోషం :** అనుచితంగా మాట్లాడడం. అతిగా మాట్లాడడం. అనర్థాల్ని కల్గించే మాటలు మాట్లాడడం. అస్థిరంగా మాట్లాడడం. సంబంధం లేకుండా మాట్లాడడం – ఇవన్నీ కథా దోషాలే.

(ఇక్కడ 'కథ' అంటే మనం ఏ విషయాన్నయితే మాట్లాడుతున్నామో ఆ విషయం)

**F. వాద – నిస్సరణ (వాదాన్నుండి వైదొలగడం)**

గుణ దోషాలు, మంచీ చెడ్డలు గమనించి, నైపుణ్యం కలిగి సభను పరీక్షించాక వాదించక పోవడం వాద – నిస్సరణం.

పైన చెప్పిన విషయాలన్నీ ఉపయోగకరమైనవి.

## V. పరమత ఖండన

తన **'యోగాచార భూమి'**లో ఇతర అభిమతాలకు చెందిన 16 వాదాల్ని అసంగుడు ఖండించాడు. అవి:

**i. హేతు – ఫల – సద్వాదం :** హేతువు (కారణం)లోనే ఫలితం (కార్యం) ఉంటుందని **సాంఖ్యం***లో **'వార్షగణ్యుడు'** అంటారు. ఈ సద్వాదమే (సత్కార్యవాదం) ఆగమ (గ్రంథ) సమ్మతం, యుక్తి సమ్మతమనీ చెప్తారు. (ఈ సద్వాదమే ఆ తరువాత సత్కాయవాదం అయ్యింది). ఫలితం (కార్యం) దేన్నుండి ఉత్పన్నమవుతుందో – ఆ ఉత్పన్నం ఆ ఫలితానికి హేతువు (కారణం) అవుతుంది.

కాబట్టే మనిషి తాను పొందాల్సిన ఫలితం కోసం ఆ ఫలితానికి ఏది కారణమో దానినే ఉపయోగిస్తాడు; అంతేగాని, వేరొక కారణాన్ని వెదకడు. అలాంటి నియమం

లేకపోతే ఒక ఫలితానికి మరొక వస్తువుని ఉపయోగించవచ్చు. నూనె తీయడానికి నువ్వుల్నే ఉపయోగించాల్సిన పని లేదు. ఇసుకనైనా ఉపయోగించవచ్చు గదా! (అంటే .... నూనె (ఫలితం) రాడానికి నువ్వులే (కారణం) అవసరం. ఇసుక (మరో కారణం) అవసరం కాదు.)

**ఖండన :** ఈ వాదన తప్పు. ఎందుకంటే, హేతువు (కారణం)లోనే ఫలితం (కార్యం) ఉందంటారా? లేక రెండూ భిన్నమైనవి అంటారా? లేక హేతువు – ఫలితం రెండూ ఒకటేనంటారా? కార్యం – కారణం ఈ రెండూ ఒకటే అనుకొంటే, హేతువు నుండి కొత్తగా ఫలితం ఉత్పన్నమయ్యేదేముంటుంది? ఉండదు కదా?! అలాకాక, హేతువు, ఫలితం వేరు వేరు అనుకొంటే ఒక హేతువు నుండి వేరే భిన్నమైన ఫలితం ఎలా వస్తుంది? ఈ ఫలితాలు ఉత్పన్నం అయినవా? ఉత్పన్నం కానివా? అనే సమస్య రాదా? కారణం, కార్యం రెండూ వేరు వేరుగా ఉత్పన్నమయ్యాయి అనుకుంటే – ఇక, కారణంలోనే కార్యం (హేతువులోనే ఫలితం) ఉందన్న వాదం వీగిపోతుంది గదా? అలా కాకుండా ఆ రెండూ – కార్యకారణాలు – ఉత్పన్నం కానివే అనుకుంటే కారణంలోనే కార్యం (హేతువులోనే ఫలితం) 'ఉంది' అని ఎలా చెప్పగలం? కాబట్టి, సర్వకాలాల్లో కారణంలోనే కార్యం (హేతువులోనే ఫలితం) ఉంది అనేది వాస్తవం కాదు. అది శాశ్వతమైనదీ కాదు. నిజానికి ఆ వాదం అంగీకరించవలసింది కూడా కాదు. సరైనదీ కాదు.

**ii. అభివ్యక్తి వాదం :** అభివ్యక్తి వాదం లేదా **అభివ్యంజన** వాదం ప్రకారం పదార్థం ఉత్పన్నం కాదు. కేవలం తనను తాను అభివ్యక్తీకరించుకొనటం అంటే తనను తాను ప్రకటించుకోవటం మాత్రమే జరుగుతుంది. హేతు – ఫల – సద్వాదాన్ని చెప్పే సాంఖ్యులు, శబ్దలక్షణ వాదులైన వైయ్యాకరణులూ, ఇదే అభిప్రాయంతో ఉన్నారు. హేతువులో (కారణంలో) ఫలితం (కార్యం) మొదటే ఉంటే ఇక ప్రయత్నంతో పనేమిటి? కాబట్టి ఒకటి అభివ్యక్తం కాడానికి ఏదో ఒక ప్రయత్నం అవసరం అవుతుంది.

**ఖండన :** పదార్థం వ్యక్తం కాకుండా ఉన్నప్పుడు, అది అలా ఉండటానికి **'ఆవరణలు'** (కప్పి ఉంచే పొరలు) గా ఉపయోగపడే ఏదైనా కారణం ఉందంటారా? అభివ్యక్తి వాదులు 'కారణం ఆవరణగా ఉండదు' అని కూడా చెప్పలేదు. హేతువూ

ఫలితం (కార్య కారణాలు) కలిసి ఉంటాయి అంటున్నారు కదా! అలాంటప్పుడు హేతువు (కారణం) ఒక పొరగా ఉండి ఫలితాన్ని (కార్యాన్ని) ఎలా దాచగలదు? కాబట్టి హేతు – ఫల – సద్వాదం తప్పు.

వస్తువులు అభివ్యక్తం కాకపోవడానికి ఆరు కారణాలు ఉన్నాయి.[25]

- దూరంగా ఉండడం వలన.
- నాల్గు రకాల పొరలతో కప్పి ఉండడం వలన.
- అతి సూక్ష్మంగా ఉండడం వలన.
- మనోస్థితి సరిగా లేకపోవడం వలన.
- ఇంద్రియాలు దెబ్బతినడం వలన.
- ఇంద్రియ సంబంధమైన జ్ఞానం సరిగా లభించకపోవడం వలన.

ఈ విధంగా... సాంఖ్యుల హేతు – ఫల – సద్వాదం తప్పు అయినట్లే, వైయ్యా కరణులూ, అదే విధంగా మీమాంసకులూ చెప్పే శబ్ద అభివ్యక్తి వాదమూ తప్పే. **'శబ్దం నిత్యం'** అనే వాదం సరైనది కాదు.

**iii. భూత – భవిష్యత్ ద్రవ్యాల సద్వాదం :** ఇది బౌద్ధులలోని సర్వాస్తివాదుల అభిమతం. అశ్వఘోషుని (క్రీ.శ.50) కాలం నుండి అసంగుని కాలం వరకు అసంగుని జన్మ భూమి అయిన గాంధార దేశం ఈ భూత – భవిష్యత్ ద్రవ్యాల సద్వాదానికి పెట్టని కోటలా ఉండేది. అసంగుని సోదరుడైన వసుబంధు గ్రంథం **'అభిధమ్మకోశం',** ఆ గ్రంథానికి ఆయనే స్వయంగా రాసిన భాష్యం ఈ రెండూ సర్వాస్తివాదానికి చెందిన గ్రంథాలే. ఐతే – ఆ కాలానికి గాంధారం లోనే కాదు మొత్తం భారతదేశంలో ప్రాచీన బౌద్ధ సంప్రదాయాలు (స్థవిర సంప్రదాయం) వెనకడుగు వేసి, దాని స్థానే, **'మహాయానం'** ఆక్రమించడం మొదలయ్యింది.

సర్వాస్తివాదులు ఇలా అంటారు: **'వర్తమాన కాలం'**లోని ఉన్న పదార్థమే – అతీతమైంది (భూత కాలానికి చెందినది). అనాగతమైనది (భవిష్య కాలానికీ చెందినది). అంటే ఇప్పుడున్న పదార్థం, గతకాలంలో ఉన్న పదార్థం, రాబోయే కాలంలో ఉండబోయే పదార్థం – అంతా ఒక్కటే. అంటే సర్వ కాలాల్లో ఉండే ద్రవ్యం ఒక్కటే – అని.

**ఖండన :** అసంగుడు ఈ వాదాన్ని ఇలా ఖండించారు – అతీత, అనాగతాలకి (భూత, భవిష్యత్ కాలాలకు) చెందిన వస్తువు (ధర్మం) నిత్యమైందా? అనిత్యమైందా? ఒకవేళ నిత్యమైంది అంటారా... అలాంటి వస్తువు త్రికాలాల్లో ఉంది అనలేము. ఎందుకంటే నిత్యమైనదానికి కాలం సరిహద్దు ఉండదు. అది కాలానికి అతీతమైనదే అవుతుంది. అలా కాకుండా అది అనిత్యమైంది అని అంటారా? అలాంటిదైతే – త్రికాలాల్లో ఆ వస్తువు 'అలాగే ఉందని' ఎలా చెప్పగలవు? అనిత్యం అంటున్నారు గదా!

(*ఉదాహరణకు ఒక బిడ్డ పుట్టాడు. పుట్టినపుడు ఎలా ఉన్నాడో రెండో రోజూ అలానే ఉన్నాడు అనుకొందాం. మరో పదేళ్ళకూ అలానే ఉన్నాడనుకొందాం. అతని చేష్టల్లో గానీ, పెరుగుదలలో గానీ ఎలాంటి మార్పు రాలేదనే అనుకుందాం. అలాంటప్పుడు ఆ బిడ్డను గూర్చి మనం మాట్లాడేప్పుడు అతను మొన్న ఇలా ఉన్నాడు, నిన్న ఇలా ఉన్నాడు, ఐదో ఏట ఈ విధంగా ఉన్నాడని చెప్పలేం కదా! అంటే అతని విషయంలో కాలం ఒక కొలతగా లేదు. ఉండదు. అంటే మార్పు, పరిణామం లేకపోతే కాలం లేదన్నమాట. కాబట్టి మూడు కాలాల్లో ఉంది అంటే దానిలో మార్పు ఉన్నట్లే. అంటే అది మార్పుచెందని "నిత్య"మైన పదార్థం కాబోదు. కాబట్టి అన్ని కాలాల్లో ఉండే పదార్థం ఒక్కటే అనడం తప్పు. మారే పదార్థాన్ని మూడు కాలాల్లో ఒక్కటే అనడం కూడా తప్పే. – అనువాదకుడు*)

**iv. ఆత్మవాదం :** ఆత్మ, సత్త్వం, జీవం, పుద్గలం – ఈ పేర్లు గల శాశ్వతమైన నిత్యమైన పదార్థం ఏదో ఒకటి ఉంది – అని చెప్పే వాదమే ఆత్మవాదం. ప్రధానంగా **ఉపనిషత్తుల** వాదం ఇదే!

**ఖండన :** అసంగుడు ఈ ఆత్మవాదాన్ని ఖండిస్తూ ఇలా చెప్పాడు : ఏది కనబడుతుందో అది ఆత్మ అనడం సరికాదు. ఆత్మ అనే భావనను ప్రత్యక్ష పదార్థంతోనూ, అనుమాన పదార్థంతోనూ చూడలేము. 'చేష్టలు (శరీర క్రియలు) బుద్ధి వల్ల జరుగుతాయి' అని అంగీకరించాక, ఇక, 'ఆత్మ శరీర క్రియల్ని జరుపుతుంది' అనడం సబబు కాదు. నిత్య ఆత్మ ఏ క్రియనూ జరుపలేదు. అది సుఖదుఃఖాల సమ్మేళనమూ కాదు.

నిజానికి, ధర్మాల్లో (ప్రాపంచిక వస్తువులు, ఘటనలు) ఆత్మ ఉందనేది ఒక కల్పన. అన్ని ధర్మాలూ నిత్యమైనవి కావు, స్థిరమైనవి కావు, శాశ్వతమైనవి కావు.

అవి మారేవే. పుట్టుక, ముసలితనం, రోగాలబారిన పడటం అవన్నీ దుఃఖం యొక్క స్వరూపాలే. అందుకే బుద్ధభగవానుడు ఇలా అన్నారు: "భిక్షువులారా, ఈ ధర్మాల్నే (వస్తువులనే) ఆత్మలనుకోండి. భిక్షువులారా, ఈ ఆత్మలు (అంటే ద్రవ్యాలు) స్థిరమైనవి కావు. శాశ్వతమైనవీ కావు. మారేవే".

కాబట్టి ఆత్మ, సత్త్వం ఏదైనా గానీ ఈ భౌతిక (వస్తు–ఘటనలు) పదార్థాల్లో ఊహించాల్సినవే. ప్రాపంచిక వ్యవహారాల వెసులు బాటుకు ఆత్మ అనీ, శాశ్వతమనీ చెప్పుకొంటాం.[26] నిజానికి అలాంటిది ఏదీ లేదు. ఆత్మవాదం ఒక బుద్ధిలేని వాదం.

**v. శాశ్వత వాదం[27] :** ఆత్మ, విశ్వం – ఈ రెండూ శాశ్వతమైనవి. చెప్పలేనివి. చెప్పడానికి వీలుకానివి. నిర్మించలేనివి. నశింపజేయలేనివి. ఎల్లకాలాల్లో ఒకే రూపంలో ఉండేవి – అని చెప్పే, నమ్మే వాదమే శాశ్వత వాదం. యవనుల (గ్రీకుల) పరమాణు నిత్యతా వాదాన్ని అంగీకరించేవారు ఎందరో ఉన్నారు. వారందర్నీ శాశ్వత వాదులే అనాలి.

**ఖండన :** [*రాహుల్ సాంకృత్యాయన్, దీనిపై అసంగుని ఖండన ఇవ్వలేదు... శాశ్వత వాదాన్ని లేదా నిత్యతావాదాన్ని బౌద్ధులు అంగీకరించరు. బౌద్ధులది అనిత్యతావాదం. ఈ అనిత్యతావాదాన్ని గూర్చి ఈ గ్రంథంలో అనేకసార్లు వచ్చింది. అనువాదకుడు*]

**vi. పూర్వకృత హేతువాదం[28] : 'నీవు ఇప్పుడు అనుభవించేది పూర్వం చేసిన కర్మ ఫలితమే'** అని చెప్పేది పూర్వకృత హేతువాదం. ఈ పూర్వకృత హేతు వాదం జైనుల వాదం. మంచి పనులు చేసేవారు కష్టాలు పడడం, చెడ్డ పనులు చేసేవారు సుఖపడడం మనం నిత్యజీవితంలో చూస్తూ ఉంటాం. ఇది నిజంగా మానవుని చేతుల్లో ఉంటే (ఫలితాలు అనుభవించడం) ఇలా జరగదు. కానీ, ఇలా జరగడానికి **'పూర్వకృత హేతువే'** కారణం అంటుంది జైన ధర్మం.

**ఖండన :** అసంగుడు ఈ వాదాన్ని పూర్తిగా తిరస్కరించలేదు. కానీ, మానవుడు ప్రస్తుత జన్మలో చేసే పనులు కూడా ఫలితాలు అనుభవించడానికి కారణమే అంటారు అసంగుడు.

**vii. ఈశ్వర కర్తృత్వవాదం :** మానవుడు అనుభవించే అనుభవాలూ, సుఖ దుఃఖాలన్నీ ఈశ్వరుని (భగవంతుని) ప్రేరణలే – అంటుంది ఈ వాదం. అందుకే

దాన్ని ఈశ్వర కర్తృత్వవాదం అంటారు. మానవుడు మంచి చేయాలనుకొంటాడు. కానీ చెడు చేస్తాడు. స్వర్గానికి వెళ్ళాలనుకొంటాడు. కానీ, నరకానికి వెళ్తాడు. సుఖపడాలనే అనుకొంటాడు. కానీ, దుఃఖపడతాడు. దీన్నిబట్టి అన్ని కర్మలకూ ప్రేరణ మానవుడు కాదు. ఈశ్వరుడు. అతనే సమస్త కర్మల ప్రేరణ కర్త. సృష్టికర్త. స్రష్ట, నిర్మాత – అంటుంది ఈ వాదం.

**ఖండన :** ఈశ్వరునితో జగత్ నిర్మాణ శక్తి – **'కారణం'**గా ఏర్పడిందా? కారణం (హేతువు) లేకుండా ఏర్పడిందా? కారణం వల్లే ఏర్పడింది అనుకొంటే, అది సహేతుకం అవుతుంది. కాబట్టి ఈశ్వరునితో పనేముంది? ఒకవేళ కారణం లేకుండానే ఏర్పడింది అనుకొంటే అది అహేతుకం. అదీ సరైనది కాదు. అప్పుడూ మరో ప్రశ్న ఎదురౌతుంది. ఈశ్వరుడు జగత్తుతో కలిసి ఉన్నాడా? లేదా, వేరుగా ఉన్నాడా? జగత్తుతో కలిసి ఉంటే **'తానే జగత్తు, జగత్తే తాను'** అవుతాడు కదా? ఇంక **'సృష్టించడం'** ఎలా? – మరి, ఈశ్వరుడు జగత్తుతో కలిసి లేడు. వేరుగా ఉన్నాడు – అని అనుకొంటే – ఇదీ కుదిరేది కాదు. ఎందుకంటే జగత్తుకు దూరంగా ఉండి జగత్తు నెలా సృష్టించగలడు? ఇక్కడ మరో – ప్రశ్న కూడా పుట్టుకొస్తుంది. ఈశ్వరుడు ఈ జగత్తును ఏదైనా ఒక ప్రయోజనాన్ని ఆశించి సృష్టించాడా? లేదా ప్రయోజనం ఆశించకుండా సృష్టించాడా? ప్రయోజనాన్ని ఆశించే సృష్టిస్తే... ఆ ప్రయోజనం ప్రాధాన్యతను పొందుతుంది కదా? అప్పుడు ఈశ్వరుడు తప్పనిసరి స్థితికి నెట్టబడతాడు కదా? ఈ స్థితిలో ఈశ్వరుడు పరతంత్రుడు అవుతాడు కదా? మరి ఆ పరతంత్రుడు జగదీశుడెలా కాగలడు? (ప్రయోజనానికే ప్రాధాన్యం ఉంటుంది, ఈశ్వరునికి కాదు అని అర్థం).

మరి, అలాగే నిష్ప్రయోజనంగా ఈ జగత్తును సృష్టించాడు అనేదీ సరి కాదు. ఎందుకంటే ఇంత పెద్ద మహావిశ్వాన్ని ప్రయోజనం లేకుండా సృష్టించడం ఎంత అవివేకం? అప్పుడు ఇంత పని చేసినవాడు మూర్ఖుడే అవుతాడు. పోనీ, ఈశ్వరుడే ఈ సృష్టికి కారణం అనుకుందామంటే అదీ కుదరదు. ఈశ్వరుడే కారణం అయితే అతనితో పాటే సృష్టి ఉంటుంది. సృష్టితో పాటే అతనూ ఉండాలి. ఈశ్వరుడూ – సృష్టీ ఈ రెండూ అనాదివి అవుతాయి. ఈశ్వరుని కోర్కె మేరకు సృష్టి జరిగింది – అని అనుకున్నా మరలా అదే సమస్య తలెత్తుతుంది. ఈ విధంగా జగత్తుతో కలిసి,

జగత్తుకు దూరంగా ఉండి, ప్రయోజనాన్ని ఆశించి, ప్రయోజనాన్ని ఆశించకుండా, ఇన్నింటిలో ఏవిధంగా చూచినా ఈశ్వరుడు సృష్టికర్త అనడం – తెలివైన పనికాదు.

**viii. హింసాధర్మ వాదం :** యజ్ఞాల్లో మంత్రవిద్యను పఠిస్తూ హింస (ప్రాణాతిపాతం) చేయడం, హోమం చేయడం, ఆ హోమానికి జంతువుల్ని బలివ్వడం – ఇలా బలి కాబడిన జంతువూ, యజ్ఞం చేయించిన వారూ, చేసినవారు, సహకరించిన వారంతా స్వర్గానికి పోతారని చెప్పడమే – హింసాధర్మ వాదం. ఇది యాజ్ఞికుల (మీమాంసకుల) వాదం. కలియుగంలో బ్రాహ్మణులు పురాతన ధర్మాల్ని వదిలి, మాంసభక్షణ కోసం ఈ హింసా ధర్మాన్ని పాటించారు.

**ఖండన :** ఈ వాదానికి చెప్పే కారణం, జరిగేపని, అందులోని తప్పుడు విధానం, బలి వల్ల మంచి ఫలితం వస్తుందనే నమ్మకం, మంత్ర తంత్రాలు చదివే వారి తీరుతెన్నులు – ఇన్ని రకాలుగా ఆలోచించగా ఈ హింసాధర్మ వాదం బుద్ధిలేని వాదం అని తెలుస్తుంది.

**ix. అంతానంతిక వాదం :** (అంతము, అనంతము అనే వాదం) **"ఈ లోకానికి 'అంతం' ఉంది". "దీనికి అంతం లేదు"** అనే విషయాన్ని చర్చించే వాదం అంతానంతిక వాదం. బౌద్ధ సాహిత్యంలో[29] ఈ వాదానికి సంబంధించిన వివరణ లభిస్తుంది.

**x. అమరా విక్షేప వాదం :** ఈ వాదాన్ని గూర్చి బౌద్ధసాహిత్యంలో ప్రస్తావించారు.[30]

**xi. అహేతుక వాదం :** ఆత్మ, విశ్వం – ఈ రెండూ సృష్టించబడటానికి ఎలాంటి హేతువూ (కారణం) లేదు.[31] ఇవి కారణం లేకుండానే (అహేతుకంగానే) సృష్టించబడ్డాయి అంటుంది ఈ వాదం. అందుకే దీన్ని అహేతుక వాదం అంటారు.

**xii. ఉచ్ఛేద వాదం[32]* :** ఆత్మ స్థూల రూపం నాల్గు మహా భూతాలతో నిర్మించబడింది. అది కూడా రోగం, కృశించడం, నశించడం – వీటితో కూడే ఉంటుంది. ఆత్మకు కూడా ఈ అవస్థలు తప్పవు. మనం చనిపోయాక ఆత్మ కూడా మరణిస్తుంది. నశిస్తుంది. ఇంక ఏమీ మిగలదు. పగిలిన కుండ పెంకులు తిరిగి కుండగా ఎలా మారవో, విరిగిన రాతి ముక్కలు తిరిగి ఎలా అతకవో – అలాగే మరణించిన ఆత్మను తిరిగి జీవింపచేయడం అసంభవం.

**ఖండన :** ఆత్మ పంచస్కంధాల నిర్మితమైనదే అయితే – ఆ స్కంధాల (తత్త్వాలు) రూపం నశించినప్పటికి అవి ఎన్నో యుగయుగాలుగా ఉంటూనే ఉన్నాయి. ఆత్మ కూడా అలాంటిదే. అంటే మరణంతో పాటు ఆత్మ నశించదు అని అర్థం. ఆత్మకు రూపం ఉంటే, అది నాల్గు భూతాలతో కూడిన భౌతికరాశి అయితే, దానికి రాగం ఉంటే, అది నశించేది అయితే – దేవలోకం లోంచి చూస్తే ఇందుకు భిన్నమైన దానిగా ఎందుకు దర్శనమిస్తుంది?

ఉచ్ఛేద వాదానికి విరుద్ధంగా ఈ రెండు వాక్యాలు మాత్రమే రాసి ఆపై మౌనం వహించారు అసంగుడు.

**xiii. నాస్తిక వాదం :** దానం – యజ్ఞం ఏమీ అక్కర లేదు. పుణ్యం లేదు. పాపం లేదు. మంచీ లేదు. చెడూ లేదు – అని చెప్పేదే నాస్తిక వాదం.[33]

**xiv. అగ్ర వాదం :** బ్రాహ్మణులు అగ్ర (ఉచ్ఛ, శ్రేష్ఠ) వర్గానికి చెందినవారు. మిగిలిన వారు హీనవర్ణులు. బ్రాహ్మణుడు తెల్లగా ఉంటాడు. ఇతరులు నల్లని వాళ్ళు. బ్రాహ్మణుడు శుద్ధుడు. బ్రాహ్మణేతరులు అశుద్ధులు. బ్రాహ్మణుడు బ్రహ్మ మానసపుత్రుడు. వాడు బ్రహ్మ ముఖం నుండి పుట్టాడు. మిగిలినవారు అలా కాదు... ఇదే అగ్రవాదం.

**ఖండన :** బ్రాహ్మణుడు కూడా అందరిలాగా తల్లి యోని ద్వారానే పుడుతున్నాడు. బ్రహ్మ ముఖం నుండి పుట్టినట్టు ఎక్కడా చూడం. కాబట్టి బ్రాహ్మణుణ్ని బ్రహ్మ మానస పుత్రుడని, అసలుసిసలైన కొడుకనీ, పెద్ద కులం వాడనీ అనడం కుదరదు. కేవలం బ్రాహ్మణ కులంలో పుట్టినంత మాత్రాన బ్రాహ్మణుడందామా? లేక సదాచారం, విద్యా సంపన్నతను బట్టి పెద్ద కులం వాడందామా? కులంలో పుట్టినంత మాత్రానే గొప్పవారైతే – యజ్ఞయాగాల్లాంటి క్రతువుల సమయంలో విద్య, శీల సంపన్నుడైన బ్రాహ్మణుడికే ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు? విద్య, శీలం ఇవే ప్రధానం అయినప్పుడు బ్రాహ్మణ కులంలో పుట్టినవాడే అగ్రవర్ణుడు కానవసరం లేదు కదా! అలా అనడం సరికాదు కదా!

**xv. శుద్ధి వాదం :** సుందరికా అనే నదిలో స్నానం చేస్తే **'శుద్ధి'** కాబడి, చేసిన పాపాలన్నీ పోతాయి అంటారు. అలాగే బాహుదా, గయా, సరస్వతీ, గంగా – ఈ నదుల్లో స్నానం చేసినా పాపాలు పోతాయట. కొందరు ఆ నదుల్లోని నీళ్ళు

పైన చల్లుకుంటే చాలు **'శుద్ధి'** అయినట్లుగా భావిస్తారు. శుద్ధికాడానికి కొందరు కుక్కుర వ్రతం చేస్తారు (కుక్కలా నోటితో తినడం, తాగడం, నమలడం, కూర్చోవడం – మొదలైన పనులు చేసే వ్రతం. చేతులతో ముట్టుకోకుండా ఆహారాన్ని కుక్కలా గతకాలి) అలాగే కొందరు గోవ్రతం, తైలమాసి వ్రతం, నగ్నవ్రతం, భస్మవ్రతం, కాష్ఠవ్రతం (కాష్ఠ = కఱ్ఱ), విష్ఠావ్రతం (విష్ఠ = మలం) – మొదలైన వ్రతాల వల్ల **'శుద్ధి'** అయినట్లు భావిస్తారు – ఇదే శుద్ధి వాదం.

**ఖండన : 'శుద్ధి'** అనేది ఆధ్యాత్మిక (ఆత్మకు సంబంధించిన) తకు చెందింది. స్నానాలు చేసినంత మాత్రాన ఎలా **'శుద్ధి'** జరుగుతుంది.

**xvi. కౌతుక మంగళ వాదం :** సూర్యగ్రహణం, చంద్రగ్రహణం, గ్రహనక్షత్రాల ప్రత్యేక గమనాల్ని బట్టి మంచో, చెడో జరుగుతాయని భావించే వారిని **'కౌతుక మంగళ వాదులు'** అంటారు. వీళ్ళు సూర్యాది గ్రహాల్ని పూజిస్తారు. హోమాలు, జపాలు చేస్తారు. తర్పణలు వదులుతారు. కుంభ (గుగ్గిలం), బిల్వ (మారేడు), శంఖాలు (వాసన గల ద్రవం) అర్పిస్తారు. జ్యోతిష్యులు (గణికులు) చెప్పినట్లు చేస్తారు.

**ఖండన :** మనుషుల శుభాలకు, అశుభాలకు సూర్య, చంద్ర, గ్రహణాది కారణాలే కారణం అంటారా? గ్రహణాల వల్లే సంపదలు కలుగుతాయనీ, కష్ట – నష్టాలు సంభవిస్తాయని అనుకొంటే – ఇక మీ మంచిపనులకు గానీ, చెడ్డ పనులకు కానీ విలువేమిటి? ఆ పనులన్నీ వ్యర్థమైనవేనా? లేక, మీ మంచి చెడ్డ పనులవల్ల కష్ట సుఖాలు కలుగుతాయంటారా... ఇవి గ్రహణాల వల్ల సంభవిస్తాయనడం తప్పుకాదా?

## VI. ఇతర విషయాలు

అసంగుడు పై విషయాలే కాక, స్కంధాలు, ద్రవ్యం, పరమాణువులూ – వీటి గురించి కూడా తన భావాల్ని ప్రకటించారు.

### i. స్కంధాలు:

**A. రూప స్కంధం:** రూప స్కంధం లేదా ద్రవ్య స్కంధం. ఇవి పద్నాలుగు ద్రవ్యాలు.

మహాభూతాలు = 4, (నేల, నీరు, నిప్పు, గాలి)

ఇంద్రియాల విషయాలు = 5 (రూపం, శబ్దం, రసం, గంధం, స్పర్శ)

ఇంద్రియాలు = 5 (కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం)

ఈ మొత్తం ఒక్కోచోట ఎందులోనూ కలువకుండా ఒంటరిగానే ఉంటాయి. ఎలాగంటే –

**వజ్రం, శంఖం, శిల, పగడం** – వీటిలో కేవలం **పృథ్వీద్రవ్యం** (నేల) మాత్రమే ఉంటుంది.

**కొలను, నది, తటాకం, ప్రవాహం** – వీటిలో కేవలం **జలద్రవ్యం** (నీటి) మాత్రమే ఉంటుంది.

**దీపం, ఉల్క** – వీటిలో కేవలం **అగ్ని ద్రవ్యం** (నిప్పు) మాత్రమే ఉంటుంది.

**పైరగాలి, తూర్పుగాలి, పడమరగాలి** – వీటిలో కేవలం **వాయుద్రవ్యం** (గాలి) మాత్రమే ఉంటుంది.

అలాగే – ఒక్కో చోట రెండేసి ద్రవ్యాలు కలసి ఉంటాయి. మంచుగడ్డ, పండ్లు, పూలు, ఆకులు, మణులు – వీటిలో రెండేసి ద్రవ్యాలు ఉన్నాయి. చెట్లు తగలబడేప్పుడు మూడేసి ద్రవ్యాలు కలిసి ఉంటాయి. మన శరీరంలో వెంట్రుకలు మొదలు, మలమూత్రాల వరకూ నాలుగేసి ద్రవ్యాలు కలసి ఉంటాయి.

'టకటకా' అనే శబ్దాల వల్ల **పృథ్వీతత్వం*** తెలుస్తుంది. ప్రవహించడం జలతత్వాన్ని తెలుపుతుంది. మంటలు పైకి లేవడం అగ్నితత్వాన్ని, పైకి వెళ్ళడం అనేది గాలితత్వాన్ని తెల్పుతుంది. ఎక్కడ ఏదేది లభిస్తుందో అక్కడ ఆయా మహాభూతాలు ఉన్నాయని గ్రహించాలి. ప్రతి ఒక్క భూత పదార్థంలో ఇతర భూత పదార్థాలు అంతర్గతంగా ఇమిడి ఉంటాయి. కాబట్టే కట్టెకు రాపిడి కల్గిస్తే అగ్ని పుడుతుంది. (ఇక్కడ 'కట్టె' పృథ్వీతత్వానికి చెందగా, దానిలో అగ్నితత్వం అంతర్నిహితంగా ఉంది). అలాగే – ఇనుము, వెండి, బంగారాల్ని బాగా వేడి చేస్తే కరిగి ద్రవాలవుతాయి.

స్కంధాలలో ఇప్పటివరకు రూపస్కంధం గూర్చి తెలుసుకున్నాం. ఇక, మిగిలిన స్కంధాల గూర్చి చూద్దాం...

**B. వేదన** : మన అనుభవానికి అందే వేదన.

**C. సంజ్ఞా** : గుర్తించడం, గ్రహించడం, తెలుసుకోవడం – సంజ్ఞ

**D. సంస్కారం** : చిత్త సంస్కారాల్ని కల్గి ఉండడం.

**E. విజ్ఞానం** : విజ్ఞానాన్ని గూర్చి ఇంతకు ముందే చెప్పుకొన్నాం.

**ii. పరమాణువులు :** చెట్టుకు విత్తనంలాగా... ద్రవ్యాలకు (పదార్థాలకు) పరమాణువు అలాంటిది. ద్రవ్యాల రూపాలు ఏర్పడానికి, దానిలో దాగి ఉన్న సూక్ష్మమైన పరమాణువులే కారణం. ఈ సూక్ష్మపరమాణువులే స్థూల ద్రవ్యాల్ని నిర్మిస్తుంది. పరమాణువులు సూక్ష్మమైనవి. నిత్యమైనవి. అయితే, అసంగుడు పరమాణువుల సత్యాన్ని ఇలా ఖండిస్తున్నారు. పరమాణువుల వల్ల రూప సముదాయం ఏర్పడదు. ఎందుకంటే... పరమాణువులు ప్రత్యక్ష దర్శనీయాలు కావు. అవి ఊహమీద ఆధారపడినవి మాత్రమే. పరమాణువులు అవయవాలు లేనివి. మరి అవి అవయవాలు కల్గిన పదార్థాన్ని ఎలా ఏర్పరచగలవు? పోతే, అవయవాలు కల్గినది పరమాణువులు అనీ చెప్పలేము. ఎందుకంటే పరమాణువే అవయవం. కాబట్టి పరమాణువుకు వేరే అవయవం ఉండదు. ద్రవ్యానికి మాత్రమే అవయవం వుంటుంది. అలాగే – పరమాణువు నిత్యమైంది అనడమూ సరికాదు. ఎందుకంటే దాని నిత్యత్వాన్ని పరీక్షించి చూపిన వారు ఎవరూ లేరు. 'సూక్ష్మమైంది కావడం వల్ల నిత్యమైంది' అని అనడం కూడా తప్పే. ఎందుకంటే సూక్ష్మమైంది కావడం వల్ల అది, దుర్బలమైంది అవుతుంది. దుర్బలత్వంవల్ల క్షణంలో నశించేదవుతుంది."

## 2. దిజ్నాగుడు (క్రీ.శ.425)

బౌద్ధ దార్శనికుల్లో వసుబంధులాగా దిజ్నాగుడు కూడా సుప్రసిద్ధుడు. ఈ దార్శనిక ప్రవాహంలో దిజ్నాగుని వద్ద ఆగకుండా, ఆతణ్ణి దాటుకుపోలేము. అలా ముందుకు పోవడం సంభవమూ కాదు. ఐతే, నేను ఎటూ ధర్మకీర్తి **ప్రమాణ వార్తికం*** మీద రాయబోతున్నాను. ఈ ప్రమాణ వార్తికం దిజ్నాగుడి **ప్రమాణ సముచ్ఛయం*** అనే గ్రంథానికి వ్యాఖ్యే. తన వ్యాఖ్యలో ధర్మకీర్తి చాలాచోట్ల దిజ్నాగునితో విభేధించినప్పటికీ, తన మౌలిక దృష్టిని స్పష్టం చేశారు. ధర్మకీర్తి గురించి రాసేప్పుడు దిజ్నాగుని గురించి రాయడం జరిగింది. కాబట్టి ఇక్కడ దిజ్నాగుని

గురించి పూర్తిగా రాయడం కేవలం గ్రంథవిస్తారమే కాగలదు. అందువల్ల ఇక్కడ దిఙ్నాగుని గురించి కొద్దిగా చెప్పుకొందాం. దిఙ్నాగుని గూర్చి నేను మరోచోట రాశాను.[34]

దిఙ్నాగుడు (క్రీ.శ.425) వసుబంధు శిష్యుడు. ఈ విషయం టిబెట్టు పరంపరను అనుసరించి తెలుస్తుంది. ఈ పరంపర ఎనిమిదో శతాబ్దంలో భారత దేశం నుండి టిబెట్టుకు వెళ్ళింది. కాబట్టి దీన్ని భారతీయ పరంపర అనవచ్చు కానీ, మనకు లభిస్తున్న చైనా పరంపరలో దిఙ్నాగుడు వసుబంధుని శిష్యుడని ఎక్కడా ఉటంకించలేదు. అలాగని, శిష్యుడు కాదనీ ఖండించలేదు. దిఙ్నాగుని కాలం వసుబంధుకీ, కాళిదాసులకీ మధ్య ఉండొచ్చు. దాని ప్రకారం క్రీ.శ.425 ప్రాంతంలో దిఙ్నాగుడున్నాడని చెప్పడం సరైనదే అవుతుంది. **'న్యాయముఖం'** కాక, దిఙ్నాగుని ముఖ్యగ్రంథం **'ప్రమాణ సముచ్ఛయం'.** ఇది ప్రస్తుతం టిబెట్ భాషలోనే లభిస్తుంది. మహా వైయ్యాకరణుడు, **'కాశికా వివరణ పంజిక'** గ్రంథకర్త, క్రీ.శ.700 ప్రాంతం వాడైన **జినేంద్రబుద్ధ** ప్రమాణ సముచ్ఛయానికి టిబెట్టు భాషలో చక్కటి టీకా కూడా రాశారు.

దిఙ్నాగుడు తమిళనాడులోని **కంచి (కంజీవరం)** సమీపంలో **'సింహవక్ర'** అనే గ్రామంలో ఓ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. పెద్దవాడయ్యాక వాత్సీపుత్రీయ బౌద్ధ సంప్రదాయానికి చెందిన **నాగదత్తుని** పరిచయం కల్గింది. నాగదత్తుని ప్రభావంతో బౌద్ధ భిక్షువయ్యారు.

నాగదత్తుని శిష్యరికంలో విద్యాధ్యయనం చేశారు. అయితే, ఆత్మ(పుద్గల)[35] విషయంలో గురువుగారితో విభేదించి, మరింత జ్ఞానం కోసం ఆ మతాన్ని వదిలి, ఉత్తర భారతం వెళ్ళిపోయారు. అక్కడ వసుబంధు శిష్యుడయ్యారు. అక్కడ న్యాయ శాస్త్రాన్ని (దర్శనాన్ని) అధ్యయనం చేశారు. న్యాయశాస్త్ర చర్చల్లో ప్రతివాదుల్ని ఓడించి, దిగ్విజయ కేతనం ఎగుర వేశారు. అంతేకాదు – **'ప్రమాణ సముచ్ఛయం'** లాంటి మహోన్నతమైన గ్రంథాన్ని రాశారు.

దిఙ్నాగుని ప్రమాణ సముచ్ఛయంలోని పరిచ్ఛేదాలూ (భాగాలు), శ్లోకాలూ (కారికలూ) వాటి సంఖ్య ఈ విధంగా ఉంటుంది.

| పరిచ్ఛేదం | విషయం | శ్లోకాల సంఖ్య |
|---|---|---|
| 1 | ప్రత్యక్ష – పరీక్ష | 48 |
| 2. | స్వార్థానుమాన – పరీక్ష | 51 |
| 3. | పరార్థానుమాన – పరీక్ష | 50 |
| 4. | దృష్టాంత – పరీక్ష | 21 |
| 5. | అపోహ – పరీక్ష | 52 |
| 6. | జాతి – పరీక్ష | 25 |
| | | **247** |

**ప్రమాణ సముచ్ఛయం :** ప్రమాణ సముచ్ఛయం మూల సంస్కృత గ్రంథం ఇప్పటికీ దొరకనే లేదు. నేను నాలుగు సార్లు టిబెట్ వెళ్ళాను. వెళ్ళిన ప్రతిసారీ మూలగ్రంథం కోసం ఎంతో శ్రమించి వెదికాను. కానీ, ఫలితం లేదు. ఐతే, నాలో ఆశ ఇంకా చావలేదు. టిబెట్టులోని ఏమఠంలోనో, స్థావరంలోనో, ఏ విగ్రహాల మాటునో తప్పక ఉండి ఉంటుంది. మూలప్రతి ఏనాటికైనా వెలుగు చూస్తుందన్న ఆశ నాకు ఉంది

తన గ్రంథ ప్రయోజనాన్ని వివరిస్తూ – ప్రమాణ సముచ్ఛయంలోని తొలి శ్లోకంలో దిఙ్నాగుడు ఇలా అన్నారు.[36]

**"జగత్తు హితం కోరేవాడూ, ప్రామాణిక ఉపదేశకుడు అయిన బుద్ధునికి నమస్కరించి, అక్కడా అక్కడా పడి ఉన్న మా సిద్ధాంతాల్ని ఒక్క చోట కూర్చుతున్నాను".**

దిఙ్నాగుడు ఇతర దర్శనాల్ని తీవ్రంగా ఖండించారు. వారిపై తర్కమనే బాణవర్షం కురిపించారు. వాత్స్యాయనుని న్యాయభాష్యాన్ని తుత్తునియలు గావించారు. దిఙ్నాగునికి సమాధానం చెప్పడం కోసం పాశుపత సంప్రదాయ ఆచార్యుడు **ఉద్యోతకర భరద్వాజుడు**, వాత్స్యాయనుడి న్యాయభాష్యానికి **వ్యాఖ్య*** రాయవలసి వచ్చింది.[37]

# 3. ధర్మకీర్తి (క్రీ.శ.600)

**డాక్టర్ శ్చెర్బాస్కీ** (స్టెచర్ బట్స్కి) మాటల్లో చెప్పాలంటే... **"ధర్మకీర్తి భారతదేశ కాంట్".**

ప్రత్యర్థులు కూడా అతని ప్రతిభా పాటవాల్ని వేనోళ్ళ పొగిడేవారు. **'ఉద్యోతకరుడు'** (క్రీ.శ.550) రాసిన **'న్యాయవార్తికా'**న్ని ధర్మకీర్తి తుత్తునియలుగా ఖండించారు.

ఉద్యోతకరుని న్యాయవార్తికానికి టీకా రాస్తూ **వాచస్పతి** (క్రీ.శ.841) ఇలా రాశారు[38] – **"ధర్మకీర్తి అనే తర్క ఊబిలో చిక్కుపడిన ఉద్యోతకరుని న్యాయవార్తికం అనే ముసలి ఆవుని రక్షించి పుణ్యం కట్టుకోడానికి నేను ఈ టీకా రాస్తున్నాను".**

ధర్మకీర్తి గ్రంథాల్ని నిశిత విమర్శకు గురి చేసిన **జయంతి భట్టు** (క్రీ.శ.1000) కూడా ధర్మకీర్తిని **"సునిపుణబుద్ధి"** అనీ, ధర్మకీర్తి ప్రయత్నం **'జగదభిభవధీర'** కమనీ,[39] కీర్తించాడు. దార్శనికుడు అయిన **శ్రీహర్షుడు*** (క్రీ.శ.1192) ధర్మకీర్తి తర్కపథాన్ని **'దురాబాధ'** అంటూ అభినందించాడు. నిజానికి ఆనాటి కంటే ఈనాటి పండితులే ధర్మకీర్తి ప్రతిభాపాటవాల్ని ఎంతో చక్కగా అంచనా వేయగలరు. వైజ్ఞానిక, దార్శనిక ప్రగతిని సాధించిన ఈనాటి సమాజం అతని ప్రతిభను సరిగా గుర్తించగలుగుతుంది.

## I. జీవిత విశేషాలు

ఉత్తర తమిళ ప్రాంతానికి చెందిన చోళ రాజ్యంలోని **తిరుమలై** అనే గ్రామంలో ఓ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు ధర్మకీర్తి. టిబెట్టు గ్రంథాలను బట్టి ఇతని తండ్రి పేరు **కోరునంద**(?) అని తెలుస్తుంది. కొందరు ధర్మకీర్తిని **కుమారిల భట్టు** మేనల్లుడనీ అంటారు. ఒకవేళ ఇదే నిజమైనట్టయితే... మామగారి తర్కాన్ని, మేనల్లుడు తన **'ప్రమాణవార్తికం'**లో ఖండించిన విధానం అద్భుతం. ఆ పరిహాస ప్రక్రియ అమోఘం. దీన్నిబట్టి ధర్మకీర్తి మంచి హాస్యప్రియుడు అయి ఉండొచ్చు.

ధర్మకీర్తి చిన్ననాటి నుండే మంచి ప్రతిభాపాటవాలు కలిగినవారు. చిన్న తనంలోనే బ్రాహ్మణుల వైదిక గ్రంథాల్ని, వేదవేదాంగాల్నీ అధ్యయనం చేశారు. ఆ సమయంలో... భారతదేశంలో బౌద్ధదర్శన ప్రభావం ఎంతో ఉండేది. నాగార్జునుడు, వసుబంధు, దిఙ్నాగుడు – వీరి దర్శన గ్రంథాలు బౌద్ధ వ్యతిరేకుల్లో కూడా ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. ఈ విధంగా ధర్మకీర్తికి బౌద్ధదర్శనాలు చదివే అవకాశం

లభించింది. అయితే... బౌద్ధదర్శన గ్రంథాలు అతణ్ణి ఎంతో ప్రభావితం చేశాయి. ధర్మకీర్తి ఆరోజుల్లో బౌద్ధధర్మ ప్రభావానికిలోనై, బౌద్ధగృహస్థు వేషంలో తిరుగుతూ ఉండే వాడని(?), టిబెట్టులో లభించిన బౌద్ధ గ్రంథాలను బట్టి తెలుస్తుంది. ధర్మకీర్తి అలా బౌద్ధ గృహస్థు వేషంలో తిరుగుతుంటే ఆయన్ని సహకులస్థులు బ్రాహ్మణ సమాజం నుండి వెలివేశారు.

ఆ రోజుల్లో **'నాలందా'** ఖ్యాతి దేశమంతా మారుమ్రోగిపోయేది. ధర్మకీర్తి తన అధ్యయనం కోసం నాలందాకు వెళ్ళారు. ఆనాటి విజ్ఞానవాద దార్శనికుల్లో మేటి అయిన, నాలందా సంఘ ప్రధాన స్థవిరుడు **'ధర్మపాల్'**కు శిష్యుడయ్యాడు. ఆవిధంగా ధర్మకీర్తి బౌద్ధ సంఘంలో చేరారు.

***న్యాయ శాస్త్రం** (తత్త్వశాస్త్రం) అంటే ధర్మకీర్తికి మక్కువ. దిఙ్నాగుని శిష్య పరంపరకు చెందిన **ఆచార్య ఈశ్వరసేనుని** దగ్గర న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేశారు.

విద్యాదశ దాటిన అనంతరం, మిగిలిన జీవితాన్నంతటినీ గ్రంథ రచనలో, గ్రంథ అధ్యయనంలో, పండిత వాదనల్లో గడిపారు.

**i. ధర్మకీర్తి కాలం క్రీ.శ. 600[41] :** చైనా పర్యాటకుడు 'యా-చింగ్' ధర్మకీర్తి గురించి తన గ్రంథాల్లో వర్ణించాడు. కాబట్టి ధర్మకీర్తి క్రీ.శ.679కి ముందరి వాడనే నిర్వివాదాంశం. ధర్మకీర్తి నాలందా విశ్వ విద్యాలయ ప్రధానాచార్యుడైన 'ధర్మపాలు'ని శిష్యుడు. యా-చింగ్ తన రచనలో ధర్మపాలుని శిష్యుడు 'శీలభద్రుడు' అప్పటికి నాలందా విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యునిగా ఉన్నాడని రాశాడు. అప్పటికి ధర్మపాలుని వయస్సు 106 సం॥లు. క్రీ.శ.635 వ సంవత్సరం అది.

యూన్-చాంగ్ రచనలని బట్టి కూడా ఇదే విషయం తెలుస్తుంది. యూన్-చాంగ్ నాలందా వచ్చేటప్పటికే ధర్మకీర్తి మరణించారు. దీనిని బట్టి మనకు తెలిసేదేమంటే ధర్మకీర్తి సమయం క్రీ.శ.600 అని.

## II. ధర్మకీర్తి గ్రంథాలు

ధర్మకీర్తి బౌద్ధ దర్శనంలో ప్రమాణాలకు సంబంధించిన గ్రంథాలు మాత్రమే రాశారు. ఆ గ్రంథాల సంఖ్య తొమ్మిది. వాటిలో ఏడు గ్రంథాలు మూల గ్రంథాలు కాగా, మిగిలిన రెండు గ్రంథాలూ తన గ్రంథాలకు తనే రాసుకున్న **టీకాలు***.

| క్రమ సంఖ్య | గ్రంథం పేరు | గ్రంథ పరిమాణం (శ్లోకాలు) | రచనా ప్రక్రియ (గద్యం, పద్యం) |
|---|---|---|---|
| 1. | ప్రమాణ వార్తికం | $1454^{1}/_{2}$ | పద్యం |
| 2. | ప్రమాణ వినిశ్చయం | 1340 | గద్యం, పద్యం |
| 3. | న్యాయబిందు | 177 | గద్యం |
| 4. | హేతుబిందు | 444 | గద్యం |
| 5. | సంబంధ – పరీక్షా | 29 | పద్యం |
| 6. | వాద – న్యాయం | 798 | గద్యం, పద్యం |
| 7. | సంతానాంతర – సిద్ధి | 72 | గద్యం |
| | | **4314 ½** | |
| | **టీకలు** | | |
| 8. | ***వృత్తి** (ప్రమాణ వార్తికం 1వ పరిచ్ఛేదానికి) | 3500 | గద్యం |
| 9. | వృత్తి (సంబంధం – పరీక్షకు) | 147 | గద్యం |
| | | **3647** | |

ధర్మకీర్తి మూల గ్రంథాలలోని 4314 ½ శ్లోకాలూ, టీకాలలోని శ్లోకాలు 3647 కలసి మొత్తం 7961 ½ శ్లోకాలు రాశారు.[42] ధర్మకీర్తి ఎంతటి కీర్తి ప్రతిష్టలు గలవారో ఈ క్రింది ఒక్క విషయాన్ని పరికిస్తే తెలుస్తుంది. బౌద్ధ న్యాయ దర్శనానికి సంబంధించి, టిబెట్టు భాషలోకి అనువదించుకున్న మొత్తం శ్లోకాలు 1,75,000. కాగా, వీటిలో ధర్మకీర్తి గ్రంథాలకు, **టీకా**లకు చెందిన అనువాద శ్లోకాలు 1,37,000[43]

(ఈ టీకాలు, టీకాకారుల వివరణ ఈ గ్రంథం చివరన ఉన్న అనుబంధంలో ఉంది. చూడండి.)

**i. ప్రమాణ వార్తికం :** నేను ముందే చెప్పాను, ధర్మకీర్తి **'ప్రమాణవార్తికం'** దిఙ్నాగుని ప్రమాణ సముచ్ఛయానికి ఓ స్వతంత్ర వ్యాఖ్యానం అని. ప్రమాణ సముచ్ఛయంలో ఆరు పరిచ్ఛేదాలు (భాగాలు) ఉన్నాయని చెప్పుకొన్నాం. కానీ, ప్రమాణ వార్తికం 4 భాగాల గ్రంథమే. ఈ నాలుగు భాగాలలోని విషయం ఇలా ఉంటుంది.

(1) ప్రమాణ సిద్ధి. (2) ప్రత్యక్షం (3) స్వార్థానుమాన ప్రమాణం (4) పరార్థానుమాన ప్రమాణం. కానీ, ఈ క్రమాన్ని సాధారణంగా ఇలా చెప్తూ ఉంటారు. స్వార్థానుమాన ప్రమాణం, ప్రమాణ సిద్ధి, ప్రత్యక్షం, పరార్థానుమాన ప్రమాణం అని. కానీ ఈ క్రమం సరైనది కాదు.

ప్రమాణ సముచ్చయంలో ఏభాగం ప్రమాణవార్తికంలో ఏయే భాగాలుగా ఉందో ఇప్పుడు చూద్దాం.

| ప్రమాణ సముచ్ఛయం | పరిచ్ఛేదాలు | ప్రమాణ వార్తికం | పరిచ్ఛేదాలు |
|---|---|---|---|
| మంగళాచరణం[44] | 1/1 | ప్రమాణసిద్ధి | 1 |
| ప్రత్యక్షం | 1 | ప్రత్యక్షం | 2 |
| స్వార్థానుమానం | 2 | స్వార్థానుమానం | 3 |
| పరార్థానుమానం | 3 | పరార్థానుమానం | 4 |

ప్రమాణ సముచ్చయంలో మిగిలిన భాగాలు – దృష్టాంతం,[45] అపోహ,[46] **జాతి *[47]** (సామాన్య) పరీక్ష – మొదలైన భాగాల్ని ప్రత్యేకంగా రాయకుండా, ధర్మకీర్తి తన ప్రమాణవర్తనంలోని ఈ నాలుగు భాగాల్లోనే ఇమిడ్చారు.

అలాగే ధర్మకీర్తి మరో గ్రంథం **'న్యాయబిందు'**లో ప్రత్యక్షం, స్వార్థానుమానం, పరార్థానుమానం ఈ క్రమంలోనే భాగాలు ఉన్నాయి. ఇది సరైన క్రమం కూడా. **'ప్రమాణవార్తిక వృత్తి'**లో మనోరథానంది కూడా ఇదే క్రమాన్ని పాటించారు. కానీ, ఇతర భాష్యాలలో, పంజికలలో, టీకాలలో, మూల పాఠాలలో అన్నిచోట్లా స్వార్థానుమానము, ప్రమాణసిద్ధి, ప్రత్యక్షం, పరార్థానుమానం – ఇలా ఈ క్రమాన్ని చూచినప్పటికీ అసలు గ్రంథకారుని యొక్క క్రమం ఇది కాదు. మనోరథానంది సూచించిన క్రమమే సరైనది.

(ధర్మకీర్తి శిష్య పరంపరం ఈ గ్రంథం చివరనున్న అనుబంధంలో ఉంది.)

ధర్మకీర్తి తన ప్రమాణవార్తికంలోని మొదటి భాగానికి ఆయనే స్వయంగా ఒక వ్యాఖ్య రాశారు. ఆయన శిష్యుడు దేవేంద్రబుద్ధి ధర్మకీర్తి రాసిన మొదటి భాగమైన స్వార్థానుమాన భాగాన్ని వదిలి మిగిలిన 2,3,4 భాగాలకు **'పంజిక'*** రాశారు. ఆ తర్వాత ఈ భాగాలకు అనేక వ్యాఖ్యానాలు వచ్చాయి. వాటిలో దేవేంద్రబుద్ధి

పంజిక, ప్రజ్ఞాకర గుప్త రాసిన భాష్యం ప్రముఖమైనవి. మిగిలిన భాష్యకారులకు ఈ రెండు భాష్యాలే ఆధారం. ఈ భాష్యాల్లో ఉన్న భాగాల క్రమాన్ని చూచి అసలు మూలగ్రంథంలోని భాగాల్ని కూడా ఇదే క్రమంలో తీసుకోవడం జరిగింది. మనోరథానంది స్వీకరించిన క్రమాన్ననుసరించే నాకు టిబెట్టు అనువాదాలు, తాళపత్ర గ్రంథాలలో లభించాయి. నేను వాటిని సంపాదించి, అదే క్రమంలో నా సంపాదకత్వంలో వెలువరించ దలిచాను. అలాగే ప్రజ్ఞాకర గుప్తుని ప్రమాణవార్తిక భాష్యాలు సంస్కృతంలో లభించాయి. అది కూడా ప్రకాశానికి సిద్ధంగానే ఉంది. నేను కూడా వారి క్రమంలోనే భాగాలను ఉంచాను.

ప్రమాణవార్తికంలోని అతిముఖ్యమైన అంశాల్ని ముందు ముందు చర్చిస్తాను. అయినప్పటికీ, ఇక్కడ భాగాలు, వాటిలోని ముఖ్య విషయాల్ని ఒక పట్టికగా ఇస్తున్నాను.

(ఈ పట్టికను కూడా ఈ గ్రంథం చివరనున్న అనుబంధంలో చూడవచ్చు.)

## III. ధర్మకీర్తి - దార్శనికత

ధర్మకీర్తి కేవలం న్యాయ (**తత్త్వ***) శాస్త్రం మీద 7 గ్రంథాలు రాశారు. వాటి వివరాల గురించి కొంత చెప్పుకోవాలి. ఈ ఏడు గ్రంథాలలో **'ప్రమాణ వార్తికం'** (1454 1/2 శ్లోకాలు), **'ప్రమాణ వినిచ్ఛయం'** (1340 శ్లోకాలు), **'హేతుబిందు'** (444 శ్లోకాలు), **'న్యాయబిందు'** (177 శ్లోకాలు)– ఈ గ్రంథాలన్నింటిలో చెప్పిన విషయం ఒక్కటే. ఈ గ్రంథాలలో ప్రముఖమైనది ప్రమాణవార్తికం. మరోగ్రంథం **'వాద న్యాయం'**లో ధర్మకీర్తి **అక్షపాదుడు** 18 నిగ్రహ స్థానాల్లో నింపిన విషయాల్ని కేవలం అర శ్లోకంలో చెప్పారు.[48]

**'సంబంధ–పరీక్ష'**లోని 29 కారికలలో ధర్మకీర్తి క్షణికవాదాన్ననుసరించి కార్యాకారణ సంబంధాన్ని ఎలా అంగీకరించవచ్చో తెలిపారు. ఇదే విషయాన్ని ప్రమాణ వార్తికంలో కూడా చూడొచ్చు.

**'సంతానాంతర సిద్ధి'**లోని 72 సూత్రాలలో **'మనో సంతానం'** మరో **'మనో సంతానం'** (సంతానాంతర) లో ఉన్నది అని చెప్పారు. అంటే – మనస్సు ఒక వస్తువు కాదు. అది ప్రతిక్షణం నష్టం అవుతూ ఉంటుంది. మరి, నూతనంగా ఉత్పన్నమవుతూ ఉంటుంది కూడా. ఇక్కడ సంతాన – అంటే ఘటన అని అర్థం.

ఈ విషయాన్ని ఈ సంతానాంతర సిద్ధిలో ఋజువు చేశారు ధర్మకీర్తి. ఆ గ్రంథంలో ఈ మనో విజ్ఞానమంతా ఏ రకంగా కలసి ఈ దృశ్య జగత్తును బయటకు వ్యక్తం అయ్యేలా చేస్తుందో వివరించారు. ఇదే విషయం ధర్మకీర్తి ప్రమాణ వార్తికంలో కూడా ఉంది.

అంటే... ధర్మకీర్తి దార్శనిక దృక్పథాన్ని తెల్సుకోడానికి ప్రమాణ వార్తికం ఒకటి చాలు.

**i. ఆనాటి దార్శనిక పరిస్థితి :** ధర్మకీర్తి, దిజ్నాగుడు – ఇద్దరూ అసంగుని యోగాచార దర్శనాన్ని (విజ్ఞాన వాదాన్ని) అంగీకరించిన వారే. వసుబంధు, దిజ్నాగుడు, ధర్మకీర్తి వంటి ఉద్ధండ బౌద్ధ దార్శనికులు శూన్యవాదాన్ని వదిలి విజ్ఞానవాదాన్ని స్వీకరించడం, మనకు ఒక విషయాన్ని అవగతం చేస్తుంది. అదేమంటే **'హెగెల్'*** కు లాగా వీరికీ తమ తర్కసంబంధ భావాల్ని ప్రకటించుకోవడానికి విజ్ఞానవాదమే అవసరం అయ్యింది. అయితే, ధర్మకీర్తి కేవలం యోగాచార వాది కాదు. సౌత్రాంత్రిక (స్వతంత్ర) యోగాచార వాది. ధర్మకీర్తి సత్తా యొక్క మూలతత్త్వం ఉంటుంది అంటారు. మరి, యోగాచార వాదులు ఆ మూలతత్త్వానికి విజ్ఞానం (చిత్తం, మనస్సు) మూలమంటారు. సౌత్రాంత్రిక యోగాచారులు – క్షణం క్షణం పరివర్తన చెందే బాహ్యప్రపంచ ప్రవాహరూప క్షణికతను అంగీకరిస్తూ, విజ్ఞానం మూలతత్త్వం అని చెప్తారు. సరిగ్గా ఇదే హెగెల్ కూడా చెప్పారు. దీన్ని ఇంకా ఇలా చెప్పుకోవచ్చు – భౌతిక తత్త్వం అనేది విజ్ఞానం (చిత్తం, మనస్సు) యొక్క వాస్తవిక గుణాత్మక పరివర్తన. పురాతన యోగాచార దర్శనంలో కూడా విజ్ఞానమే మూల **తత్వం** అని చెప్పి, దాన్ని రెండుగా విభజించారు. ఒకటి : **'ఆలయ విజ్ఞానం'.** రెండు : **'ప్రవృత్తి విజ్ఞానం'.**

ప్రవృత్తి విజ్ఞానాలు ఆరు. అవి : **చూపు, వినికిడి, వాసన, రుచి, స్పర్శ.** పంచేంద్రియ జ్ఞానాలు – అవి తెలిపే రంగు, ఆకారం మొదలైన విషయాలు, వాటిని గుర్తించే **'మనస్సు'** ఈ ఆరు ప్రవృత్తి విజ్ఞాన భాగాలు. ఈ ఆరు ప్రవృత్తి విజ్ఞానాలతో పాటు క్షణ క్షణ పరివర్తన గతిని కల్గి పుడుతూ గిడుతూ ఒక ప్రవాహంలా సాగే విజ్ఞానాలకు **'గృహం'** లా (ఆలయంలో) ఆశ్రయం కల్పించే విజ్ఞానమే **'ఆలయ విజ్ఞానం'.** ఈ ఆలయ విజ్ఞానంలోనే వెనుకటి సంస్కారాలు, విజ్ఞానాల తాలూకు వాసనలు ఉంటాయి.

అయినప్పటికీ, విముక్తిసేన్, హరిభద్ర, ధర్మకీర్తి లాంటి వాళ్ళు ఈ ఆలయ విజ్ఞానంలో ఆలయ విజ్ఞానంగా ముసుగు వేసుకొన్న ఆత్మవాదం చోటు చేసుకుందని గ్రహించారు. ఈ ఆలయ విజ్ఞానం 'చీకటిలో బాణప్రయోగం లాంటిదనీ, దానిలో ప్రమాదం దాగుందనీ' తెలుసుకొన్నారు.[49] కాగా, ధర్మకీర్తి కూడా తన ప్రమాణ వార్తికం[50]లో **'ఆలయ'** (విజ్ఞానం) అనే శబ్దాన్ని వాడారు. ఐతే, ఈ శబ్ద ప్రయోగాన్ని సాధారణ విజ్ఞానం అనే అర్థంలోనే ఉపయోగించారు తప్ప, అదేదో రహస్యాత్మక అద్భుతశక్తిని తెలియపరచే అర్థంలో వాడనేలేదు.

సంతాన రూపంలో (క్షణికం లేదా విచ్ఛిన్న ప్రవాహ రూపం) ఈ భౌతిక జగత్తు ఉంది అని భౌతిక తత్వ వాస్తవాన్ని అంగీకరిస్తున్నారు. ఐతే దీన్నే పూర్తిగా అంగీకరించ లేక పోతున్నారు కూడా. వాళ్ళు ఈ ధర్మ సంకటంలో పడి కొట్టు మిట్టాడుతున్నారు. సౌత్రాంత్రికులు తమ తర్కంలో క్షణ క్షణం దర్శన మిచ్చే భౌతిక వాస్తవికతను సంపూర్ణంగా స్వీకరిస్తే – ఇంక వారికి మత సంబంధమైన పొరలు విడిపోతాయి. భౌతికవాదులుగా మిగిలిపోతారు. కాబట్టి వారికి సౌత్రాంత్రికులు (స్వతంత్రకులు) అన్న పేరు ఉన్నప్పటికీ భౌతికవాదులు (విజ్ఞానవాదులు)గా పిలిపించుకోవడానికే వారు ఇష్టపడ్డారు.

ఐరోపాలో భౌతికవాదం ఎప్పుడూ మూడుపూలు ఆరు కాయలుగా వర్థిల్లింది అంటే – అక్కడ భూస్వామ్య వ్యవస్థ గర్భం నుండి అభివృద్ధికరమైన వ్యాపార వర్గం, పెట్టుబడిదారీ వర్గం ఉద్భవించినప్పుడు. ఆ వర్గం శాస్త్రీయ పరిశోధనతో తన ఉనికిని చాటుకుంది. ఆ వర్గం అన్ని రంగాల్లో గత కాలం నాటి అభివృద్ధి నిరోధక భావాలను వెనక్కునెట్టి, భౌతిక వాస్తవికతకు చెందిన అభివృద్ధికర భావాల్ని ప్రోత్సహించింది. అప్పుడుగానీ, ఐరోపాలో భౌతికవాద భావజాలం అభివృద్ధి జరగలేదు. ఆరో శతాబ్దంలో ఉన్న అప్పటి భారతదేశానికి – ఐరోపా ఖండంలో వలే వ్యాపార పెట్టుబడిదారీ వర్గం ఏర్పడి, అభివృద్ధికావడానికి ఇంకా 14 వందల సంవత్సరాలు కావాల్సి ఉంది. అయినప్పటికీ – ఆనాటికి ధర్మకీర్తి చేసింది తక్కువేం కాదు. భారతీయ హెగెల్ అనదగిన ధర్మకీర్తి, జర్మన్ వాడైన హెగెల్ (క్రీ.శ.1770–1831) కంటే 12 వందల సంవత్సరాలు వెనుకటివాడు. 18వ శతాబ్దంలో హెగెల్ చెప్పిన సిద్ధాంతాన్ని, దానికి 12 వందల సంవత్సరాలకి మునుపే – అంటే 6వ శతాబ్దంలోనే – ఓ భారతీయ బౌద్ధ భిక్షువు చెప్పడం సాధారణ విషయం కాదు.

*(ధర్మకీర్తిని భారతీయ హెగెల్ అనడం గానీ, భారతీయ కాంట్ అనడం గానీ సరైనది కాదు. హెగెల్‌నే 'జర్మన్ ధర్మకీర్తి' అనడం సబబు – అనువాదకుడు)*

**ii. ఆనాటి సామాజిక పరిస్థితులు :** ధర్మకీర్తి దార్శనిక చింతన కాలం నాటి సామాజిక స్థితిగతులు తెలుసుకొందాం. సామాజిక పరిస్థితులు అనే రక్తమాంసాలకూ, దర్శనానికీ ఎలాంటి సంబంధం ఉండదనీ, అలాగే దర్శనాలు తమకూ సామాజిక స్థితి గతులకూ ఏ విధమైన బాంధవ్యాలు ఉండవని, ఎంత అరచి చెప్పినా – దర్శనం కూడా సామాజిక పరిస్థితులు అనే రక్తమాంసాల నుండి పుట్టిందే. భౌతిక స్థితి గతులకు దర్శనం అతీతం కాదు. వసుబంధు నుండి ధర్మకీర్తి వరకు గల కాలం (క్రీ.శ.400–600)లో భారతదేశంలో దర్శన వికాసం ఎంతో జరిగింది. దార్శనిక రంగంతో పాటుగా కావ్య రచనలు; జ్యోతిషం; శిల్పం, చిత్రకళలు, వాస్తుకళలు కూడా ఎంతో వికాసాన్ని సాధించాయి.[51]

ఈ కాలంలోనే సముద్రగుప్తుని, హర్షవర్ధనుని మహా సామ్రాజ్యాలు వెలిశాయి. దార్శనిక చింతనకు వాటి ప్రోత్సాహాలూ లభించాయి. ఇక్కడ, మహాసామ్రాజ్యాలు అని చెప్పడం, వాటి వెనుక దాగి ఉన్న దారుణాల్ని దాచిపెట్టడం కాదు. అది నా ఉద్దేశ్యం ఏమాత్రం కాదు. అసలు మహాసామ్రాజ్యం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకొంటే ... ఎందరెందరో సామంత రాజులు – ఇంకెందరో సామంత పరివారాలు కలిపి ఒక మహా సామంతను తమ నాయకుడిగా ఒప్పుకోవడం. ఆ నాయకుడు సముద్రగుప్తుడు, హరివర్మ, హర్షవర్ధనుడు ... ఎవరైనా కావొచ్చు. ఆ నాయకుని ఆధీనంలో ఉన్న ప్రజలను సైనిక శాసనంతో పాలించడమే పాలకుల పని. తాము పాలించే ప్రజల్ని తమ అధీనం నుండి పోకుండా చూచుకోవడం, కొత్త కొత్త ప్రాంతాల ప్రజల్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడమే సామ్రాజ్యాల పని. అందుకోసం యుద్ధాలు చేయడమే వారికి ఆయుధం.

రాజులు, చక్రవర్తులు పరోపకారం కోసమో, శాంతిని స్థాపించడం కోసమో పాటుపడరు. తమ రాజ్యాల విస్తరణకి, తమ దోపిడీ పాలన కోసం యుద్ధాలే చేస్తారు. ఈ యుద్ధాలలో పాల్గొనే సైనికులు మాత్రం కూటికి లేని వారే. వారే యుద్ధాల్లో పాల్గొంటారు. సామంతుల కోసం తమ ప్రాణాలు అర్పణ చేసి యుద్ధాల్లో పోరాడతారు. బలిదానం చేస్తారు. వీళ్ళంతా **'కడుపులు ఎండకట్టుకునే'** యుద్ధాలు చేస్తారు.

అయితే, సాధారణ సైనికులపైన ఉండే సేనా నాయకులు, సేనాధిపతులు మాత్రం రాచ కుటుంబాలకు సామంత కుటుంబాలకు చెందినవారే. సాధారణంగా ధనవంతులైన వారికి యుద్ధాలవల్ల మరింత సంపద పోగు పడుతుంది. గొప్ప గొప్ప జీతాలూ... దోపిడీ సొత్తులో భాగాలు... దీని కారణంగా అపార ధన రాశు లకు అధిపతులవుతారు. వీటితో పాటు బహుమతులు, జాగీర్లు, సముద్రంలో వర్షం కుండపోతగా కురిసినట్లు, మరింతగా సొమ్ము వచ్చి పడుతుంది. వీరే కాదు, ప్రజల్లో పని చేసే ఉద్యోగులు కూడా అంతే... ప్రజల దగ్గర లంచాలు గుంజి, ప్రభువుల దగ్గర జీతాలు పొందిందే కాక, జాగీర్లు జాగీర్లకు బహుమతులుగా పొందుతూ ఉంటారు.

ఇది నిజం – ఏమంటే... మనిషి తాను సంపాదించిన సొమ్ముతో తిండికీ, గుడ్డకీ, నిత్యజీవితంలో అవసరమయ్యే ఆభరణాలకీ పెట్టేంత ఖర్చు, కొన్ని శతాబ్దాల వరకూ నిలబడి ఉండే వస్తువుల కోసం ఖర్చు పెట్టడు. అలా అధిక వ్యయంతో నిర్మించిన కట్టడాలు కాలక్రమంలో కాలం క్రూరత్వానికి బలౌతాయి. శిథిలమైపోతాయి. మానవుని అనాగరిక చేష్టలకు ధ్వంసమవుతాయి. బోధగయ, వైద్యనాథ్ మందిరాలూ, అజంతా, ఎల్లోరా గుహా ప్రాసాదాలూ, అలాంటివే. ఇంకా, కాళిదాసు కావ్యాల్లో వర్ణించిన నగరాల వర్ణనలూ, బాణభట్టు తన **'కాదంబరి'** కావ్యంలో వర్ణించిన ఆనాటి జైన నగరం అట్టాలికా రాజప్రాసాదాల వర్ణనలు చూస్తుంటే ఆ రాజసౌధాల నిర్మాణానికి ఎంత డబ్బు ఖర్చు అయివుంటుందో, ఎంత శ్రమ ఖర్చు అయి ఉంటుందో అర్థమవుతుంది. ఇప్పుడు కూడా తిండి, గుడ్డల కంటే విలాసవస్తువుల ధరలే ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ ఈనాడు మనం యంత్ర యుగంలో ఉన్నాం కాబట్టి, వస్తువులు యంత్రాల మీద తయారవడం చేత ఆనాటితో పోలిస్తే చౌకగానే దొరుకుతున్నాయి. అంటే... విలాస భవనాల కోసం గానీ, రాజప్రాసాదాల నిర్మాణాల కోసం ఈనాటికంటే ఆ కాలంలోనే లక్షల రెట్ల మానవ చేతుల శ్రమ అవసరం అయ్యేది.

దీని సారాంశం ఏమంటే – పాలకవర్గాల, సామంత పాలకవర్గాల శారీరక అవసరాల్ని తీర్చడం కోసం, వాళ్ళ విలాస సామగ్రి తయారు కోసం దేశ జనాభాలో పెద్ద సంఖ్య కడుపు కట్టుకొని పాటుపడాల్సి ఉండేది. జనాభాలోని ఎంత మంది కేవలం కొద్ది మంది విలాసాల కోసం శ్రమిస్తున్నారో లెక్క కట్టలేం కూడా – ఇప్పటికి వందేళ్ళ క్రితం కంపెనీ ఆంగ్ల పాలకులు ప్రతి సంవత్సరం మన భారతదేశం

నుండి వారి దేశానికి పంపే ధనాన్ని ఉత్పత్తి చేయడానికి దాదాపు 6 కోట్ల మంది శ్రమ అవసరం అయ్యేది. అంటే ఆనాటి జనాభాలో దాదాపు 4వ వంతు ప్రజలు తమ శ్రమని వారికి ధారాదత్తం చేసేవారన్నమాట. అదీ ఇక్కడ ఉన్న కంపెనీ ఉద్యోగుల ఖర్చులూ, జీతాలూ, వారి ఉద్యోగుల నిర్వహణకు అయ్యే ఖర్చులు పై లెక్కకు మినహాయింపు. (కేవలం వారు తమ దేశానికి పంపే ధనం (ఉత్పత్తులు మొ॥వి) మాత్రమే.

ఆ రోజుల్లో మూడింట ఒక వంతు ప్రజల శ్రమ కేవలం రాజరిక సామంత, పాలక వర్గం కోసం ఖర్చు అవుతూ ఉండేది. అంతే కాకుండా వారి విలాసాలు తీర్చడానికీ, కాముక ప్రవృత్తిని చల్లబర్చడానికి లక్షల సంఖ్యలో స్త్రీలు చట్టబద్ధంగాకాని, చట్టరహితంగా కానీ శరీరాన్ని అర్పిస్తూ ఉండేవారు. పెద్ద సంఖ్యలో దాసీలుగా సేవలు చేస్తుండేవారు. ఇది కాక **'దాసుల'** (బానిస) రూపంలో మనుషుల అమ్మకాలు, కొనుగోళ్ళు నడిబజార్లలో జరిగేవి. ఇది ఆనాడు మనకు సాధారణంగా కన్పించే స్థితి.

దీని అర్థం ఏమంటే – దార్శనిక చింతనలో, కళలు, సాహిత్యాలలో స్వర్ణయుగంగా పేరు తెచ్చుకున్న ఆ యుగం గొప్పతనమంతా సాధారణ ప్రజానీకాన్ని పరతంత్రుల్ని చేసి, వారి చేత పశువుల్లా చాకిరీ చేయించుకొని, వారి శ్రమను దోపిడీ చేయడం మీదే నిలబడింది. హృదయంలేని బానిస విధానం మీదే నిలబడింది అనేది మనం మరచిపోకూడదు. అలాంటి పాశవికమైన అనాగరిక దోపిడీ విధానంలో ఎలాంటి విప్లవాత్మకమైన దార్శనిక భావాన్నైనా కొంత హద్దుల్లో పెట్టుకోవాల్సి ఉంటుంది. హద్దులు దాటి ఆ దుర్మార్గాలని ప్రశ్నించినట్లైతే రాజదండనకు గురికాక తప్పదు. లేదా రాజు తిరస్కారానికైనా గురి కావాలి. పాలక వర్గాల నుండి లభించే దాన దక్షిణలు లభించవు. రాజులు కట్టించిన మఠాలలో దార్శనికులకు స్థానం దొరకదు. ఈనాటి కంటే ఆనాడు రాచరిక వ్యవస్థ కఠినంగా, క్రూరంగా ఉండేది. కాబట్టి రాజ్యవ్యవస్థ గుప్పిట్లో చిక్కకుండా ఉండాలంటే ధార్మిక మార్గం ఒకటే దారి. ఆ మార్గాన్ని పోగొట్టుకుంటే దొంగలూ – తాగుబోతుల కంటే హీనంగా బ్రతకవలసి ఉంటుంది.

ధర్మకీర్తి, నాలందా విశ్వవిద్యాలయ రత్నం. ఆ విద్యాలయానికి పట్టణాల్ని, గ్రామాల్నీ దానంగా ఇచ్చినవారు సామంతులు, రాచరిక ప్రభువులే. ఆనాటి వారి

దానశాసనాలు ఈ నాటికీ తాళపత్ర గ్రంథాల్లో దొరుకుతున్నాయి. **హుయాన్-త్సాంగ్** (క్రీ.శ.640) సమయంలో నాలందా విశ్వ విద్యాలయంలో 10 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులూ ఉండేవారు. మంచినీళ్ళ ప్రాయంగా అంతమంది కోసం పాలకులు ధనాన్ని ఖర్చు పెట్టేవారు. పాలకవర్గం ధాష్టీకంతో సంపాదించిన దాన్ని ఇలా ఖర్చు చేసేవారు. దీన్ని బహిరంగ పరచి రాయడం, ప్రమాణవార్తిక కారుడైన సౌతాంత్రిక వస్తువాది ధర్మకీర్తి మాత్రం చేయగలడా? దానం ఇచ్చే చేతుల్ని నరకగలడా? కాకపోతే... ఈ సామాజిక దుఃఖ రోగానికి కారణం ఆధ్యాత్మికతలో ఉందని ఎలా అంటాడు? సమాజపరమైన కారణాల్ని ముట్టుకోకుండా ఎలా ఉండగలడు? పునర్జన్మలో ఉందని మాత్రం ఎలా చెప్పగలడు? ధర్మకీర్తి **'ఈ విశ్వానికి కారణం ఈశ్వరుడు'** అన్న వాదాన్ని తిరస్కరించాడు. ఈ విశ్వం యొక్క శుద్ధత్వం, మహత్తు దాని క్షణిక పరివర్తనమూ, గుణాత్మక పరివర్తనంలోనే ఉంది అన్నాడు. అయినప్పటికీ పాలక వర్గాల నుండి ప్రమాదం రాకుండా సామాజిక, భౌతిక దుఃఖాలను అభౌతిక (అలౌకికత్వం, పునర్జన్మ) కారణాల్ని చూపెట్టాడు. వాస్తవ కారణాల్ని ప్రక్కన పెట్టాడు.

ఆనాడు ప్రజల్లో మూడింట ఒక వంతు బానిసలు, దాదాపుగా అంతే సంఖ్య గల అర్ధబానిసలూ ఉండేవారు. వీరంతా ధనిక వర్గాల లాభాల కోసం తమ శ్రమ ధారపోసే వారు. ఈ శ్రమంతా సమాజానికి ఉపయోగిస్తే మానవ సమాజాలకు ఎంత మేలు చేకూరేదో! అలాగే సామంత పరివారం, ధనిక శ్రేష్ఠ పరివారం అంతా సోమరులై ఉండకుండా, సోమరితనాన్ని వీడి వారూ తమ శక్తిని శ్రమలో పెట్టగలిగితే – ఆనాటి మానవుల భౌతిక దుఃఖం చాలా వరకు తీరేదనేది ఎంతో నిజం. ఐతే, ఆ వర్గాల సోమరితనాన్ని వదలగొట్టే సమయం కాదది. అసలు అలాంటి ఊహే ఆనాడు అసంభవం కూడా. విచిత్రం ఏమిటంటే – భౌతిక, వాస్తవిక దుఃఖాన్ని తిరస్కరించడం, సోమరిపోతు వర్గం మెడలు వొంచి చాకిరీ చేయించడం కలల్లోని ఊహగానే ఉండింది. కానీ, ఎన్నో కలల ఊహల్ని సుందరమైన భౌతిక వాస్తవిక ఊహలుగా మలచడానికి ఆనాటి దార్శనికులు, మతకర్తలూ పోటీలు పడ్డారు. భౌతిక వాస్తవిక దుఃఖాన్ని భౌతికంగానే పరిష్కరించుకోవడం అనే ఊహ అసంభవమే అయినప్పటికీ, దార్శనికులు సహృదయంతో, నిర్భీతితో ఆ అనుభవాన్నే సూచన ప్రాయంగానైనా చెప్పగలిగితే బాగుండేది. పట్టించుకోకపోవడం వల్లనో, లేదా

శత్రువర్గం దాడి చేసి నాశనం చేయడం వల్లనో, వారి ప్రయత్నం లేదా వారి కృతులు నశించిపోవచ్చు. అయినా, వారి ఆలోచనలు, ఖండన మండనలూ... శతాబ్దాల అంధకారాన్ని చీల్చుకు వచ్చే వెలుగు దివిటీల్లాంటివి. నిజమైన మానవతను దూసుకుంటూ మోసుకువచ్చిన విల్లంబుల్లాంటివి.

**iii. విజ్ఞాన వాదం :** సహృదయులైనవారి మనస్సుల మీద దార్శనిక ప్రభావం ఒక మత్తుమందులా పనిచేస్తుంది. వారు 'భౌతిక వాదాన్ని' మరచిపోయేలా చేస్తుంది. ఎలాగంటే... పగలంతా గొడ్డుచాకిరీ చేసిన కార్మికుని మీద, కష్టాలు తాత్కాలికంగా మరచి పోడానికి పనిచేసే సారాయిలా. మత్తు పదార్థం ఎలా పని చేస్తుందో దార్శనిక విజ్ఞాన వాదం కూడా సరిగ్గా అలాగే మత్తు మందులా పనిచేస్తుంది. అవమానమైన, క్రూరమైన దాసత్వంలో మగ్గుతున్నప్పటికీ మానవుని మెదడూ, అతని ఆలోచనలూ, హృదయమూ – ఎంతో వికాసాన్ని పొందాయి. అంతేకాదు అతని హృదయం సాటి ప్రాణుల పట్ల, తోటి మానవుల పట్ల స్నేహపాత్రమైన ప్రేమ, వాత్సల్యాలనే ప్రదర్శించింది. వేదన చెందటం మనిషి హృదయం యొక్క సహజ లక్షణం. ఇరుగు పొరుగు వారి దీనత్వాన్ని చూచి చలించే లక్షణం ఆ హృదయానికుంది. దుఃఖాన్ని అసత్యం అని ప్రకటించడం ద్వారా ఈ భౌతిక, వాస్తవిక ప్రపంచంలోని అసమానతల్ని కొంతలో కొంతైనా తాత్కాలికంగానైనా తగ్గించ కల్గుతుంది ఈ దార్శనికుల **'విజ్ఞాన వాదం'.**

ఈ దార్శనికుల పని చివరికి ఇదే – **"జగత్తుని వ్యాఖ్యానించడమే. దానిని మార్చటం కాదు."**

ధర్మకీర్తి – బాహ్య జగత్తును, భౌతిక తత్త్వాలనూ అవాస్తవికాలని అంటారు. విజ్ఞానం (చిత్తం) ఒక్కటే అసలైన తత్త్వం (పదార్థం) అని అంటారు.

**A) ఒకే ఒక తత్త్వం, విజ్ఞానమే:** మనం ఒక వస్తువు (వస్త్రాన్ని)ను చూచి నట్లైతే... మనకు దానిలో – దాని రంగు – నీలమో, ఎరుపో, పసుపు పచ్చరంగో కన్పిస్తుంది. అలాగే... పొడవూ, వెడల్పూ, మందం, బరువు, గరుతనం తెలుస్తాయి. వీటిని బట్టే మనం అది వస్త్రం అని గుర్తిస్తాం.[52] ఈ లక్షణాల్ని మినహాయిస్తే, కేవలం ఎర్రని రంగుని మాత్రమే చూచి వస్త్రం అని అనుకోము. ('ఎర్రని రంగు' వస్త్రం కాదు). రంగులాగానే, వెడల్పూ, మందం మొదలైనవి. వీటిని విడివిడిగా

చూచి 'వస్త్రం' అనీ అనలేం. అంటే... ఈ రంగు, పరిమాణాలు అనేవి భౌతిక తత్త్వాలు.[53] ఇవేవీ విడివిడిగా చూస్తే వస్త్రాలు కావు.

మరి ఏది వస్త్రం? ఇంద్రియాలు ఇచ్చిన ఈ జ్ఞానాల ఆధారంగా మనస్సు ద్వారా మనలో కలిగే నిర్ణయాత్మకమైన జ్ఞానమే 'వస్త్రం'. అదే 'విజ్ఞానం'. కాబట్టి విజ్ఞానమే ముఖ్యం. మూలం. భౌతికం కాదు – అంటారు ధర్మకీర్తి.

మన మనస్సులో కూడా జ్ఞానం అనేది పదే పదే ఇంద్రియాలు కల్గించే జ్ఞానం మీదే ఆధారపడి ఉంటుంది. ఈ రంగు కల్గినది, ఈ పొడవు కల్గినది, ఈ వెడల్పు కల్గినది, ఇంత మందం ఉండేది, ఇంత బరువు ఉండేది, ఇంత నునుపుగా ఉండేది – ఇదిగో వీటన్నింటినీ కలగలిపిన జ్ఞానమే వస్త్రం. ఇలా ఇంద్రియాలు మనస్సుకిచ్చిన మొత్తం సామగ్రి ఆధారంతో ఇది 'వస్త్రం' అనే నిర్ణయం కలుగుతుంది. అంటే ఇక్కడ ఇంద్రియాల భౌతికతత్త్వం చిరునామాలు ప్రత్యేకంగా ఉండవు. దీనిపై ధర్మకీర్తి ఇంకా ఇలా విశ్లేషిస్తున్నారు. "భౌతిక పదార్థాన్ని గురించి విశ్లేషిస్తూ పోతున్న కొద్దీ పదార్థం చిన్న చిన్న భాగాలుగా విడిపోతూ ఉంటుంది. రంగు, పరిమాణం, స్పర్శ... ఇలా ప్రత్యేక రూపాలుగా విభజించబడుతుంది.[54] ఇలా విభజించాక ఇక 'వస్త్రం' అనేదే లేకుండా పోతుంది. ఐతే, విజ్ఞానం ద్వారా మనస్సులో నిలిచి ఉన్న 'వస్త్రం' మాత్రం అలానే నిలిచిపోయి ఉంటుంది. అంటే దాని 'విజ్ఞాన రూపం' అలాగే ఉండిపోతుంది. కానీ, భౌతికతత్త్వం నిలబడలేదు. కాబట్టి విజ్ఞానమే అసలైన తత్త్వం."

**B) చైతన్యం, భౌతికతత్త్వం – విజ్ఞానం యొక్క రెండు రూపాలు:** విజ్ఞానం లోపలా, విజ్ఞానంతో కలిసే ఉంటుంది **'చిత్తం'**. సుఖ దుఃఖాల్ని స్వీకరించేది అదే – అని మనకు తెలుసు. కానీ, పైకి కన్పించే బాహ్యతత్త్వం (కుండ, వస్త్రం) కూడా ఉంది. ఇవి విజ్ఞానానికి భిన్నమైనవి కావు. అవి విజ్ఞానానికి రెండో వైపు మాత్రమే. కానీ, ఇవి విజ్ఞానానికి బాహ్యములైనవిగా, విభిన్నాలైనవిగా కన్పిస్తాయి.[55] దీనిని బట్టి తెలిసేదేమంటే – ఒక విజ్ఞానం – అంతరంగంలో (చిత్త రూపంలో) సుఖదుఃఖాల్ని గ్రహించేదిగానూ, పైకి కన్పించే ప్రపంచంలో బయటకు ఇంద్రియాలకు కన్పించే కుండ, వస్త్రం లాంటి గ్రహించబడే పదార్థం గానూ ఉంటుంది. కాబట్టి రెండు అవస్థలూ – విజ్ఞానం యొక్క రూపాలే అవుతాయి. అలా అయితే, ఉన్నది మొత్తం విజ్ఞానమే అయినప్పుడు, చైతన్యమూ, భౌతిక తత్త్వమూ – అనే రెండు రూపాలుగా

ఎందుకు ఉండాలి? దీనికి ధర్మకీర్తి సమాధానమిది – “విజ్ఞానం రెండు రూపాలుగా – అంటే ‘గ్రహించబడేది’ (బాహ్య పదార్థాల ‘రూపం... పరిమాణం’ మొదలైన విషయ పరిజ్ఞానం)” గా, ‘గ్రహించేది’ (అంతరంగిక చిత్తంలో కలిగే జ్ఞానం) గా – రెండు విధులుగా ఉంటుందనేది సత్యం కాదు. భ్రమ మాత్రమే. ఈ రెండింటింలో ఏ ఒక్కటి లేకపోయినా రెండోది ఉండదు. ‘గ్రహించేది’ (చిత్తం) లేకపోతే ‘గ్రహించబడేది’ (కుండ) ఉందని ఎలా చెప్పగలం? అలాగే ‘గ్రహించబడేది’ (కుండ) లేకపోతే ‘గ్రహించేది’ (చిత్తం) ఎలా ఉంటుంది? – కాబట్టి విజ్ఞానం మాత్రమే నిజమైనది. ఆ విజ్ఞానానికి ‘గ్రహించేది’, ‘గ్రహించబడేది’ అనేవి భ్రాంతి రూపాలు మాత్రమే. ఈ రెండూ నిరాకార విజ్ఞానం యొక్క రెండు రూపాలు. ఇది మొదటే చెప్పుకొన్నాం. పైకి కన్పించే లక్షణాల ద్వారానే భౌతిక పదార్థాల్ని గుర్తించగలం. ఈ పైకి కన్పించే లక్షణాలు ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు నిరాకార జ్ఞానంలో భాగాలైనప్పుడు – బాహ్య పదార్థం సమస్తమూ నిరాకారమే అవుతుంది.[56]

ఒకవేళ బాహ్య పదార్థం వస్తు సత్తాని స్వీకరించక పోయినట్లైతే, అది పదార్థ తేడాలని కూడా స్వీకరించకూడదు. ఒకవేళ స్వీకరిస్తే ‘ఇది కుండ’ ‘ఇది వస్త్రం’[57] అని ఎలా చెప్పగలం? అనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది.

దానికి సమాధానం – “ఇది కుండ”, “ఇది వస్త్రం” అనే జ్ఞానం పైకి కన్పించే లక్షణాల వల్ల కల్గుతుందని అనుకోవడం పొరపాటు. ఈ జ్ఞానం అప్పటికే చిత్తంలో ఉండాలి. అంటే చిత్తంలోని **వాసనల** (పూర్వ సంస్కారాల) వల్లే కలుగుతుంది. వస్తు పరమైన జ్ఞానం ఆ చిత్తాన్ని మేల్కొలుపుతుంది. మేల్కొన్న ఆ పూర్వ సంస్కారాల వల్లే బాహ్య పదార్థాల్లోని తేడాలను (ఇది కుండ, ఇది వస్త్రం అనే తేడాలు) గ్రహించే తత్వం ఉత్పన్నమవుతుంది. అంతేగాని బాహ్య పదార్థాల వల్లే తేడాలను గుర్తించగలగడం లేదు.”[58]

*(గ్రహించేది మనస్సు. గ్రహింపబడేవి బయట ప్రపంచంలోని వస్తువులు – మనం ఒక వస్తువుని చూస్తాం. ఆ వస్తువు రంగు, వాసన, ఆకారం, దాని ఇతర లక్షణాలను మనం గ్రహిస్తాం. ఈ గ్రహించిన విషయాలను మనస్సులోకి చేరతాయి. అక్కడ అవి నిలచిపోతాయి. మనం మరలా ఇంకోసారి అలాంటి వస్తువునే చూచినప్పుడు ఆ వస్తువు ‘ఫలానా వస్తువు’ అనే విషయం గుర్తుకు వస్తుంది. ఈ గుర్తుకు రావడమే వాసనలు లేదా పూర్వ సంస్కారాలు.*

*అంతకుముందు ఎప్పుడూ జామకాయను, మామిడికాయను చూడని ఒక పిల్లవాడికి ఇవి ఏమిటి? అని అడిగితే వాటి గురించి చెప్పలేడు. అంటే వాటికి చెందిన పూర్వజ్ఞానమేదీ అతనికి లేదన్నమాట. వాటి గురించి అతను చెప్పాలంటే తప్పనిసరిగా అతనికి వాటి జ్ఞానం అంతకుముందే తెలిసి ఉండాలి. అది లేదు కాబట్టే వాటి గురించి చెప్పలేకపోయాడు. ఇప్పుడు మనం వాటి గురించి వివరాలు చెబితే... వాటిని గుర్తుంచుకొని, ఇక ముందు ముందు వాటి గురించి చెప్పగలడు. అలాగే వాటి భేదాలు కూడా.*

*మనం రాత్రిపూట ఆకాశంలో చూస్తే నక్షత్రాలు కన్పిస్తాయి. మామూలుగా అందరూ వాటిని చూస్తూనే ఉంటారు. కాని వాటిలో కొన్ని నక్షత్రాలు, కొన్ని గ్రహాలు ఉంటాయి. వాటి భేదం సాధారణంగా అందరికీ తెలియదు. అన్నీ ఒకే విధంగా మెరుస్తూ కన్పిస్తున్నా తెలిసిన వారికి వాటిలో భేదాలు కన్పిస్తాయి. మినుకు మినుకు మనేవి నక్షత్రాలనీ, అలా అననవి గ్రహాలనీ గుర్తించగలుగుతారు.*

*అంటే... వాటిలో భేదాల్ని గ్రహించకల్గిన వారే వాటి తేడాల్ని తెలుసుకోగలరు. మాములు కంటితో చూస్తున్నా మన మనస్సులో వాటి తేడాల్ని గుర్తించలేకపోతే, ఆ రెండూ ఒకటిగానే, తేడాలు లేనివిగానే కన్పిస్తాయి. కాబట్టి తేడాలనేవి బాహ్య పదార్థ లక్షణాలు కావు. మన మనస్సులోని వాసనలే.*

*అలాగే... ఇంగ్లీషు అక్షరాలైన "W" "M" ల తేడా కూడా – అనువాదకుడు)*

"బాహ్య పదార్థ జ్ఞానం కలగడం కోసమే, ఒకే విజ్ఞానం బయట పదార్థాల్లాగా, లోపల చిత్తంగా వేరైనట్లు కనపడుతుంది. అలా అనుకోవడం వల్లే – (విజ్ఞానం రెండుగా విభజింపబడినట్లు అనుకోవడం వల్లే) స్వయం అనుభూతిని పొందగలుగుతున్నాం. ఈ **'స్వయం సంవేదన'** మనలో అంతరంగిక జ్ఞానం యొక్క సాక్షాత్కారం.[59]

మరో ప్రశ్న ఉదయిస్తుంది – ఏమంటే... "లోపల ఉన్న విజ్ఞానం కుండగా, వస్త్రంగా ఎలా ఇంద్రియ ప్రత్యక్షం కాగలదు?"

దీనికి సమాధానంగా – ఇది "ఒక వ్యక్తిని హిప్నోటైజ్ చేస్తే ఆ వ్యక్తి కండ్లకు చిల్లపెంకులు రూపాయిల్లా కన్పిస్తాయి. అలాగే... అసలు విజ్ఞానానికి నకలుగా భౌతిక రూపాలు ఇంద్రియ ప్రత్యక్షం కావొచ్చు.[60]

ఈ విధంగా బయటా, లోపలా ఒకే విజ్ఞానం ఉందంటారు ధర్మకీర్తి. అంతేకాదు – తత్త్వజ్ఞానులు – మదపుటేన్గుల్లా కళ్ళు మూసుకుని భౌతిక తత్త్వాలనే పరిగణనలోకి తీసుకొంటారు[61] అని కూడా అంటారు.

## iv. క్షణిక వాదం

"బుద్ధుని దర్శనంలో **'అంతా అనిత్యతే'** అనే ఈ సిద్ధాంతానికి చాలా ప్రాధాన్యం ఉంది అని చెప్పాను. దీన్నే ఆ తరువాతి దార్శనికులు **'క్షణిక వాదం'** అన్నారు. ధర్మకీర్తి దీని మీద వ్యాఖ్యానిస్తూ – "ప్రతిదీ నశించే తత్వం కల్గిందే"[62] అన్నారు. దీనినే **'జ్ఞానశ్రీ'** (క్రీ.శ.700) ఇలా అన్నారు. "ఏదైతే ఉన్నదో అది క్షణికమైనది."[63]

"అన్ని సంస్కారాలూ (ఉత్పన్న పదార్థాలన్నీ) అనిత్యాలే" అన్నారు బుద్ధుడు. ఈ బుద్ధ వచనాన్ని చూపి ధర్మకీర్తి ఇలా అన్నారు "ఏవైతే పుడతాయో... అవి నశిస్తాయి."[64] అనిత్యం అంటే ఏమిటి? అనే దానికి ధర్మకీర్తి "మొదట ఉండి, ఆ తరువాత ఉండలేదో – అది **అనిత్యం***" అని అన్నారు.[65]

ఏలాంటి అనుమానం లేకుండా "క్షణికతానియమం పదార్థాలన్నింటిలో ఉంటుంది" అంటారు ధర్మకీర్తి.

## v. పరమార్థ సత్తా – వ్యాఖ్య

'క్షణక్షణం మారే ఈ జగత్తు వెనుక మారని ఒక తత్త్వం ఉంటుంది.' అనేది యవన దార్శనికుడు ప్లేటో, మరియు ఉపనిషత్ దార్శనికుల అభిప్రాయం. ఈ మారని తత్త్వాన్నే పరమార్థతత్త్వం లేదా పరమార్థ **సత్తా** అంటారు. ఐతే బౌద్ధ దర్శనం ఇంద్రియాలకూ, బుద్ధికీ అందనిదాన్ని దేన్నైనా అంగీకరించాల్సిన అవసరం లేదు అంటుంది.

ఈ పరమార్థ తత్త్వంపై ధర్మకీర్తి ఇలా చెప్పారు. –

"యోగ్యత కల్గినవే పరమార్థ సత్తాలు. వీటికి వ్యతిరేకమైనవి (అయోగ్యమైనవి) కాల్పనిక (కల్పించుకొన్న) పరమార్థాలు" –[66]

ఉదాహరణకు – కుండ – వస్త్రం అనేవి పరమార్థ సత్తాలు. ఎందుకంటే అవి క్రియను జరుపుతూ. కుండ నీళ్ళకు, వస్త్రం చలి నుండి రక్షణకు ఉపయోగపడతాయి. కానీ, ఘటత్వం (కుండతత్త్వం), వస్త్రత్వం అనే సామాన్య (జాతి) తత్త్వాలు ఊహలు,

లేదా కల్పనలు. 'కుండత్వం' అనేది జాతి రూపం. ఒక పదార్థం కాదు. అలాగే 'వస్త్రత్వం' అనే జాతి రూపం కూడా పదార్థం కాదు. ఎందుకంటే వాటికి అనుక్రియలు ఉండవు. అంటే... కుండత్వంతో నీళ్ళు తేలేము. వస్త్రత్వంతో చలి ఆపుకోలేము. కాబట్టి వాటి ఈ సామాన్యతత్త్వమే కాల్పనికమైనది. కేవలం కల్పించుకొన్నది. ఇదే పరమార్థసత్తు --"[67] (అంటే పారమార్థికత ఊహాజనితం మాత్రమే అనేది ధర్మకీర్తి అభిప్రాయం).

## vi. నాశానికి కారణం లేదు

క్షణికత్వం అన్ని పదార్థాలకూ ఉంటుంది. ఇది వాటి స్వభావం. అందువల్ల నాశం కూడా స్వాభావికమే. నాశానికి ఏదైనా ఒక కారణం గానీ, లేక అనేక కారణాలు కానీ అవసరం లేదు. దీనర్థం ఏమంటే నాశానికి కారణం లేదు. పదార్థాల పుట్టుకకు కారణం గానీ, కారణాలు (హేతు సామాగ్రి) గానీ అవసరమవుతాయి. హేతువుల కారణంగా అంతవరకు ఉండనటువంటి ఒక పదార్థం (భవం) ఉత్పన్నమవుతుంది. ఒక వస్తువు నశించడం, మరో వస్తువు ఉత్పన్నం కావడం – సరిసమానంగా జరుగుతూ ఉంటాయి. కాబట్టి మనం ఒక పొరపాటు అభిప్రాయంతో ఉంటాము. 'కారణాన్ని' పుట్టే వస్తువుకు అన్వయించకుండా, నాశనమయ్యే వస్తువుకు అన్వయిస్తాము. ఈ తత్త్వాన్ని ఋజువు చేస్తూ ధర్మకీర్తి ఈ విధంగా చెప్పారు.

**A. అభావ రూప నాశానికి హేతువు అవసరం లేదు :** "ఏదైనా ఒక కార్యం ఉంటే దానికి కారణం ఉంటుంది. నాశం వస్తువు కాదు. అంటే అది అభావరూప పదార్థం. కాబట్టి నాశానికి కారణంతో పని లేదు. అంటే హేతువు అవసరం లేదు.[68]"

"**కార్యం** (కారణం చేత ఉత్పన్నమైనది) అనిత్యం. అకార్యం (కారణం చేత ఉత్పన్నం కానిది) అవినాశనం, అంటే నిత్యం. వస్తువు నాశం ఎల్లప్పుడు ఉంటుంది. కాబట్టి అకార్యాలు అహేతుకం. అహేతుకాలయితే వాటి నాశం స్వభావ సిద్ధం.[69]" కాబట్టి ఆ అహేతుకాల నాశం కొరకు హేతువు అవుసరం లేదు.

**B. నశించినా, నశించకపోయినా ఈ రెండు స్థితుల్లోనూ భావ నాశానికి కారణంతో పనిలేదు :** ఒక వేళ మనం ఒక దానిని 'నశించదు' అని అంగీకరిస్తే – అది మరో కారణం చేత నాశమైంది' అని అనము. ఎందుకంటే మొదటగానే

దాన్ని 'నశించదు' అని అంటున్నాం కదా! ఇక, దానిని 'నశించనిది' అని అనుకుంటే – ఇక, అప్పుడు కూడా అది నశించడానికి ఇతర కారణాలతో పనేముంటుంది.[70]

ఏదైతే స్వయంగా నశించదో దాన్ని నిలబెట్టడానికి వేరే కారణం అవసరం లేదు. అలాగే... అది నశించేది అనుకుంటే దాని నాశానికీ కారణంతో పని లేదు. ఎందుకంటే అదే స్వయంగా నాశనమవుతుంది కనుక. కాబట్టి నశించేదైనా, నశించనిదైనా – పదార్థాల నాశానికి కారణంతో పనిలేదు.[71]

**a. భావ (వస్తు) స్వరూపానికి నాశం వేరైనదీ, లేదా వేరుకానిదీ కావొచ్చు. ఈ రెండు స్థితుల్లోనూ కారణంతో పని లేదు :** కట్టెకు నిప్పు అంటుకుంటుంది. మనం కట్టె నాశాన్ని చూస్తాం. అలాగే బూడిద, బొగ్గుల ఉత్పత్తినీ చూస్తాం. దీన్ని మనం వ్యవహారికంగా 'నిప్పుకట్టెను కాల్చేసింది', లేదా 'నష్టపరచింది' అంటాం. కానీ, నిజానికి మనం ఏమనాలంటే –

నిప్పు – 'బూడిదనూ, బొగ్గునూ ఉత్పన్నం చేసింది' అనాలి. కానీ అలా అనం. ఎందుకంటే మన దృష్టిలో బొగ్గు, బూడిదల కన్నా కట్టే విలువైనది. ముఖ్యమైనదీ. అందుకే మనం మన మాటల్లో మనకు ఉపయోగకరమైన దాన్ని 'పోగొట్టుకున్నాం' అనే చెప్తుంటాం. దానికే ప్రాధాన్యతనిస్తాం.

ఒకవేళ బూడిద, బొగ్గులు కట్టెకన్నా ఎక్కువ ఉపయోగకరమైనవి అయితే, 'నిప్పు కట్టెను నాశనం చేసింది' అని అనేచోట 'నిప్పు వల్ల బూడిదను, బొగ్గును తయారు చేశాం' అనే అంటాం.

అడవుల్లో పని చేసే కూలీలు కట్టెల్ని కాల్చి బొగ్గుల్ని చేసి అమ్ముతుంటారు. వారికి కట్టెల్ని అమ్మడం కంటే బొగ్గులుగా అమ్మడమే లాభదాయకం. అక్కడికి వెళ్ళి వాళ్ళను మీరు 'ఏంచేస్తున్నారు?' అని అడిగితే వాళ్ళు 'మేము బొగ్గుల్ని తయారు చేస్తున్నాం' అనే అంటారు.[72]

అలాగే ....

లోహపు కార్ఖానాలలో ఇనుపరాతిని కాల్చి, నాశం చేసి ఇనుమూ, ఉక్కునూ తయారు చేస్తారు. ఐతే, ఇనుపరాతి యొక్క నాశం స్వాభావికంగా (అహేతుకంగా) సహజంగా జరిగేది కాబట్టి దాని విషయం ప్రస్థావన చేయరు. ఈ ఏడాది ఇన్ని

లక్షల మణుగుల ఇనుప ఖనిజాన్ని తయారు చేస్తున్నాం" అంటారు తప్ప "ఇన్ని లక్షల మణుగుల ఇనుపరాతిని కాల్చాం" అని అనరు.

ఇదే విషయాన్ని ధర్మకీర్తి అర్థమయ్యేట్లు చెప్పడానికి ప్రయత్నించారు.

నిప్పు (కారణం, హేతువు) ఏంచేస్తుంది? ఇది ప్రశ్న. దానికి జవాబులు ఇవి: కట్టె నాశనమా? లేక బొగ్గు ఉత్పత్తా? సహజంగానే అనేస్తారు 'కట్టె నాశనం' అని. అంటే 'కట్టెను నాశనం చేస్తుంది' అని. అప్పుడు మరో ప్రశ్న వస్తుంది. నాశం అనేది కట్టెకు సంబంధంలేనిదా? సంబంధించిందా? అంటే కట్టెకు వేరుగా ఉంటుందా? లేక కట్టెలోనే ఉంటుందా? వేరు వేరు కావు, సంబంధించిందే అనుకుంటే – నాశమూ, కట్టె రెండూ ఒకటే అవుతాయి గదా! కాబట్టి నిప్పు నాశం చేయలేదు. అంటే కట్టె నాశం కాలేదన్నమాట. మరి నాశం కానప్పుడు కట్టె కనిపించాలి కదా! ఒకవేళ నిప్పు నుండి 'నాశమనే' వస్తువు ఉత్పన్నమైంది, దానివల్ల కట్టె నశించింది, అందుకనే కన్పించడం లేదు అనవచ్చు. అప్పుడూ మరోప్రశ్న పుట్టుకొస్తుంది -- వినాశమనే ఒక పదార్థం వల్ల, కట్టె అనే మరో పదార్థం ఎలా నాశమవుతుంది? వినాశం అనేది భావ రూపమైన వస్తువు అనుకుంటే కాలిన తర్వాత కట్టెను మనం ఎందుకు చూడలేము? అంటే... వినాశం భావరూప వస్తువు కాదు.

**b. వినాశం, ఒక వేరైన భావరూప వస్తువు అని భావించడానికి వీలులేదు:** వినాశం ఓ ప్రత్యేకమైన భావరూప పదార్థం. నాశం అనే మరో భావరూప పదార్థంతో కప్పి ఉంచడం వల్ల 'కట్టె' కనబడడం లేదు – అని అనుకోవడం కూడా సరైనది కాదు. భావ రూపనాశమనే పదార్థం కట్టెను కప్పి ఉంచడానికి ఏవిధంగానూ వీలులేదు – ఎలాగంటే నాశమే కప్పేసింది అనుకుంటే... అది ఆ వస్తువుకు పైతొడుగు అవుతుంది. అలాంటి స్థితిలో 'నాశం' నాశం కాకుండా పోతుంది. పైన కప్పిన తొడుగును నాశం అని ఎలా అనగలం. అది నాశమే కానప్పుడు నాశనం ఎలా చేయగలదు? ఈ విధంగా కట్టెను, అగ్ని నాశనం చేసింది అనలేము.[73]

ఒకవేళ అగ్ని నాశాన్ని పుట్టించింది అనుకొంటే – అదీ సరైనది కాదు. ఎందుకంటే 'అది ఉత్పన్నం అయ్యింది కాబట్టి – ఇక దాన్ని నాశమూ, నాశమానమూ అనాల్సిందే. ఎందుకంటే ఉత్పన్నమైంది తప్పక నాశనమవుతుంది కదా! నశించి పోతుంది కదా! దానికి ఆవరణగా ఉన్న నాశం – నాశమైనప్పుడు కట్టె కన్పించాలి కదా!

ఇప్పుడు మరో రకంగా చూద్దాం.

"నాశ రూపమైన భావ పదార్థం – కట్టె యొక్క హంతకి" అనుకుందాం. ఎలాగంటే ... ఒక ఉదాహరణ చూద్దాం.

"రాముడు శ్యాముని చంపెను. లేదా శ్యాముని నాశనం చేసెను. లేకుండా చేసెను. ఆ తరువాత న్యాయాధిపతి 'రామునికి ఉరిశిక్ష విధించెను'. ఇక్కడ – రాముణ్ణి ఉరితీసినంత మాత్రాన అంటే నాశనాన్ని నాశనం చేసినంత మాత్రాన, చనిపోయిన శ్యాముడు తిరిగి జీవించడు – అలాగే ఇక్కడ... 'నాశనం' చెందిన నాశం నాశనమైనప్పటికీ, కట్టె తిరిగి తన అస్తిత్వంలోకి రాదు గదా! కానీ, ఈ ఉదాహరణ సరైనది కాదు. హంతకుడైన రాముడు, శ్యాముని మరణం కాదు.[74] శ్యాముని మరణం అతని ప్రాణం, ఇంద్రియాలు నశించడం వల్ల కల్గింది. ఒకవేళ శ్యాముని ప్రాణాల్ని, ఇంద్రియాల్ని, నాశం నుండి తొలగించి నట్లైతే ... శ్యాముడు తప్పక బతికి వస్తాడు. అయితే ఇక్కడ మనం నాశమనే పదార్థాన్ని కట్టె మరణం అంటున్నాం. కనుక నాశ పదార్థం నాశమయ్యాక కట్టె తిరిగి ఉనికిలోకి రావాల్సి ఉంటుంది.

**C. 'నాశం ఒక వేరుకాని భావరూపమైన వస్తువు' అని అంగీకరించడం సరికాదు :** వినాశమనే భావరూప వస్తువు కట్టెకు సంబంధించిందని అంగీకరించితే– ఇక అప్పుడు కట్టే నాశమవుతుంది. నాశమే కట్టె అవుతుంది. ఇలా ఈ కట్టె – నాశాలు రెండూ అసత్తులు (అభౌతికాలు) అవుతాయి. అందువల్ల అగ్ని నాశానికి కారణం కాలేదు.

నాశం, కట్టెలు వేరు వేరైనవి, లేక, ఒకటే అని అంగీకరించగలం. దీని విషయం ఏమంటే – పై రెండు స్థితుల్లోనూ నాశానికి హేతువు (కారణం)తో పనిలేదు. అందువల్ల నాశం అహేతుకమైనది.

నాశం కారణం లేనిది అని భావిస్తే అది, అనిత్యం కాదు, నిత్యం అవుతుంది. మరప్పుడు భావము (కట్టె), నాశమూ కలిసే ఉంటాయని అంగీకరించవలసి ఉంటుంది. ఇలాంటి అనుమానమే తప్పు. ఎందుకంటే నాశమనేది అసత్ పదార్థం. అసత్తు, అభావం. మరి, అది నిత్యం, అనిత్యం ఎట్లా అవుతుంది? నిత్యం, అనిత్యం అనేది భావము (పదార్థం)నకే ఉంటుంది.[75] అభావానికి ఉండదు.

"గాడిద కొమ్ములు" – వలే. (గాడిద కొమ్ములు అసత్ పదార్థం. అవి అసలు ఉండనే ఉండవు. మరి వాటికి నిత్యత, అనిత్యత అనేదే ఉండదు).

## vii. కారణ సమూహవాదం

'కార్యం' ఒక కారణం చేత పూర్తి కాదు. అది అనేక కారణాలు ప్రోగైనప్పుడు మాత్రమే పూర్తవుతుంది. అంటే కారణ సామాగ్రి చేతే కార్యం ఉత్పన్నమవుతుంది. దీని అర్థం ఏమంటే – అనేక కారణాలు కలసి ఒక కార్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. **ఈ సిద్ధాంతం ద్వారా బౌద్ధ దార్శనికులు జగత్తుని ప్రయోగ పూర్వకంగా ఋజు పర్చడానికి, వస్తు స్థితిని తెల్పడానికి, సృష్టికి కర్త ఈశ్వరుడు అనే వాదాన్ని తిరస్కరించడానికి ఉపయోగించారు.** అంతేకాదు – స్థిరతావాదాన్నీ ఖండిస్తున్నారు. స్థిరతావాదం (ఈశ్వరుడు కానీ, పరమాణువు కానీ) కారణ సామాగ్రి లేకుండా అస్తిత్వంలో ఉండజాలవు. మరి, క్షణిక వాదం మాత్రమే కారణ సమూహాన్ని ఒప్పుకుంటుంది.

"ఒక వస్తువు (కార్యం) ఏదైనా ఒకే ఒక్క కారణం చేత ఉత్పన్నం కాలేదు. కారణ సామాగ్రి అనేకం పోగు అవడం చేత (అనేక కారణాలు) కార్యం ఉత్పన్న మవుతుంది".[76]

'కార్యాల స్వభావాల్లో (స్వరూపాలలో) ఉండే భేదం ఆకస్మికం కాదు. ఆ భేదాలు కారణ సామగ్రిలోనే ఉండి కార్యానికి లభిస్తాయి. కార్యం – కారణ సామగ్రితో కాకుండా వేరే ఇతరమైన దాని వల్ల ఉత్పన్నం అయిందనుకొంటే – 'కార్యం' రూపమైన బొగ్గు అగ్ని వల్ల ఉత్పన్నమైందని ఎలా చెప్పగలం?[77]

కారణసామగ్రి వివిధ రూపాలలో ఉంటాయి. కాబట్టి వాటి కారణం చేత వస్తువులలో (కార్యాలలో) విభిన్నతలు కన్పిస్తాయి. ఒక వేళ ఆ కారణసామగ్రిలో తేడాలు లేకపోతే ఈ జగత్తు అంతా 'అంతా రూపం' లో ఉండేది.[78]

మట్టి, సారె, కుమ్మరి – ఈ మూడు పదార్థాలూ విడివిడిగా కుండను తయారు చేయగలవా? కానీ ఇవి కలసినప్పుడు కార్యం జరుగుతుంది. కుండ తయారవుతుంది. దీన్నిబట్టి ఒక్కటిగా కలసిన ఆ క్షణిక పదార్థాల్లో కారణం (హేతువు) ఉంది. ఈశ్వరునిలో క్షణికత్వం లేదు కాబట్టి, ఈశ్వరునిలో హేతుతత్త్వం లేదు. ఈశ్వరుణ్ణి నిత్యుడు అంటున్నారు. నిత్యత్వంతో హేతుతత్త్వం ఉండదు.[79]

## viii. ప్రమాణ యోచన

మానవునికి జ్ఞానం ఎంత పెరుగుతూ వచ్చిందో, అతనూ ఆ జ్ఞానం విలువను అంతగానే గుర్తించాడు. తన జీవితానికి చెందిన అన్ని రంగాల్లో తన మెదడును ఎంతో ఎక్కువగా ఉపయోగించాడు. ఈ జ్ఞానం ప్రయోగసిద్ధి కాకపోయినప్పుడు, అతను ఊహల్లో, కల్పనల్లో తేలిపోయాడు. ఈ కల్పన వివిధ మతాలకూ, దర్శనాలకూ దారి తీసింది. ఈ స్థితిని మనం 'ఉపనిషత్తు'ల కాలం నాడే చూశాం. ఉపనిషత్ దార్శనికులు జ్ఞానానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చారు. బుద్ధుడు జ్ఞానానికి అంతకంటే ఎంతో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఎందుకంటే, అవిద్యవల్ల 'చెడు'లు జరుగుతాయని ఆయనకి తెలుసు. అందుకే ఆ చెడుల్ని దూరం చేయడానికి **'ఆర్యసత్యాలు',** లేక నిర్దోష జ్ఞానం (దోషం లేని జ్ఞానం) చాలా అవసరం అని ఆయన భావించారు.

ఆ తరువాత శతాబ్దాల్లో **'అరిస్టాటిల్'*** తర్క శాస్త్రంతో భారతీయులకు పరిచయం కల్గింది. ఎప్పుడు అది భారతీయుల్లో బాగా ప్రాచుర్యం పొందిందో – అప్పుడు భారతీయులకు జ్ఞానం వైపు, జ్ఞాన సాధనల వైపు దృష్టి మళ్ళింది. ఈ విషయాన్ని మనం నాగార్జునుడు, కణాదుడు, అక్షపాదుడు మొదలైన వారి గూర్చి చర్చించే సమయంలో చూశాం. వసుబంధు, దిఙ్నాగుడు, ధర్మకీర్తి లాంటి దార్శనికులు ఈ జ్ఞాన విషయాన్నే ముఖ్య విషయంగా తీసుకొని ప్రమాణ శాస్త్రాన్ని రచించారు కూడా. దిఙ్నాగుడు తాను రచించిన గ్రంథానికి 'ప్రమాణ సముచ్చయం' అని ఎందుకు పేరు పెట్టారో, అలాగే వసుబంధు తన ప్రఖ్యాత గ్రంథానికి 'ప్రమాణ వార్తికం' అని ఎందుకు పేరు పెట్టారో – పైన తెల్పిన విషయాన్ని అర్థం చేసుకుంటే తెలుస్తుంది.

**ప్రమాణం :** ప్రమాణం అంటే ఏమిటి? – అనే దానికి ధర్మకీర్తి ఇలా చెప్పారు.[80]

"అజ్ఞాత అర్థాన్ని తెలిపేది. ప్రస్తుత స్థితికి భిన్నం కానటువంటి **అ–విసంవాద** జ్ఞానాన్ని ప్రమాణం అంటారు. అ–విసంవాదం అంటే... ఊహల మీద, కల్పన మీద ఆధారపడకుండా **అర్థక్రియల*** (ఆచరణ, ప్రయోగం) మీద ఆధారపడడం. కాబట్టి దేనికైనా ప్రమాణమనేది ప్రయోగం వల్ల, ఆచరణ వల్లే లభిస్తుంది.[81]

**ప్రమాణ సంఖ్య :** ఇతర భారతీయ దార్శనికులు కొందరు శబ్దం – ఉపమానం, అర్థాపత్తి – వీటిని కూడా ప్రమాణాలుగా అంగీకరిస్తారు. ధర్మకీర్తి అర్థక్రియను (ప్రయోగాన్ని) ఉత్తమ ప్రమాణంగా భావించారు.

ప్రమాణాలలో రెండు రకాల ప్రమాణాలు ముఖ్యమైనవి. 1. **ప్రత్యక్షం.** 2. **అనుమానం*** (inference).

ప్రత్యక్ష ప్రమాణానికి ఆధారం వస్తువు యొక్క స్వలక్షణం.

అనుమాన ప్రమాణానికి ఆధారం – వస్తువు సామాన్య లక్షణం.[82] (అంటే అనేక వస్తువులలో ఉండే పోలిక).

ధర్మకీర్తి – ప్రత్యక్షం, అనుమానం – ఈ రెండు ప్రమాణాలనే జ్ఞానాన్ని పొందే ఉత్తమ సాధనాలుగా అంగీకరించారు.

**A. ప్రత్యక్ష ప్రమాణం :** 'ప్రత్యక్షం' అంటే ఏమిటి? కల్పనలకు సంబంధం లేకుండా – (ఊహించు కోకుండా) ఇంద్రియాలు, మనస్సు, విషయాలు – ఈ మూడింటి సంయోగం చేత ఏర్పడిన జ్ఞానమే ప్రత్యక్ష జ్ఞానం. ఊహతో సంబంధం లేకుండా ఇతర మార్గాల ద్వారా లభించే జ్ఞానాన్ని కూడా ప్రత్యక్ష జ్ఞానం అనొచ్చు. ఈ విధంగా యథార్థస్థితిని బట్టి ఇంద్రియాలు, మనసు, విషయాలు – వీటి సంపర్కం వల్ల, కల్పనలకి అవకాశం లేకుండా మనకు లభించే జ్ఞానమే ప్రత్యక్ష జ్ఞానం.

దిఙ్నాగుని లాగానే, ధర్మకీర్తి కూడా ప్రత్యక్ష ప్రమాణాన్ని నాల్గు రకాలుగా చెప్పారు. అవి :

a) ఇంద్రియ ప్రత్యక్షం.

b) మానస ప్రత్యక్షం.

c) స్వసంవేదన ప్రత్యక్షం.

d) యోగి ప్రత్యక్షం.

ఐతే, అసంగుడు చెప్పిన 'లోక ప్రత్యక్షా'నికి ఇక్కడ చిరునామా కూడా లేదు.

**a) ఇంద్రియ ప్రత్యక్షం :** చిత్తాన్ని నాల్గు వైపులకూ పోనీకుండా – నిశ్చల చిత్తంతో దర్శించిన జ్ఞానమే ఇంద్రియ ప్రత్యక్ష జ్ఞానం అవుతుంది.[83] ఈ జ్ఞానం సిద్ధించిన అనంతరం – మనిషి కొంత కల్పనను జతచేస్తాడు.[84] ఒక ప్రత్యేక ఆకారం కలది కాబట్టి 'ఇది కుండ' అని గ్రహించగలుగుతాడు. ఐతే, ఈ 'ఇది కుండ' అనే జ్ఞానం మొదటిగానే ఇంద్రియ ప్రత్యక్షంగా లభించదు.[85] అది కేవలం వ్యక్తికి,

వస్తువుకూ మధ్య సంపర్కం వల్లే కల్గుతుంది. అప్పుడు భాష (దాని జాతివాచకం) ఏమీ ఉండదు. ఇంద్రియాలు కుండను చూస్తాయి. ఆ తర్వాత భాష సాయంతో వ్యక్తిగా చూచిన వస్తువుని జాతిపరం చేస్తాయి.[86] అప్పుడు ఇది 'కుండ' అనే జాతికి చెందినది – అనే నిర్ణయానికి మనస్సు వస్తుంది. ఆ నిర్ణయానికి రావడానికి అంతకు పూర్వం పొందిన జ్ఞానం **(పూర్వ సంస్కారం)** సహకరిస్తుంది.[87]

*(అంటే... మనం ఇప్పుడు ఒక వస్తువుని చూశాం అనుకుందాం. ఆ వస్తువు పైన చెప్పిన ఉదాహరణలోని "కుండ" అనే అనుకుందాం. ఆ వస్తువును మనం 'కంటి'తో అంటే ఒక ఇంద్రియంతో చూశాం. ఆ వస్తువుకీ, మన ఇంద్రియానికీ ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. దాని ఆకారం మన మెదడుకు చేరుతుంది. అప్పుడు మనం దానిని ఇది 'కుండ' అని అనుకుంటాం. ఇక్కడొక విషయం మనం గుర్తుంచుకోవాలి. ఆ చూచిన వస్తువును "ఇది కుండ" అని ఎలా అనుకున్నాం? అలా అనుకోవాలంటే ఆ వస్తువు పేరు నీకు అంతకుముందే తెలిసి ఉండాలి. అంటే ఆ వస్తువు, ఆ వస్తువు తాలూకు ఇతర వివరాలు నీకు అంతకుముందే తెలిసి ఉండాలి. అంటే వస్తువుతో పాటు భాష కూడా ఇక్కడ సహకరించింది. "కుండ" అనేది ఏదైనా ఒకే ఒక వస్తువు పేరు కాదు. అంటే ఒకే వస్తువు కుండే "స్వంత లక్షణం" కాదు. 'కుండ' అనేది ఒక వస్తు సమూహానికి చెందింది. అంటే అది ఒక 'జాతి' కి చెందింది. గతంలో మనకు తెలిసి కుండ తాలూకూ మన మెదడులో నిలిచివుండే జ్ఞానాన్నే సంస్కారం అంటాం. దాన్నే పూర్వ సంస్కారం అంటారు.*

*మనం ఒక వస్తువును మొదట కంటితో చూచినప్పుడు, ఆ వస్తువు తాలూకు జ్ఞానం ఇంద్రియం ద్వారా మెదడుకు (మనస్సుకు) చేరుతుంది. అప్పటికే మన మనస్సులో ఆ వస్తువు ఫలానా వస్తువు అనే జ్ఞానం కలిగివుంటుంది.*

*ఇక్కడ 'కుండ' కు చెందిన జ్ఞానం అలాగే కల్గింది.*

*ఒకవేళ... మనం ఇప్పుడే క్రొత్తగా కుండను చూస్తున్నట్లయితే, ఆ వస్తువుకు సంబంధించిన పేరు (భాష) మనకు తెలియపోతే... దాన్ని చూడగానే "ఇది కుండ" అను అనుకోలేము. – అనువాదకుడు)*

**b) మానస ప్రత్యక్షం :** "పదార్థాల రాగద్వేషాల ద్వారా ఏర్పడే కల్పనారహిత జ్ఞానమే మానస ప్రత్యక్షం" అన్నాడు దిజ్ఞాగుడు తన ప్రమాణ సముచ్ఛయంలో.[88]

మానస ప్రత్యక్షం స్వతంత్ర ప్రత్యక్షం కాదు. ఇది – ఇంతకు ముందే ఇంద్రియాల ద్వారా తెలిసిన జ్ఞానానికి (జ్ఞాతానికి) చెందినది అవుతుంది. అజ్ఞాత అర్థం (తెలియని దానికి) కాదు. కాబట్టి, అది ప్రమాణం కాదు. ఒకవేళ ఇంద్రియ జ్ఞానానికి అందని 'అ–దృష్ట'ను కూడా మానస ప్రత్యక్షం అనరాదు. ఎందుకంటే అలా అంగీకరిస్తే గ్రుడ్డి వారికి కూడా వస్తు దర్శనం కల్గుతుంది అని అంగీకరించవలసి వస్తుంది.[89] మరి, ఈ విషయాలనన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ధర్మకీర్తి మానస ప్రత్యక్షాన్ని గూర్చి ఇలా అన్నారు.

"కన్ను మొదలైన ఇంద్రియాల వల్ల, ఏదైతే... విషయ జ్ఞానం కల్గిందో– దాని అనంతర ప్రత్యక్షమే మానస ప్రత్యక్షం" అన్నారు. అంటే... ఇంద్రియాల వల్ల కల్గిన జ్ఞానాన్ని ఆ తరువాత హేతువుగా చేసుకొని మనస్సులో కలిగే చైతన్య జ్ఞానమే మానస ప్రత్యక్షం.[90]

కళ్ళు, చెవులు... మొదలైన ఇంద్రియాల ద్వారా రూపసంబంధమైన జ్ఞానానికి భిన్నమైన దాన్ని మనస్సు ప్రత్యక్షంలో గ్రహిస్తుంది. కాబట్టి అది తెలిసిన రూపాన్నే ప్రకటిస్తుంది. కనుకే మానస ప్రత్యక్షాన్ని గ్రుడ్డివారు పొందలేరు.

**c) స్వసంవేదనా ప్రత్యక్షం :** "కళ్ళు మొదలైన ఇంద్రియాలు గ్రహించిన రూప జ్ఞానం, మనస్సు చేత గ్రహించబడిన రూప విజ్ఞానంతో కలిసిన తరువాత ఆ జ్ఞానం పట్ల రాగద్వేషాల ద్వారా ఏర్పడే సంవేదన (అనుభవం) ఏదైతే ఉంటుందో అదే స్వసంవేదన" అన్నాడు దిఙ్నాగుడు తన ప్రమాణ సముచ్ఛయంలో.[91]
మరి, దీన్నే ధర్మకీర్తి తన ప్రమాణ వార్తికంలో ఇలా రాశారు –

"రాగం (సుఖ దుఃఖాలు మొదలైన) మొదలైన వాటి ఆధారంగా మనం దేన్నైతే అనుభవానికి తెచ్చుకుంటామో – అది ఇతర ఇంద్రియాలతో సంబంధం కల్గి ఉండదు. కాబట్టి ఆ అనుభవ స్వరూపాన్ని గూర్చి చెప్పగలిగింది గానీ, చెప్పేది గానీ ఏమీఉండదు. ఆ అనుభవం తాలూకు సంవేదనకు ఒక సంకేతం (గుర్తు, పేరు) కూడా ఉండదు".[92]

ఈ విధంగా – తెలియని ఒక వస్తువుని గూర్చి ఊహలకి, కల్పనలకి తావియ్యకుండా సుఖదుఃఖాల అనుభవంతో ఏ అనుభవాన్నైతే మనం పొందుతామో – ఆ ప్రత్యక్షమే స్వసంవేదనా ప్రత్యక్షం. ఇది ఇంద్రియ ప్రత్యక్షాలకు, మానస ప్రత్యక్షాలకు భిన్నమైంది.

ఇంద్రియ ప్రత్యక్షంలో – మనం ఏదో ఒక ఇంద్రియం తాలూకు రూప (భౌతిక) జ్ఞానాన్ని పొందుతాము.

మానస ప్రత్యక్షంలో ఇంకాస్త ముందుకు వెళ్ళి ఇంద్రియాల తాలూకు జ్ఞానాన్ని 'మననం చేసుకొంటుంది మనస్సు'.

స్వసంవేదన ప్రత్యక్షంలో ఇంద్రియ, మానస ప్రత్యక్ష జ్ఞానాల తాలూకు రాగద్వేషాల అనుభూతి ఉంటుంది.

కాబట్టి స్వసంవేదన ప్రత్యక్షం ఇంద్రియ ప్రత్యక్షాలకు, మానస ప్రత్యక్షాలకు పూర్తిగా భిన్నమైంది.

**d) యోగి ప్రత్యక్షం[93] :** పైన చెప్పిన మూడు ప్రత్యక్షాలు – ఇంద్రియ ప్రత్యక్షం, మానస ప్రత్యక్షం, స్వసంవేదన ప్రత్యక్షం. – ఇవి కాక, నాలుగోదైన యోగి ప్రత్యక్షాన్ని కూడా బౌద్ధులు అంగీకరిస్తారు. ఇతర ప్రత్యక్షాలకు ఉన్నటువంటి అజ్ఞాత జ్ఞాన ప్రకాశకాలు, కల్పనారహితము, అ–విసంవాది – ఇవి ఈ ప్రత్యక్షానికి కూడా వర్తిస్తాయి.

సమాధి (చిత్త ఏకాగ్రత) మొదలైన స్థితుల ద్వారా పొందే జ్ఞానాలన్నీ యోగి ప్రత్యక్షాలు వాటి వాటి స్థితిని అనుసరించి, ఊహలకూ, కల్పనలకూ తావియ్యని జ్ఞానాలు మాత్రమే యోగి ప్రత్యక్షాలు.[95]

ప్రత్యక్ష జ్ఞానం అంటే – అది ఊహించినదై ఉండకూడదు. ఇంద్రియ ప్రత్యక్షంలో కల్పనకూ, ఊహలకూ చోటే లేదు. దీన్ని ఇలా చెప్పుకోవచ్చు. ఒక 'కుండ'ను చూశాం. ఆ కుండ తాలూకూ రూపం మన కండ్ల మీద పడుతుంది. అది అక్కడి నుండి జ్ఞాననాడుల ద్వారా మెదడుకు చేరుతుంది. ఆ క్షణంలో మెదడు కల్పనారహితంగా ఉంటుంది. అలా ముద్ర వెనుక ముద్రలు వచ్చి మెదడులో పడుతూ ఉంటాయి. అప్పుడు మెదడులోని 'సంస్కారాలు' మేల్కొంటాయి. అంటే పూర్వ జ్ఞానం నిద్ర లేస్తుంది. గతంలో ఏర్పడిన 'కుండ' తాలూకు జ్ఞానానికి, ప్రస్తుత రూప జ్ఞానాన్ని జోడిస్తాయి. ఇక్కడే ఊహ (కల్పన) ప్రారంభమవుతుంది. పాత ముద్రకూ, కొత్త ముద్రకూ సంయోగం కుదురుతుంది. అప్పుడు ఆ ముద్ర తాలూకు జ్ఞానం మేల్కొంటుంది. చూచిన వస్తువు 'కుండ' అని గుర్తుకు వస్తుంది. ఈ క్రియల్లో ఎక్కడి వరకూ కల్పన (ఊహ) కు తావు లేదో, ఎక్కడి నుండి కల్పన (ఊహ)కు

తావుందో తెలుస్తూనే ఉంది. మెదడులో మొదట ముద్ర పడేప్పటికి కల్పనకు అవకాశం లేదు. కాగా ఆ తర్వాత 'కుండ' అన్న ముద్రకు, 'కుండ' అనే జాతి వాచకంతో సంబంధం ఏర్పడ్డాక ఇక అప్పుడూ కల్పనకు తావులేదు. కాబట్టే ధర్మకీర్తి కల్పన (ఊహ)ను గూర్చి ఇలా రాశారు.

"ఒక వస్తువును (విషయాన్ని) మరో వస్తువుతో వేరు పరచే జ్ఞానం మనకు ఎప్పుడైతే కలుగుతుందో – అప్పుడే ఆ వస్తువు తాలూకూ కల్పన ప్రారంభమైంది అనుకోవాలి. మరి, ఆ వస్తువుకు శబ్దరూపం (పేరు) ఇవ్వనంతవరకూ, అది కల్పనారహిత ప్రత్యక్ష జ్ఞానం అవుతుంది".

ఈ విధంగా జ్ఞానానికి చెందిన విషయం బాహ్యమైనదైనా, ఆంతరికమైనదైనా అసమానత, లేక సమానత మొదలైన హెచ్చు తగ్గుల ఆధారంగా ఏర్పడే శబ్ద రూపానికి అవకాశం ఇవ్వని వరకూ అది ప్రత్యక్ష జ్ఞానంగానే ఉంటుంది.[96]

**e) ప్రత్యక్షాభాస (ప్రత్యక్షం వలే కన్పించడం) :** నాల్గు రకాల ప్రత్యక్షాల్ని ఇప్పటిదాకా చూశాం. అయితే, ప్రత్యక్ష ప్రమాణానికి చెందని జ్ఞానాలు కూడా కొన్ని ఉంటాయి. ఇవి, ప్రత్యక్ష జ్ఞానాలనే అనిపిస్తాయి. అందువల్ల వీటిని **'ప్రత్యక్ష ఆభాసాలు'** అంటారు. అంటే ప్రత్యక్షాల వలే భ్రమ కల్గిస్తాయి. ఈ ఆభాసాల గురించి తెలుసుకోవడం మంచిది, లేకుంటే ఇవే 'ప్రత్యక్షాలు' అనే భ్రమకు లోనవుతాం. దిఙ్నాగుడు ప్రత్యక్షాభాసాల్ని నాలుగు రకాలుగా విభజించాడు.[97]

- **భ్రాంతి జ్ఞానం :** ఎండమావుల్లో నీరున్నట్లు కన్పించడం.

- **సంవృత్తి జ్ఞానం :** ద్రవ్యగుణ జ్ఞానం. 'ఫలానా పదార్థంలో ఫలానా గుణం ఉండాలి' అనే జ్ఞానం.

- **అనుమాన జ్ఞానం :** అనుమానాన్ని బట్టి, అనుమానాన్ని గుర్తించే జ్ఞానం. అనుమానం అంటే లింగం. ఆనుమానం అంటే **లింగి.** (దీన్నే లింగ లింగి జ్ఞానం అంటారు) ఉదా॥ పొగ(లింగం)ను బట్టి నిప్పు (లింగి), అలాగే శబ్దాన్ని బట్టి కుండ మొదలైన వస్తువుల్ని గుర్తించే జ్ఞానం.

- **తైమిరి :** శారీరక వికారాల వల్ల కలిగే జ్ఞానం. కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కన్పించడం.

పై నాల్గు ఆభాసాలలో మొదటి మూడు రకాల ప్రత్యక్ష ఆభాస జ్ఞానాలూ కల్పన (ఊహ) ప్రధానమైనవి. కాబట్టి వీటిని ప్రత్యక్షాలని అనం. నాల్గవదైన 'తైమిరి'లో ఊహకు తావులేదు. ఇది ఇంద్రియ వికారం వల్ల కల్గినది. అయినా ఇది కూడా ప్రత్యక్షం కాదు.[98]

**B. అనుమాన ప్రమాణం :** మనకు 'అగ్ని' జ్ఞానం రెండు రకాలుగా కలుగుతుంది. ఒకటి : అగ్ని 'స్వరూపం' చేత – అంటే అగ్నిని మనం ప్రత్యక్షంగా చూచినప్పుడు ఇది 'అగ్ని' అనే జ్ఞానం కల్గుతుంది. ఇక, రెండోది : పొగను చూచినప్పుడు కూడా మనకు 'అగ్ని' జ్ఞానం కల్గుతుంది. పొగను చూడగానే, (అగ్నిని చూడకపోయినా) పొగ అగ్నికి గుర్తు కాబట్టి, 'అగ్ని'ని గుర్తిస్తాం. ఇలా రెండో విధంగా పొందే జ్ఞానాన్నే 'అనుమానం' అంటాం. అంటే పదార్థాల్ని గుర్తించడం, లేదా వాటిని గురించిన జ్ఞానాన్ని పొందడం రెండు రకాలు.[99] ఒకటి – స్వరూపం వల్ల. అంటే 'దాని' వలనే 'దానిని' గుర్తించడం. రెండు – పరరూపం వల్ల. ఒకదానిని చూచి మరో దానిని గుర్తించడం. పొగను చూచి నిప్పును గుర్తించడం. ఇందులో మొదటిది **ప్రత్యక్షం.** రెండోది **అనుమానం.**

ఐతే – అనుమాన ప్రమాణంలో – మనం చూచే స్వరూపం **'పొగ'**ది. పొందే జ్ఞానం **'అగ్ని'**ది. అంటే పొగ స్వరూపం ద్వారా, 'అగ్ని' జ్ఞానాన్ని పొందుతున్నాం. దీన్నే 'భ్రాంతి' అంటారు. ఇక్కడ మనకు ఒక ప్రశ్న ఉదయిస్తుంది. మరి, 'భ్రాంతి'ని ప్రమాణం అని ఎందుకు అనకూడదు? ఎందుకంటే అది **అ–విసంవాది** కాదు కాబట్టి. మరి, 'భ్రాంతి' పడిన వస్తువు అ–విసంవాది అయితే అంటే యథార్థస్థితిని కల్గినది (కల్పనలకీ ఊహలకి తావులేనిది). అయితే... భ్రాంతి కూడా ప్రమాణం అవుతుంది.[100] పర్వతం మీద పొగను చూచి 'అగ్ని' యొక్క జ్ఞానాన్ని ఊహించాము. అంతేగాని, మనం పర్వతం మీద ఉన్న నిప్పును చూడ లేదు. ఈ ఊహ ఎలా కల్గింది అంటే... మనం ఇంతకు ముందే వంట ఇంటి నుండి వచ్చే పొగను చూచి ఉన్నాం. దానిని బట్టి అగ్ని ఉన్నచోట పొగ ఉంటుందని తెలుసుకొని, పర్వతం మీది నుండి వచ్చే పొగను చూచి, అక్కడ అగ్ని ఉంటుంది అని ఊహించాం. అక్కడ వంట ఇంటిలో చూచిన నిప్పుకూ, పర్వతం మీద నిప్పుకూ సామాన్య లక్షణం ఒకటే కాబట్టి – నిప్పు నుండి పొగ వస్తుంది కాబట్టి – మన అనుమానం ప్రామాణికమైంది.

**a) అనుమానం ఆవశ్యకత :** వస్తువు స్వరూపాన్ని 'స్వలక్షణం' అంటామనీ, దానిలో ఊహలకీ, కల్పనలకూ తావులేని 'ప్రత్యక్ష జ్ఞానం' ఉంటుందనీ ఇంతకు ముందు తెలుసుకొన్నాం. ఏ లక్షణం అనేక వస్తువులలో ఉంటుందో ఆ లక్షణాన్ని 'సామాన్యం' అంటాము. ఈ సామాన్య జ్ఞానాన్ని తెల్సుకోడానికి 'అనుమాన' ప్రమాణం అవసరం అవతుంది.[101]

**b) అనుమానం లక్షణం :** ఏదైనా ఒక పదార్థంలో గల సంబంధాన్ని బట్టి – **'ధర్మం' 'ధర్మి'** ల జ్ఞానాన్ని పొందవచ్చు. 'ధర్మం' (పొగ) ను బట్టి, 'ధర్మి' (అగ్ని) ని అనుమానించి జ్ఞానాన్ని పొందడం. ఇది పరోక్షంగా జరిగేది.[102]

కొండ మీది నించి పైకి లేచిన పొగను దూరం నుండి మనం చూస్తాం. మనకు అప్పుడు గతంలో వంట గదిలో అగ్ని నుండి లేచిన పొగ గుర్తుకు వస్తుంది. దాన్ని బట్టి ఎక్కడెక్కడ పొగ ఉంటుందో అక్కడక్కడ అగ్ని ('నిప్పు') ఉంటుంది కదా అని అనుకుంటాం. ఇక్కడ 'పొగని' హేతువుగా చేసుకొని పర్వతం మీద 'నిప్పు' ఉన్నదని అనుకొంటాం. ఇక్కడ నిప్పు లేదా అగ్ని 'ప్రత్యక్షం' కాదు. పరోక్షం. అంటే... మనం నిప్పు 'స్వరూపాన్ని' ప్రత్యక్షంగా చూచి కొండమీద నిప్పు ఉన్నది అనే జ్ఞానాన్ని పొందడం లేదు – మనం, ఇక్కడ నిప్పు జ్ఞానాన్ని వెంటనే పొందడం లేదు. ఇది, స్మృతి (జ్ఞాపకం), కల్పనలు ఇవన్నీ కలవడం వల్ల – వాటిని ఆశ్రయాలుగా చేసుకోవడం వల్ల ఈ జ్ఞానం పొందుతున్నాం.

**ప్రమాణాలు రెండే :** జ్ఞేయాన్ని (ప్రమేయాన్ని), పదార్థ స్వరూపాన్ని బట్టి, లేదా పరరూపాన్ని బట్టి తెలుసుకోగలం. ఇందులో 'పదార్థ స్వరూపం' అనేది ఊహించి చెప్పేది కాదు. కాగా, పరరూపాన్ని బట్టి తెలుసుకోవడం అనేది ఊహించి మాత్రమే చెప్పేది. అంటే మొదటిది 'ప్రత్యక్షం'. రెండోది 'అనుమానం' (అప్రత్యక్షం). ఈ రెండూ కాక మూడవదైన ప్రమాణం అంటూ ఏదీ లేదు. అంటే ....

**'ప్రత్యక్షం', 'పరోక్షం'** అనే ఈ రెండు విధానాలవల్ల పదార్థ **(ప్రమేయ*)** జ్ఞానం కల్గుతుంది.

కాబట్టి, ప్రమాణాలు రెండే. ప్రమేయాన్ని బట్టి రెండు కంటే ఎక్కువగానీ, లేదా రెండు కంటే తక్కువ గానీ ప్రమాణాలు ఉండవు.[103]

**c) అనుమాన ప్రమాణ భేదాలు : కణాదుడు, అక్షపాదుడు** లాంటి వారు అనుమాన ప్రమాణం ఒక్కటే, దానిలో భేదాలు లేవు అన్నారు. **ప్రశస్తపాదుడు** లాంటి వారు మినహా – మిగిలిన బ్రాహ్మణ తత్త్వవేత్తలందరూ కూడా ఈ ప్రమాణాన్ని 'ఒక్కటే' అన్నారు.

కానీ, ఆచార్య దిఙ్నాగుడు మాత్రం అనుమాన ప్రమాణం రెండు రకాలు[104] అన్నారు. అవి, **1. స్వార్థానుమానం. 2. పరార్థానుమానం.** ఈ రెండింటిలోనూ స్వార్థానుమానం మూడు రకాల హేతువులతో (లింగం, చిహ్నం, ధూమం) ఉంటుంది.[105] ఈ మూడింటిలో ఏదో ఒక పదార్థ జ్ఞానాన్ని (ప్రమేయ జ్ఞానాన్ని) అది 'తన కొరకు' (స్వార్థం) పొందడం జరుగుతుంది. అందుకే అది స్వార్థానుమానం. ఇక, పరార్థానుమానంలో ఈ మూడు హేతువులతో ఏదో ఒక పదార్థ జ్ఞానాన్ని (ప్రమేయ జ్ఞానాన్ని) అది 'ఇతరుల కొరకు' (పరార్థం) పొందడం జరుగుతుంది. (అందుకే అది పరార్థానుమానం).

*(హేతువు, కారణం, లింగం, ధర్మం ఇవి అనుమానానికి పేర్లు. కార్యం, లింగి, ధర్మి ఇవి ఆనుమానానికి పేర్లు – అనువాదకుడు)*

**d) హేతు (లింగ) ధర్మం :** పదార్థం (ప్రమేయం) ఏ ధర్మాన్నైతే మనం చూచి ఊహద్వారా దాని ఉనికిని అనుమానిస్తామో – అదే హేతువు (కారణం).[106]

'అగ్ని' ఉనికిని గుర్తించడానికి కారణం 'పొగ'. దీన్నే 'లింగం' అని కూడా అంటారు.

హేతువు (లింగం) మూడు రకాలు.[107]

కార్య హేతువు లేదా కార్య లింగం.

స్వభావ హేతువు లేదా స్వభావ లింగం.

అనుపలబ్ధి హేతువు లేదా అనుపలబ్ధి లింగం.

• **కార్య హేతువు :** 'పొగ'కు 'నిప్పు' కారణం. 'నిప్పు'కు 'పొగ' కార్యం. పొగ ద్వారా– అంటే కార్యం ద్వారా నిప్పును అనుమానిస్తాము. కాబట్టి అది కార్య హేతువు.

• **స్వభావ హేతువు :** మన ఎదురుగా ఉన్నది ఒక వృక్షం అనుకొందాం. దీని తల భాగం పెరుగుతూ ఉంటుంది. నిరంతరం దీని తల భాగం పెరుగుతూ

ఉంటుంది. కాబట్టి ఇది వృక్షం (చనిపోయే దాకా పెరుగుతూ ఉండడం వృక్ష ధర్మం). నిరంతరంగా పెరగడం అనేది 'ఇది వృక్షం' అని గుర్తించడానికి ఒక హేతువు. పెరగడం అనేది ఆ వృక్ష స్వభావం (స్వరూపం). స్వభావ హేతువు ద్వారా ఇది వృక్షం అనే విషయాన్ని తెలుసుకొంటాం. కాబట్టి అది స్వభావ హేతువు.

• **అనుపలబ్ధి హేతువు :** "ఈ టేబుల్ మీద గ్లాసు లేదు". గ్లాసు మనకు తెలిసిన వస్తువే. దానికి స్వరూపం ఉంది. అయినప్పటికీ, అది ఈ టేబుల్ మీద లేదు – ప్రస్తుతం ఇక్కడ 'లభించడం లేదు'. ఒకవేళ అది అక్కడ ఉన్నట్లైతే మనకు కన్పిస్తుంది. ప్రస్తుతం అక్కడ లేదు కాబట్టి మనకు కన్పించదు. కాబట్టే టేబుల్ మీద లేదు. గ్లాసు **అనుపలబ్ధం*** (తెలిసిన వస్తువు ప్రస్తుతం లేకపోవడం) ఇక్కడ హేతువుగా ఉంది. కాబట్టి అది 'అనుపలబ్ధ హేతువు'.

అనుమానం చేత ఏదైనా విషయాన్ని ఋజువు పరచడానికి ఈ మూడు విధాలైన హేతువులు ఉంటాయి.

మనకు తెలుసు, ఎక్కడైతే నిప్పు ఉంటుందో అక్కడ తప్పక పొగ ఉంటుందని. అలాగే... ఎక్కడైతే నిరంతర పెరుగుదల ఉందో అది వృక్షమని, ఆ విధంగా మనకు తెలిసిన గ్లాసు ఒకవేళ అక్కడ ఉండి ఉంటే అది తప్పక కన్పిస్తుందని. అది కన్పించడం లేదంటే... అర్థం అది ప్రస్తుతం అక్కడ 'లేదు' అని –

(అంటే... అంతకుముందు గ్రహించిన విషయాల్ని, వాటి హేతువుల్ని బట్టి... ఆ విషయాల్ని ప్రత్యక్షంగా చూడక పోయినా, గుర్తించగలం).

## ix. మనస్సు – శరీరం

**A. ఒకటి మరోదానికి ఆశ్రయం :** మనస్సు – శరీరం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. ఒకదానికి మరొకటి ఆధారమవుతుంది. ఒకటి మరోదానిపై ఆధారపడి ఉంటుంది. అంటే పరస్పరాశ్రయాలు. పరస్పర ఆశ్రితాలు. మనస్సు – శరీరం – ఒకటా? లేదా వేరు వేరా? అనే విషయాలపై ధర్మకీర్తి తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బౌద్ధ దర్శనాన్ని రాసే క్రమంలో నేను ఇంతకు ముందే చెప్పాను – ఇక ముందు కూడా చెప్తాను – ఏమంటే... **బౌద్ధులు 'ఆత్మ'ను అంగీకరించరు**. దాని స్థానంలో **'మనస్సు – చిత్తం – విజ్ఞానం'** వీటిని అంగీకరిస్తారు. పదాలు

వేరైనా ఈ మూడింటి అర్థం ఒక్కటే. అంటే... ఆ మూడూ పర్యాయ పదాలే. మనస్సు శరీరం కాదు. కానీ, అది శరీరాన్ని ఆశ్రయించే ఉంటుంది.[108] మనకీ విషయం తెలుసు – ఇంద్రియాలు శరీరం లోపల ఉంటాయని. ఇంద్రియాలు లేకుండా బుద్ధి (మనస్సు, జ్ఞానం) ఉండదని. బుద్ధి పనిచేయకపోతే ఇంద్రియాలూ నిరుపయోగాలే. కాబట్టి – ఈ రెండూ (ఇంద్రియాలూ, బుద్ధీ) ఒకటి వేరొక దానిపై ఆధారపడి ఉంటాయి కాబట్టి అన్యోన్య ఆశ్రయాలు. అలాగే, ఒకటి మరో దానికి కారణం కాబట్టి, ఇవి అన్యోన్య హేతువులే!

**B. మనస్సు శరీరం కాదు :** మనస్సు – శరీరం ఈ విధంగా ఒకదానికొకటి ఆశ్రయాలవడం వల్ల అవి విడదీయరాని సంబంధాన్ని కల్గి ఉంటాయి కూడా. అందువల్ల మనస్సు శరీరం కంటే వేరైనది కాదు. అది శరీరంలో ఒక భాగమే అనుకుంటాము. అంతేకాదు మనస్సూ, శరీరం ఈ రెండూ ఒకే భౌతిక తత్త్వంతో వికాసం పొందుతాయి. కాబట్టి ఆ రెండింటికీ భేదం లేదు' అనే అంగీకారానికీ వస్తాం. ఇంక, భౌతికతత్వమే చైతన్యం, చైతన్యమే భౌతికతత్వం, అనీ అనుకుంటాం. ధర్మకీర్తి మిగతా బౌద్ధ దార్శనికుల్లాగానే ఈ **'భూత చైతన్య వాదం'** (భౌతిక వాదం లేదా జడ వాదం)ను ఖండించారు. వారు ఇలా రాశారు –

"గాలి పీల్చడం, వదలడం, ఇంద్రియాలు, బుద్ధి లేక మనస్సు – ఇవి తమలాంటి సజాతీయ పూర్వ కారణాల నుండే పుట్టుకొస్తాయి. ఈ సజాయితీ పూర్వ కారణాలు లేకుండా శరీరంలో ఇవి అనుకోకుండా పుట్టుకొస్తాయనడం సరికాదు. ఈ పూర్వ కారణాల్తో పనిలేకుండా ఇవి పుట్టుకొచ్చాయనుకుంటే, ఇక – అవి పుట్టడానికి శరీరంతో పనేముంటుంది? ఏ ఇతర భౌతిక పదార్థం అయినా సరిపోతుంది కదా![109]

జీవం కల్గిన బీజం నుండే వేరొక జీవం పుట్టుకొస్తుంది. కేవలం భౌతిక పదార్థం నుండి చైతన్యం ఉత్పన్నం అవదు. కానీ ఒక్కొక్కప్పుడు జీవ బీజాలతో పని లేకుండా జీవం పుట్టడమూ జరుగుతుంది. వర్షం వల్ల కొన్ని క్రిమి కీటకాలు ఉద్భవించినట్లు...!

దీనికి ధర్మకీర్తి ఇలా జవాబిచ్చారు – "ఈ భూమి మొత్తం మీద **'స్వేదజాలు'** (పురుగులు) పుట్టుకురాని చోటే లేదు. దీనిని బట్టి భౌతిక పదార్థాల చేత ఉత్పన్నమయ్యేట్టు కన్పించే సమస్త ప్రాణులూ బీజాత్మకమే."[110]

ఒకవేళ 'జీవసంబంధ' కారణం లేకుండా ఇంద్రియాలూ మొదలైనవి ఉత్పన్నమవుతాయి అనుకుంటే అదీ పొరపాటే. (మనకు కన్పించే కంకరరాళ్ళను ఒకచోట ప్రోగుపోస్తే అవి, మానవ రూపంగా పరిణామం చెందవు కదా!).[111]

"నూనె అయిపోతే దీపం ఆరిపోయినట్లుగా – కఫం, పిత్తం మొదలైన దోషాలవల్ల దేహం మరణిస్తుంది అని అనేది సరైనది కాదు. ఒకవేళ అలా అయితే, మరణించాక, ఆ దోషాలు పోతాయి. అవి పోయాక చచ్చినవాడు తిరిగి బ్రతకాలి కదా!"

"అలాగే... నిప్పు కట్టెను కాల్చేసింది. అప్పుడు కట్టె – బొగ్గు, బూడిదలుగా రూపాన్ని మార్చుకొంది. అప్పుడు ఇక అగ్ని చల్లారింది. 'అగ్ని' అనే దోషం శాంతించింది కాబట్టి బొగ్గు తిరిగి తన పూర్వ రూపాన్ని (కట్టె) పొందలేదు కదా!"

ఇది కూడా సరైనది కాదు. ఎలాగంటే... మనిషి బ్రతికుండగా చికిత్స ద్వారా తన దోష గుణాల్ని పోగొట్టుకొని పూర్వ రూపాన్ని పొందుతున్నాడు".

"దోషాల వల్ల కలిగే మార్పులు, తిరిగివచ్చే విధానం, తిరిగిరాలేని విధానం ఒకే విధంగా ఉండదు. అగ్ని కారణంగా కట్టెలో ఏర్పడ్డ వికారం (మార్పు) తిరిగిరాలేనిది. బొగ్గు తిరిగి ఏ పరిస్థితుల్లోనూ కట్టెగా మారదు. కానీ, అగ్నివల్ల బంగారంలో కలిగే మార్పు తిరిగి రాగలిగినది. అగ్ని వల్ల బంగారాన్ని ఆభరణంగా మార్చినా, తిరిగి దానిని పూర్వ రూపానికి తీసుకొని పోవచ్చు".

"మరణం పొందిన వాడు తిరిగి బ్రతకడం అసాధ్యం అని చెప్పవచ్చు. ఎందుకని? రోగాది దోషాల నివారణ మందుల వల్ల సాధ్యం కాకపోవడంవల్ల, ఆయుక్షయం జరుగుతుంది. ఒకవేళ భౌతికవాదుల మతానుసారం కేవలం భౌతిక దోషాలే మరణానికి కారణమైతే, ఆ దోషాలను తొలగించడం అసాధ్యం కాదు కదా!

మరో ఉదాహరణ చూద్దాం.

"పాము కరచిన తర్వాత ఎప్పటి వరకైతే మనం జీవించి ఉంటామో అప్పటి వరకూ విషం శరీరాన్ని ఆక్రమిస్తూనే ఉంటుంది. కానీ, శరీరం చనిపోయాక ఆ విషం కరచిన ప్రదేశంలోకి చేరి, ప్రోగవుతుంది. భౌతిక పదార్థమే చైతన్యం (జీవం) అయితే, చనిపోవడానికి కారణమైన విషం, శరీరంలోని మిగిలిన ప్రాంతాల

నుండి తొలగిపోగానే, ఆ ప్రదేశాలన్నీ తిరిగి బ్రతకాలి గదా! ఆ విషం ప్రోగుపడిన ప్రదేశాన్ని తొలగిస్తే ... అప్పుడు మరణం పొందిన శరీరం తిరిగి బ్రతకాలి. ఇలా జరుగుతుందా? జరగదు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమంటే... చైతన్యమూ, భౌతిక పదార్థమూ ఒకటి కాదు. అయితే, ఆ రెండూ ఒకదాని కొకటి ఆశ్రయాలు కాబట్టి ఒకటి లేకుండా మరొకటి ఉండలేవు".

అలాగని, చైతన్యమూ, భౌతిక పదార్థం – ఈ రెండూ పరస్పర ఆశ్రయాలైనప్పటికీ, అవి వేరు వేరు కూడా కాదు. భౌతిక పదార్థంవల్ల చేతనం (జీవం) పుట్టింది అని అనుకొంటే భౌతిక పదార్థం **'ఉపాదానం',** చైతన్యం (జీవం) **'ఉపాదేయం'*** అవుతుంది. అలాంటప్పుడు ఉపాదన శరీరంలో మార్పు కలగకుండా, ఉపాదేయమైన చైతన్యం (జీవం)లో మార్పు కలగడానికి వీలు లేదు. ఎలాగంటే... మట్టిలో 'మార్పు' లేకుండా మట్టితో చేసిన పాత్రల్లో (కుండ, చట్టి, పిడత మొదలైన) వికారం (మార్పును)ను తీసుకొనిరాలేము. అంటే ఏదైనా వస్తువు మారనప్పుడు, ఏదైతే పదార్థం మారుతుందో, ఆ పదార్థం ఆ వస్తువుకు ఉపాదానం కాజాలదు. ఉదాహరణకు – ఏ మార్పునీ పొందకుండా ఆవు, పొడవైన కొమ్ములు కల్గిన నీల్‌గాయ్ (గేదె) ఒకదానికి ఒకటి ఉపాదానాలు కావు. ఈ విధంగానే శరీరమూ, మనస్సులు. ఈ మనస్సు – శరీరాలలో మార్పులు దేని మార్పులు దానిలోనే సంభవిస్తాయి.[112]

C. **మనస్సు స్వరూపం :** మనస్సు సహజ లక్షణం 'ప్రభాస్వరం లేదా నిర్వికారం'. అంటే ఆకారం లేకపోవడం. దానిలో పొందే మలినాలు (మనో మలినాలూ, చిత్తమాలిన్యాలు) అగంతుకమైనవి. అంటే – ఆకాశంలోని అంధకారం, కుహరం– లాంటివి. ఈ మనోమలినాలు మనస్సుకు భిన్నమైనవి.[113]

## 4. ఇతర దర్శనాల ఖండన

ధర్మకీర్తి తన దర్శన గ్రంథం ప్రమాణవార్తికంలో తన దార్శనిక దృక్పథాన్ని ప్రతిపాదించడం, దాన్ని సమర్థించుకోవడమే కాదు – హిందూ దార్శనిక సంప్రదాయాల్ని కూడా సమగ్రంగా చర్చించాడు. వాటిని ఖండించాడు. ఇలా ఖండన చేసిన వారిలో ప్రముఖ బ్రాహ్మణ దార్శనికులైన **'ఉద్యోతకరుడు', 'కుమారిలభట్టు'లు** కూడా ఉన్నారు. నేను గ్రంథ విస్తార భయంలో, పునరుక్తి అవుతుందనే ఉద్దేశ్యంతో

ఆ దర్శనాల గురించి ఇక్కడ సమగ్రంగా చర్చించదలచలేదు – ధర్మకీర్తి ఆలోచనల్ని గ్రహించడానికి ఆయా గ్రంథాల్ని గూర్చి కొద్దిగా తెలుసుకుందాం –

## I. నిత్యతావాదుల సామాన్య సిద్ధాంతాల ఖండన

ఎక్కువ మంది దార్శనికులు అంగీకరించిన ఉమ్మడి సిద్ధాంతాల గురించిన ఖండనలు ముందుగా మనం చూద్దాం. వాటిలో...

**i. నిత్యతావాద ఖండన :** అనిత్యతా వాదానికి (క్షణిక వాదానికి) తిరుగులేని పక్షపాతి అయిన **బౌద్ధదర్శనం**, నిత్యతావాదాన్ని ఎంతో సమర్థవంతంగా వ్యతిరేకించింది. భారతదేశంలో బౌద్ధులు మినహా – మిగిలిన దార్శనికులు అందరూ ఏదో ఒక రూపంలో నిత్యతావాదాన్ని అంగీకరించినవారే. జైనులు, మీమాంసకులు లాంటి ఆత్మవాదులే కాదు; చార్వాకుల్లాంటి భౌతికవాదులు కూడా భౌతిక పదార్థం యొక్క సూక్ష్మ రూపాన్ని 'నిత్యం' అనే అన్నారు. గత శతాబ్దం వరకూ యూరప్‌కు చెందిన యాంత్రిక భౌతిక వాదులు పరమాణువులు (మూల ఇటుకలు) – నిత్యమైనవే అన్నారు.

దిఙ్నాగుడు ఇలా అంటున్నారు –[114] " కారణం స్వయంగా తాను మార్పును పొంది వేరొక వస్తువు పుట్టుకకు కారణం అవుతుంది. అంటే – కారణం కూడా మార్పు చెందితేగాని, కారణం కాలేదు!"

దీన్ని ధర్మకీర్తి ఇలా అంటారు – "దేని మార్పువల్ల మరొకటి జన్మిస్తుందో – లేక దేనిలో మార్పు జరిగాక, మరొకటి మార్పుకు గురౌతుందో – ఈ విధంగా మొదట మార్పుకు గురైన పదార్థం, తర్వాత మార్పు పొందడానికి కారణం అవుతుంది".[115]

కాబట్టి మార్పుకు గురయ్యేదే కారణం కాగలదు. 'నిత్యం' అనే పదార్థంలో మార్పు జరిగే ప్రసక్తే లేదు. ఈశ్వరుడు మొదలైన 'నిత్య' పదార్థాలుగా చెప్పబడేవి వేటినీ ఉత్పన్నం చేయలేవు. అవి దేనికీ జనన కారణాలు కాలేవు. కారణమేమంటే, అవి **వికారం*** (మార్పు) చెందవు కాబట్టి.[116]

"దేన్నైతే 'నిత్యమైనది' అని అంటామో అది మరోదానికి కారణం (హేతువు) కాలేదు. నిత్యతావాదులైన విద్వాంసులు 'ఎప్పటికీ స్వరూపం నాశనం కాని దానినే' నిత్యమైనది" అని అంటారు.

ధర్మకీర్తి 'పరమార్థసత్'గా దేనిని అంగీకరిస్తున్నారు? అంటే – ఉపయోగకరమైన క్రియను చేయగలిగిన దాన్నే 'పరమార్థసత్' అనమంటున్నారు.[117]

"మార్పులేనిచోట 'క్రియ' అనేది ఉండనే ఉండదు. ఆత్మ, ఈశ్వరుడు మొదలైనవి కన్పించేవి కాదు. కాగా, నిత్యమైనవి అంటున్నారు కనుక ఏలాంటి క్రియలను చేయలేనివి కూడా. అయినప్పటికీ అవి ఉన్నాయని అంటున్నారంటే ఎంత దుస్సాహసం!"

**ii. ఆత్మవాద ఖండన :** బౌద్ధదర్శనాలూ, చార్వాకం మినహాయిస్తే మిగిలిన భారతీయ దర్శనాలన్నీ ఆత్మను ఒక నిత్యచేతన పదార్థం అని అంగీకరిస్తాయి. బౌద్ధులు అనాత్మతా వాదులు. అంటే 'ఆత్మ'ను అంగీకరించనివారు. అనాత్మతావాదులే అయినప్పటికీ క్షణ క్షణ పరివర్తనశీలమైన చైతన్య ప్రవాహం (విజ్ఞాన సంతతి) ఒక శరీరం నుండి మరొక శరీరాన్ని పొందుతూ (ప్రతిసంధి) ఉంటుందని బౌద్ధులు అంగీకరిస్తారు. ఈ విషయాన్ని మనం ఇంతకు ముందే చెప్పుకొన్నాం. చేతన (మనస్సు లేక విజ్ఞానం) ఎప్పుడూ శరీరాన్నే ఆశ్రయించి ఉంటుంది. ఐతే, ఒక శరీరానికీ, మరో శరీరానికీ దగ్గర సంబంధం ఏమీ ఉండదుకదా! ఒక శరీరం నశించాక అది భూలోకంలో ఉంటుంది. భూలోకంలో ఉండే ఈ శరీరాన్ని **'క'** అని అనుకుందాం. చైతన్యం ప్రవేశించాల్సిన మరో శరీరం ఏదో ఒక గ్రహం మీద ఉంది అనుకుందాం. ఆ శరీరాన్ని **'ఖ'** అనుకుందాం. **'క'** శరీరాన్ని వదిలి, **'ఖ'** శరీరాన్ని చేరడానికి చైతన్యానికి కొంత సమయం పడుతుంది. మరి, ఈ మధ్య కాలంలో చైతన్యం దేన్ని ఆశ్రయించి ఉంటుంది? ఈ స్థితిలో "మనస్సు ఎల్లప్పుడూ శరీరాశ్రితమై ఉంటుంది" అని బౌద్ధులు చెప్పడం తప్పు అవుతుంది కదా?" దీనికి బౌద్ధులు ఇలా సమాధానం చెప్తారు –

"మేము (బౌద్ధులం) మనస్సును ఒకే పదార్థం అనం. ఇది విచ్ఛిన్న ప్రవాహంతో కూడుకున్నది అని అంగీకరిస్తాం. విచ్ఛిన్న ప్రవాహం అంటే నిరంతరం విచ్ఛిన్నమవుతూ కొనసాగే ఒకే ఒక వస్తువు కాదు. ప్రతి క్షణం తన రూపాన్ని పూర్తిగా విచ్ఛిన్నం చేసుకుంటూ, తరువాత అదే రకమైన, నూటికి నూరుపాళ్ళు కొత్తదైన వస్తువును సృష్టించుకొంటూ కొనసాగడమే. చేతనత్వం, మనస్సు – ఇవి విచ్ఛిన్న ప్రవాహ సంతతులే. ఈ ప్రవాహం ఒక జీవన రేఖగా కన్పిస్తుంది. అంటే జీవన ప్రవాహ బిందువుల పంక్తి మాత్రమే. ఇలా అనుకొన్న తర్వాత 'మనస్సు

శరీరాశ్రితం' అనడంలో అర్థం ఏమంటే... 'ప్రవాహంలోని ప్రతి 'బిందువు' శరీరం లేకుండా ఉండాల్సి ఉంటుంది' అని మాత్రమే.

భూలోకంలో నశించిన శరీరం **'క'** – తాను క్షణ క్షణ పరివర్తన శీలమైన శరీర నిర్మాణ మూలబిందువుల (విచ్ఛిన్న ప్రవాహం) యొక్క చిట్ట చివరి చిత్తబిందువు నశిస్తుంది. దాని తరువాతి చిత్తబిందువు **'ఖ'** శరీరాన్ని అనుసరిస్తుంది. **'క'** శరీర (ప్రవాహం) అంతిమ చిత్తబిందువుకూ, **'ఖ'** శరీర (ప్రవాహం) తొలి చిత్తబిందువుకు (**'క'** చిత్తం, **'ఖ'** చిత్తం) మధ్య, ఒకవేళ ఏదైనా ఒక **'గ'** చిత్త బిందువు ఉంటుందని అనుకొంటే కదా, ఆక్షేపణకు అవకాశం? **'గ'** చిత్తం శరీరం లేకుండా ఉండిపోయింది అనడానికి? ఈ రకంగా నిత్య పదార్థవాదాన్ని తిరస్కరిస్తూనే, మెరుపు కంటే కూడా తీవ్రవేగంతో **"దాగుడు మూతలు"** ఆడే చిత్త ప్రవాహాన్ని (అనాత్మ తత్త్వం) అంగీకరిస్తూనే అది పరంపరగా అనేక శరీరాల్లోకి వెడుతుంది" అని చెప్తుంది బౌద్ధదర్శనం.

**A) నిత్యమైన ఆత్మ లేదు :** 'ఆత్మ నిత్యమైంది' అని కొందరు ఎందుకు అంటున్నారంటే – వారు అలా ఆత్మ నిత్యమైందని అంగీకరించకపోతే, జనన మరణ బంధనాలలో పడి, సుఖదుఃఖాలు అనుభవించడం, ఆ సుఖదుఃఖాలను వదిలి మోక్షం పొందడం, పరమ సుఖాలలో విహరించడం – ఈ రెండూ సంభవించవు అని అనుకొంటారు.

దీని గురించి ధర్మకీర్తి ఇలా అంటారు.

"దుఃఖం పుట్టడానికి కారణ (కర్మ) బంధమే కారణం. అంటే – దుఃఖానికి కర్మే కారణం. ఐతే, దేన్నయితే మనం నిత్యమైందని అంటున్నామో అది ఎలాంటి క్రియల్ని చేయలేనిది. కాబట్టి అది దేనికీ కారణం కాలేదు. దుఃఖానికి భిన్నమైంది మోక్షం. అంటే కర్మబంధం నుండి ముక్తి పొందడం. ఈ నిత్య పదార్థం మార్పును అంగీకరించనిది అవడం వల్ల అది మోక్షానికి కారణం కాదు. నిజానికి అనిత్యం (క్షణికం) కానిదేదీ మరో దానికి కారణం కాలేదు. ఈ లజ్జాకర నిత్యతా సిద్ధాంతాన్ని వదిలి, ఆత్మ అనిత్యమైందని అంగీకరించండి."[118]

**B) ఆత్మ నిత్యతావాదం (సత్కాయ దృష్టి) అన్ని చెడులకూ మూలం : "నేను"** సుఖ పడాలి. లేదా **'నేను'** దుఃఖపడకూడదు అనేది మనుషులకు సహజం. ఇక్కడ

'నేను' అనే ఉద్దేశ్యం ఏదైతే ఉందో అదే సహజంగా ఆత్మవాదానికి కారణం. **'నేను'** అన్న భావన లేనివాడు ఆత్మపట్ల ప్రేమను, స్నేహాన్ని ప్రకటించరు. ఇలా లేనివాడు ఎవడూ తిరిగి పుట్టాలనే వైపుకు పరుగులు తీయడు."[119]

"ఎవరైతే ఆత్మపట్ల ప్రేమను వదిలిపెట్టలేడో వాడు దుఃఖాన్ని వదలలేడు. విచారం లేకుండా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండలేడు. ఎవరూ ఎవరిని విముక్తం కావించలేరు. అయినా, 'నేను' అన్న అసత్య భావం నుండి అతడు విముక్తుడవడానికి ప్రయత్నించాలి."[120]

క్షణికము, ప్రవాహ యుక్తమూ అయిన మనస్సుకు, ఆత్మ అనేది ఒకటున్నదన్న భావన అసహజమైన 'నిత్యత్వం' పట్ల స్నేహాన్ని కల్గిస్తుంది.[121]

ఆత్మ భావనన్నది కేవలం మోహమే. అదే అన్ని దోషాలకూ (చెడుగులకు) మూలం.[122]

**C) సత్కాయ దృష్టి (నిత్య ఆత్మ యొక్క ధారణ) :** మోహమే సత్కాయదృష్టి. ఈ మోహ మూలకమే అన్ని చిత్త వికారాలకు కారణం.[123]

ధర్మాన్ని అంగీకరించే వాళ్ళకూ ఆత్మవాదం (సత్కాయదృష్టి) చెడ్డదే. దీనిని గురించి చెప్తూ ధర్మకీర్తి ఇలా అన్నారు – ఏదైతే 'నిత్యమైన ఆత్మ'ను అంగీకరిస్తుందో, దానికి 'నేను' అనీ దానిపట్ల అతి రాగం (ప్రేమ, స్నేహం) ఉంటుంది. ఈ స్నేహం వల్ల సుఖాలపట్ల కోర్కె పెరుగుతుంది. ఈ కోర్కెలు తప్పుల్ని కప్పి పెడతాయి. అలా కప్పిపెట్టడం వల్ల తప్పులు ఒప్పులుగా కన్పిస్తాయి. ఇక 'నేను', 'నా' సుఖాలు, అన్న కోర్కెలు మితిమీరతాయి. ఈ కోర్కెల వల్లే జీవుడు పునర్జన్మను గ్రహిస్తాడు. ఎప్పటికైతే సత్కాయదృష్టితో ఆత్మను చూస్తాడో అప్పటి వరకూ మానవుడు ఈ ప్రపంచంలో (భవసాగరంలో) పడిపోతాడు. ఆత్మకు 'నేను' 'నా' అనే భావం ఏర్పడ్డాక 'నీవు' 'నీ' అనేది కూడా ఏర్పడి స్వ, పర (నాదీ – నీదీ, నేనూ – నీవూ) భేదాలు ఏర్పడతాయి. ఈ భేదాలు ఎప్పుడైతే ఏర్పడతాయో ఇక రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలు పుట్టుకొస్తాయి. ఇలా ఆత్మపై అతి ప్రేమ పెంచుకొన్నవాడు సుఖ సాధనాల పట్ల ఏర్పడే వ్యామోహాన్ని చంపుకోలేడు.[124]

"నిజానికి ఆత్మ లేదు. ఈ ఆత్మ లేదనే భావనలో ఎప్పుడైతే, (పొరపాటుగా) ఆత్మ వచ్చి కలిసిందో – లేని సుఖం కోసం ప్రాకులాడుతారు. ఈ పనికిమాలిన

స్నేహం వల్ల – కొద్దిపాటి ప్రయోజనానికే పాల్పడతారు.[125] ఎలాగంటే – అందమైన సుందరి లభించనప్పుడు కూడా కాముకుడైన వాడు పశువులతో కామాన్ని తీర్చుకొన్నట్లు ఆత్మవాదులు ఇలా సిద్ధపడతారు."[126]

ఈ విధంగా, నిత్య ఆత్మ అనేది ఒకటుంది అని ఋజువు పరచలేము. ధర్మం, పరలోకం, ముక్తి – వీటికి ఈ నిత్యాత్మ భావన పెద్ద అడ్డంకి.

**iii. ఈశ్వరవాద ఖండన :** ఈశ్వరవాదులు ఈశ్వరుణ్ణి 'నిత్య' మంటారు. అతణ్ణి ఈ జగత్ సృష్టి 'కర్త'గా భావిస్తారు. – ఈశ్వరుడు ఉన్నాడనే విషయాన్ని ఖండిస్తూ ధర్మకీర్తి ఇలా అన్నారు –

'ఈ సృష్టికి ఈశ్వరుడు కారణుడు, కర్త అంటున్నారు. విశ్వసృష్టి చేసే సమయంలో కర్తగా, కారణుడుగా, అతనిలో ఏ విధంగా స్వలక్షణాలు, స్వరూపాలు ఉన్నాయో, అవన్నీ సృష్టికి ముందు కూడా ఆయన కర్తగా, కారణునిగా లేనప్పుడూ ఉండాలి. ఆ స్వరూపం రెండు అవస్థలలో (సృష్టికి ముందూ, సృష్టి క్రమంలో) ఒకే విధమైనది కావాలి. అంటే ఈశ్వరుడు కారణుడు, అకారణుడూ కావాలి లేదా కర్త, అకర్త కూడా కావాలి.

కారణం, అ–కారణం రెండు స్థితుల్లో ఒకరకంగా ఉండే ఈశ్వరుణ్ణి 'కారణుడు' 'కర్త' అనుకున్నప్పుడు మరోప్రశ్న ఎదురవుతుంది – "రాముని శరీరం మీద కత్తి తగిలి గాయం అయ్యింది. దానికి ఔషధం వేస్తే నయం అయ్యింది. ఇలాంటివి మనం చూస్తూనే ఉంటాం. కత్తి, ఔషధాలు క్షణికత్వం కల్గినవి కాబట్టి అవి క్రియను జరిపాయి. కానీ, భగవంతుడు నిత్యుడు. క్రియలేనివాడు. మరి అలాంటి క్రియలేమీ లేనటువంటి భగవంతుణ్ణి కారణంగా భావించడం కంటే ఎండిపోయిన మోడును కర్త (కారణం) అనుకోవచ్చు.

ఒకవేళ – ఈశ్వరుడు సృష్టి కారకుడు అనే స్థితికంటే 'అకారకుడు'గా ఉన్న స్థితి ప్రత్యేకం. అంటే... అప్పుడూ మరో ప్రశ్న ఎదురవుతుంది. ఏమంటే అతని స్వరూపంలో మార్పు రావాలి. ఎలాగంటే అకారకుడుగా ఉన్న స్థితి నుండి 'కారకుడు'గా ఉండే స్థితికి అతను మారాలి. కానీ, ఆయన 'నిత్యుడు' కావడంవల్ల స్వరూపంలో మార్పు రావడం కుదరదు. పైగా నిత్యమైనవాడు 'వేరుగా' ఉండడు. సృష్టితో కలిసే ఉంటాడు. ఇలా కలిసి ఉన్నవాడు – అకారణునిగా ఉన్నవాడు కొంత కాలం కారణుడుగా ఉండాల్సిన అవసరం ఏమొచ్చింది?

"ఏ కారణాల వల్ల యే పని (కార్యం) అవుతుందో, వాటివల్ల కాక, అన్యమైన కారణాల వల్ల అది జరిగింది అనుకొంటే అలా అనుకోవడం ఈశ్వరుని వరకూ వెళ్ళి ఆగిపోవాల్సిన పని లేదు. ఆ స్థితిలో కారణాలకు అంతం అంటూ ఉండదు. ఈశ్వరుని కంటే ఇంకా ముందుకు వెళ్ళి కారణాన్ని వెతకాల్సి ఉంటుంది."

"కార్యాన్ని ఉత్పన్నం చేసినప్పుడు, ఏదైతే మారుతుందో అదే కారణం అవుతుంది. అంకురాన్ని (మొలకని) మొలిపించడానికి, ఆ మొలకకి కారణమైన నేల, విత్తనం మొదలైన వాటిలో మార్పు జరుగుతుంది. నేల, విత్తనంలోని సంస్కారాల కారణంగా మొలకలో ప్రత్యేకత కన్పిస్తుంది – కాబట్టి ఈశ్వరుడు కూడ తన స్వరూపంలో పరివర్తన చెందకుండా కారణం కాలేడు. మరి ఈశ్వరుడు పరివర్తన చెందితే, 'నిత్యుడు' ఎలా కాగలడు?[127]

ఈశ్వరుని ఉనికిని ఋజువు పర్చడానికి, ఈశ్వర వాదాలు చేసే వాదం ఏమంటే... ఒక వస్తువుని చూచి, దాని 'కర్త'ను 'అనుమానం' ద్వారా తెలుసుకోవచ్చు అని. ఎలాగంటే 'కడవ'ను చూచి, దాని కర్త అయిన కుమ్మరిని అనుమానం ద్వారా గ్రహిస్తాం. అలాగే ఈశ్వరుణ్ణి కూడా. ఈ సృష్టి ఉంది కాబట్టి ఈ సృష్టి 'కర్త' ఉన్నాడని ఊహించడం. దీన్ని ఖండిస్తూ ధర్మకీర్తి ఇలా చెప్పారు – 'కుండను చూచి, కుమ్మరిని అనుమానించినట్లు కుమ్మరిలాగా, ఈశ్వరుణ్ణి అనుమానించడం సరికాదు. ఎలాగంటే ఒకచోట ఒకడు పసుపు రంగుతో మండే పొగను చూచి అది నిప్పుగా భావించి – ఇక ఎక్కడ పసుపు రంగును చూచినా అది నిప్పే అని అనుమానించడం సరైనది కాదు. కుమ్మరి కుండ చేస్తాడనుకొని, కుండ ఆకారంలో ఉన్న ఒక మట్టి పుట్టను చూచి, దీని కర్త 'కుమ్మరి' అని అనుకోవడం పొరపాటు.[128] కార్యాన్ని పూర్తి చేయడానికి ఇంకా కారణ **సామాగ్రి** అవసరం ఉంది కదా?'[129]

## II. న్యాయ – వైశేషిక దర్శనాల ఖండన

**న్యాయ***, **వైశేషిక*** దర్శనాలు జగత్తులోని **బాహ్య పరివర్తనా శీలతను** అంగీకరిస్తాయి. యవన (గ్రీకు) దార్శనికుడు **'అరిస్టాటిల్'** దర్శన ప్రభావం ఈ దర్శనాల మీద బలంగా కన్పిస్తుంది. ఈ దర్శనాలు ప్రపంచ ఉపరితలం ఎల్లప్పుడూ మారుతూ ఉంటుందని చెప్తాయి. అయితే బాహ్యంలో పరివర్తన జరిగినప్పటికీ, అంతరంలో నిత్యమైన ఒకే తత్త్వం కల్గిన, చైతన్యపూరితమైన పదార్థాలు ఉన్నాయని నిరూపించడానికి ప్రయత్నించాయి.

మరి, **బౌద్ధ దర్శనం** 'నిత్యతని' అంగీకరించదు. ఎందుకంటే క్షణికవాదాన్ని అతి గట్టిగా అంగీకరించే బౌద్ధ దర్శనంలో 'నిత్యతకు' స్థానమే లేదు. అందుకే నిత్యతా వాదాన్ని అది ఎలాంటి మినహాయింపులూ లేకుండా తిరస్కరిస్తుంది. ధర్మకీర్తి ప్రమాణవార్తికంలో ఇలాంటి సిద్ధాంతాల్ని బలంగా ఖండించడాన్ని చూశాం.

వైశేషికంలోని **స్థిరవాద** సిద్ధాంతాల్ని అనుసరించి పదార్థాల్ని – **'ద్రవ్యం*, గుణం*, కర్మ, సామాన్యం*, విశేషం*, సమవాయం*'** అని ఆరు రకాలుగా భావించారు. బౌద్ధులు పై ఆరింటిలో కేవలం కర్మ, విశేషం – ఈ రెంటినే అంగీకరిస్తారు. వీటిని అంగీకరించడంలో బౌద్ధులకు అభ్యంతరం ఏమీలేదు. ఎందుకంటే, కర్మ లేక క్రియ క్షణికవాదంలో పరమార్థసత్ స్వరూపాలే. అలాగే, విశేషం కూడా హేతు సామాగ్రిని అంగీకరిస్తుంది కాబట్టి విశేషం కూడా బౌద్ధులు అంగీకరించేదే. ఇక, మిగిలిన ద్రవ్యం, గుణం, సామాన్యం, సమవాయం ఇవి కల్పనల మీద ఆధారపడ్డ వ్యవహార సత్‌గా అంగీకరిస్తారు.

**i. ద్రవ్యం, గుణం, మొదలైన వాటి ఖండన :** బౌద్ధుల **పరమార్థసత్, వ్యవహారసత్**ల గురించి నేను ముందే చర్చించాను. అందులో **'అర్థకియ'**ను (ప్రయోగం, ఆచరణలను) పరమార్థసత్‌కి ప్రమాణంగా చెప్తారు. విశ్వంలో ఏదైతే వస్తుజాలం ఉందో అవన్నీ అర్థక్రియను కలిగి ఉంటాయి. అర్థక్రియలు కలిగిలేని వస్తువేదీ పరమార్థసత్ కాలేదు (వస్తుసత్ కాలేదు). విశ్వం, విశ్వపదార్థాల్ని గురించి అటువంటి అభిప్రాయాల్ని కల్గి ఉంటారు బౌద్ధులు. ఐనా వారు, కేవలం వస్తువునే అంగీకరించరు. ఎందుకంటే సాధారణ జనం మనస్సుల్లో 'వస్తువు' అంటే ఒక 'స్థిర'మైన పదార్థం అనే ఉద్దేశ్యం నాటుకుపోయింది. అందుకు బౌద్ధులు 'వస్తువు' స్థానంలో **'ధర్మం'** లేదా **'భావం'** అనే శబ్దాల్ని ఎక్కువగా ప్రయోగించారు. ధర్మం అంటే మతమని గానీ, స్థిరసత్యమని గానీ అర్థం కాదు. బౌద్ధ పరిభాషలో 'ధర్మం' అంటే – "క్షణ క్షణం నశిస్తూ, మరియు ఉత్పన్నమవుతూ విచ్చిన్న ప్రవాహ రూపంలో ఉండే వస్తురూపంలో కన్పించే పదార్థం" అని అర్థం.

అలాగే 'భవం' గురించి – 'భవం' (అగుట) (becoming) అనే పదాన్ని బౌద్ధులు ఎక్కువగా ఇష్టపడతారు. ఎందుకంటే – 'ఉన్నది' అనే శబ్దంకంటే 'వుంటూ... ' అనే శబ్దం ఎక్కువగా పదార్థ స్వభావాల్ని తెల్పడానికి ఉపకరిస్తుంది. ఎందుకంటే

మనం ‘ఉన్నది’ అనే పద ప్రయోగాన్ని చేశామంటే అది పరిసమాప్తమైన విషయాన్ని తెలియజేస్తుంది. ఇది ప్రకృతిలోని పదార్థస్థితికి సరిపోయేది కాదు. ఎందుకంటే – పదార్థ స్థితి పరివర్తన చెందుతూ ...చెందుతూ... వుంటూ... వుంటుంది.

ఇలా చూస్తే వైశేషికం చెప్పే ద్రవ్యం, గుణాల కల్పన క్షణ క్షణ విచ్ఛిన్న ప్రవాహ సిద్ధాంతానికి పూర్తిగా విరుద్ధం. వైశేషికం చెప్పేదేమంటే... ద్రవ్యం, గుణం – ఈ రెండూ – పదార్థాలు (వస్తువులు). అందులో గుణం ఎప్పుడూ ఏదో ఒక పదార్థం మీద ఆధారపడి ఉంటుంది. **‘గంధం’** (వాసన)ను మనం నేలకు ఉన్న ప్రత్యేక తత్వంగా భావిస్తాం. అలాగే **‘రసం’** (రుచి)ను నీటికున్న ప్రత్యేక తత్వంగా చూస్తాం. ఇలా మనం ఎక్కడెక్కడ ద్రవ్యాల్ని చూస్తామో... అక్కడక్కడ వాటిని అంటిపెట్టుకుని ఉండే గుణాల్ని చూస్తాం. ఎక్కడైతే నేలకు చెందిన తత్వాలు లభిస్తాయో అక్కడ దాన్ని అంటిపెట్టుకుని ఉండే గుణమైన గంధం (వాసన) లభిస్తుంది. అంటే... ‘గుణం’ కొరకు ఏదైనా ఒక ఆధారం ఉండాలి. ద్రవ్యం ఎల్లప్పుడూ తన **ఆధేయగుణం**తో పాటే ఉంటుంది అనే భావన గుణం ఉనికిని అంగీకరించడం తప్పదనిపిస్తుంది.

కానీ, బౌద్ధ దర్శనకారులు ఇలా చెప్పారు: ప్రకృతి ఈ ద్రవ్యం, గుణంల భేదాన్ని ఒప్పుకోదు. మనం అర్థం చేసుకోడానికి తేలిగ్గా ఇలా చెప్పుకోవచ్చు వైశేషికులు ‘ద్రవ్యం వేరు, గుణం వేరు అని అంటారు. కానీ, బౌద్ధులు ఈ రెండూ వేరు వేరు పదార్థాలు’ అని ఒప్పుకోరు.

ఒక మామిడి చెట్టు ఉందనుకొందాం. దానికి పది కాయలు ఉన్నాయనుకుందాం. ప్రకృతి ఈ కాయల్ని ఒకటో కాయ... రెండో కాయ... మూడో కాయ... అని ఇలా సంఖ్యాక్రమంలో కాయల్ని ఉత్పత్తి చేసి మన ఎదుట ఉంచదు. ప్రతి ఒక్క మామిడి కాయనూ, వేరే కాయకు భిన్నంగా, ప్రత్యేకంగా ఉంచుతుంది. ప్రకృతికి తెలిసింది ఇదే!

‘భావం (పదార్థం) ప్రతి క్షణం నశిస్తూ ఉంటుంది. తిరిగి ఒక ప్రవాహగతిలో నశిస్తూ, ఉత్పత్తి అవుతూ ఉంటుంది. దీనివల్ల తేలేదేమంటే... ఉత్పత్తి ఎప్పుడూ కారణం కల్గిందే అని. అంటే కారణం లేదా **పూర్వావర్త భావం** కల్గినదై ఉంటుంది. దీని నుండి ఆశ్రయం ఉంటుంది. అంటే వస్తు ఉత్పత్తికి ముందుగా ఉండే ఓ భవ

ప్రవాహం లేదా కారణ సమూహం. దాన్ని ఆశ్రయం (ఆధారం) అంటారు. దీనికి భిన్నమైన అర్థంలో ఆధారంగానీ (ఆశ్రయాన్ని) లేదా ద్రవ్యంగానీ మనకు ప్రకృతిలో దొరకదు. చూడలేం. మరి, జలానికి ఆధారం 'కుండ' అని అంగీకరిస్తున్నాం గదా! అదే విధంగా 'గంధానికి' ఆధారం 'పృథ్వి' అని అనడం తప్పు.[129]

ఎందుకంటే... నీరు మొదలైన ద్రవ పదార్థాలకి ఏదో ఒక ఆధారం అవసరమవుతుంది. ఎందుకంటే... కదలడం (మార్పు) నీటికి సహజ లక్షణం కాబట్టి అది కదిలే గుణాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి, నీటి కదలికల్ని నిలపడానికి 'కుండ' ఉంటుంది. కాబట్టి కుండ నీటికి ఆధారం అవుతుంది. మరి గుణం, సామాన్యం (జాతి), కర్మ – ఇవి కదిలేవి కావు గదా! ఇవి ద్రవ్యం లోపల అంతర్గతంగా ఉంటాయని మనకు తెలుసు. మరి ఈ కదలికలు లేని పదార్థాలకి ఆధారం అవసరం ఏముంది? ఈ రకంగా చూస్తే 'ఆధారం అనే కల్పనే తప్పు' అని తేలాక ఇక ద్రవ్యం, పదార్థం వేరు వేరు అనే ఉద్దేశ్యం కూడా తప్పే అవుతుంది.[130]

'గుణం ఎల్లప్పుడూ ద్రవ్యంలోనే ఉంటుంది'. దీని అర్థం ఏమంటే... ఈ రెండింటికీ మధ్య ఉండే సంబంధం **సమవాయం** (నిత్యం). కాబట్టి ద్రవ్యం, గుణం సమవాయ (నిత్య సంబంధం కల్గినటువంటి) కారణం అవుతుంది – గదా? అని అడగవచ్చు – ఈ **సమవాయ, సమవాయి** – కారణం ఉద్దేశ్యం కూడా ఇంతకు ముందు మనం ఖండించిన – ద్రవ్యం వేరు, గుణం వేరు అనే దాని మీద ఆధారపడిన ఊహే కాబట్టి – ఇది కూడా తప్పు భావనే?

**ii. సామాన్యం ఖండన :** ఆవులు కోట్లాదిగా ఉంటాయి. భూత, భవిష్యత్, వర్తమానాలలోని ఆవుల్ని లెక్కిస్తే వాటి సంఖ్య అసంఖ్యాకంగా ఉండొచ్చు. అసంఖ్యాకమైన ఈ ఆవు గణంలో ప్రతి ఆవుకీ తనదైన 'వ్యక్తి'తత్త్వం ఒకటి ఉంటుంది. కాబట్టి ఆవుల్ని రెండు రకాలుగా వర్గీకరించి చెప్పుకోవచ్చు. ఒకటి : ఆవు వ్యక్తి. రెండు : ఆవు జాతి. ఇన్ని కోట్ల ఆవులన్నింటిలోనూ సామాన్య లక్షణం (ఉమ్మడి లక్షణం) ఒకటి ఉంటుంది. దాన్నే **'గోత్వం'** అంటారు. వ్యక్తులుగా ఆవులు చనిపోయినా, కొత్తగా పుట్టుకొచ్చే ఆవులలో కూడా ఈ గోత్వాన్ని చూస్తాం. అనేక వ్యక్తులలో ఒకే రకంగా ఉండే పదార్థమే **'సామాన్యం'** లేదా **'జాతి'**. వ్యక్తులుగా అనేకం నశించినా 'జాతి'గా నశించవు. 'గోవు' నశిస్తుంది. కానీ, 'గోత్వం' నశించదు. ఇది ఎప్పటికీ ఉండేదే. ఏదైతే ఇలా ఎప్పటికీ ఉంటుందో ఆ'సామాన్యా'న్ని

నిరూపించడానికి 'వైశేషికం' అనేక యుక్తుల్ని ఉపయోగించింది. దీనిని గురించి (ఈ సామాన్యాన్ని గురించి) మొదటే చెప్పుకొన్నప్పటికీ, ఇంకా తేలిగ్గా ఈ ప్రకరణాన్ని అర్థం చేసుకోవడం కోసం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకొందాం.

అనుమాన ప్రకరణంలో ధర్మకీర్తి ఇలా చెప్పారు – "సామాన్యం అనేది వస్తు సత్యం కాదు. అది ఊహ లేదా కల్పన మీద ఆధారపడినదే" అంటారు. అంటే... వ్యవహారరీత్యా సామాన్యాన్ని అంగీకరిస్తాం. కానీ, దానికి వస్తుసత్యం లేదు. అంటే... గోవు 'వ్యక్తి' గా నిజం. గోజాతి అనేది ఒక పదార్థం కాదు. అది నిజం కాదు. 'గోత్వం' అనేది ఒక ఊహే! అది వస్తుసత్యం కాదు. *(సరిగ్గా అస్తిత్వవాదం చెప్పేది కూడా ఇదే – అనువాదకుడు).*

దీన్ని గూర్చి ధర్మకీర్తి ఇలా అంటారు.

"బైటకు పైపైన మనం చెప్పుకునే అర్థం పదార్థం కంటే భిన్నమైంది. శబ్దం పదార్థానికి అర్థాన్నిచ్చే పదంగా కాకుండా, అది పిలిచే వారి సౌలభ్యం కోసం ఏర్పడింది. అలా వ్యక్తులు పిలిచిన శబ్దాలే పదార్థానికి వాచకం అవుతుంది".

సంస్కృత భాషలో "ఒక స్త్రీ" అని చెప్పడానికి 'దారా' అనే బహువచన శబ్దం వాడతారు. అలాగే ఆరునగరాలు అనే బహువచన అర్థాన్ని చెప్పడానికి 'షణ్ణగరి' అనే ఏక వచన శబ్దాన్ని వ్యవహారంలో ఉపయోగిస్తాం – ఇలాంటి ఏకవచన, బహువచన శబ్దరూపాల వ్యవస్థకి కారణం ఏమిటి? అనేక వ్యక్తులకు కలిపివాడే సామాన్యం (జాతి) ఒక్కటి గానే కదా ఉండేది. (అంటే – 'జాతి' అనే పదం ఏక వచనంగా 'ఒకే జాతి' అని వ్యవహారంగా మనకు అనిపిస్తున్నా – జాతి 'ఏక' వస్తువు కాదు. అది అనేకమైన వ్యక్తుల సముదాయం కదా! అని) మరి, ఆకాశం ('ఖ') ఒక్కటే. దాన్ని 'జాతి' వాచకం అని ఎలా అనుకోవాలి. (ఆకాశపన్) అంటే 'ఖత్వం' (ఆకాశత్వం) – దీన్ని సామాన్యమని ఎలా అనుకోవాలి? – దీన్నిబట్టి మనకు అర్థం అయ్యేది ఒక్కటే .... ఏమంటే శబ్ద ప్రయోగం పదార్థ సత్యాన్ని బట్టికాక, పిలిచే వారి స్వేచ్ఛ మీద (అంటే పలకడానికి తేలికగా ఉండే విధంగా) ఆధారపడి ఉంటుంది.[131] అని.

కాబట్టి 'గోత్వం' అనేది ఒక స్వేచ్ఛా ఊహే. దీనికి ఒక వస్తుసత్ స్థితిని ఆపాదించడం తప్పు. దీన్ని బట్టి మనకు తెలిసేది ఏమంటే... వస్తు సత్ను

పరిగణించకుండా, వక్త తన సౌలభ్యం కోసం శబ్దాల్ని ఉపయోగిస్తాడు. 'గోత్వం' లాంటి జాతి వాచక శబ్దాలన్నీ యథార్థ స్థితిని చెప్పేవి కావు. యథార్థాన్ని కప్పిపుచ్చేవి; కావడం వల్ల వీటిని **'సంవృతి'** (అంటే వాస్తవాన్ని కప్పి ఉంచేవి) అంటాం. ఈ రకంగా సంవృతి లేదా కల్పిత బుద్ధి కలిగిన సామాన్య శబ్దాల్ని సత్ అని అంటున్నాం. కానీ, వస్తుస్థితిని బట్టి సామాన్యం అసత్ (లేనిది) అవుతుంది. వస్తు స్థితిని బట్టి 'గోత్వం' అనేది అసత్ భావం అవుతుంది. అంటే అది కేవలం కల్పిత భావం మాత్రమే అవుతుంది. అంటే – గోవులు వ్యక్తులుగా తమలో తాము తేడాల్ని కల్గి ఉంటాయి. అయినా 'గోత్వం' చేత తేడా లేనట్లే చెప్పబడతాయి.

కాబట్టి అనేక పదార్థాలలో ఏకరూపత (సామాన్యం)ని గ్రహించడం ఒక అవాస్తవికమైన కల్పన. అలాగే మానవులు. మానవులు వాస్తవం. 'మానవత్వం' కల్పన. నిజానికి జాతి (సామాన్యం) పరమైన శబ్దాలు – గోత్వం, మానవత్వం మొదలైనవి – మనం వ్యవహారిక సౌకర్యం కోసం ఏర్పాటు చేసుకున్నవి మాత్రమే![132]

ఒకే రకమైన కార్యం (పనిని) చేసే భావాల్లో (వస్తువుల్లో, పదార్థాల్లో) వ్యత్యాసాల్ని గుర్తించడం కోసమే మనం వాటికి పేర్లు (నామ వాచకం) పెట్టుకొంటాం.[133] ఆవులు పాలిస్తాయి. ఇతర పనులు చేస్తాయి. వాటి భేదాల్ని గుర్తించడం కోసం వాటికి ప్రత్యేక పేర్లు పెట్టుకొంటాం.[134] కానీ, వాటి సంఖ్య లెక్కకు మించి ఉండటం చేతనూ, అవి వేరు వేరుగా పేర్లను కలిగి ఉండడం చేతనూ వాటిని చెప్పుకోవడం కష్టం కనుక, వాటి అన్నింటినీ కలిపి ఒకే శబ్దం 'ఆవు' అనే శబ్దాన్ని వ్యవహారంలో ఉపయోగిస్తాం.[135]

ఇక్కడ మరలా మరో ప్రశ్న ఉదయిస్తుంది. సామాన్యం (జాతి)ని నిత్యమని చెబుతున్నాం కదా? అలాంటప్పుడు 'గోత్వం' (సామాన్యం) ఏక దేశీయం (పరిమితం) అయినదా? లేక సర్వ వ్యాపకమైనదా? ఒకవేళ ఏకదేశీయం అయితే, ఒక ఆవువ్యక్తి లోని 'గోత్వం' ఆ 'ఆవువ్యక్తి' వరకే ఉంటుందా? అది మరణించాక దానిలోని గోత్వం (సామాన్యం), వేరే కొత్తగా ఉత్పన్నమైన మరో 'ఆవువ్యక్తి'లో ప్రవేశిస్తుందా? అంటే అలా వెళ్ళదు. గోత్వం అనేది మొదటి నుండి ఏ ఆవు వ్యక్తిలో ఉంటుందో ఆ 'గోత్వం' ఆ గోవులోనే ఉండి పోతుంది. అంతేగాని దాని 'గోత్వం' మరో దానికి పోదు. – మరి, ఏదేని ఒక గోవువ్యక్తి కొత్తగా పుట్టినట్లైతే దానిలో 'గోత్వం' లక్షణాలు

ఉంటాయి. ఆ లక్షణాలు ఉంటేనే కదా దాన్ని గోవు అనేది. అంటే 'సామాన్యం' లేకుండా 'వ్యక్తి' ఉండదు. కాబట్టి 'గోత్వం'ని (సామాన్యం)ని రెండు కొసలు గల అంశంగా అనుకోవచ్చా? మొదటి కొస మరణించిన ఆవువ్యక్తిలో, రెండో కొస నూతనంగా ఉత్పత్తి అయిన మరో ఆవువ్యక్తిలో కలిసి ఉంటుంది. ఇలా అనుకొంటే... నిత్యం అయిన సామాన్యానికి దేశ కాల పరిమితులు ఉండవు అనాలి కదా? అంతేకాదు 'వ్యక్తి'కి బైట కూడా సామాన్యం ఉంటుందని అంగీకరించాలి. అంటే వ్యక్తి, సామాన్యం వేరు వేరుగా ఒప్పుకోవాలి. ఇలా ఒప్పుకొనే 'సామాన్య వాదికి' ఎన్ని కష్టాలంటే, పాపం, అతని కష్టాలకి అంతే ఉండదు మరి. ఎలాగంటే:

వర్తమాన సామాన్యం తన స్థానం కదలకుండా, గతించిన ఆవులోంచి, జన్మించే పిండంలో ప్రవేశించింది అనడం సరైనది కాదు.

సామాన్యానికి (గోత్వానికి) ఒకే ప్రదేశం, కాలం అంటూ ఉండదు. ఎందుకంటే సామాన్యంలో వ్యక్తి ఉండదు. ఒకవేళ సామాన్యాన్ని ఏక దేశీయం కాదు, అది సర్వ వ్యాపకం అని అంగీకరిస్తే – ఒకచోట 'ఆవువ్యక్తి'గా కనపడేది, అప్పుడే అన్ని చోట్లా కనపడాలి. ఎందుకంటే సర్వవ్యాపి అయిన సామాన్యం భేదాలు ఉన్నప్పటికీ ఒకటిగా కన్పించాలి. గోత్వం సామాన్యం. సర్వత్రం (సార్వత్రికం).[136]

**'వ్యంజనం'** (వ్యక్తి) జ్ఞానం లేకుండా **'వ్యంగ్యం'** (సామాన్యం) జ్ఞానం ఉండదు. గోత్వం (సామాన్యం), ఆవు (వ్యక్తి) పుట్టడానికంటే ముందుగానే ఉంటుందా? ఉండదు. వ్యక్తి లేకుండా సామాన్యం ఉండనే ఉండదు. అంటే 'వ్యంజనం' లేకుండా 'వ్యంగ్యం'ను చూడలేము.[137]

వ్యక్తి లేకుండా సామాన్యాన్ని చూడనేలేము. కాబట్టి సామాన్యం **అరూపం***
(చూడలేనిది). 'గోత్వం' అన్నప్పుడు ఏదేని ఒక 'వ్యక్తిగోవు' రూపం మనకు కన్పించదు. కాబట్టి అది అరూపం. వ్యక్తిని (ఆవుని), సామాన్యాన్ని బట్టి ఊహించలేం. ఎందుకంటే సామాన్యం అనేది 'వ్యక్తు'ల యొక్క క్రియా సంబంధమైనది. కాబట్టి సామాన్యం రూపపరంగా ఒక భ్రాంతి మాత్రమే! 'వ్యక్తి' మాత్రమే సహజమైనది.[138]

**iii. అవయవి ఖండన :** అక్షపాదుని గురించి ఇంతకు ముందు మనం చెప్పుకొన్నాం. అవయవాల లోపల లేదా వాటికి వేరైనదీ, వాటికి భిన్నమైనదీ అయిన పదార్థాన్ని **'అవయవి'** అని అక్షపాదుడు అన్నాడని కూడా చర్చించాం.

ఈ అవయవాలకు వేరుగా ఉండే ఈ స్వతంత్ర పదార్థాన్ని **'అంగి'** అని కూడా అంటారు. దీన్ని అక్షపాదుడు నిత్యమైనదని అన్నాడు. ఈ వాదాన్ని ధర్మకీర్తి ఖండించారు. సామాన్యంలో చెప్పినట్టు అవయవాల వ్యవహారాన్ని 'సంవృతి' సత్ అని ధర్మకీర్తి అంగీకరించారు. **'అవయవి'**ని ధర్మకీర్తి అంగీకరించలేదు. అవయవాలకు వేరుగా అవయవి ఉంటుందనే వాదాన్ని కూడా ఖండించాడు.

బుద్ధి (జ్ఞానం) ఏ ఆకారంలో ఉంటుందో అదే ఆ **బుద్ధి*** గ్రాహ్యం అవుతుంది.[139] అంటే దాన్ని బుద్ధి ఆ విధంగా స్వీకరిస్తుంది. దాన్నే **'గ్రాహ్యం'** అంటాం. మనం బుద్ధి (**జ్ఞానం***) చేత అవయవాల స్వరూపాన్ని చూస్తాం. 'అవయవి'ని తెలుసుకోలేం. అంటే వేరు వేరుగా అవయవాల్ని గుర్తిస్తాం. అవయవాలన్నింటికీ కలిపి, వీటికి భిన్నమైంది అయిన 'అవయవి'ని గుర్తించలేం. ఈ భిన్న భిన్న అవయవాల్ని ఒకటిగా చేసి, కేవలం కల్పన ద్వారానే 'అవయవి'ని మన మనస్సులో ఊహించుకుంటాం. ఇది ఒక మానసిక భ్రమ మాత్రమే. 'అవయవి' అనేది ఒక భౌతిక పదార్థంగా లేదు. దీన్ని ఇంద్రియ జ్ఞానం ద్వారా గ్రహించగలం అని అంటే అప్పుడు కూడా మరో ప్రశ్నే ఎదురవుతుంది.

"ఒకేసారి అవయవాలను, అవయవిని ఎలా గ్రహించగలుగుతాం? ఉదాహరణకు ఆవుని చూద్దాం. ఆవులోని కొమ్ములు, గంగడోలుల్ని విడివిడిగా (అవయవాల్ని) చూడకుండా ఆవు మొత్తాన్ని (అవయవిని) ఒకేసారి చూడలేము.[140] అలాగే... ఒక వాక్యంలో మొదటి నుండి ఒక్కొక్క అక్షరాన్ని చదవకుండా వాక్యం మొత్తాన్ని ఒకేసారి చూడలేము. ఒక్కొక్క అక్షరం లేదా ఒక్కొక్క వాక్యం చదువుతున్నప్పుడు ఆ వాక్యం అర్థం మనకు తెలియదు. మనం చదివే క్రమంలో ఒక్కొక్క అక్షరం; దాని తాలూకు సంకేతాల్ని మన మెదడులో ముద్రలను వదులుతాయి. అన్ని అక్షరాలూ అయ్యాక వాటన్నిటి ముద్రలనూ కలిపి మన మనస్సు తన ఊహ ద్వారా ఒక భావాన్ని కలిగిస్తుంది. అది ఒక చాపంగా మన మనస్సులో కదులాడుతుంది. ఆ ఊహాచాపం ద్వారా ఆ అక్షరాలన్నింటినీ ఒక వాక్యంగా కలిపేసుకుని దానికే తగిన అర్థాన్ని గ్రహిస్తాం. అలాగే... ఆవు విషయంలో కూడా... మనం ఆవు తాలూకూ కొమ్ముల్ని, గంగడోలు, తోకలను వరుసగా చూస్తాం. ఇలా చూస్తుంటే వాటి ముద్రలు మన మనస్సులో ఒక్కొక్కటిగా వచ్చిపడతాయి. ఆ ముద్రలన్నింటినీ కలిపి మన మనస్సు ఆవు (అవయవి)ని ఊహిస్తుంది. అంటే

దీన్ని బట్టి మనం తెలుసుకోవాల్సింది ఇది : **'వ్యక్తి'కి భిన్నంగా సామాన్యం అనేది ఎలా లేదో, అలాగే... 'అవయవాలకు భిన్నంగా అవయవి లేదు?'** అని. సామాన్యంగానీ, అవయవిగానీ వస్తుసత్‌లు (పదార్థాలు) కావు.

ఒకవేళ 'అవయవి'... బహుశ ఒక స్వతంత్ర వాస్తవిక పదార్థం అయినట్లయితే– శరీరంలో భాగమైన చేతినిగాని, మరేదైనా ఏదో ఒక శరీర భాగాన్ని కదలించినప్పుడు ఆ అవయవం తాలూకు కదలిక శరీరం అంతా ఎంతో కొంత ఉంటుంది. కానీ, శరీరంలో దాని తాలూకు 'అవయవి' అనేది వేరేదైనా ఉండి ఉంటే అది 'కదలకుండా' ఉండాలి. అలా కదలకుండా ఉండేట్లయితే అది ప్రత్యేకంగా కనిపించాలి.[141]

మరి, అవయవాల కలయిక వల్ల అవయవాలకు భిన్నమైన అవయవి అనే మరో వస్తువు (పదార్థం) ఏర్పడుతుంది అనుకుంటే –

అవయవాలతో పాటు అవయవిని కలపడం వల్ల దాని భారం పెరగాలి.

'అవయవం + అవయవం + అవయవం' – ఈ అవయవాల భారం కొంత బరువుతో ఉన్నాయనుకుందాం. ఈ అవయవాలతో ఒక 'అవయవి' ఏర్పడిందను కుందాం. అప్పుడు అవయవి కూడా ఒక పదార్థం అయితే... దాని భారం ఇలా...

'అవయవం + అవయవం + అవయవం + అవయవి' అయి ఉండాలి. అంటే దాని భారం అదనంగా పెరిగి ఉండాలి. కానీ, అలా పెరగదని మనకు నిజ జీవితంలో తెలుస్తుంది. ఒక తరాజులో ఒక వైపు శిబ్బిలో అవయవాల్ని, రెండో శిబ్బిలో అవయవాలు + అవయవిని ఉంచినట్లైతే ఆ తరాజు ముల్లు రెండో శిబ్బి వైపు మొగ్గు చూపదు.[142]

అలాగే... ఇసుక రాశి (గుట్ట). అనేక సూక్ష్మమైన ఇసుక రేణువులు ఒక్కొక్కటి ఒక చోట ప్రోగు అవుతున్నాయి అనుకుందాం. ఈ ప్రోగుపడే ఇసుక రేణువుల (అవయవాల) విడివిడి భారాల్ని కొలుద్దాం. అలాగే ఈ రేణువులు ప్రోగు పడిన తర్వాత ఆ ప్రోగుని 'గుట్ట' (రాశి) అంటాం. (ఆ గుట్టనే – అవయవి అంటారు). ఇప్పుడు దానికి కొత్తగా 'రాశి' అనే పేరు వచ్చింది కదా? అదే 'అవయవి' కాబట్టి ఇప్పుడు దాని భారం చూస్తే ఇసుక రేణువుల భారానికి గుట్ట భారానికి తేడా ఉండదు. అవయవాలతో (ఇసుక రేణువులతో) పాటు, అవయవి (గుట్ట) వచ్చి చేరినా వాటి రెండింటి మధ్య తేడా లేదు. దీన్ని బట్టి కూడా 'అవయవి' పదార్థం కాదని, అది వస్తుసత్ కాదని తెలుస్తుంది.[143]

అలాగే బంగారం, వెండి మొదలైన లోహాల్ని చిన్నచిన్న ముక్కలు (అవయవాలు)గా ఉన్నప్పుడు వాటి భారానికి, వాటిని కలిపి తయారు చేసిన ఆభరణాల (అవయవి) భారానికీ వ్యత్యాసం ఉండదు. అలాగే... 96 మాసల బంగారాన్ని తూకం వేస్తే 96 మాసలే ఉంటుంది. ఆ బంగారాన్ని కరగించి ఒక డాలర్‌గా (నాణెం) తయారు చేస్తే, అందులో డాలర్ అనే అవయవి కలియడం వల్ల అది 99 మాసలుగా మారదు. అప్పుడు కూడా అది 96 మాసల డాలర్ నాణెం గానే ఉంటుంది.

అంటే... 'అవయవి' (ఆవు – గుట్ట – డాలర్ – వాక్యం) అనేది ఒక కల్పన అని తెలుస్తుంది.

**iv. సంఖ్య మొదలైన వాటి ఖండన :** వైశేషికులు **సంఖ్య, సంయోగం, కర్మ, విభాగం** మొదలైన గుణాలను వస్తుసత్‌లుగా అంగీకరించారు. దీనిని ధర్మకీర్తి సంవృతిసత్‌గా అంగీకరించారు. వస్తుసత్ వాదాన్ని ఖండించారు. ధర్మకీర్తి ఇలా చెప్పారు – సంఖ్య, గుణం, కర్మ – వీటికి 'రూపం' ఉన్నప్పటికీ – ఈ రూపం బుద్ధి (జ్ఞానానికి)కి అందదు. (కాబట్టి ఒకటి, రెండు, మూడు... మొదలైన సంఖ్యా వాచకాల్ని, మంచి, చెడు, ఎరుపు, నలుపు లాంటి గుణాల్ని, అలాగే కర్మల్ని (పనుల్ని) వస్తువులు అనుకో కూడదు. అంటే అవి భౌతికాలు కావు) అవి శబ్దరూపంలో ఉన్నవే. సామాన్యం, జాతి, అవయవిలాగానే ఈ సంఖ్య మొదలైనవి కూడా ఊహించుకున్నవే.[144]

## III. సాంఖ్య దర్శన ఖండన

**చైతన్యం, జడత్వం** – ఈ రెండూ రెండు రకాల విభిన్న తత్త్వాలని సాంఖ్యం అంగీకరిస్తుంది. వీటిలో చైతన్యాన్ని **'పురుషుడ*'**నీ, అది కేవలం నిష్క్రియసాక్షి మాత్రమే నంటుంది. ఇక జడాన్ని – **ప్రధాన్*** – అంటుంది. నిష్క్రియాసాక్షి అయిన చైతన్యం, 'ప్రధాన్' (ప్రకృతి)తో కలియడంవల్ల ప్రధాన్ తన రూపాన్ని మార్చుకోవడం ద్వారా ఈ జగాన్ని ఏర్పరస్తుంది అని కూడా అంటుంది. సాంఖ్యం ప్రకృతిలోని (ప్రధాన్‌లోని) తేడాల్ని అంగీకరించదు.

సాంఖ్యం సత్కార్యవాదాన్ని అంగీకరిస్తుంది – **'సత్కార్యవాదం'** అంటే... కార్యంలో మొదటనే పూర్ణరూపం కల్గిన కారణం ఉంటుంది అని అంగీకరించే వాదం. దీన్ని గూర్చి ధర్మకీర్తి ఇలా అంటారు –

అనేకాలు కలసి ఒకటైతే ఒక పని జరుగుతుంది. ఎలాగంటే – విత్తనం, నీరు, మట్టి (అనేకాలు) ఈ మూడూ కలసి ఒకటైతే (ప్రకృతి – 'ప్రధాన్') మొలక (కార్యం) వస్తుంది. అంటే విత్తనం, నీరు, మట్టి కలసి మొలకను ఉత్పన్నం చేస్తాయి. ఈ మొలకకి కారణం విత్తనం అనుకుంటే అది ప్రధాన్ (ప్రకృతే) (ప్రధాన కారణం) కదా! దానికి నీరు, మట్టి సహకార కారణాలు. ఇవి లేకపోతే కూడా కార్యం (అంకురం) ఉండదు. విత్తనం **మూల భౌతిక తత్త్వం** అయితే, సహకార కారణాలైన మట్టి, నీరులను **'విశేషాలు'** అని అనొచ్చు.

ప్రధాన్ (ప్రకృతి) శాశ్వతమైంది. నీరు, మట్టి (విశేషాలు) తమ రూపాల్ని మార్చుకొన్నప్పటికీ, ప్రకృతి తన మూలతత్త్వాన్ని మార్చుకోదు. మట్టి, నీరుల రూపాలు నశించేవి. ఈ మట్టి, నీరు అనేవి విశేషాలు గదా! ఈ విశేషాలలో ఏది లోపించినా కార్యం (మొలక) జరగదు. కాబట్టి కార్యం (మొలక) ప్రధాన్ (ప్రకృతి) నుండి కాక సహకార కారణాల (విశేషాల) రూపాంతరం వల్లే సంభవిస్తుంది అనాలి.

భావానికే (పదార్థానికే) పరమార్థ తత్త్వం ఉంటుంది. అది మాత్రమే అర్థక్రియల్ని చేయగలదు. అంటే అది మాత్రమే ఉత్పన్నం చేయగలదు. అలాంటి అర్థక్రియల్ని చేసే మట్టి, నీరు లాంటి విశేషాలు – అవి పరస్పరం వేరు వేరు పదార్థాలైనట్లే వాటి కార్యం (మొలక) కూడా వేరుగానే ఉంటుంది. అంటే కార్యంలో వాటి చర్యలు వేరు వేరుగానే ఉంటాయి. అలానే పరివర్తన చెందుతాయి. కానీ, ప్రకృతి (ప్రధాన్) మూల రూపం పరివర్తన చెందదు. కాబట్టి, ప్రధాన్ ఇక్కడ మొలక (కార్యం)గా మారడం అసంభవం. ఎందుకంటే సత్కార్య వాదాన్ననుసరించి, పరివర్తన కల్గిన మట్టీ, నీరు లాంటి సహకార కారణ విశేషపదార్థాలే కార్యానికి (మొలకకి) కారణాలు కాగలవు.

*(మొలక నిరంతరం మారుతూ ఉంటుంది. పరివర్తన చెంది పెరుగుతూ ఉంటుంది. సాంఖ్యులు ప్రకృతి 'మారనిది' అంటారు కాబట్టి ఇక్కడ మొలకకి ప్రకృతితో పనిలేదు కదా! అనేది – అనువాదకుడు)*

మరి, ప్రధాన్ (ప్రకృతి) పరివర్తన చెందలేని నిత్య పదార్థం అనుకుంటే, అదే ఉత్పత్తికి మూల కారణంగా భావిస్తే – మట్టి, నీరు, బీజం ఇవి కూడా ప్రకృతి (ప్రధాన్) మయమే కావాలి. అప్పుడు వీటిని కూడా – పరివర్తన చెందని వాటిగానే భావించాలి. నిత్య పదార్థాలుగానే నిర్ధారించాలి. అలా అనుకుంటే బీజం ఒక్కటే

ఉంటే చాలు మొలకెత్తడానికి. ఇక మట్టి, నీరు లాంటివి ఉండనక్కరలేదు. వాటి సహకారం లేకుండానే బీజం మొలకెత్తాలి అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. 'బీజం, మట్టి, నీరు ఒక్కటి కాదు, ఆ మూడు భిన్నమైనవి. ఆ మూడూ ఒకటైతేనే మొలక పుడుతుంది'[145] అంటే...

ధర్మకీర్తి ఇలా అంటారు.[146] "ఉత్పత్తి కొనసాగించడానికి వాటి కార్యాలనే కారణాలంటాం. వాటినే పదార్థాల 'స్వలక్షణం' అంటాం. అదే వస్తుసత్ అయి ఉంటుంది. దాన్ని పొందడానికి మనుషులు విభిన్నమైన పనులు ప్రవృత్తిగా చేస్తారు" అంటారు ధర్మకీర్తి.

సాంఖ్యం అంగీకరించిన మూల భౌతిక తత్త్వాలు (ప్రధాన్ లేదా ప్రకృతి) – మట్టి, బీజం, నీరు, నిప్పు – వీటన్నింటిలో సమానంగా ఉంటే... అన్ని పదార్థాలూ కార్యాలకు (కుండ, మొలక) కారణాలు కావాలి. కానీ మనం అలా జరగడం చూడలేం. మొలకెత్తడానికి (ఒక కార్యానికి) అవసరం అయిన కారణాలు, కుండ, ఆభరణాల (మరో కార్యాలు) ఉత్పత్తికి కారణాలు కాలేవు. అన్ని భౌతిక తత్త్వాలు, అన్ని ఉత్పత్తులకు పనికి రావు. మట్టి, బీజం, నీరు, నిప్పు, సువర్ణం లాంటి భౌతికతత్త్వాల వెనుక – పూర్వ కారణం క్షణిక పరమాణువు లేదా వాటి భౌతిక మూలతత్త్వం ఒకటే అయి ఉంటే – వాటి కారణాలన్నీ – అన్ని కార్యాలనీ చేయగలగాలి. అంటే ఆ భౌతిక తత్త్వాలు అన్నింటినీ ఉత్పత్తి చేయాలి. అలా జరగదు" అంటారు ధర్మకీర్తి.[147]

"ఇదే కాదు. కారణానికీ, కార్యానికీ తేడా లేదని చెప్పే సాంఖ్యుల **సత్కార్య వాదం** కూడా తప్పే. సాంఖ్యం అన్నీ ప్రధాన్ (ప్రకృతి) రూపాలే అంటుంది. ఈ విశ్వం, ఈశ్వరుడు ఇవ్వన్నీ నిత్యాలే. శాశ్వతాలే అంటుంది. ఈ శాశ్వత పదార్థాల నుండి రూపాంతరం చెందినవే ఈ విశ్వ పదార్థాలన్నీ అంటుంది. అంటే ఆ పదార్థాలలో భేదాల్ని అంగీకరించదు. నీరు = ప్రధాన్. నిప్పు = ప్రధాన్. చక్కెర= ప్రధాన్. కారం = ప్రధాన్ అంటుంది. అంటే నీరు, నిప్పు, చక్కెర, కారం – ఇవ్వన్నీ ప్రధాన్ యొక్క రూపాలే అంటుంది. ఇది సాంఖ్యులు చెప్పే సత్కార్య వాదం. ఈ సత్కార్య వాదమే సరైనది అనిపిస్తుంది. ఈ అసత్కార్య వాదాన్ననుసరించి కారణం ఒకటి కాదు. అవి అనేకాలు. అనేక కారణాలు కలిసి ఒక కార్యాన్ని పూర్తి చేస్తాయి.

మరి, ప్రతి కార్యం తన కారణాలకి పూర్తిగా భిన్నమైనటువంటి వస్తువే. ప్రతి నూతన ఉత్పన్న కార్యం తన కారణాలలో పోలికల్ని కలిగి ఉంటుంది. ఈ సాదృశ్యం వల్ల "ఇది అదే" లేదా "అదే ఇది" అనే భ్రమకు లోనవుతాం.

## IV. మీమాంసా ఖండన

మీమాంసా దర్శనాన్ని గూర్చి నేను మొదట్లోనే రాశాను. మీమాంసా సిద్ధాంతం ఏంచెప్తుందంటే... " ప్రత్యక్షం, అనుమానం – అనే ప్రమాణాల ద్వారా మన ఎదురుగా ఉన్నదాన్నే మనం సరిగా గ్రహించలేం. మరి, అలాంటప్పుడు పరలోకం, స్వర్గం, నరకం, ఆత్మ మొదలైనవి మన ఇంద్రియాలకు కన్పించేవి కానేకావు. కన్పించే వాటిని గూర్చే సరిగా చెప్పలేనివి, కన్పించని వాటి గూర్చి సరైన జ్ఞానాన్ని ఎలా ఇవ్వగలవు? కాబట్టి – ప్రత్యక్షం, అనుమానం అనే ప్రమాణాల కన్నా **'శబ్ద ప్రమాణం'** (వేదం) ఉన్నతమైంది" అంటుంది మీమాంసా దర్శనం. **శబ్దం*** అంటే మాట. మాటే ప్రమాణం అంటుంది. అందునా వేదం చెప్పిన మాటే ప్రమాణం అంటుంది. ఈ దర్శనం వేదాల్ని అపౌరుషేయాలంటుంది. అంటే పురుష రచనలు కావు. అంటే ఏ మానవుడో, దేవతో, ఈశ్వరుడో రచించినవి కావు. సనాతనమైనవి అంటారు వేదాల్ని గురించి, శబ్ద ప్రమాణం గురించి మీమాంసకులు.

కానీ, బౌద్ధులు ప్రత్యక్షం, అనుమానం తప్ప మరో ప్రమాణాన్ని అంగీకరించరు. కాబట్టి వేద ప్రమాణాన్ని అంగీకరించరు. ప్రమాణాల గీటురాయి మీద పరీక్షించి చూస్తే వేదంలోని హింసాపూరిత యజ్ఞాలు, కర్మకాండలు అమానుషాలనిపిస్తుంది. పురోహిత వర్గం తమ పబ్బం గడుపుకోడానికి దక్షిణల కోసమే వేదం ఉపయోగ పడుతుంది అని ఋజువు అవుతుంది. అసత్యాలకు, అతిశయోక్తులకూ పుట్టినిల్లని తోస్తుంది. పరాన్నభుక్కులైన పురోహిత వర్గం చెప్పే వేదోక్తులన్నీ అబద్ధాలని, అసంబద్ధాలని తేలిపోతుంది – ఇలాంటి సంకటంలో వేదాలు పడ్డప్పుడు, ఆనాటి సమాజంలో తిరిగి వేదాల్ని బతికించడానికి మీమాంసా దర్శనం లాంటి దర్శనాన్ని రచించి, శబ్దప్రమాణమే శ్రేష్ఠమైన ప్రమాణం అని ప్రచారం చేయాల్సిన అవసరం ఆ పురోహితవర్గానికి ఎంతో ఉంది. ఆ బ్రాహ్మణ పురోహితవర్గం చేతిలోని పదునైన ఆయుధంగా వేదం మారింది. ఆ పదునైన ఆయుధానికి ఒక అంచు **కర్మకాండ**, రెండో అంచు **జ్ఞానకాండ**. ఈ రెండంచుల కత్తిని తునాతునకలు చేసే పని బుద్ధుడు చేశారు.

ఈ రెండంచుల కత్తిలో జ్ఞానకాండ అంచును పదునుగా నూరిన వారు **అక్షపాదుడు, వాత్స్యాయనుడి**లాంటి భాష్యకారులు. ఈ భాష్యకారుల మీద బౌద్ధ దార్శనికుడైన దిఙ్నాగుని తర్కమనే బాణం వేటు బలంగా పడింది. దీనితో చావుదెబ్బ తిన్న వేదాల్ని రక్షించే ప్రయత్నాన్ని పాశుపతాచార్య **ఉద్యోత్కర భరద్వాజుడు** (క్రీ.శ.500) తీవ్రంగా చేశారు. ఈ ప్రయత్నాల్ని ధర్మకీర్తి తిప్పి కొట్టారు. మట్టి కరపించారు. ధర్మకీర్తి దెబ్బకు ఉద్యోత్కర భరద్వాజుడు ఎంతగా మట్టికరచారంటే... ఈ విషయంలో ఒక నానుడి ఇలా ఉంది... "ధర్మకీర్తి అనే తర్క ఊబిలో చిక్కుకున్న ఉద్యోత్కరుడనే ముసలి ఆవుని కాపాడటానికి **వాచస్పతి మిశ్రుడు** నడుం కట్టాల్సి వచ్చింది."

కానీ, ఈ తార్కికుల ప్రయత్నాల వల్ల వైదిక జ్ఞానకాండ, కర్మకాండల అడుగులు సరిగా ముందుకు పడలేదు. దీనితో వైదిక సంప్రదాయాల్ని ముందుకు నడిపే బాధ్యతని **జైమిని**, బాదరాయణులు తీసుకున్నారు. ఇందులో జ్ఞానకాండ (బ్రహ్మవాదం) మీద **బాదరాయణుడు,** కర్మకాండల మీద జైమిని తమ ఘంటాల్ని కదిలించారు. వీరి భాష్యకారుడైన **శబర,** అసంగుని విజ్ఞాన వాదాన్ని బాగా అధ్యయనం చేశాడు. దిఙ్నాగుడు, అక్షపాదుడు, బాదరాయణులతో పాటు శబర, జైమినిలను కూడా తన తర్కశరాఘాతాల పాల్జేశారు. ఈ దెబ్బల నుండి కోలుకోడానికి న్యాయదర్శనకారుడైన ఉద్యోతకర భారద్వాజుడు వేయి విధాల ప్రయత్నించారు. ఉద్యోతకరునికి తోడుగా మీమాంసకుడైన **కుమారిల భట్టు** నిలిచారు. ధర్మకీర్తి ఉద్యోతకరుణ్ణి మట్టి కరపించడంతోపాటు కుమారిల భట్టుని సైతం తన తర్కమనే పదునైన బాణాల వర్షంలో ముంచెత్తారు.

మీమాంసకులు వేద ప్రమాణాన్నే కాకుండా **'ప్రత్యభిజ్ఞం'**ను కూడా ఒక ఉన్నత ప్రమాణంగా భావిస్తారు. ఈ రెండు ప్రమాణాలను గురించి ధర్మకీర్తి అభిప్రాయాల్ని ఇప్పుడు చూద్దాం.

**i. ప్రత్యభిజ్ఞ ఖండన :** మనం మన ఎదురుగా ఉన్న ఒక పదార్థాన్ని చూచి 'ఇది అదే' అని గుర్తించడం. జ్ఞాపకం తెచ్చుకోవడం. మన ఎదుట నిలబడిన 'రాముడు' అనే వ్యక్తిని చూచి 'ఇతడు ఆ రాముడే' అని గ్రహించడం. అలా జ్ఞాపకం తెచ్చుకొనేదే ప్రత్యభిజ్ఞం. అంటే ఇది ఒక ప్రామాణిక స్మృతి. అంటే ప్రమాణంగా భావించాల్సిన

జ్ఞాపకం, ఎరుక. మీమాంసకులు ఈ ప్రత్యభిజ్ఞ ప్రమాణాన్ని ప్రత్యక్ష ప్రమాణంగానే భావిస్తారు. దాన్ని వారు **స్పష్టావభాస ప్రత్యక్ష ప్రమాణం** అంటారు. బౌద్ధులు ఈ ప్రమాణాన్ని ప్రత్యక్ష ప్రమాణంగా అంగీకరించరు. ఎందుకంటే "ఇది అదే" "ఇతడు అతడే" అనే జ్ఞానం కొంత ఊహమీద (స్మృతి మీద) ఆధారపడి ఉంది కాబట్టి.

ఈ ప్రత్యభిజ్ఞ ప్రమాణంలో 'బాగా తెలియడం' (స్పష్టావభాసం) గూర్చి ధర్మకీర్తి ఇలా అన్నారు: 'గొరిగినాక మరలా వచ్చే జుట్టు, గారడీవాడు తెప్పించే కొత్త కొత్త వస్తువులు, క్షణక్షణమూ నశిస్తూ, నూతనంగా పుట్టుకొస్తూ వెలిగే దీపశిఖ – వీటిలో 'ఇది అదే' అనేది స్పష్టంగా తెలుస్తుంది – అయితే, ఇప్పుడు కొత్తగా వచ్చే జుట్టు, ఆ వెనుకటి (గొరిగిన) జుట్టేనా? కొత్తగా తీసిన గోళీకాయ, నిజంగా మొదట చూపించిన దేనా? అలాగే... ఇప్పుడు కన్పించే దీపశిఖ మొదటి కన్పించిన కాంతిశిఖ అవుతుందా? ఈ ప్రశ్నల్ని బట్టి ఆలోచిస్తే అవి 'కావు' అనే స్పష్టంగా తెలుస్తుంది. మరి అలాంటప్పుడు 'ఇది అదే' 'ఇతడు అతడే' అనడం తప్పు కాదా?" అని ధర్మకీర్తి ప్రశ్నించాడు. "మనకు ఈ భేదం స్పష్టంగా తెలుస్తుంది కదా! మరి, అలాంటప్పుడు ఇది ప్రత్యక్షం ఎలా అవుతుంది? ఇది కేవలం భ్రమ కల్గించే జ్ఞానమే. కల్పనాత్మక జ్ఞానమే. కాబట్టి భ్రమాత్మక జ్ఞానం ప్రత్యక్షం ఎలా అవుతుంది? అందుకని బౌద్ధులు ప్రత్యభిజ్ఞత వల్ల కలిగే 'ఇది అదే' అనే జ్ఞానం సరైనది కాదంటారు.[148]

**ii. శబ్ద ప్రమాణ ఖండన :** యథార్థ జ్ఞానాన్ని ప్రమాణం అని చెప్తారు. **కపిలుడు*, కణాదుడు*, అక్షపాదుడు*** – వీరు ప్రత్యక్షం, అనుమానం, ఈ రెండు యథార్థ ప్రమాణాలతో పాటు శబ్దప్రమాణాన్ని (ఆప్తవాక్యాన్ని) కూడా ఒక ప్రమాణంగానే అంగీకరించారు. ఒక యథార్థవక్త (ఆప్తపురుషుడు) చెప్పిన విషయాన్ని శబ్ద ప్రమాణం అంటారు వారు. ఐతే, మీమాంసకులు చెప్పినట్లు ఎవరు యథార్థవక్త (ఆప్తపురుషుడు)? ఎవరు చెప్పింది యథార్థవచనం (ఆప్త వచనం)? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దాన్ని చెప్పడం అసంభవం అంటారు బౌద్ధులు.

**A) అపౌరుషేయం వ్యర్థమైనది :** 'ఏది ఆప్తవచనం?' అనే దానికి సరైన ప్రమాణం ఏదీ లేదు. ఎవరు సత్యవాదో, ఎవరు అసత్యవాదో తెలుసుకోవడం. కష్టం. "ఒకడు చెప్పేది అబద్ధమో, నిజమో తెలుసుకోవడం ఎంతో కష్టం.[149]" అంటూ వేదాలు అపౌరుషేయాలు అన్నవాదాన్ని ధర్మకీర్తి ఖండించారు.

మీమాంసకులు ఇలా అంటారు – "మనిషి చెప్పే మాటలు నిజాలై ఉండవు. ఎందుకంటే అజ్ఞానం, రాగం, ద్వేషం, మొదలైన దోష గుణాల వల్ల వారు చెప్పే మాటలు (శబ్దం) అబద్ధాలై ఉంటాయి. అంటే పౌరుషేయాలు (పురుష వాక్యాలు అంటే మనుషులు చెప్పే మాటలు) అబద్ధాలవుతాయి. మరి, అపౌరుషేయాలు (మనుషులు చెప్పని మాటలు అంటే... వేదం చెప్పే మాటలు) మాత్రమే సత్య వాక్యాలు కాగలవు"[150] అంటారు.

దీన్ని ధర్మకీర్తి ఇలా ఖండించారు.

"అజ్ఞానం, రాగం, ద్వేషం – ఈ గుణాలే కాదు, మనుషుల్లో జ్ఞానం, అ–రాగం, ప్రేమ–మొదలైన గుణాలు కూడా ఉంటాయి కదా! మరి, మనుషులు చెప్పని అపౌరుషేయ వచనాలు సత్యాలెలా అవుతాయి? మనుషులు చెప్పిన పౌరుషేయాలు సత్యాలు కాకుండా ఎలా పోతాయి?"[151]

"ఒక శబ్దం అర్థాన్ని తెలుసుకునే సాధనాలు బాహ్య సంకేతాలే. 'ఆవు' శబ్దం అర్థాన్ని, దాని కొమ్ములు, తోక, గంగడోలు, ఇలాంటి సంకేతాల ద్వారానే తెలుసుకుంటాం. ఇలాంటి లక్షణాలు ఉన్న జీవి 'ఆవు' అని గ్రహిస్తాం. ఇలాంటి శబ్దాల్ని ఏర్పాటు చేసుకుంది మనుషులేకదా! కాబట్టి ఇవి పౌరుషేయాలే అవుతాయి. అంతేగాని ఇవి అపౌరుషేయాలు కావు. ఈ సంకేతాలు పౌరుషేయాలయినప్పుడు, ఈ వచనాలతో (మాటలతో) కూర్చిన అపౌరుషేయం (వేదం) కూడా అబద్ధమే అవుతుంది".

"ఒకవేళ శబ్దం దాని అర్థం సంబంధం అపౌరుషేయం అయితే ఏమీ తెలియని వానికి (అజ్ఞానికి) కూడా పూర్తి వేదార్థజ్ఞానం ఉండి ఉండాలి. ఇది ఎలాగంటే నిప్పు, వేడికి గల సంబంధం లాంటిది. నిప్పు, వేడిల సంబంధం అపౌరుషేయం. పౌరుషేయమైన సంకేతం చేతే (అర్థజ్ఞానం చేత) వేదాన్ని అర్థం చేసుకోగలం కానీ, మరో రకంగా ఏదో ఒక కల్పన సంబంధంగా దాన్ని అర్థం చేసుకోలేము."

"ఒకవేళ శబ్దాలు, వచనాలు ప్రకృతి సిద్ధం అయినవైతే, అంటే అపౌరుషేయాలైతే... వాటికి ఒకే అర్థం ఉండాలి. ఒకే అర్థంలో తప్ప మరో అర్థంలో వాటిని ప్రయోగించ కూడదు. ఒకవేళ ఒకే శబ్దానికి అనేకార్థాలు ప్రకృతి సిద్ధం అంటారా!" – అలాగైతే...

"అగ్నిస్తోమ యాగం స్వర్గం పొందడానికి సాధనం" అనే వాక్యాన్ని

"అగ్నిస్తోమ యాగం నరకాన్ని పొందడానికి సాధనం" అనే అర్థంలో కూడా వాడాల్సి ఉంటుంది.[152] ఎలాగైనప్పటికీ ఏమైనప్పటికీ వేదాలు మానవులు రచించినవి కావు అని అంగీకరించినప్పటికీ ఈ సమస్య తీరిపోదు. చిక్కు సమస్యలు మనల్ని వదిలి పెట్టవు.

'శబ్దం, అర్థ'ం వీటి సంబంధాన్ని సంకేతాల ద్వారా వ్యక్తం చేయలేనటువంటిది అని అంగీకరిస్తే – అంగీకరించిన శబ్దప్రమాణం (వేదం) అక్షరాలా ఉపయోగం లేనిది అవుతుంది. ఎందుకంటే శబ్దార్థాలు మానవ సంకేతాలను బట్టే ఉంటాయి. ఈ శబ్దార్థాల సంకేతాల్ని ప్రజలందరూ గురుశిష్య సంబంధంగానే తెలుసుకోగలరు. ఇది ఎవ్వరూ తిరస్కరించలేనిది. ఒకవేళ వేదవచనాలే అపౌరుషేయాలు అని అనుకొంటే అది సరిగ్గా గజస్నానం మాత్రమే అవుతుంది. శబ్దాలు పౌరుషేయాలూ – వేద వచనాలు అపౌరుషేయాలు – అని అంగీకరించినా, అప్పుడు కూడా వేదార్థాలన్నీ ప్రామాణికం కావాల్సిన పని లేదు.[153]

ఇక, వేదాల్ని అపౌరుషేయాలని ఋజువు చేయాలనే జైమిని చూశారు. జైమిని ప్రయత్నం అక్షరాలా తప్పు.

"వేద వచనాల కర్తల పేర్లు మనకు తెలియదు. అందువల్ల అవి అపౌరుషేయాలు" అని వాదించే వారిని తీవ్రంగా ఖండించారు ధర్మకీర్తి.

"వీరి అజ్ఞానం, మూర్ఖత్వం అనే కటిక చీకటి నీడలు ప్రపంచాన్ని ముంచేశాయి" అన్నారు ధర్మకీర్తి.[154]

ఇంకా... వేదాల్ని అపౌరుషేయాలని ఋజువు చేయడానికి ఇంకొందరు ఈ విధంగా ప్రయత్నిస్తారు.

'గురువుగారి ఎదుటిగా ఉన్న విద్యార్థి గురువు గారి నుండి అక్షరాలూ, శబ్దాలూ, పదాలూ, క్రమంగా శ్లోకాలూ, భావార్థాలూ చెప్పించుకొంటాడు. అప్పుడు గానీ వేదార్థాల్ని గ్రహించలేడు. అలాగే... ఆ గురువు కూడా తన గురువు దగ్గర, ఆ గురువు తన గురువు దగ్గర... అలా వారి దగ్గర నేర్చుకోకుండా చెప్పలేరు. అంటే ఇలా ఈ గురు పరంపరకు అంతం లేదు,[155] అనంతం కాబట్టి వేదం అనాది.

అపౌరుషేయం అని ఋజువు అయ్యింది అనే కుతర్కంతో వాదించే వారు ఒక విషయం మర్చి పోతున్నారు. వేదాలనే కాదు, ఇతర రచయితలు రచించిన గ్రంథాలు కూడా గురుశిష్య పరంపరగా పఠిస్తూనే ఉన్నారు. **'కాళిదాసు'** రచించిన **'రఘువంశం'** కూడా ఇలాగే బోధించ బడుతుంది. గురువులు శిష్యులచే కంఠస్థం చేయించేవారు. కాబట్టి రఘువంశం కూడా అపౌరుషేయమేనా?[156]

'మనిషి గురుశిష్య సంబంధం వల్ల గానీ, తండ్రీకొడుకుల సంబంధం వల్ల గానీ ప్రతి ఒక మాటనూ నేర్చుకుంటాడు. మరి, మీమాంసకులు ఈ విషయాన్ని ఆధారంగా వేదాన్ని అనాది, అపౌరుషేయం అని వాదిస్తారు. మరి, అలాగయితే మ్లేచ్ఛులు మొదలైన భారతీయులు కాని జాతులవారు తల్లినీ, కూతుళ్ళను కూడా వివాహం చేసుకొంటారు. వారికి ఆ ఆచారం పరంపరగా రావడం గురువులు, తల్లిదండ్రులు పరంపరగా నేర్పడం వల్లే. కాబట్టి ఆ ఆచారం కూడా అనాది అయినదే. అందుకని దాన్ని కూడా అపౌరుషేయం అనే అందామా? ఇదే కాదు ఈ గురుశిష్య పరంపరని బట్టి చూస్తే నాస్తిక గ్రంథాలూ అనాది అయినవే. అప్పుడు అవీ అపౌరుషేయాలే అవుతాయి. స్వతః ప్రమాణమూ అవుతాయి.[157]

ఇక సరే, వేదాల్ని అపౌరుషేయాలని, అంగీకరించినంత మాత్రాన జైమినికి, కుమారిలభట్టులకు ఒరిగేది ఏమీ ఉండదు. దానివల్ల వారికి కలిగే ప్రయోజనం శూన్యం. ఎందుకంటే అప్పటికే 'ధాన్యం అంతా పది దారుల్లో పోనేపోయింది'. (అంటే... అన్ని రకాలుగా అయిపోయింది. దాన్ని గూర్చి చర్చ అనవసరం అని).

**B) అపౌరుషేయం ముసుగులో కొందరి గొప్పతనం పెంచారు :** 'నిజానికి, వేరొక ఉద్దేశ్యంతో (స్వార్థంతో) జైమిని, కుమారిల – అండ్ కంపెనీ వారు 'వేదం అపౌరుషేయం' అనే నినాదానికి పెద్ద ఎత్తున ప్రచారం తెచ్చారు.

'ఈ (వేదం) మాటలకి 'అర్థం ఇది', 'అది కాదు'. మానవులు కల్పించే అర్థాలు సరైనవి కాదు. ఎందుకంటే వారు రాగద్వేషాలకు అతీతులు కారు. కాబట్టి మానవ కల్పిత అర్థాలు రాగద్వేషయుక్తమైనవి'. అంటారు జైమిని మొదలైన వేదార్థ తత్త్వవేత్తలు. ఇక్కడ మనకూ కొన్ని ప్రశ్నలు పుట్టుకొస్తాయి. 'ఈ జైమిని కూడా మానవ మాత్రుడేకదా? ఆయన కూడా రాగద్వేషాది గుణాలకు అతీతుడు కాదు కదా! కాబట్టి అతను చెప్పిందీ గ్రహించాల్సిన పనే లేదు కదా! ఆయనొక్కడే జ్ఞానా? మరొకరు కారా?[159]

**C) 'అపౌరుషేయం' అంటూ వేదార్థాన్ని అనర్థం చేశారు :** మీరు అంటారు– "మనిషి స్వార్థం, రాగం, ద్వేషాలు కల్గినవాడు. కాబట్టి వేదార్థాల్ని సరిగా తెలుసుకోలేడు" అని. మరి ఎలా? వేదాలకు నోరుందా? తమ గురించి తాము చెప్పుకోగలవా? ఇంక చూడండి... వేదాలకూ, వేదార్థాలకు ఏ గతి పట్టిందో? ఇక నేం చెప్తాం... మనిషికి అర్థం కావూ, అవి తమ గురించి తాము చెప్పుకొనలేవూ. ఈ గజిబిజి గందరగోళంవల్ల... వేదార్థాలు ఎవ్వరికీ అంతుబట్టని కారణంగా "స్వర్గం కోరే వారు అగ్నిహెూత్రహెూమం చేయండి" అనే వేద వాక్యం 'స్వర్గం కోరేవారు కుక్క మాంసం తినండి'" అనే అర్థాన్ని తీస్తే... మీరు ఇలా అనవచ్చు. అలా అర్థాన్ని తీయ కూడదు అని. ప్రజల్లో వేదాలు పేరుగాంచినవి కాబట్టి ఇలాంటి అర్థాన్ని తీయకూడదు అని. మరి దీనికి ప్రమాణం ఏముంది? ప్రజలందరూ స్వార్థ రాగ ద్వేషాలు కలవారే అయినప్పుడు వారిలో ఎవరు వేదార్థాల్ని సరిగ్గా అర్థం చేసుకో గలవారు? అనేక అర్థాలున్న శబ్దానికి 'దీని అర్థం ఇదే' అనే నిశ్చయం ఎవరు చేస్తారు?

'మేమే వేదజ్ఞులం' అని భావించే మీమాంసకులు వేదాలకి వేరువేరు అర్థాల్ని వారే చెప్పారు. ప్రజల్లో రూఢి అయిన అర్థాలకి కూడా వేరువేరు అర్థాల్ని చూపించారు. 'స్వర్గం' అనే దానికి లోకంలో అందరికీ తెలిసినది, లోకం సమ్మతించిన అర్థం ఏమంటే – 'మనుషుల కంటే ఉన్నతమైన వ్యక్తుల నివాసం'. అక్కడ 'మానవాతీత' (అమానుష) సుఖం లభిస్తుంది. ఆ సుఖాన్ని పొందే సాధనాలు అక్కడ ఎల్లప్పుడూ లభిస్తాయి' అని. మరి, దీనికి విరుద్ధంగా మీమాంసకులు ఇలా చెప్తారు – 'స్వర్గం అనే శబ్దానికి వారు చెప్పే అర్థం ఏమంటే – అది "దుఃఖ రహితమై ఉండేది. ఎక్కడా దొరకని సుఖాన్నిచ్చేది" అని. అలాగే... 'ఊర్వశి' అంటే లోకానికి తెలిసిన అర్థం 'స్వర్గలోకంలోని అప్సర' అని. దీనికి విరుద్ధంగా మీమాంసకులు చెప్పే అర్థం ఇది– ఊర్వశి అంటే **ఆరణి** అనే యజ్ఞ పాత్ర అని. అదేవిధంగా 'జుహుయాత్' అనే శబ్దార్థం – అందరికీ తెలిసింది 'కుక్కా, మాంసం తిను' అని. మరి అలాగే 'అగ్నిహోత్రా జుహుయాత్' అంటే 'అగ్నిహోత్రయాగం చేయాలి' అనే అర్థానికి బదులు 'కుక్కా – మాంసం తిను' అనే అర్థాన్నే ఎందుకు తీసుకోకూడదు?[160]

ఇతరుల్ని మోసం చేయడానికే పురోహిత వర్గం వేదాల్ని అపౌరుషేయాలని అంది.

వెనుకటికి ఒకడు మరొకణ్ణి "రాజగృహం వెళ్ళే మార్గం ఎటు?" అని అడిగాడట. అప్పుడు వాడు 'ఈ మార్గం' అని అబద్ధం చెప్పాడు. అప్పుడు మరొకడు 'నేను చెప్తున్నాను ఇదే మార్గం' అని చెప్పాడుట. విజ్ఞులు వీరిద్దరి సమాధానాల్లో మంచేదో, చెడేదో గ్రహించ గలుగుతారు.[161]

**D) వేదంలోని ఒక మాట నిజం అయినంత మాత్రాన వేదం మొత్తం నిజం కాదు :** వేదంలో ఒక వాక్యం ఉంది. **'అగ్నిర్హిమస్యభేషజం'** అనేది ఆ వాక్యం. దానర్థం 'చలికి నిప్పు మందు' అని. ఈ వాక్యం అక్షర సత్యం. నూటికి నూరుపాళ్ళూ ఇది నిజం. ఇది ప్రత్యక్షంగా ఋజువయ్యేది కూడా. మరి, అలాగే వేదాల్లోని మరో వాక్యాన్ని చూద్దాం. **"అగ్నిహోత్ర జుహుయత్ స్వర్గ కామః"** అనేది ఆ వాక్యం. దాని అర్థం ఏమంటే[162]... 'స్వర్గం కోరేవారు అగ్నిహోత్ర హోమం చేయాలి' అని. మీమాంసకులు ఏమంటారంటే... మొదటి వాక్యం సత్య వాక్యం కాబట్టి, వేదంలో ఉన్న ఈ వాక్యం కూడా సత్యమైనదే అని. సత్యమైన వాక్యంగానే నమ్మాలని. ఇది ఏ విధంగా ప్రమాణం? నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు చెప్పే అబద్ధాలకోరు కూడా ఏదో ఒక మాట నిజం చెప్పడా![163]

**E) శబ్దం ఎప్పుడూ ప్రమాణం కాదు :** ప్రత్యక్షం, అనుమానం – ఈ రెండు ప్రమాణాల ద్వారా ఋజువైన జ్ఞానాన్నే స్వీకరించాలి. ఈ ప్రమాణాలకు విరుద్ధమైన వేదాల్ని వదిలివేసినప్పటికీ ఎలాంటి లోటూ రాదు. పోనీ, ఇంద్రియాలకు అందని వేదం నిలబడుతుందా? అంటే అదీ లేదు. అది ఎప్పటికీ ఋజువు కాదు. ఈ విధంగా వేదం అటు ప్రత్యక్ష ప్రమాణానికి గాని, ఇటు పరోక్ష ప్రమాణానికి గానీ నిలబడలేదు. కాబట్టి ప్రత్యక్షం గానీ, పరోక్షం గానీ ఈ రెండూ వేద (శబ్ద) ప్రమాణం కాదు.[164]

వేదాన్ని ప్రమాణంగా తీసుకోవాలి అనే నియమాన్ని ఎవరు పెట్టారు? వేదం తెలియని వాడా? వాడు 'పొగను చూచి నిప్పు ఉంటుంది' అని తెలుసుకోలేనివాడు.

వేదం మార్గంలో నడుస్తూ, వేద వచనాల గుణ, దోషాలు తెలుసుకోలేనివారు ఎందరో. అలాంటి సాదాసీదా మనుషుల నెత్తిన వేద ప్రమాణం అనే పిశాచాన్ని ఎవరు కూర్చోబెట్టారు?[165]

మీమాంసకులు ప్రత్యక్షం, అనుమానం లాంటి ప్రమాణాల్ని వదిలిపెట్టి

'అపౌరుషేయాలనే' వేద వచనాల్ని (శబ్ద ప్రమాణాల్ని) పట్టుకొని గ్రుడ్డిగా నమ్ముతారు. దీన్ని ధర్మకీర్తి తీవ్రంగా ఖండిస్తూ – ఒక ఉదాహరణ ఇచ్చారు.

ఎవరో దురాచారిణి అయిన ఒక స్త్రీ పరపురుషునితో కూడివున్న సమయంలో, భర్త చూచి ఆమెను నిందించగా, అప్పుడామె అక్కడున్న ఇరుగుపొరుగు స్త్రీలతో – "చూశారమ్మా! అక్కలారా! చెల్లెల్లారా! మా ఆయన మూర్ఖత్వం. నాలాంటి ధర్మచారిణి మాటలు (శబ్ద ప్రమాణం) మీద నమ్మకం ఉంచకుండా, అతను తన కళ్ళు అనే రెండింటి (ప్రత్యక్షం, అనుమానం) మీదే విశ్వాసాన్ని ఉంచాడు" అని[166] అందిట. అలాఉంటుంది ఈ మీమాంసకుల విధానం.

## V. అహేతువాద ఖండన

ఎంతో మంది ఈశ్వరవాద (ఆస్తిక) దార్శనికులు, సందేహవాద (శంకావాద) దార్శనికులు ఈ విశ్వంలోని కార్యకారణ నియమాన్ని గానీ, హేతువాదాన్ని కానీ అంగీకరించరు. ఇస్లాం ధర్మానికి చెందిన దార్శనికుడు **'అశ–అరీ'** ఇలా అంటారు "ఈ కార్యకారణ సంబంధం భగవంతుడు సర్వశక్తిమంతుడు అనే అభిప్రాయాన్ని తిరస్కరిస్తుంది. ఈ కార్యకారణ సంబంధం మాటున భౌతికవాదం దాగి ఉంది. వస్తువులు ఉత్పన్న మవడానికి ఏలాంటి కారణం మొదటనుండే ఉండనక్కరలేదు. అల్లామియా ప్రతి వస్తువునీ, క్రొత్త కొత్తగా అక్షరాలా నూతనమై **'అసత్తు'** నుండి **'సత్తు'** రూపం లోకి తెస్తాడు" అంటారు అశ–అరీ.

అశ–అరీ నే కాదు, చాలామంది ఈశ్వరవాదులు, సందేహ (శంకా) వాదులూ అయిన ఆధునిక, ప్రాచీన దార్శనికులు ఉన్నారు. వారు విశ్వ రచనలో ఏ విధమైన కార్యకారణ సంబంధాన్ని, ఆ నియమాల్ని అంగీకరించరు. వాళ్ళిలా అంటారు: 'వస్తువులు ఏ కారణం వల్లా తయారు కావు. ఏ కారణం వల్లా నశించవు' అని వాళ్ళింకా ఇలా అంటారు: "ముల్లుకు గల వాడితనానికి (తీక్షణతకి) ఏదీ కారణం కాదు. అదే విధంగా ఈ జగత్తుకీ, దాని ఉత్పత్తికీ ఏదీ కారణంగా ఉండనవసరం లేదు" అనీ అంటారు.[167]

దీనికి ధర్మకీర్తి ఇలా సమాధాన మిచ్చారు: "దేనికి ముందు ఉంటుందో, దేనికి తరువాత జన్మిస్తుందో, దేని పరివర్తనకి ఏది సహకరిస్తుందో అదే కారణం. ఈ స్థితి ముళ్ళలో కూడా ఉంటుంది."[168]

పుట్టే ప్రతి వస్తువూ అక్షరాలా నూతనమైనదేనని బౌద్ధులు కూడా అంగీకరిస్తారు. కానీ, అది క్షణక్షణం వినాశనమయ్యే అనంత ప్రవాహంలో ఒక బిందువు అని అంటారు. ఈ బిందువుకు ముందూ, తరువాత కూడా అనేక బిందువులుంటాయని అంటారు. దానికి దాని పూర్వపు బిందువు కారణం. కానీ, తరువాత వచ్చే బిందువుకు అది కారణం అవడం చేత, దానికీ, దీనికీ దగ్గరి పోలిక ఉంటుంది. ఇదే గనుక నిజం కాక పోతే... మామిడి కాయను తిన్న వ్యక్తి దాని టెంకను నాటాలని అనుకోడు. ఒక భవం (పదార్థం) వస్తువుగా మారిన మీదట, అదే రెండో భవంగా అవడం, ఇలా ప్రతి వస్తువూ తన పూర్వ స్వభావంతో దగ్గరి పోలికలు కల్గి ఉండడం – ఇదే హేతువాదం. ఎప్పటి వరకైతే విశ్వంలో అంతటా చూచే ఈ ఉత్పత్తి ప్రవాహం, సాదృశ్య నియమం విరాజిల్లుతూ ఉంటుందో – అప్పటి వరకూ అహేతువాదం అక్షరాలా తప్పు అనే ఋజువు చేయ బడుతుంది.

## VI. జైన – అనేకాంతవాద ఖండన

జైన దర్శనం **'శాద్వాదం'** లేదా **'అనేకాంతవాదం'** ను గూర్చి మనం మొదటే చెప్పుకొన్నాం. ఈ వాదం ప్రకారం చూస్తే "కుండ కుండలా ఉంది", "కుండ వస్త్రం లావుంది", అంటే 'కుండ కుండా అవుతుంది, కుండ వస్త్రమూ అవుతుంది'. దీన్ని ధర్మకీర్తి ఇలా ఖండించారు.

"ఒకవేళ అన్ని వస్తువులూ తన రూపాన్ని లేదా ఇతర రూపాన్ని – రెండింటినీ కలిగి ఉన్నట్లయితే... 'పెరుగు పెరుగులానే ఉంది. ఒంటెలా కాదు" అనీ, అలాగే "ఒంటె ఒంటే కాని పెరుగు కాదు" అనీ ఎలా చెప్పగలం! ఈ విధంగా ఒక వస్తువులోని దాని విశిష్టతను మనం గుర్తించకపోతే కొన్ని అనర్థాలు కలుగుతాయి. ఎలాగంటే ... ఎవరినైనా సరే 'పెరుగుతిను' అని చెబితే – వాడు 'ఒంటెను తినడానికి పరుగెత్తుతాడు – ఎందుకంటే 'పెరుగు పెరుగులా ఉంటుంది, ఒంటెలానూ ఉంటుంది' అని అంగీకరిస్తున్నావు కదా!

"అలా కాకుండా... పెరుగులో కొంత విశిష్టత ఉంటుంది. ఆ విశిష్టతలు (ప్రత్యేక లక్షణాలు) ఇతర పదార్థాల్లో ఉండవు. కాబట్టి ఏ వస్తువూ రెండు రూపాల్లో ఉండదు. ఇలా అనుకుంటే ప్రతి పదార్థం 'తానుతానే' గానీ తాను 'ఇతరం కాదు'.[169]

ధర్మకీర్తి దర్శనం గురించి సంక్షిప్తంగా చెప్పుకొన్నాం. ధర్మకీర్తి రాసిన ఒక పద్యంతో దీన్ని ముగిస్తాను. ఆ పద్యం అర్థం ఇది –

వేదాన్ని (గ్రంథాన్ని) ప్రామాణికంగా అంగీకరించేవాడూ.

ఈశ్వరుణ్ణి (సృష్టికర్తను) అంగీకరించేవాడూ.

స్నానాదికాల వల్ల 'ధర్మాన్ని' పొందాలనుకొనేవాడూ.

జాతి వాదాన్ని (చిన్నా పెద్దా, జాతి, ప్రాంతీయ భేదాలు) పాటించి గర్వపడేవాడూ.

పాపాల్ని దూరం చేసుకోవడం కోసం, ఉపవాసాలూ, ఇతర పద్ధతుల ద్వారా శరీరాన్ని బాధలకు గురిచేసేవాడూ.

ఈ ఐదూ చేసేవాడు

**జడుడు...** (చేతనత్వం లేని మొద్దు రాతిలాంటివాడు)

**మహామూర్ఖుడు...** (స్వంత ఆలోచన లేనివాడు)

**అక్షరజ్ఞాన శూన్యుడూ**[170] ... ('అ' 'ఆ' లు కూడా తెలియనోడు).

# పాదసూచికలు

1. ఈ రెండు గ్రంథాలు టిబెట్టు మరియు చైనా అనువాద రూపాలుగా మొదటి నుండే ఉన్నాయి. కానీ, వాటి సంస్కృత మూలాలు నాకు టిబెట్టులో దొరికాయి. వాటి ఫోటో కాపీలను భారత్‌కు తెచ్చాను.
2. అభిధర్మ కోశాన్ని, దాని వృత్తిని మొదటే సంపాదించాను.
3. 'వాదన్యాయం' (రాహుల్‌జీ) మరియు 'అభిధర్మకోశం' యొక్క పీఠిక.
4. శ్రావక భూమి, బోధిసత్త్వ భూమి టిబెట్‌లో లభించాయి. బోధిసత్త్వ భూమి యొక్క తాళపత్ర గ్రంథం (10వ శతాబ్దం వరకు) దొరక లేదు. దీన్ని ప్రొఫెసర్ ఉ. వోగీహారా (జపాన్ 1930) వెలువరించారు. ఇది కాకుండా వేరుగా కూడా లభించింది.
5. చూడండి. ఈ పుస్తకం చివరనున్న అనుబంధంలో.
6. యోగాచార భూమి (శృతమయీ భూమి 10)
7. యోగాచార భూమి (చింతనామయీ భూమి 11)
8. యోగాధార భూమి (చింతనామయీ భూమి 11)
9. దర్శన్ దిగ్దర్శన్ పేజీ 242.
10. యోగాచార భూమి (1)
11. Contact
12. యోగాచార భూమి (మనోభూమి 1)
13. యోగాచార భూమి (12)
14. యోగాచార భూమి (3,4,5)
"ప్రత్యయః ఇత్వ రాత్యయ – సంగత ఉద్వాదః ప్రతీత్య సముద్వాదః క్షణికార్థమధి కృత్యం"
15. యోగాచార భూమి (3,4,5)
16. యోగాచార భూమి (3,4,5)
17. సంయుక్త నికాయ 2/92 (దీఘ నికాయ 2/55)
18. 'ప్రతిక్షణం చ నవ లక్షణాని ప్రవర్తంతే. క్షణ భంగురశ్చ ప్రతీత్య సముద్వాదః"
19. యోగాచార భూమి (శృతమయీ భూమి 10)
20. 'కోమేషు' తథ్యథా నట – నర్తక – హాస కాథ్యుప సంహితేషు వా వైశ్య జనోప సంహితేషు వాపునః సందర్శనాయ్ వా ఉపభోగయ్ వా... విగృహితా నాం... నానా వాదః... దృష్టేర్వాపునః ఆరభ్య తథ్యథా సత్కాయ దృష్టిం, ఉచ్ఛేద దృష్టిం, విషమహేతు దృష్టిం, శాశ్వత దృష్టిం, వార్షగణ్య దృష్టిం, మిథ్యా దృష్టి మితివా నానా వాదః

21. “ప్రత్యక్షం కల్పనా పోఢమభ్రాన్త” – ధర్మకీర్తి. (అసంగుని సోదరుడైన వసుబంధు శిష్యుడైన దిఙ్నాగుడు కూడా ఇదే చెప్పాడు)

22. “యో గ్రహణమాత్ర ప్రసిద్ధోపలబ్ధ్యాశ్రయో విషయః యశ్చ విషయ ప్రతిష్ఠోపలబ్ధ్యాశ్రయో విషయః” – యోగాచార భూమి.

23. శుద్ధ ప్రత్యక్ష మే యోగీ ప్రత్యక్షం. “యో లోకోత్తరస్య జ్ఞానస్య విషయః”

24. “తదుభయమేకత్వ మభి సంక్షిప్యా – లోక ప్రత్యక్షమిచ్యుచ్యతే” – యోగాచార భూమి.

25. ఈశ్వర కృష్ణుని సాంఖ్యకారికలలో ఈ హేతువుల వివరణ ఉంది. ఈశ్వర కృష్ణుని మరోపేరు ‘వింధ్యవాసి’ అని కూడా ఉంది. ఇతని ప్రతివాది అసంగుని అనుజుడు వసుబంధు అని చైనా గ్రంథాల నుండి మనకు తెలుస్తుంది.

26. “సుఖ – సవ్యవహారార్థ”.

27. ‘ప్రకృథ కాత్యాయన్’ (పేజీ 592)

28. మహావీర్ (పేజీ 496)

29. దీఘనికాయ 1/1

30. దర్శన్ – దిగ్దర్శన్ – పేజీ 493

31. దర్శన్ – దిగ్దర్శన్ – పేజీ 489

32. దర్శన్ – దిగ్దర్శన్ – పేజీ 487–88

33. దర్శన్ – దిగ్దర్శన్ – పేజీ 487

34. పురాతత్త్వ నిబంధావళి పేజీ 214–15

35. వాత్సీపుత్రీయ బౌద్ధుల పాత సంప్రదాయాలలో సంప్రదాయం ఉంది. అనాత్మవాదం పూర్తిగా తిరస్కరించబడకుండా, అంతర్గతంగా దాగినట్లు కన్పిస్తుంది. ఈ దృష్ట్యా ఆత్మవాదాన్ని సమర్థిస్తున్నట్లుగా అగుపిస్తుంది.

36. ప్రమాణ భూతాయ జగద్విఏషిణే శాస్త్రోసుగతాయ తాయినే! ప్రమాణ సిద్ధయౌ స్వమతాత్ సముచ్ఛయః కరిష్యతే విప్రసితాదిహైకః

37. యదక్షపాదః ప్రవరే మునీనాం. సమాయ శాస్త్రం జగతో జగాద్. కృతర్కికాజ్ఞాన నిబుత్తిహేతుః కరిష్యతేః తస్య మయా నిబన్ధః – న్యాయవార్తికం 1/1/1

38. న్యాయవార్తిక – తాత్పర్య టీకా 1–1–1

39. ఇతి సునిపుణ బుద్ధిర్లక్షణం వక్తుకామః
పద యుగళమ పీదం నిర్మమేనానవధ్యామ్!
భవతుమతి మహీన్మశ్చేస్థితం
దృష్టమేత జ్ఞగదభీభవధీరం ధీమతోం ధర్మకీర్తేః – న్యాయమంజరి. పేజీ 100

40. దురాబాధ్ ఇవచాయం ధర్మకీర్తేః పంథా ఇత్యవహితేన భావ్యమిహేతి! – ఖండన ఖండ ఖాధ్య – 1

41. నా 'పురాతత్త్వ – నిబంధావళి' పేజీ 215–17
42. శ్లోకంలో 32 అక్షరాలు ఉంటాయి
43. టీకాలు ఈ విధంగా ఉంటాయి... (ఈ పుస్తకం చివరనున్న అనుబంధంలో చూడండి)
44. చూడండి 'దర్శన్ – దిగ్దర్శన్' లో 692 పేజీలోని ఫుట్ నోట్.
45. ప్రమాణ వార్తికం 3–37; 3–136
46. ప్రమాణ వార్తికం 2/163–73
47. ప్రమాణ వార్తికం 2/5–55, 2/145–62, 3/55–161, 4/133–48, 4/176–88
48. అసాంధనాంగ వచనం అదోషోద్ భావనం ద్వయోః – వాద న్యాయం (పేజీ 1)
49. టిబెట్టుకు చెందిన నయ్యాయికులు 'జమ్–యజ్–శద్–పా (మంజుఘోషపాదుడు. క్రీ.శ. 1648–1722) తన గ్రంథం సప్తనిబంధ న్యాయాలంకారసిద్ధి (అలంకార–సిద్ధిలో ఇలా రాశారు – "ఎవరైతే అంటారో (ధర్మకీర్తి) సప్తనిబంధ (అనే గ్రంథంలో) మంతవ్యంలో "ఆలయ విజ్ఞానం" కూడా ఉంది అని, వారు అంధులు, వారు తమ అజ్ఞానాంధకారంలో తామే నివసించేవారు" – డా॥ శ్చేర్వాస్కీ, Buddhist Logic - Vol.II. p.329. ఫుట్ నోట్ 23/522లో.
50. 'ఆలయ' శబ్దం పాత పాళీ సూత్రాల్లో కూడా లభిస్తుంది. కానీ, అక్కడ రుచి అనునయం, 'అధ్యవసాయం' అనే అర్థాలలో వస్తుంది. చూడండి – మహాహత్తి–పదోపమసుత్త. (మజ్ఝిమ నికాయ 1/3/8; బుద్ధ చరియ పేజీ. 179.
51. కావ్యాలు : కాళిదాసు, దండి, బాణుడు
    జ్యోతిషం : ఆర్యభట్ట, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు
    చిత్రకళ : అజంతా, బాగ
    వాస్తుకళ : అజంతా, ఎల్లోరా గుహలు, దేవ, కోణార్క దేవాలయాలు
52. ప్రమాణ వార్తికం 3/202
53. ప్రమాణ వార్తికం 3/335
54. ప్రమాణ వార్తికం 3/209
55. ప్రమాణ వార్తికం 3/212
56. ప్రమాణ వార్తికం 3/213
57. ప్రమాణ వార్తికం 3/ 215
58. ప్రమాణ వార్తికం 3/336
59. ప్రమాణ వార్తికం 3/337
60. ప్రమాణ వార్తికం 3/353–55
61. ప్రమాణ వార్తికం 3/ 219
62. ప్రమాణ వార్తికం 1/272 "సత్తామాత్రాను బన్ధిత్వాత్ నాశస్థ"

63. “యత్ సత్ తత్ క్షణిక్” – క్షణభంగ్ 1/1 (జ్ఞానశ్రీ)
64. ప్రమాణ వార్తికం 2/284–5
65. ప్రమాణ వార్తికం 3/110
66. ప్రమాణ వార్తికం 3/3
67. ప్రమాణ వార్తికం 1/71
68. ప్రమాణ వార్తికం 1/282
69. ప్రమాణ వార్తికం 1/195
70. ప్రమాణ వార్తికం 2/70
71. ప్రమాణ వార్తికం 1/72
72. ప్రమాణ వార్తికం 1/273
73. ప్రమాణ వార్తికం 1/274
74. ప్రమాణ వార్తికం 1/274, 275
75. ప్రమాణ వార్తికం 1/275–277
76. ప్రమాణ వార్తికం 3/536
77. ప్రమాణ వార్తికం 4/248
78. ప్రమాణ వార్తికం 4/249
79. ప్రమాణ వార్తికం 2/28
80. ప్రమాణ వార్తికం 2/1
81. ప్రమాణ వార్తికం 2/4
82. ప్రమాణ వార్తికం 3/1
83. ప్రమాణ వార్తికం 3/124
84. ప్రమాణ వార్తికం 3/124
85. ప్రమాణ వార్తికం 3/125, 127
86. ప్రమాణ వార్తికం 3/129
87. ప్రమాణ వార్తికం 3/141–142
88. ‘మానసం చార్థరాగాది’
89. ప్రమాణ వార్తికం 3/239
90. ప్రమాణ వార్తికం 3/ 243
91. “అర్థరాగాది స్వసంవిత్తిర కల్పికా”
    – ప్రమాణ సముచ్ఛయం.
92. ప్రమాణ వార్తికం 3/249
93. Intuition

94. ప్రమాణ వార్తికం 3/281 - 283
95. ప్రమాణ వార్తికం 3/286
96. ప్రమాణ వార్తికం 3/287
97. "భ్రాంతి సంవృత్తి సంజ్ఞానం అనుమానానుమానికం
స్మార్తామిలాపికం చేతి ప్రత్యక్షాభం సతౌమిరం" - ప్రమాణ సముచ్ఛయ.
98. ప్రమాణ వార్తికం 3/288
99. ప్రమాణ వార్తికం 3/54
100. ప్రమాణ వార్తికం 3/55, 56
101. ప్రమాణ వార్తికం 3/75
102. ప్రమాణ వార్తికం 3/62
103. ప్రమాణ వార్తికం 3/63, 64
104. ధర్మేస్థ (న్యాయ బిందు, పేజీ 42)
105. న్యాయ బిందు 2/3
106. ప్రమాణ వార్తికం 1/3
107. ప్రమాణ వార్తికం 1/3
108. ప్రమాణ వార్తికం 2/43
109. ప్రమాణ వార్తికం 2/35
110. ప్రమాణ వార్తికం 2/37
111. ప్రమాణ వార్తికం 2/38
112. ప్రమాణ వార్తికం 2/54-62
113. ప్రమాణ వార్తికం 2/208
114. "కారణం వికృతిం గచ్ఛ జ్ఞాయతేన్యస్త కారణం"
115. ప్రమాణ వార్తికం 2/181-82
116. ప్రమాణ వార్తికం 2/183
117. ప్రమాణ వార్తికం 2/204
118. ప్రమాణ వార్తికం 2/202-205
119. ప్రమాణ వార్తికం 2/20-1-2
120. ప్రమాణ వార్తికం 1/191-92
121. ప్రమాణ వార్తికం 1/195
122. ప్రమాణ వార్తికం 2/195
123. ప్రమాణ వార్తికం 2/213
124. ప్రమాణ వార్తికం 2/217-220

125. ప్రమాణ వార్తికం 2/235-236
126. ప్రమాణ వార్తికం 2/233
127. ప్రమాణ వార్తికం 2/21-25
128. ప్రమాణ వార్తికం 2/12, 13
129. ప్రమాణ వార్తికం 2/67
130. ప్రమాణ వార్తికం 2/68
131. ప్రమాణ వార్తికం 1/68, 69
132. ప్రమాణ వార్తికం 2/70-72
133. ప్రమాణ వార్తికం 1/73-74
134. ప్రమాణ వార్తికం 1/99
135. ప్రమాణ వార్తికం 1/139-140
136. ప్రమాణ వార్తికం 3/154-58
137. ప్రమాణ వార్తికం 3/49
138. ప్రమాణ వార్తికం 2/31-32
139. ప్రమాణ వార్తికం 3/224
140. ప్రమాణ వార్తికం 3/ 225
141. ప్రమాణ వార్తికం 3/284
142. ప్రమాణ వార్తికం 4/154
143. ప్రమాణ వార్తికం 4/157, 158
144. ప్రమాణ వార్తికం 2/92
145. ప్రమాణ వార్తికం 1/166-170
146. అర్థకియకారీ = అర్థక్రియ - సమర్థతా - కార్యం. ఉత్పాదనా సమర్థత; క్రియా ఉద్పాదనలో సమర్థత, సార్థక క్రియ చేయడంలో సమర్థత, సఫల క్రియ చేయడంలో సమర్థత, క్రియ చేయడంలో యోగ్యత, క్రియ చేసేవాడు - మొదలైన అర్థాలు.
147. ప్రమాణ వార్తికం 1/175-177
148. ప్రమాణ వార్తికం 1/503-505
149. ప్రమాణ వార్తికం 1/222
150. ప్రమాణ వార్తికం 1/227
151. ప్రమాణ వార్తికం 1/227-228
152. ప్రమాణ వార్తికం 1/227-231
153. ప్రమాణ వార్తికం 1/233
154. ప్రమాణ వార్తికం 2/242, 243

155. ప్రమాణ వార్తికం 1/242, 243
156. ప్రమాణ వార్తికం 1/243, 244
157. ప్రమాణ వార్తికం 1/248, 249
158. ప్రమాణ వార్తికం 1/249
159. ప్రమాణ వార్తికం 1/316
160. ప్రమాణ వార్తికం 1/320-323
161. ప్రమాణ వార్తికం 1/328
162. ప్రమాణ వార్తికం 1/333
163. ప్రమాణ వార్తికం 1/338
164. ప్రమాణ వార్తికం 4/106
165. ప్రమాణ వార్తికం 1/53, 54
166. 'ప్రేమాణ వార్తిక - స్వవృత్తి 1/337
"సా స్వామినా పరేణ సంగతా త్వమిత్యుపాలబ్ధః
పరచత్ పుంసో వైపరీత్యం ధర్మపన్తయా
ప్రత్యయ మకృత్వా స్వనేత్ర బుద్బుదయోః ప్రత్యేతి"!
167. ప్రమాణ వార్తికం 2/180-181
168. ప్రమాణ వార్తికం 2/181-182
169. ప్రమాణ వార్తికం 2/180-182
170. ప్రమాణ వార్తిక - స్వవృత్తి 1/342
"వేదప్రామాణ్యం కస్యచిత్ కర్తృవాదః
స్నానే ధర్మేచ్ఛా జాతి వాదావ లేపః
సంతాపారం భాః పాపహానాయ చేతి
ధ్వస్త ప్రజ్ఞానాం పంచలింగాని జాఢయే!"

# అనుబంధం

**1. ఐదో అధ్యాయంలో ఫుట్ నోట్ = 5**

"యోగాచార భూమిలో" అసంగుడు ఏయే విషయాల మీద చర్చించారో తెలిపే విషయసూచిక

## భూమి = 1 (విజ్ఞాన భూమి)

**1. విజ్ఞాన భూమి (పంచేంద్రియాల విజ్ఞానాలు)**

**2. పంచేంద్రియాల విజ్ఞానం (జ్ఞానం)**

I. నేత్ర జ్ఞానము

i. విజ్ఞాన స్వభావం

ii. వాటి ఆశ్రయాలు (సహభూ, సమనంతర, బీజ)

iii. వాటి ఆలంబన (వర్ణం, సంస్థానం, విజ్ఞప్తి, క్రియ)

iv. వాటి సహాయాలు (సహ యోగి)

v. కర్మ

a. తన విషయంలో ఆలంబన క్రియ (జ్ఞప్తి)

b. వాటి స్వరూప (స్వలక్షణ) విజ్ఞప్తి

c. వర్తమాన కాలం యొక్క విజ్ఞప్తి

d. ఒక క్షణం యొక్క విజ్ఞప్తి

e. మనో విజ్ఞాన అనువృత్తి

f. మంచీ - చెడుల అనువృత్తి

II. శోత్ర విజ్ఞానం (స్వభావం మొ॥నవి)

III. ఘ్రాణం (ముక్కు) విజ్ఞానం (స్వభావం మొ॥నవి)

IV. జిహ్వ (నాలుక) విజ్ఞానం (స్వభావం మొ॥నవి)

V. త్వక్ (చర్మం) విజ్ఞానం (స్వభావం మొ॥నవి)

**3. పంచ విజ్ఞానాల ఉత్పన్నం**

**4. పంచ విజ్ఞానాలతో సంబద్ధ చిత్తం**

**5. ఐదు విజ్ఞానాల సహాయము మొ॥ వాటి యొక్క 'ఒక్కటే అయ్యేటటువంటి' ఉపమానం.**

## భూమి - 2 (మనో భూమి)

**1. మనో స్వభావం మొ॥నవి.**

I. మనస్సు స్వభావం

II. మనస్సు ఆశ్రయాలు

III. మనస్సు ఆలంబనలు (విషయాలు)

IV. మనస్సు సహాయాలు (సహయోగి)

V. మనస్సు విశేష కర్మ

***i. ఆలంబన విజ్ఞప్తి***

- విషయ వికల్పన
- 'మత్త'త
- నిద్ర పోవడం
- మూర్ఛపోవడం
- కాయక, వాచక

***ii. విశేష కర్మ***

- ఉపని ధ్యానం
- ఉన్మత్తత
- నిద్ర లేవడం
- మూర్ఛ నుండి తేరుకోవడం
- విరక్తి చెందడం

**2. మనస్సు శరీరం నుండి నశించడం తిరిగి ఉత్పన్నం కావడం.**

I. శరీరాన్ని వదలడం (మృత్యు, చ్యుతి)

II. ఒక శరీరం నుండి వేరొక శరీర ప్రవేశ మధ్య అవస్థ యొక్క సూక్ష్మకాయిక మనస్సు (అంతరాభావం)

III. మరో శరీరంలో ఉత్పన్నం కావడం.

i. శారీరక వికారం

a. వర్ణ వికారం b. చర్మ వికారం

ii. గర్భంలో ప్రవేశం

a. గర్భాదానానికి సహాయకాలు

b. గర్భాదానంలో అవరోధాలు

క. యోనిలో దోషాలు

ఖ. బీజంలో దోషాలు

గ. పూర్వ కర్మల దోషాలు

c. అంతరాభవ దృష్టిలో పరివర్తన

d. పాపి – పుణ్యాత్మలో జన్మము – కులం

e. గర్భాశయం ఆలయ విజ్ఞానం చేరే విధానం (ప్రవాహం)

f. గర్భంలో విభిన్న అవస్థలు

క. కలల అవస్థ

ఖ. అర్బుద అవస్థ

గ. పేశీ అవస్థ

ఘ. ఘన అవస్థ

ఇ. ప్రశాఖ అవస్థ

చ. కేశ–రోమ–నఖ అవస్థ

ఛ. ఇంద్రియాలు ప్రకటితం కావడం

జ. స్త్రీ, పురుష లింగ భేధాలు ప్రకటితం కావడం

ఝ. హిమాలయాల ప్రాదుర్భావం

ఞ. అనవతప్త సరస్సు (మానస సరోవరం)

ట. సుమేరు పార్శ్వం (మానస సరోవరం)

ఠ. అంగాలలో వికారం

g. గర్భంలో స్త్రీ, పురుషుల గుర్తింపు

IV. గర్భం నుండి వెలువడుట

V. శిశు పోషణ

**3. జగత్తు సంహారం, ప్రాదుర్భావం**

I. సంహార (సంవర్తనం) క్రమం

i. దేవతల ఆయువు ii. కల్పాల పరిమాణం

II. ప్రాదుర్భావం (వివర్తనం)

i. వివిధ లోకాల పుట్టుక

a. బ్రహ్మలోకం పుట్టుక

b. పృథ్వి పుట్టుక

క. సుమేరువు మొ॥నవి పుట్టుక ఖ. నరకం పుట్టుక

గ. ద్వీపాల పుట్టుక ఘ. నాగలోక పుట్టుక

ఇ. యక్షలోక పుట్టుక చ. వైశ్రవణాది చతుర్మహారాజుల పుట్టుక

III. ద్రవ్యాలు పద్నాలుగు

IV. ప్రాణులతో కలసి ఉండటం లేదా వేరుగా ఉండటం

V. మనస్సు (చిత్తం)

VI. చిత్త సంబంధం (చైతసం) తత్త్వ విజ్ఞాన ఉత్పత్తి

**4. సత్త్వ(ప్రాణు)ల పుట్టుక**

I. ప్రథమ కల్పంలో సత్త్వం (మానవ)

i. వాని ఆహారాలు

ii. మనస్సు వికారం వల్ల ఆహారంలో లోటు

iii. రాజు యొక్క మొదటి ఎన్నిక

II. గ్రహ, నక్షత్రాదుల పుట్టుక

i. సత్త్వాల ప్రకాశ లోపం; సూర్య, చంద్ర, నక్షత్రాదుల పుట్టుక

ii. సూర్య చంద్రుల గతులు

iii. ఋతువుల పరివర్తన

iv. చంద్రుని క్షీణత – వృద్ధి

III. వెయ్యి 'చూడాలు' కల్గిన లోకం (Local Universes) (బుద్ధుని క్షేత్రం)

IV. జడతత్త్వ రూపాలు

i. బీజ రూపం (మూల రూపం)

ii. మహా భూతాలు

iii. పరమాణువు (అవయవం)

a. రస భేదం b. స్పర్శ భేదం c. ధర్మ భేదం

V. తొమ్మిది విషయాలతో కూడిన బుద్ధవచనం (ధర్మం)

i. చైతస మనస్కారాలు మొ॥నవి

a. వాటి స్వభావం b. వాటి కర్మలు

VI. త్రికాలాలు (జన్మ, జర, మొ॥నవి)

VII. ఆరు రకాల విజ్ఞానం

i. విజ్ఞానం యొక్క నాల్గు ప్రత్యాయాలు

a. ప్రత్యయం b. ప్రత్యయాలు భేదాలు

ii. ఆయతనాలు – ఆరు భేదాలు

a. ఇంద్రియాల భేదాలు

క. చక్షువుల భేదాలు ఖ. శ్రోత్ర భేదాలు

గ. ఘ్రాణ భేదాలు ఘ. జిహ్వా భేదాలు

ఇ. కాయం భేదాలు     చ. మనస్సు భేదాలు

b. ఆలంబనలలోని ఆరు భేదాలు

క. రూప భేదం     ఖ. శబ్ద భేదం

గ. గంధ భేదం     ఘ. తిర్యక్ యోని

చ. ప్రేత యోని     ఛ. మనుష్య యోని

జ. దేవ యోని

c. సుఖము – భోగం

క. నరక – యోనిలో

## భూమి = 3, 4, 5

## (సవితర్క - సవిచార భూమి)

## (అవితర్క - విచార మాత్రా భూమి)

## (అవి తర్క - అవచార భూమి)

**1. ధాతువుల ప్రజ్ఞప్తి**

I. ధాతువుల ప్రజ్ఞాపనల ద్వారా

i. కామ (స్థూల) ధాతువు (లోకం)   ii. రూప ధాతువు iii. ఆరూప్య ధాతువు

II. పరిమాణ ప్రజ్ఞాపనల ద్వారా

i. శరీర పరిమాణం     ii. ఆయువు పరిమాణం

III. భోగ ప్రజ్ఞాపనల ద్వారా

i. దుఃఖ భోగం

a. నరకం

క. మహా నరకం (ఎనిమిది)     ఖ. చిన్న నరకం (నాలుగు)

గ. శీతల నరకం ( ఎనిమిది)     ఘ. ప్రత్యేక నరకం (ఎనిమిది)

b. హేతు ప్రత్యయం భేదాలు

క. హేతు భేదం     ఖ. ప్రత్యయ భేదం

గ. ఫలితం యొక్క భేదం

c. హేతు – ప్రత్యయ – ఫల – వ్యవస్థ

క. హేతు ప్రజ్ఞాపన ఖ. తిర్యక్ (పశుపక్ష్యాదులు) యోనిలో

గ. మనుష్య యోని (చక్రవర్తి)లో

ఘ. దేవ యోనిలో

స్వర్గంలో ఇంద్రాది దేవతలు, ఉత్తర కురు మరియు అసురులు

రూప లోకమందు దేవతలు

అరూప లోకమందు దేవతలు

d. దుఃఖం, సుఖాల విశేషం (4) ఆహార భోగం (5) పరి భోగం

IV. ఉపపత్తి (జన్మ యొక్క ప్రజ్ఞాపన ద్వారా)

V. ఆత్మ భావం

VI. హేతు, ఫల అవస్థ

i. హేతు ఫల (కార్య) లక్షణం

ii. హేతు ప్రత్యయ అధిష్టానం

iii. యోనిశ మనసికార

a. అధిష్ఠానం b. వస్తు c. ఏషణా

d. పరిభోగ e. ప్రతిపత్తి

iv. అయోనిశోమనస్కార ప్రజ్ఞప్తి నుండి

a. ప్రత్యయ – ప్రజ్ఞాపన b. ఫల – ప్రజ్ఞాపన c. హేతు – వ్యవస్థ

**2. లక్షణ ప్రజ్ఞప్తి నుండి**

I. శరీరం మొ॥నవి

i. శరీరం ii. ఆలంబన (విషయం) iii. ఆకారం

iv. సముత్థానం v. ప్రబోధం vi. వినిశ్చయం

vii. ప్రవృత్తి

II. వితర్క – విచార గతి భేదం

(1) నరక గతి (2) ప్రేత, తిర్యక్ గతి

(3) దేవ గతి

(క) కామలోక దేవుడు (ఖ) ప్రథమాధ్యాయన భూమి కల్గిన దేవుడు

III. నాస్తిక వాదం (కేశ కంబలుడు)

IV. అగ్ర వాదం (బ్రాహ్మణ వాదం)

V. శుద్ధి వాదం (బ్రాహ్మణ వాదం)

VI. జ్యోతిషం – శకునం (కౌతుక మంగళ వాదం)

**3. సంక్లేశ – ప్రజ్ఞప్తి**

I. ఇతర వాదాలు

i. సద్వాదం (సాంఖ్యం)

ii. అనభివ్యక్తి వాదం (సాంఖ్యం, వ్యాకరణం)

iii. ద్రవ్య సద్వాదం (సర్వాస్తి వాదం)

iv. ఆత్మ వాదం (ఉపనిషత్ వాదం)

v. శాశ్వత వాదం (కాత్యాయనుడు)

vi. పూర్వకృత హేతువాదం ( జైనం)

vii. ఈశ్వర కర్తృత్వ వాదం (నైయాయికులు)

viii. హింసా ధర్మ వాదం (యాజ్ఞికులు, మీమాంస వాదులు)

ix. అంతానంతిక వాదం

x. అమరా విక్షేప వాదం (వేలట్టి పుత్త)

xi. అహేతు వాదం ( గోశాల)

xii. ఉచ్ఛేద వాదం (లోకాయతం)

a. ధ్యానం b. విమోక్షం c. సమాధి d. సమాప్తి

**4. వ్యవస్థానం**

**5. విమోక్ష**

**6. సమాధి**

**7. సమాప్తి**

## భూమి - 7 (అసమాహిత భూమి)

**1. క్లేశము (చిత్తమలము)లు**

I. క్లేశముల స్వభావం

II. క్లేశముల భేదాలు

III. క్లేశముల హేతువులు

IV. క్లేశముల అవస్థ

V. క్లేశముల ముఖం

VI. క్లేశాతిశయం

VII. క్లేశముల విపర్యం

VIII. క్లేశముల పర్యాయం

IX. క్లేశముల అదీనవం

**2. కర్మ**

**3. జన్మ**

I. కర్మ భేదాలు II. కర్మల ప్రవృత్తి

**4. ప్రతీత్య సముద్పాదం**

## భూమి - 6 (సమాహిత భూమి)

**1. ధ్యానం**

I. పేరు – లెక్కింపు

i. స్థితి ii. తత్వం iii. శుభం iv. వరం
v. ప్రశమ్ vi. ప్రకృతి vii. యుక్తి viii. సంకేతం

ix. అభిసమయం

## భూమి - 8,9

## (సచిత్తకా భూమి) (అచిత్తకా భూమి)

## భూమి - 10

## (శృతమయీ భూమి)

**ఐదు రకాల విద్యలు :**

**1. ఆధ్యాత్మిక విద్య**

I. వస్తు ప్రజ్ఞప్తి

i. సూత్ర వస్తు ii. వినయ వస్తు iii. మాతృకా వస్తు

II. సంజ్ఞాభేద ప్రజ్ఞప్తి

i. పదం ii. భ్రాంతి

iii. ప్రపంచం

a. ఉదాహరణ

b. సారూప్యం

క. లింగ సాదృశ్యం ఖ. స్వభావ సాదృశ్యం

గ. కర్మ సాదృశ్యం ఘ. ధర్మ సాదృశ్యం

ఇ. హేతుఫల (కార్యకారణ) సాదృశ్యం

c. వైరూప్యం

d. ప్రత్యక్షం

క. అ–పరోక్షం

III. బుద్ధుని శాసనం ప్రకారం ప్రజ్ఞప్తి అంటే?

IV. బుద్ధుని బోధన ప్రకారం – జ్ఞేయ అధిష్ఠానం

**2. చికిత్సా విద్య**

**3. హేతు (వాద) విద్య**

I. వాదం

i. వాదం ii. ప్రవాదం iii. వివాదం

iv. అపవాదం v. అనువాదం vi. అవవాదం

II. వాదాధి కరణం

III. వాద – అధిష్ఠానం (పది)

i. 'సాధ్యం' రెండు విధాలు

ii. 'సాధన' ఎనిమిది విధాలు

a. ప్రతిజ్ఞ b. హేతు c. హేతు ఫలం (కార్య కారణం) d. ఆప్తాగమం (శబ్దం)

IV. వాద – అలంకారం

i. తన; పర, వాదాల అభిజ్ఞత

ii. వాక్కు, కర్మల సంపన్నత (భాషణ)

a. అగ్రామ్య భాషణ

b. మిత భాషణ

క. అనభ్యాహితం, అనభ్యాహ్యం

ఖ. అ – భ్రాంత

*(ప్రత్యక్ష భేదాలు : ఇంద్రియ ప్రత్యక్షం, మనో ప్రత్యక్షం, లోక ప్రత్యక్షం, యోగి ప్రత్యక్షం)*

c. అనుమానం

క. లింగమును బట్టి ఖ. స్వభావమును బట్టి

గ. కర్మను బట్టి ఘ. ధర్మాన్ని బట్టి

d. అమితి వచనం

e. అనర్థమైన వచనం

f. అకార వచనం

g. అస్థిర వచనం

h. అదీప్త వచనం

i. అప్రవర్ధ వచనం

V. వాద నిస్సరణ

i. గుణదోష పరీక్ష ii. పరిషత్ పరీక్ష iii. కౌశల్య (నైపుణ్యా) పరీక్ష

VI. వాద ఉపకరణాలు

**4. శబ్దవిద్య**

I. ధారాళమైన భాషణ

II. పూర్వపర సంబంధ భాషణ

III. మంచి అర్థంగల మాటలు

IV. విశాదులు కావడం

V. స్థిరత్వం

VI. దాక్షిణ్యత (ఉదారత)

VII. వాద నిగ్రహం

i. కథాత్యాగం

ii. కథామాదం

iii. కథాదోషం

a. చెడ్డ మాటలు b. కుపిత వచనాలు c. అ – గమక వచనాలు

iv. సామాన్య లక్షణ సత్తు

v. సంకేత లక్షణ సత్తు

vi. హేతు లక్షణ సత్తు

vii. కార్య లక్షణ సత్తు

VIII. అసత్తు (వస్తువు)

i. అనుత్పన్న అసత్తు ii. విరుద్ధ అసత్తు

iii. అన్యోన్య అసత్తు iv. పరమార్ధ అసత్తు

IX. అస్తిత్వం

X. నాస్తిత్వం

XI. ధర్మ సంచయం

i. ధర్మ – ప్రజ్ఞప్తి ii. అర్థ – ప్రజ్ఞప్తి iii. పుద్గల – ప్రజ్ఞప్తి
iv. కాల – ప్రజ్ఞప్తి v. సంఖ్యా – ప్రజ్ఞప్తి vi. అధికరణ – ప్రజ్ఞప్తి

**5. శిల్ప, కర్మస్థాన విద్య**

## భూమి - 11 (చింతామయీ భూమి)

**1. స్వభావ శుద్ధి**

**2. జ్ఞేయ (ప్రమేయ) సంచయం**

I. సత్తు (వస్తువు)

i. స్వలక్షణ సత్తు

II. సద్ధర్మ శ్రవణ సంపత్తు

ii. సరైన ఉపదేశం

iii. సరిగా వినడం

III. నిర్వాణ ప్రాముఖ్యత

IV. చిత్తము, ముక్తిని సరిపక్వం చేసే ప్రజ్ఞాపరిపాపం

V. ప్రతిపక్ష భావన

i. సూత్రార్థాల సంచయం

ii గాథార్థాల సంచయం (వందల నిటల యొక్క గాథల సంగ్రహం)

## భూమి - 12 (భావనామయీ - భూమి)

**1. స్థానతః సంగ్రహం**

**2. భావన – ఉపనిషత్**

**3. యోగ – భావన**

**4. భావనా ఫలం**

I. అంగతః సంగ్రహం

i. అభినివృత్తి సంపత్తు

## భూమి - 13

## (శ్రావక భూమి)

## భూమి - 14

## (ప్రత్యేక బుద్ధుల భూమి)

**1. గోత్రం**

I. మంద - రజోగుణం గల వారి గోత్రం

II. మంద - కరుణ గల వారి గోత్రం

III. మధ్య - ఇంద్రియ గుణములు కల వారి గోత్రం

**2. మార్గం**

**3. సముదాగం**

I. ఖడ్గమృగం కొమ్ముంవలే ఒంటరిగా విహరించే...

II. గుంపులుగా విహరించే...

**4. నాలుగు**

## భూమి - 15

## (బోధి సత్వ భూమి)

## భూమి - 16

## (ఉపాధి - సంహితా భూమి)

**మూడు ప్రజ్ఞప్తులు**

**1. భూమి - ప్రజ్ఞప్తి**

**2. ఉపశమ - ప్రజ్ఞప్తి**

**3. ఉపాధి - ప్రజ్ఞప్తి**

I. ప్రజ్ఞప్తి ఉపాధి

II. పరిగ్రహ ఉపాధి

III. స్థితి ప్రజ్ఞప్తి

IV. ప్రవృత్తి ప్రజ్ఞప్తి

V. అంతరాయ ప్రజ్ఞప్తి

VI. దుఃఖ ప్రజ్ఞప్తి

VII. రతి ప్రజ్ఞప్తి

VIII. అన్య ప్రజ్ఞప్తి

# భూమి - 17

## (ఉపాది - రహిత భూమి)

**1. భూమి - ప్రజ్ఞప్తి వలన**

**2. నివృత్తి ప్రజ్ఞప్తి**

I. వ్యుపశమ నివృత్తి II. అవ్యాబాధ నివృత్తి

**3. నివృత్తి - పర్యాయ విజ్ఞప్తి**

**2 వ అధ్యాయంలో 48వ ఫుట్ నోట్**

# ఋగ్వేద ఋషులు

48. ఋగ్వేద ఋషుల్లో వామకుడు అనే పేరు లేదు. 'అంగిర' అనే పేరుతో కూడా ఋక్కులు లేవు. అంగిర గోత్రికుల పేరుతో 57కు పైగా సూక్తాలు ఉన్నాయి. (ఋక్కులు : 1/35, 36; 6/15; 8/57-58, 64, 74, 76, 78, 79, 81-85, 87, 88; 9/4, 30, 35, 36, 39, 40, 44-46, 50-52, 61, 67, (22-32), 69, 72, 73, 83, 94-97, (45-58), 108 (8-11), 112; 10/42-44, 47, 67-68, 71, 72, 82, 107, 108, 134, 172-74 – మిగిలిన 8 మంది ఋషుల ఋక్కులు ఇలా ఉన్నాయి.

| మంత్రకర్త | సూక్తాలు సంఖ్య | మంత్రాల వివరాలు | |
|---|---|---|---|
| 1. అష్టకుడు (విశ్వామిత్రపుత్ర) | 1 | | 1/104 |
| 2. వామక | 0 | | 0 |
| 3. వామదేవుడు (బృహదకయ, మూర్ఘన్వా, అంహొూముచకుని తండ్రి) | 55 | 4/1-41; | 45-58 |
| 4. విశ్వామిత్రుడు (కుశిక పుత్రుడు) | 46 | 3/1-41; | 24-26; |
| | | 27-30; | 32-53; |
| | | 57-62; | 9-67; |
| | | (13-15); | 9 |
| 5. జమదగ్ని (భార్గవుడు) | 4 | 8/90; | 9/62,65, |
| | | 67, | (16-18) |
| 6. అంగిరా | 0 | 0 | 0 |
| 7. భరద్వాజుడు (బృహస్పతి పుత్రుడు) | 60 | 6/1-14; | 16-32; |
| | | 37-43; | 53-74; |
| | | 9/67; | (1-3) |
| 8. వశిష్ఠుడు (మిత్రావరుణ పుత్రుడు) | 105 | 7/1-104 | 9/67 |
| | | (19-21); | 90 |
| | | 97 | (1-3) |
| 9. కాశ్యపుడు (మరీచి పుత్రుడు) | 7 | 1/99 | 9/64 |
| | | 67 (4-6) | 91 |
| 10. భృగు (వరుణ పుత్రుడు) | 1 | 9/65 | |

ఐదో అధ్యాయంలో 43 ఫుట్ నోట్

# ధర్మకీర్తి గ్రంథాలకి టీకాలు రాసిన వారి జాబితా

| మూలగ్రంథం | టీకా కారుడు | పరిచ్ఛేదాలు | గ్రంథ పరిణామం (శ్లోకాల్లో) |
|---|---|---|---|
| 1. ప్రమాణ వార్తికం | 1. దేవేంద్రబుద్ధి (పంజికా) T | 2-4 | 8,748 |
| | 2. శాక్య బుద్ధి (పంజికా-టీకా)T | 2-4 | 17,046 |
| | 3. ప్రజ్ఞాకర గుప్త (భాష్యం) ST | 2-4 | 16,276 |
| | 4. జయానంత్ (భాష్యటీకా) T | 2-4 | 18,148 |
| | 5. యమారీ (భాష్యటీకా) T | 2-4 | 26,552 |
| | 6. రవిగుప్త (భాష్యటీకా) T | 2-4 | 7,552 |
| | 7. మనోరథ నంది (వృత్తి) S | 1-4 | 8,000 |
| | 8. ధర్మకీర్తి (స్వవృత్తి) TS | 1 | 3,500 |
| | 9. శంకరానంద (స్వవృత్తి-టీకా)T (అపూర్ణం) | 1 | 7,578 |
| | 10. కర్ణకగోమీ (స్వవృత్తి-టీకా) S | 1 | 10,000 |
| | 11. శాక్యబుద్ధి (స్వవృత్తి-టీకా) T | 1 | ... |
| 2. ప్రమాణ వినిశ్చయం | 1. ధర్మోత్తర (టీకా) T | 1-3 | 12,463 |
| | 2. జ్ఞానశ్రీ (టీకా) T | 1-3 | 3,271 |
| 3. న్యాయ బిందు | 1. వినీత్‌దేవ (టీకా) T | 1-3 | 1,030 |
| | 2. ధర్మోత్తర (టీకా) TS | 1-3 | 1,477 |
| | 3. దువేంకమిత్ర (అను-టీకా) S | 1-3 | .... |
| | 4. కమలశీల (టీకా) T | | 221 |
| | 5. జినమిత్ర (టీకా) T | | 31 |
| 4. హేతుబిందు | 1. వినీత్‌దేవ (టీకా) T | 1-4 | 2,268 |
| | 2. అర్చట (వివరణ) TS | 1-4 | 1,768 |
| | 3. దువేంకమిత్ర (అను-టీకా) T | 1-4 | 1,768 |
| 5. సంబంధ-పరీక్షా | 1. ధర్మకీర్తి (వృత్తి) T | | 147 |
| | 2. వినీత్‌దేవ (టీకా) T | | 548 |
| | 3. శంకరానంద (టీకా) T | | 384 |
| 6. వాదం - న్యాయం | 1. వినీత్‌దేవ (టీకా) T | | 609 |
| | 2. శాంతరక్షిత (టీకా) TS | | 2,900 |
| 7. సంతానాంతర సిద్ధి | 1. వినీత్‌దేవ (టీకా) T | | 474 |

**Note: T =** టిబెట్టు భాషానువాదం. లభ్యం **S =** సంస్కృతమూలం. లభ్యం

# ధర్మకీర్తి 'ప్రమాణ వార్తిక' పరిచ్ఛేద వివరాలు

| విషయం | పరిచ్ఛేదకారికా |
|---|---|
| **ప్రథమ పరిచ్ఛేదం (స్వార్థానుమానం)** | |
| 1. గ్రంథ ప్రయోజన | 1/1 |
| 2. హేతువు | 1/3 |
| 3. అభావము | 1/5 + (4/126) |
| 4. శబ్దం | 1/186 |
| 5. శబ్దం ప్రమాణం కాదు | 1/214 |
| 6. వేదం ప్రమాణం కాదు | 1/225 |
| **రెండవ పరిచ్ఛేదం (ప్రమాణ సిద్ధి)** | |
| 1. ప్రమాణ లక్షణం | 2/1 |
| 2. బుద్ధుని వచనాలు ఎందుకు మాననీయాలు | 2/29 |


| విషయం | పరిచ్ఛేదకారికా |
|---|---|
| **3వ పరిచ్ఛేదం (ప్రత్యక్ష ప్రమాణం)** | |
| 1. ప్రమాణాలు రెండు ప్రత్యక్షం, అనుమానం | 3/1 |
| 2. పరమార్ధ సత్యం లేదా వ్యవహార సత్యం | 3/3 |
| 3. 'సామాన్యం' వస్తువు కాదు | 3/3 +(4/131) |
| 4. అనుమానప్రమాణం | 3/55 |
| 5. ప్రత్యక్ష ప్రమాణం | 3/123 |
| 6. ప్రత్యక్షంలోని రకాలు | 3/191 |
| 7. ప్రత్యక్షాభాసం? | 3/288 |
| 8. ప్రమాణ ఫలితం | 3/300 |
| **నాల్గవ పరిచ్ఛేదం (పరార్థానుమానం)** | |
| 1. పరార్థానుమాన లక్షణం | 4/1 |
| 2. పక్ష చింతన | 4/15 |
| 3. శబ్దం ప్రమాణం కాదు | 4/48 |
| 4. 'సామాన్యం' వస్తువు కాదు | 4/131+(3/3) |
| 5. పక్ష దోషాలు | 4/141 |
| 6. హేతు చింతన | 4/189 |
| 7. అభావ చింతన | 4/128+(1/5) |
| 8. భావం అంటే ఏమిటి | 4/28 |

# ధర్మకీర్తి శిష్యపరంపర

**కాలం:**

| | | | | | |
|---|---|---|---|---|---|
| క్రీ.శ. 600 | ........ | ధర్మకీర్తి | | | |
| క్రీ.శ. 625 | ......... | దేవేంద్రబుద్ధి | | | |
| క్రీ.శ. 650 | ....... | శాక్యబుద్ధి | | | |
| క్రీ.శ. 675 | ....... | జినేంద్రబుద్ధి | ప్రజ్ఞాకరగుప్త | ధర్మకరదత్త | కళ్యాణ రక్షిత |
| క్రీ.శ. 700 | ....... | జ్ఞానశ్రీ | రవిగుప్త | ధర్మోత్తర | |
| క్రీ.శ. 725 | ....... | యమారీ | | | |
| క్రీ.శ. 750 | ....... | వినీత్‌దేవ | | | |
| క్రీ.శ. 775 | ....... | శంకరానంద | | | |

## ప్రమాణవార్త్తికం టీకాకారులు



# కొన్ని పదాలు - వివరణలు

**అనంతం :–** ప్రాచీన హిందూ సంఖ్యామానం. 30 స్థానాల సంఖ్య. $10^{29}$ (ఒకటి తర్వాత 29 సున్నాల వేసిన సంఖ్య) 10,00,00,000,00,00,000,00,00,000,00,00,000.

**అనాథ పిండిక :–** అసలు పేరు సుదత్తుడు. దాన గుణశీలి. బౌద్ధ పోషకుల్లో అగ్రగణ్యుడు. జేత రాకుమారుని వద్ద జేతవనాన్ని కొని బుద్ధునికి దానమిచ్చాడు. బుద్ధుడు తన జీవిత కాలంలో ఎక్కువ కాలం గడిపింది ఈ జేత వనంలోనే. శ్రావస్తిలో ఉంది.

**అనాత్మ :–** అనత్త (పాళీ). ఆత్మ లేదు అని. బౌద్ధుల త్రిలక్షణాలలో ఒకటి. "సబ్బే సంఖారా అనత్త" (వస్తువులన్నీ ఆత్మలేనివే) మనం చేసే కర్మలన్నింటికీ కర్తగా ఒక శాశ్వతమైన ఆత్మ ఒకటుంటుందనీ, అది కర్మఫలాల్ని ఒక జన్మ నుండి మరో జన్మకు మోసుకు వస్తుందని నమ్మడం అవివేకం అని మజ్ఝిమనికాయంలో ఉంది. ఇలా ఆత్మను నమ్మడమే 'అవిద్య' అంటారు బౌద్ధులు.

**అనిత్యం :–** (impermanance) అనిచ్చ (పాళీ). అశాశ్వతం. నిత్యమైనది కానిది. శాశ్వతత్వం లేనిది. ప్రతిదీ, ప్రతిక్షణం మారుతూ ఉంటుంది. ఈ మార్పు ఒక ప్రవాహంగా అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది.

**అనుటీకా :–** టీకాను అనుసరించి రాసినది.

**అనుపలబ్ధం :–** ఒక ప్రమాణం. అభావాన్ని గుర్తించే ప్రత్యేక ప్రమాణం. ఇక్కడ అభావం అంటే ఒక దాని లేమిని గుర్తించడమే గాని శూన్యాన్ని కాదు. ఒకప్పుడు ఉండి ఇప్పుడు లేని దానికిని గుర్తించడం. ఇది ప్రత్యక్ష అనుమాన ప్రమాణాల వల్ల సాధ్యమయ్యేది కాదు.

**అనుమానం :–** పదార్థాల యథార్థస్థితిని తెలుసుకోడానికి ఉపయోగించే ప్రమాణాలలో ఒకటి. బౌద్ధులు అంగీకరించే ప్రమాణాలలో రెండోది. (మొదటిది ప్రత్యక్షం). ఈ రెండూ కాక ఆప్తవచనం (శబ్దం), దృష్టాంతాలనే మరో రెండు ప్రమాణాల్ని కొందరు తాత్త్వికులు చెప్తారు.

**అన్‌ఖాగోర్ :–** అనాగ్జగొరాస్ (క్రీ.పూ. 500–428). గ్రీకు దార్శనికుడు. ఏథెన్స్ నివాసి. ఆసియా మైనర్ క్లాజొమెన్‌లో జన్మించాడు. శాస్త్రీయ అన్వేషణా పద్ధతిని ఆయోనియానుండి ఏథెన్స్‌కు తెచ్చాడు. మొదట్లో ప్రపంచం అంతా అతి సూక్ష్మ భాగాలతో ఉండేదనీ, విశ్వంలో ఆ భాగాలన్నీ పెనవేసుకొని ఏదో ఒక బంధంలో ఉండేవనీ చెప్పాడు. ఏదో ఒక హేతువు లేదా సంఘటన వీటిని ఏకం చేసిందని చెప్పాడు. ఈ భావాలే ఆ తర్వాత పరమాణు వాదానికి దారి తీశాయి.

**అకుశల కర్మ :–** అనైతిక కర్మ. పంచశీలను పాటించక పోవడం.

**అచింత్యం :–** ప్రాచీన హిందూ సంఖ్యామానం. 33 స్థానాల సంఖ్య. $10^{32}$ (ఒకటి తర్వాత 32 సున్నాలు వేసిన సంఖ్య). 10,000,00,00,000,00,00,000,00,00,000,00,00,000

**అజాత శత్రు :–** అజాత సత్తు. (పాళీ) అంటే... శత్రువులు పుట్టని వాడు. బుద్ధుని సమకాలికుడు. బింబిసారుని, కోసలదేవి పుత్రుడు. కోసలరాజు ప్రసేనజిత్తు మేనల్లుడు. దేవదత్తుని ప్రోత్సాహంతో తండ్రిని చెరలో వేసి, మగధాధిపతి అయ్యాడు, బుద్ధుణ్ణి చంపి తనను బౌద్ధ సంఘానికి నాయకుణ్ణి చేయమని దేవదత్తుడు ఇతణ్ణి కోరతాడు. చివరికి, తండ్రి మరణానంతరం తన ప్రవర్తనకు తానే సిగ్గుపడి, బుద్ధుణ్ణి శరణు వేడాడు.

**అభావం :–** వస్తువు లేకపోవడం. శూన్యం. (అభావ వాదం = nihilism)ఆస్తికులు విశ్వాన్ని వాస్తవికం అంటారు. నాస్తికులు అవాస్తవికం అంటారు. బౌద్ధులు ఈ రెండింటినీ ఒప్పుకోరు.

**అభిధమ్మ కోశం :–** వసుబంధు రాసిన గ్రంథం. సర్వాస్తివాదుల సిద్ధాంతాల్ని తెలిపే 8 ప్రకరణాలు, 600 శ్లోకాలతో ఉన్న గ్రంథం. ఈ గ్రంథానికి వసుబంధు తానే భాష్యం రాశారు. అది “అభిధమ్మ కోశ భాష్యం”.

**అమర కోశం :–** అమర సింహుడు రాసిన సంస్కృత నిఘంటువు. దీన్ని ‘నామలింగాను శాసనం’ అని కూడా అంటారు. అమర సింహుడు మహాయాన బౌద్ధాచార్యుడు. ఈ గ్రంథంలో 1500 శ్లోకాలు 20 వేల పదాలు ఉన్నాయి.

**అరిస్టాటిల్ :–** Aristotle (క్రీ.పూ. 384–322). గ్రీకు మేధావి. ప్లేటో శిష్యుడు. మాసిడోనియాలోని స్టజీర పట్టణ వాసి. అలెగ్జాండర్ గురువు. లైసియం అనే విద్యాలయ స్థాపకుడు. పెద్ద గ్రంథాలయ స్థాపకుడు. అనేక విషయాలపై 400 గ్రంథాలు రాశాడు. కాల్సిస్ నగరం (యూబియా ద్వీపం) లో మరణించాడు.

**అరూపం :–** అరూప్య (సంస్కృతం). పంచేంద్రియ జ్ఞానం వల్ల తెలుసుకోలేనిది. రూపం లేనిది.

**అర్థ క్రియ :–** ఎండమావులు లాంటి భ్రమ కల్గించే వస్తువుల నుండి, నిజంగా ఉన్న వస్తువుల్ని గుర్తించడానికి ప్రమాణంగా ఉపయోగించేది.

**అలార కాలామ :–** సిద్ధార్థుడు పరివ్రాజకుడైనప్పుడు తాను శిష్యునిగా చేరిన గురువులలో మొదటివాడు అలారకాముడు. తాత్త్వికంగా ఏ శాఖకు చెందిన వాడో తెలియదు. ధ్యానానికి సంబంధించినవాడై యుండొచ్చు. సిద్ధార్థునికి జ్ఞానోదయం కాడానికి కొంత కాలం ముందే మరణించాడు.

**అలెగ్జాండ్రియా :–** సికందరియా. అలెగ్జాండర్ పేరుతో నిర్మించిన పట్టణం. మధ్యధరా సముద్రం దక్షిన భాగంలో, ఆఫ్రికా ఖండంలో, ఈజిప్టు దేశంలో ఉన్న పట్టణం.

**అవిద్య :–** అవిజ్జ (పాలీ). **అనిత్యా శుచి దుఃఖానాత్మసు నిత్యా శుచి సుఖాత్మా ఖ్యాతి రవిద్యా.** (యోగదర్శనం – 2/4.) అనిత్యాన్ని నిత్యం అనీ, అశుచిని శుచి అనీ, దుఃఖాన్ని సుఖమనీ, అనాత్మని ఆత్మ అని అనుకోవడమే అవిద్య. జ్ఞాన రాహిత్యమే అవిద్య. జ్ఞానం వల్ల అవిద్య నశిస్తుంది అంటారు అద్వైతులు. ప్రకృతి యొక్క ఒక స్వరూపం అవిద్య అంటారు ద్వైతులు. అష్టాంగ మార్గాలు తెలియక పోవడం, ఆర్య సత్యాలు గ్రహించక పోవడం అవిద్య అంటారు బౌద్ధులు. ప్రతీత్య సముత్పాదంలోని 12 భాగాలలో మొదటిది అవిద్య.

**అవ్యాకృతాలు :– (unanswerable)** అకథనీయాలు. సమాధానాలు చెప్పలేని ఊహాజనిత ప్రశ్నలు. మజ్ఝిమ నికాయలో వత్సగోత్రుడు (వచ్ఛగొత్త) 14 ప్రశ్నలు బుద్ధుణ్ణి అడుగుతాడు. బుద్ధుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనం వహిస్తాడు.

**అశోకారామం :–** అసోకారామ (పాలీ). పాటలీపుత్రం (పాట్నా)లో అశోకుడు నిర్మించిన బౌద్ధారామం. 3వ బౌద్ధ సంగీతి, 2వ పాటలీపుత్ర సంగీతి ఇక్కడ జరిగాయి.

**అశోకుడు :–**(క్రీ.పూ. 272–231) మౌర్య చక్రవర్తి. చంద్రగుప్తుని మనుమడు. బిందుసారుని పుత్రుడు. క్రీ.పూ. 250లో మొగ్గలిపుత్త తిస్స నేతృత్వంలో 3వ బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. 'దేవనాంప్రియ' అనేది ఇతని బిరుదు.

**అశ్వఘోషుడు :–** బుద్ధచరితం, సౌందరనందం కావ్యాలు రచించిన కవి. కనిష్కుని ఆస్థాన కవి. సారిపుత్ర ప్రకరణం, మహాయాన శ్రద్ధోత్పాద అనే గ్రంథాలు కూడా ఇతని కృతులే. కావ్య రచనకు శ్రీకారం చుట్టిన మహాకవి. మహాయాన సంప్రదాయవాది.

**అసాధారణ కారణం :–** మట్టి, కుమ్మరి ఉన్నంత మాత్రానే కుండ తయారు కాదు. మట్టిని కుండగా మలచడానికి కొన్ని పరికరాలు అవసరం. అవి, సారె, కర్ర, గీకే చెక్క మొదలైనవి. వీటిని అసాధారణ కారణాలు అంటారు. ఇవికూడా కార్యం (కుండ)లో కన్పించవు.

**అసంస్కృతం :– (Unconditioned)** అప్రత్యయం. ఏ ప్రత్యాయాలూ లేనిది. అంటే... ఏ కారణాలూ లేనిది.

**అహింస :– అపీడనం అహింస**. అంటే మనో వాక్కాయ కర్మలతో ప్రాణుల్ని హింసించకుండుట. పీడించకుండడం.

**అక్షపాదుడు :–** గౌతముడు. న్యాయదర్శన కర్త. నడుస్తున్నా సరే, తల వొంచుకొని పాదాలవంక చూస్తూ, నిరంతరం ఆలోచిస్తూ ఉండేవాడుట అందుకని అక్షపాదుడన్నాడంటారు. మరో కథకూడా ఉంది. ఆలోచిస్తూ నడుస్తుంటే ఒక గుంటలో పడ్డాడట. "కాళ్ళకు కన్నులుంటే బావుండును గదా!" అనుకొన్నాడట. అందుకే అక్షపాదుడంటారనీ అంటారు. అహల్య భర్త గౌతముడు, ఇతడూ ఒకరేనంటారు. రామాయణంలోని బాలకాండను బట్టి, శతపథ బ్రాహ్మణాన్ని బట్టీ ఇతను రహూగణ

మహర్షి కొడుకని మిథిలవాసియనీ తెలుస్తుంది. జనక పురోహితుడైన శతానందుడు ఈ గౌతముని కొడుకేనంటారు.

**ఆత్మ :–** అత్త (పాలీ). **(soul)** నశించే శరీరానికి అతీతంగా, శరీరంలో నశించకుండా ఉండేది. మారనిది. శాశ్వత సత్యంగా భావించబడింది. శరీరాన్ని నడిపేది. విశ్వాన్ని నడిపే పరమాత్మలో భాగం. **"యో 2 తతివ్యాప్నోతి స ఆత్మా"** అంటే వ్యాపించి ఉండేది ఆత్మ అని అర్థం. ఆత్మకు ఉపనిషత్తులు అధిక ప్రాధాన్యత నిచ్చాయి. బౌద్ధులు ఆత్మను తిరస్కరించారు. బుద్ధుడు అనాత్మతా వాది. చార్వాకులు ఆత్మ, శరీరాలు అభిన్నాలు, రెండూ నశిస్తాయి అన్నారు. జైనులు జీవుడే ఆత్మ, ఆత్మలు అసంఖ్యాకాలు అన్నారు. సాంఖ్యులు ఆత్మ అంటే పురుషుడు అంటారు. మీమాంసకులు శరీరానికి భిన్నమైనది, నిత్యం, సర్వవ్యాపకం అంటారు. అద్వైతం ఆత్మ జనన మరణాలు లేనిది అంటుంది. విశిష్టాద్వైతం ఆత్మలు నిత్యాలు, పరమాత్మ నుండి జీవాత్మలు పుడతాయి అంటుంది. ద్వైతం జీవాత్మలు అసంఖ్యాకాలు, పరమాత్మకు భిన్నాలు అంటుంది. ఇస్లాం ఆత్మ నాలుగు విధాలు. (హృదయం, జీవం, కామం, బుద్ధి) అంటుంది. ప్లేటో ఆత్మ చావులేనిది, శాశ్వతం అన్నాడు. హెగెల్ ఆత్మ, శరీరం ఒక్కటే అన్నాడు.

**ఆర్యదేవుడు :–** ఆచార్య నాగార్జునికి సమకాలికుడు. మాధ్యమిక వాది. చతుశ్శతక, శతశ్శాస్త్ర, చతుహస్తిక, అక్షర శతకాలు – ఆర్యదేవుని గ్రంథాలు.

**ఆలయం :– 'ఆ' సమంతాతే** అంటే సంపూర్ణంగా అని అర్థం. లయం అంటే లయమవ్వడం. అంటే లీనమైపోవడం. అంటే... సంపూర్తిగా దానిలో లీనమై పోవడం – ఆలయం. అలాగే... ఆచారం (సంపూర్ణంగా చరించడం) ఆలోచన (సంపూర్ణంగా చూడడం), అనే పదాలు.

**ఆవాసాలు :–** వర్షాకాలంలో భిక్షువులు నివసించే స్థలాలు. కాలాంతరంలో ఇవి విహారాలుగా మారాయి.

**ఇంద్రియాలు :–** ఇంద్రియాలు 22. ఆయతనాలు = 6; లింగభావాలు = 2; వేదనా ఇంద్రియాలు = 6; ఆధ్యాత్మిక ఇంద్రియాలు = 5; లోకోత్తర ఇంద్రియాలు = 3

**ఈశ్వరుడు :–** అంటే... నశించనివాడు. ఐశ్వర్యవంతుడు. భగవంతుడు. ప్రస్తుతం శివుణ్ణి ఈశ్వరుడు అంటున్నాం. అమర కోశంలో శివుని గల 48 పేర్లలో 'ఈశ్వరుడు' అనేది కూడా ఒకటి. తత్త్వ శాస్త్రగ్రంథాల్లో, ఉపనిషత్తుల్లో ఈ పదం భగవంతునికి వాడబడింది. సగుణ బ్రహ్మే ఈశ్వరుడు. సృష్టి, స్థితి, లయ కర్త. ' బ్రహ్మ చైతన్యమే ఈశ్వరుడు' – అంటారు శంకరాచార్యులు.

**ఉచ్ఛేదవాదం :– (unnihilationism)** ఖండించే వాదం. భేదించే వాదం. బుద్ధుడు అంగీకరించని వాదం. వ్యక్తి చనిపోయాక అతనికి సంబంధించింది ఏదీ మిగలదు. పునర్జన్మ లేదు. కర్మ ఫలాలు అంటవు అని చెప్పే వాదం.

**ఉదయనుడు :-** ఉదయనాచార్యుడు. క్రీ.శ.10వ శతాబ్దం. వాచస్పతి మిశ్రుని 'తాత్పర్యటీక'కు "తాత్పర్య పరిశుద్ధి" పేరుతో వ్యాఖ్య రచించాడు. ఇతని మేటి రచనలు 'న్యాయ కుసుమాంజలి' 'ఆత్మతత్త్వ వివేకం' (బౌద్ధధిక్కారం). ప్రబోధ సిద్ధి (న్యాయ పరిశిష్టము). ఈ రచనల్లో అనాత్మ వాదాన్ని తీవ్రంగా ఖండించి ఆత్మ వాదాన్ని గొప్పగా చెప్తాడు.

**ఉద్దక రామపుత్త :-**ఉద్రక రామపుత్రుడు. ఉద్రకుడు. ఉద్దకుడు. సిదార్థునికి తొలి దశలో ధ్యానయోగాన్ని నేర్పిన గురువు.

**ఉద్యోతకారుడు :-** ఉద్యోతకార భరద్వాజుడు. క్రీ.శ. 6వ శతాబ్దివాడు. బౌద్ధ దార్శనికుడైన దిజ్నాగుని సిద్ధాంతాన్ని ఖండిస్తూ "న్యాయ వార్తికం" రచించాడు. దీన్లో దిజ్నాగుణ్ణి 'కుతార్కికునిగా' అభివర్ణించాడు.

**ఉపనిషత్తులు :-** ఉప-ని-షత్ - అంటే ధ్యానంతో దగ్గరగా కూర్చోవడం అని అర్థం. గురుశిష్యులు ఒకరు చెప్పేవారు, ఒకరు వినేవారు అనే భావంతో కాకుండా మిత్రుల్లా జ్ఞాన చర్చ చేయడం. వీటిని వేదాంతాలు అంటారు. షుమారు 200 ఉపనిషత్తులున్నాయి. ముక్తికోపనిషత్తు 108 ఉపనిషత్తుల్ని ముఖ్యమైన వాటిగా చెప్పింది. శంకరాచార్యులు 10 ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రాశారు. అవి ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, ఐతరేయ, తైత్తరీయ, ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్తులు. ఉపనిషత్తులు యజ్ఞయాగాల్ని, జంతు బలుల్ని వ్యతిరేకించాయి. జ్ఞాన మార్గమే ముక్తి మార్గమని చాటాయి. ఇవి బ్రహ్మ విద్యా బోధకాలు. ఆత్మకీ, బ్రహ్మకీ ఉన్న సంబంధాన్ని విశ్లేషించాయి.

**ఉపాదాన కారణం :-** కార్యంలో కన్పించే కారణాన్ని ఉపాదాన కారణం అంటారు. మట్టి లేకుండా కుండ ఉండదు. కుండ పుట్టడానికి మట్టే కారణం. కార్యం, కారణం నుండే పుట్టుతుంది. కాబట్టి ఇక్కడ మట్టి కారణం లేదా ఉపాదానం. కుండ - కార్యం లేదా ఉపాదేయం. కుండలో మట్టి కన్పిస్తుంది. ఉపాదానం అంటే ప్రకృతి. అంటే ఏదైతే ఉందో అది. ఇక్కడ మట్టి ప్రకృతి. అది కుండలో కూడా ఉంటుంది. మట్టితో చేసిన కుండ మట్టికుండ అవుతుంది. ఇత్తడితో చేసిన బిందె ఇత్తడి బిందె అవుతుంది. ఇంకా... ఉపాదానం అంటే ... కారణం, హేతువు అనే అర్థాలు కూడా ఉన్నాయి.

**ఉరువేళా :-** ఉరువేల. నెరంజనా (నిరంజనా) నది ఒడ్డున ఉన్న ఒక గ్రామం. గయ సమీప గ్రామం. బుద్ధుడు తీవ్రమైన ధ్యానం చేసి సొమ్మసిల్లి పడిపోయిన ప్రదేశం. సుజాత బుద్ధునికి పాయసమిచ్చిన చోటు. బుద్ధుడు ఆరేళ్ళు ఇక్కడే కఠిన తపశ్చర్యలు చేశారు.

**ఐన్‌స్టీన్ :- (Einstein)** జర్మన్ భౌతిక శాస్త్రవేత్త. నోబెల్ బహుమతి (1921) గ్రహీత. సాపేక్ష సిద్ధాంతం, ద్రవ్యరాశి శక్తుల సమానత, బ్రౌనియన్ గతి సిద్ధాంతం, కాంతిఫోటాన్‌ల సిద్ధాంతం ఇతను ప్రతిపాదించిన నూతన సిద్ధాంతాలు.

E=$mc^2$ ఇతని ప్రసిద్ధ సిద్ధాంతం. జననం : 14-03-1879 మరణం : 18-04-1955

**కణాదుడు :-** (క్రీ.శ.150). పరమాణు వాది. వైశేషిక దర్శన కర్త. ప్రతిదీ కణాలతో నిర్మించ బడిందే అని చెప్పాడు. 'కణాలను తినేవాడు' కాబట్టి కణాదుడనే పేరు వచ్చింది అంటారు.

**కదలీ గర్భం :-** అరటి చెట్టు గర్భం. దీనిలోంచి ఒక గెల మాత్రమే వస్తుంది. ఆ తర్వాత ఆ చెట్టు అంతరిస్తుంది. మరో గెల రాదు.

**కనిష్కుడు :-** కనిష్కుడు (క్రీ.పూ.125-51) వాయువ్య, మధ్య భారత దేశాన్ని పాలించిన కుషాణు వంశంలో మూడో రాజు. రెండో అశోకుడని పేరు. బౌద్ధాభిమాని. సర్వాస్తివాద అవలంబి. కనిష్కుని ఆధ్వర్యంలో ఆరో బౌద్ధ సంగీతి గాంధారం (కాశ్మీర్) లో వసుమిత్రుని అధ్యక్షతన 499 మంది బౌద్ధ పండితులతో నిర్వహించబడింది. అప్పుడే 'మహావిభాష' రచన జరిగింది.

**కపిలుడు :-** (క్రీ.పూ.400) సాంఖ్య దర్శనకారుడు. ఒక ముని. తల్లి దేవహూతి. తండ్రి కర్దము పుత్రుడు. భార్య శ్రీమతి. బుద్ధుని ఉపదేశాల్లో ఎక్కడా కపిలుని ప్రస్థావన లేదు. కాబట్టి బుద్ధుని తర్వాతి వాడైయుండొచ్చు. ఇతని ప్రస్థావన తొలిగా శ్వేతాశ్వతరకోపనిషత్తులో కన్పిస్తుంది.

**కర్మ :-** కమ్మ (పాలీ). పని చేయడం. "కరణం కర్మ" అంటే చేసేది. వ్యవహారంగా ఏ పనైనా కర్మగానే భావిస్తాం. కానీ, బౌద్ధం ఉద్దేశ పూర్వకంగా చేసిన పనుల్నే కర్మగా భావిస్తుంది. బౌద్ధం కర్మని నైతికంగా చూసింది. భారతీయ దర్శనంలో ప్రధానమైన 'కర్మ' విభజన రకరకాలుగా ఉంది. *వైదికం :-* కర్మ, అకర్మ, వికర్మ. *మీమాంసకులు :-* నిత్యకర్మ, కామ్యకర్మ, ప్రతిషిద్ధకర్మ. *భగవద్గీత :-* నిష్కామ కర్మ (కర్మ అంటే స్వధర్మం) *జైనులు :-* కర్మ సూక్ష్మరూప భౌతిక పదార్థం. ఒక ద్రవ్యం. 8 రకాలు కర్మలున్నాయి. *వైశేషికులు :-* ఒక ద్రవ్యం. ఏడు ద్రవ్యాలలో ఒకటి. కర్మ అంటే గతి. గమన రూపక్రియ. కర్మ ఐదు విధాలు. ఇవే కాక, సాధారణంగా... కర్మల్ని నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలనీ, సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలనీ విభాగిస్తారు. "బుద్ధిఃకర్మను సారిణి" కర్మని బట్టే బుద్ధి ఉంటుంది అంటుంది హిందూ వాదం. "కర్మ బుద్ధ్యాను సారిణి" బుద్ధిని బట్టే కర్మ ఉంటుంది అంటుంది బౌద్ధ ధర్మం.

**కారణం :-** (cause) హేతువు. ఫలితాన్ని ఇచ్చేది. ఒక సంఘటన జరగడానికి మూలమైనది. కుండకు మట్టి కారణం. ఆరిస్టాటిల్ ఉపాదాన (material) కారణం, ఆకృతిక (formal) కారణం, నిమిత్త (efficient) కారణం, పార్యంతిక (firal) కారణాలు ప్రధాన కారణాలన్నాడు. భారతీయులు సమవాయి కారణం, అసమవాయి కారణం, నిమిత్త కారణం, ఉపాదాన కారణాలు ప్రధాన కారణాలన్నారు.

**కారికా :-** అర్థవివరణలతో ,శ్లోకాల రూపంలో ఉండే వ్యాఖ్యానాన్ని కారికా అంటారు.

**కార్యం :-** జరిగిన పని. పని ఫలితం. మట్టి (ఉపాదాన కారణం), కుమ్మరి (నిమిత్త కారణం), సారె (అసాధారణ కారణం) - ఈ కారణాల ఫలితం జరిగిన కార్యం కుండ ఏర్పడటం. 'కుండ' కార్యం.

**కుమారిలుడు :–** కుమారిల భట్టు. 'అనుమాన పరిచ్ఛేద' కర్త.

**కెప్లర్ :–** Kepler (1571-1630) జర్మన్ గణిత ఖగోళ వేత్త. గ్రహ గతులకు సంబంధించిన మూడు నియమాల్ని తొలిగా ప్రకటించిన వాడు. టైకోబ్రాహే శిష్యుడు. భూమి, ఇతర గ్రహాలు సూర్యుని చుట్టూ అండాకార కక్ష్యలో పరిభ్రమిస్తున్నాయని చెప్పాడు. జననం :27–12–1571, మరణం : 15–11–1630

గుణం :– Quality. ద్రవ్యాన్ని ఆశ్రయించి ఉండేది. కణాదుడు 24 గుణాల్ని చెప్పాడు. వాటిని సామాన్య గుణాలు, విశేష గుణాలని వర్గీకరించాడు తన వైశేషికంలో. ఈ వైశేషికులు గుణాన్ని ప్రత్యేక పదార్థంగా చూస్తారు.

గెలీలియో :– (Galileo) పీసా పట్టణంలో జన్మించాడు. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్రవేత్త. మొదటిసారిగా గణిత శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రానికి అన్వయించి గడియారాలకు లోలకాల్ని నిర్మించాడు. 1610లో దూరదర్శిని తయారు చేసి చంద్రుణ్ణి, ఇతర గ్రహాల్ని వాటి ఉపరితలాల్ని చూశాడు. చంద్రుని మీద కొండలు, లోయలు ఉన్నాయని, గురుగ్రహానికి నాలుగు చందమామలున్నాయని, సూర్యతలంపై మచ్చలున్నాయని, బుధునికి చంద్రునిలా కళలు ఉన్నాయని, పలుచటి మేఘంలా కన్పించే పాలపుంత అనంతకోటి నక్షత్రాల నిలయమని చెప్పాడు. బైబిలుకు విరుద్ధంగా చెప్పాడని మతాధిపతులు ఇతణ్ణి శిక్షించారు. జైలులో అంధుడై మరణించాడు. జననం : 15–02–1564, మరణం : 08–01–1642

**జ్ఞానం :–** 'జ్ఞా' అనే ధాతువుకు అవబోధనా, అనుభవంతో తెలుసుకొనేది అని అర్థం. "జ్ఞాయతే అనే నేతి జ్ఞానం" అంటే "దీని చేత తెలియబడును" అని. తత్త్వంలో మోక్షసాధన తెలుసుకోడానికి అవసరమైన బుద్ధిని "జ్ఞానం" అంటారు.

**జ్ఞాత :–** తెలుసుకునేవాడు.

**జ్ఞేయం :–** తెలియ దగినది. జ్ఞానం ద్వారా తెలుసుకునేది. ప్రమాణం ద్వారా తెలుసుకుంటాం కాబట్టి ప్రమేయం అని కూడా అంటారు.

**చింతన :–** చింతించడం. పదేపదే తలచుకోవడం. ధ్యానమే చింతన. ఇది "ధ్యై" అనే ధాతువు నుండి పుట్టింది. 'ధ్యై' అంటే ధ్యానం, చింతామయం అని. దార్శనిక చింతన అంటే తాత్త్విక చింతన.

**చైత్యవాదం :–** చైత్య – చేతియ (పాళీ). బౌద్ధంలో ఒకశాఖ. బౌద్ధ చైత్యాలను పూజించడం వల్ల పుణ్యం కల్గుతుందని నమ్మేవారు. దక్షిణ భారత దేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఈ శాఖ ప్రధానమైంది. వీరి గురువు మహాదేవుడు చైత్యగిరిపై నివసించాడని, అందువల్ల వీరికి చైత్యకులనే పేరు వచ్చిందంటారు. అమరావతి వీరి ప్రధాన స్థావరం.

**జగత్తు :–** 'జ' అంటే పుట్టినది. జనించినది. 'గ' అంటే గమనం చేసేది. గమించి నశించేది. సృష్టి, స్థితి, లయాలు చెందేది జగత్తు.

**జాతి :–** జాతి అంటే జన్మ. పుట్టడం. గర్భాదానం సమయం నుండి పుట్టే వరకు ఉన్న మధ్య సమయం. అస్తిత్వ వర్గ రూపాలు ఒక స్థిర రూపాన్ని ఏర్పరుచుకొని బహిర్గతం కావడమే జాతి. బౌద్ధుల ప్రతీత్య సముత్పాదంలో పదో నిదానం.

**టీకా :–** "టీకా నిరంతర వ్యాఖ్యా". మూలగ్రంధానికి సంబంధించిన అర్థాన్ని సమగ్రంగా వివరించే రచన. (Explanatory notes)

**డెమోక్రటీజ్ :–** Democritus (క్రీ.పూ. 460–370). గ్రీకు భౌతిక దార్శనికుడు. పాశ్చాత్య ప్రపంచంలో అణు సిద్ధాంతాన్ని తొలిగా ప్రకటించినవాడు. అణువులు విభజించలేని భౌతిక రాశులు అని చెప్పాడు. అణువులు గుణ రహితాలు, అపరివర్తనీయాలు, శాశ్వతాలు, నిరంతర చలన శీలాలు అన్నాడు. అణువుల ఆకారాలలో, స్థితుల్లో, పరిమాణాల్లో భేదాలుంటాయి. సమస్త విశ్వం అణువులతోనే నిర్మించబడింది అని చెప్పిన గొప్ప భౌతిక వేత్త.

**తత్వం :–** "తస్యభావం తత్వం". దాని యొక్క యథార్థ లక్షణం తత్వం. అంటే... సహజ లక్షణం.

**తత్త్వం :–** తత్ అంటే ఆత్మ. త్వం అంటే నీవు. ఆత్మ, వ్యక్తి (నీవు) ఈ రెండింటి ఐక్యతే తత్త్వం.

**తృష్ణ :–** తన్హ (పాలీ). దాహం. కోరిక. తపన. దుఃఖానికి మూలం. వేదనను పదే పదే అనుభవించాలి అనే ఆరాటమే తృష్ణ అంటుంది బౌద్ధం. ఇది 3 రకాలు. **కామతృష్ణ** సుఖాన్ని పదేపదే పొందాలను కోవడం. **భవ తృష్ణ** శరీరాన్ని శాశ్వతంగా భావించి దాన్ని పోషించుకోడానికి. **విభవ తృష్ణ** పై వాటికి భంగం వాటిల్లినప్పుడు కలిగే ఆత్రుత.

**దశకుమార చరిత్ర :–** దండి మహాకవి రాసిన సంస్కృత కావ్యం. తెలుగులో తిక్కన శిష్యుడు 'అభినవ దండి' కేతన అనువదించాడు. కేతన నెల్లూరి వాసి.

**దర్శనం :–** "దృశ్" అనే ధాతువు నుండి పుట్టింది. ఒక వస్తువునిగాని, సన్నివేశాన్ని గాని మనం చూస్తాం. ఏ ఇద్దరూ దాన్ని ఒకే విధంగా గ్రహించలేరు. ఎవరి మానసిక పరిస్థితిని బట్టి వారు చూస్తారు. చూచేవారిని 'ద్రష్ట' అనీ, చూడబడిన దాన్ని 'దృశ్యం' అనీ, చూడడాన్ని "దృక్" అనీ అంటారు. దృశ్యం నుండి దృక్ ద్వారా ద్రష్ట గ్రహించిన జ్ఞానమే దర్శనం. బుద్ధుడు ఇంకా కొందరు బౌద్ధ తత్త్వ వేత్తల బోధనల ద్వారా ధర్మాన్ని దర్శించడమే "బౌద్ధదర్శనం". ఉదా॥ తాజ్‌మహల్‌ని శ్రీశ్రీ, జాషువాలు ఇద్దరూ చూశారు. షాజహాను యొక్క "తెలికన్నుల భాష్పధారలు పొగిలి ఘనీభవించినవి ముద్దల తాజ్‌మహలుగన్" అన్నారు జాషువా. "తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు?" అని ప్రశ్నించారు శ్రీశ్రీ. చూచిన విషయం ఒకటే,చూచిన వారి దృక్పథాలే మార్పు.

**ద్రవ్యం :–** Substance. సమస్త విశ్వం అస్తిత్వానికి మూలమైనది, విశ్వపరిణామాలకు, మార్పులకు కారణమైనది, తాను మాత్రం మార్పు చెందనదీ, శాశ్వతమైనది. ఏది ద్రవ్యం? అనే విషయంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిప్రాయం ఉంది. ఆధ్యాత్మికవాదులు ఆధ్యాత్మిక సత్తాయే ద్రవ్యం అంటారు. దైవవాదులు దైవమే ద్రవ్యం అంటారు. భౌతిక వాదులు భౌతిక పదార్ధమే ద్రవ్యం అంటారు. బౌద్ధులు ద్రవ్యాన్ని ఒప్పుకోరు.

**నైయ్యాయికులు :–** పంచభూతాలు, కాలం, దిక్కు, ఆత్మ, మనస్సు– ఈ తొమ్మిదింటిని ద్రవ్యాలు అంటారు.

**దుఃఖం :–** బౌద్ధుల త్రిలక్షణాలలో ఒకటి. "దుష్టాని ఖాని ఇంద్రియాణి యత్రేతి దుఃఖం" 'ఇంద్రియాలు దీనియందు దుష్టములగుతాయి,కాబట్టి ఇది దుఃఖం. దుఃఖం సహజం కాదు. తెచ్చుకొనేదే. కాబట్టి దాన్ని వదిలించుకోవచ్చు. పోగొట్టుకోవచ్చు. దుఃఖాన్ని మనకు మనం తెచ్చుకొంటాం. అందుకే, 'దుర్నిందితం ఖనతివా దుఃఖం' "నిందితమైనదాన్ని తవ్వి తెచ్చుకోవడమే దుఃఖం."

**ధర్మం :–** "ధారణాయ శక్యం ఇతి ధర్మం" "ధారణాత్ ధర్మం" అంటే 'ధరించేది ధర్మం' అని "ధరతి లోకానితి" – లోకాన్ని ధరించేది ధర్మం. "ధ్రియతే వాజ నైరితి" – జనం అనుసరించేది ధర్మం. ధర్మం అనేది సహజం, శాశ్వతం. దీన్ని పొందడం లేదా ధరించడం వల్ల సహజ సుఖశాంతుల్ని పొందుతాము. బౌద్ధాన్ని 'బౌద్ధమతం' అంటారు, వ్యవహారికంగా. కాని 'బౌద్ధధర్మం' అనేది సరైనది. మతం, ప్రకృతి, గుణం, నియమం, న్యాయం, విధి, నైతికం – ఈ పదాలకి పర్యాయంగా'ధర్మం' అనే పదాన్ని ఉపయోగిస్తారు.

**ధర్మ ప్రచారం :–** ధర్మచక్రప్రవర్తన. (Wheel of the law) ధమ్మ చక్క (పాలీ). వారణాసి దగ్గర ఉన్న సారనాథ్‌లో బుద్ధుడు తొలిగా తన ధర్మాన్ని ప్రజలకు చెప్పాడు. దీని ప్రతీకగా ఉన్న చక్రానికి 8 ఆకులు అష్టాంగాలని గుర్తుగా ఉంటాయి. ఈ చక్రానికి ఆద్యంతాలు లేవు. నిరంతరం తిరుగుతూనే ఉంటుంది.

**ధర్మయుద్ధం :–** జీహాద్. పవిత్రయుద్ధం. ముస్లింలు ముస్లిమేతరులపై చేసే మత యుద్ధం.

**ధాన్యకటకం :–** ధనకటకం.ప్రస్తుతం ధరణికోట. ఒకనాటి శాతవాహనుల రాజధాని. గుంటూరు జిల్లా అమరావతి గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఓ చిన్న గ్రామం.

**నాస్తిక వాదం :–** Athesim. నాస్తి అంటే లేదు అని. 'పదార్థానికి యథార్థమైన స్థితి లేదు' అని చెప్పింది నాస్తిక వాదం. కాలక్రమంలో ఈ పదానికి అర్థాలు మారాయి. పరలోకం లేదనేవారు నాస్తికులన్నాడు పాణిని. వేదప్రమాణాన్ని అంగీకరించనివారు నాస్తికులు అన్నాడు మనువు. భగవంతుని విశ్వాసం లేనివారు నాస్తికులు అనుకొంటున్నారు ప్రస్తుతం. చార్వాక, జైన, బౌద్ధ దర్శనాల్ని నాస్తిక దర్శనాలంటారు. బౌద్ధం 'సృష్టికర్తను' అంగీకరించదు. కానీ, పరమ వాస్తవికతని నిరాకరించదు. కాబట్టి బౌద్ధం తాత్త్వికంగా నాస్తికం కాదు.

**న్యాయం :-** "నీయతే ఇతి న్యాయం" – అంటే దగ్గరకు చేర్చేది అని. ధర్మం దగ్గరకు చేర్చేది. దీన్ని 'అన్వీక్షికి' అని కూడా అంటారు. అంటే... 'మననం' అని. నిరంతరం ఆ తత్త్వాన్నే ఆలోచిస్తూ ఉంటే ధర్మాన్ని తెలుసుకుంటాము అని దీని భావం. "ప్రమాణైరర్థ పరీక్షణం న్యాయం" అన్నాడు వాత్స్యాయనుడు. అంటే భిన్న భిన్న ప్రమాణాల ద్వారా వస్తు తత్త్వాల్ని పరీక్షించడం. ఆధునిక కాలంలో చట్టాల్ని పరిరక్షించే శాస్త్రాన్ని న్యాయ శాస్త్రం అంటున్నారు. కానీ, 'న్యాయం' అనేది తత్త్వశాస్త్రం. పూర్వం తత్త్వ శాస్త్రాన్ని న్యాయ శాస్త్రం అనేవారు.

**న్యాయ దర్శనం :-** న్యాయ దర్శనం. ఈ దర్శన కర్త గౌతముడు. (అక్షపాదుడు) షడ్దర్శనాలలో ఒకటి. తత్త్వశాస్త్రం.

**నికాయ :-** పాలీ భాషలో ఉన్న ఐదు బౌద్ధ గ్రంథాలు. దీఘ (దీర్ఘ), మజ్ఝిమ (మధ్యమ), సంయుత్త (సంయుక్త),అంగుత్తర, ఖుద్దక (హ్రస్వ) నికాయాలు.

**నిమిత్త కారణం :-** మట్టి కుండగా మారింది. తనుకు తానుగా మారిందా? లేదు. మట్టిని కుండగా మలిచేవాడు కుమ్మరి. ఇక్కడ కుమ్మరి 'నిమిత్త కారణం'. మట్టి కుండగా మారిన తర్వాత కుండలో మట్టి కన్పిస్తుంది. కానీ కుమ్మరి కన్పించదు.

**నిర్వాణం :-** నిబ్బానం (పాలీ) మరణాన్ని బౌద్ధులు నిర్యాణం అనరు. 'నిర్వాణం' అంటారు. 'నిర్యాతి నేత్రజలం అస్మాత్ ఇతి నిర్యాణం' "దీనివల్ల కన్నీళ్ళు రాలును" – కాబట్టి సాధారణ చావును నిర్యాణం అంటారు. కానీ, ఎలాంటి పాశబంధాలు అంటని దాన్ని 'నిర్వాణం' అంటారు. "**దుఃఖాగయో అస్విన్నితి నిర్వాణం**" దుఃఖాదులు దీనియందు నిర్గత మవుతాయి. కాబట్టి ఇలాంటి అమరమైన మరణాన్ని నిర్వాణం అంటారు. దీని సాధారణార్థం "ఆరిపోవుట", దీప నిర్వాణం అంటే దీపం ఆరిపోవుట. దీపం కొండెక్కుట. ముక్తి, కైవల్యం, శ్రేయస్సు, నిశ్రేయస్సు, అమృతం, మోక్షం, అపవర్గం – అనేవి నిర్వాణానికి పర్యాయ పదాలు. బౌద్ధులు రెండు రకాల నిర్వాణాన్ని పొందుతారు.

ఉపాధి శేషనిర్వాణం :- రాగద్వేషాలు నశింపజేయడం. క్లేశాల్ని నశింప చేస్తాం. కాబట్టి దీన్ని హిలేశపరి నిబ్బానం అంటారు. దీనిలో వ్యక్తి జీవించే ఉంటాడు.

అనుపాధి శేష నిర్వాణం :- వ్యక్తి మరణంతో బాటు స్కంధ జీవితం కూడా ముగుస్తుంది. నిర్వాణం పొందే దశలు నాలుగు. ఆయా దశల్ని బట్టి వీరిని స్రోతాపన్నులు, సకృదాగాములు, అనాగాములు, అర్హంతులు అంటారు.

**న్యూటన్ :-** (Newton) (1642–1727) ప్రసిద్ధ భౌతిక గణిత వేత్త. విజ్ఞాన శాస్త్ర చరిత్రలో కెల్లా అతి గొప్పదైన గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్నాడు. గమన నియమాల్ని ప్రతిపాదించాడు. కాంతి, ఉష్ణం, కలన గణితం ఇలా పలు శాస్త్రాల్లో కృషి చేశాడు. భౌతిక శాస్త్రవేత్తల్లో అగ్రగణ్యుడు.

**పంజిక :–** విపుల వివరణ (Detailed exposition) అన్ని అంశాల్ని పూర్తిగా వివరించిచెప్పే రచనా ప్రక్రియ.

**పిటకాలు :–** బౌద్ధ వాఙ్మయం సర్వస్వం. పిటకం అంటే బుట్ట అని అర్థం. బుద్ధుడు నిర్వాణం పొందిన మూడు నెలలకు ,అజాతశత్రురాజైన ఎనిమిదో యేట రాజగృహలో 500 మంది బౌద్ధ పండితులతో జరిగిన మొదటి బౌద్ధసంగీతిలో అప్పటివరకు మౌఖికంగా ఉన్న బుద్ధుని బోధనలను అందలి విషయాల్నిబట్టి మూడు ప్రధాన భాగాలుగా విభజించి రచించారు. వీటిని త్రిపిటకాలు అంటారు.

1. సూత్రపిటకం : (సుత్తపిటకం) ప్రధానంగా బుద్ధుడు, ఇంకా... ఆనందుడు, మొగ్గల్లాన, సారిపుత్త మొదలైనవారి ఉపదేశాలుండే గ్రంథాలు. దీనిలో దీఘ, మజ్ఝిమ, సంయుత్త, అంగుత్తర, ఖుద్దక – అను ఐదు నికాయాలున్నాయి. మరలా ఇందులో ఖుద్దక నికాయం 19 గ్రంథాల సంపుటి.

2. వినయ పిటకం : బౌద్ధసంఘ నిర్మాణం, నియమాలకు సంబంధించిన విషయాలుంటాయి. ఇది పారాజికపాలి, పాచిత్తియపాలి, మహావగ్గపాలి, చుల్లవగ్గపాలి, పరివారపాలి అను ఐదు గ్రంథాలు.

3. అభిధమ్మ పిటకం : త్రిపిటకాల్లో ముఖ్యమైనది. అభిధమ్మం అంటే బుద్ధుని ఉన్నత ధమ్మం అని. ఇది ధమ్మసంగణి, విభంగ, ధాతుకథా, పుగ్గలపఞ్ఞత్తి, కథావత్థు, యమక, పట్ఠాన అనే ఏడు గ్రంథాల బుట్ట.

**ప్రజ్ఞ :–** (Insight) అవగాహన. జ్ఞానం. విజ్ఞానం. బౌద్ధ వాఙ్మయంలో విపస్సన. అంటే లోతుగా చూడడం. అంతర్జ్ఞానం. మానసిక కార్యం.

**ప్రజాపతి గౌతమి :–** గౌతమి. మాయాదేవి చెల్లెలు. శుద్ధోధనుని రెండో భార్య. నందుని తల్లి. తన పుత్రుని దాదులకు అప్పగించి, తాను సిద్ధార్థుణ్ణి సాకింది. స్త్రీలను బౌద్ధ సంఘంలో చేర్చుకోవాలని బుద్ధుణ్ణి కోరి, ఒప్పించింది. తనూ బౌద్ధ సంఘంలో చేరింది. బౌద్ధ సంఘంలో చేరిన తొలి భిక్షుణి. ఆమె మరణానంతరం ఆమె అవశేషాలపై లిచ్ఛవి రాకుమారులు ఒక స్తూపాన్ని నిర్మించారు.

**ప్రధాన్ :–** అవ్యక్తం. ప్రకృతి. "ప్రకృష్టం కరోతీతి ప్రకృతి" పదార్థాన్ని ప్రకృష్టం చేసేది ప్రకృతి. సాంఖ్యులు ప్రపంచానికి ప్రకృతే మూలం, సమస్త సృష్టికి ప్రకృతే మూలకారణం అంటారు. ఇది నిత్యం. ఉత్పత్తి, వినాశాలు లేనిది. అది త్రిగుణాత్మకం.

1. సత్వం :– దీని లక్షణం జ్ఞానం. స్వభావం నిర్మలం. రంగు తెలుపు.
2. రజస్సు :– దీని లక్షణం చలనం. రంగు ఎరుపు.
3. తమస్సు :– దీని లక్షణం జడత్వం. రంగు నలుపు.

**ప్రమాణం :–** "ప్రమీయతే అనే నేతి ప్రమాణం" దేని వల్ల ఒక విషయం తెలుస్తుందో అది ప్రమాణం. 'ప్రమ' అంటే యథార్థ జ్ఞానం. ప్రమను జనింపచేసేది ప్రమాణం. ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం, అర్థాపత్తి, అనుపలబ్ధి – ఇవీ ప్రమాణాలు. కొందరు నాలుగు ప్రమాణాల్నే అంగీకరిస్తారు. బౌద్ధులు మొదటి రెండు ప్రమాణాల్నే ఒప్పుకొంటారు.

**ప్రమాత:–** ప్రమాణం ద్వారా ప్రమేయ జ్ఞానాన్ని పొందేవాడు.

**ప్రమేయం :–** ప్రమాణాల ద్వారా తెలిసేది. దీన్ని జ్ఞేయం అంటారు.

**ప్రసేన జిత్తు :–** పసేనది (పాలీ). ఇతని రాజధాని శ్రావస్తి (సావత్థి). ఇతని మొదటి భార్య మల్లిక. రెండో భార్య  వాసభఖత్తయా. ఈమె బుద్ధుని జ్ఞాతి సోదరుడైన మహానామకు, బానిస స్త్రీకి పుట్టింది. ఈమె కొడుకు విడూడభా. మల్లిక కూతురు వజీర. కూతురు పుట్టిందని ప్రసేనుడు బాధపడుతుంటే... "చక్కగా పెంచితే మగ పిల్లవానికంటే ఆడపిల్లే గొప్ప కావొచ్చు" అని చెప్పాడు బుద్ధుడు. ఆమె ఆ తర్వాత మగధరాణి అయ్యింది. ఆ రోజుల్లోనే బుద్ధుని ఆలోచన ఎంత ఉన్నత మైనదో తెలుస్తుంది. హిందూ మతాభిమాని అయిన ప్రసేనుణ్ణి బౌద్ధ ధర్మం వైపు మళ్ళించాడు బుద్ధుడు.

**పునర్జన్మ :–** పునర్భవం. (rebirth) కర్మ ఫలాల్ని అనుభవించడానికి తిరిగి మళ్ళీ మళ్ళీ పుట్టడం. ఈ జనన మరణ పరంపర మోక్షం పొందే వరకూ ఉంటుంది. ఇదే సంసార చక్రం. భవ చక్రం. ఈ వాదం వేదాల్లో లేదు. తొలిగా ఛాందోగ్యోపనిషత్‌లో కన్పిస్తుంది. ఆత్మ ఇలా మరలా మరలా పుడుతుంది అని అంటారు. బౌద్ధులు ఆత్మను అంగీకరించరు. కానీ, ఆత్మలేని పునర్భవాన్ని (తిరిగి భవాన్ని పొందడం) అంగీకరిస్తారు. మార్పులేని దేదీ పునర్భావాన్ని పొందదనేది బౌద్ధుల వాదం.

**పురుషుడు :–**సాంఖ్య దర్శనం ప్రకారం నిత్యుడు. సర్వవ్యాపి. కేవల చైతన్యం. పరిణామం లేని, నాశంలేని, క్రియారహితుడు. పురుషుని సాన్నిధ్యంవల్లే ప్రకృతి సృష్టి క్రియకు లోనవుతుంది. – ఇతర దర్శనాలలో పురుషుడు 'ఆత్మ'గా, 'జీవుడు'గా కన్పిస్తాడు.

**ప్లేటో :–** (Plato) (క్రీ.పూ.427–347) గ్రీకు దార్శనికుడు. భావవాది. ఏథెన్స్‌లో పుట్టాడు. తండ్రి ఆరిస్టాన్. తల్లి పెరిక్టోని. సోక్రటీస్ శిష్యుడు. ఆరిస్టాటిల్ గురువు. బహుగ్రంథకర్త. అకాడెమీ స్థాపకుడు. ఈ విశ్వవిద్యాలయం 1000 సం॥లు పని చేసింది. ప్రపంచంలో మొదటి విశ్వవిద్యాలయం. నీతి శాస్త్రం, రాజనీతి శాస్త్రం, ద్వంద్వ తార్కిక విధానం ఆయన రచనల్లో ఎంతో అభివృద్ధి చెందాయి. 25 గ్రంథాలు రాశాడు.

**పైథాగరస్ :–** పితాగొరస్. (Pythagoras) (క్రీ.పూ. 570–500) గ్రీకు దార్శనికుడు. గణిత వేత్త. మత సంస్కర్త. సామోస్ నివాసి. పదార్థ వాదాన్నుండి దూరంగా పోయి ఆకృతి (పొడవు, వెడల్పు, ఎత్తు) వాదాన్ని చెప్పాడు. భౌతిక విశ్వాన్ని వదిలి ఊహల్లో విహరించాడు. పునర్జన్మ

వాదాన్ని తీసుకున్నాడు. భారతీయ వైయాకరణులు 'శబ్దబ్రహ్మ' అంటే పైథాగరస్ "సంఖ్యబ్రహ్మ" అన్నాడు. సంఖ్యల మీదే ప్రపంచం నిలబడింది అన్నాడు.

**బ్రహ్మ :-** "బృంహ్" అంటే విస్తరించు, అభివృద్ధి చెందు, వ్యక్తం అగు అని అర్థాలు. వేద కాలంలో యజ్ఞాన్ని బ్రహ్మ అనేవారు. ప్రతి దేవతనూ బ్రహ్మ అనేవారు. శబ్దాన్ని కూడా బ్రహ్మ అని అనేవారు. ఆ తరువాతే సృష్టి అంటూ, ఆ సృష్టి బ్రహ్మ నుండే ప్రారంభమైంది అనే వాదం వచ్చింది. బ్రహ్మ సృష్టికర్త అయ్యాడు. సత్ పదార్థమే బ్రహ్మ. అది నిర్గుణం. ఆనందమయం. అవిద్యవల్ల బ్రహ్మ ఆత్మగా భావిస్తాం. నిర్గుణ బ్రహ్మకూ, ఆత్మకు అభేదాన్ని చూడడమే ముక్తి అంటారు అద్వైతులు. ద్వైతులు బ్రహ్మ అంటే శ్రీమహావిష్ణువే. సృష్టి, స్థితి, లయ కారకుడు అంటారు. బ్రహ్మ సగుణుడూ, నిర్గుణుడూ, ఉభయ లక్షణుడూ, ఉపాదాన, నిమిత్త కారణుడు అంటారు రామానుజుడు.

**బాదరాయణుడు :-** వ్యాసుడు. ఉత్తరమీమాంసా (బ్రహ్మ సూత్రాల) కర్త. ఇదే వేదాంత దర్శనం. "శూద్రులకు వేదాధ్యాయనం లేదు" అని చెప్పిన పూర్వ మీమాంసా కర్త జైమిని అభిప్రాయాన్ని బాదరాయణుడు వ్యతిరేకించాడు.

**బింబిసారుడు :-** హర్యంక వంశస్థాపకుడు. రాజగృహ నగర నిర్మాత. క్రీ.పూ.465 నుండి క్రీ.పూ.413 వరకు 52 ఏళ్ళు పాలించాడు. బుద్ధుని కంటే ఐదేళ్ళు చిన్నవాడు. బుద్ధుడంటే ఎంతో అభిమానం. బుద్ధునికి వేణువనాన్ని దానం చేశాడు. ఈ వేణువన విహారంలోనే బుద్ధుడు ఆరు వర్షావాసాలు గడిపాడు. ఇతని పెద్ద భార్య కోసలదేవి. ఆమె ప్రసేనజిత్తు సోదరి. ఈమె కుమారుడే అజాతశత్రు. బింబిసారుని మరో భార్య ఖేమ (క్షేమ). బుద్ధుని శిష్యురాలు. ఈమె భిక్షుణి సంఘానికి పెద్ద.

**బుద్ధుడు :-** "సర్వం క్షణికం బుధ్యతే బుద్ధః' సమస్తాన్నీ క్షణికంగా భావించేవాడు బుద్ధుడు. "ప్రశస్తా బుద్ధి యశ్యస బుద్ధః" ప్రశస్తమైన బుద్ధికలవాడు బుద్ధుడు.

**బుద్ధి :-** "నిశ్చయాత్మకా బుద్ధిః" సంశయం లేని నిశ్చిత జ్ఞానమే బుద్ధి.

**బుద్ధఘోషుడు :-** 'విశుద్ధిమగ్గ' (విశుద్ధి మార్గం) గ్రంథ రచయిత. నాలుగు నికాయాలపై వ్యాఖ్యానాలు రాశాడు. దీఘ నికాయంపై "సుమంగళ విలాసిని" మజ్ఝిమ నికాయంపై 'పపంచసూదని' సంయుత్త నికాయంపై 'సారత్థపకాసినీ' అంగుత్తర నికాయంపై 'మనోరథపూరణి' అనే వ్యాఖ్యానాలు రాశాడు.

**బుద్ధపాలితుడు :-** (క్రీ.శ.470–540) దంతపురి విహారంలో ఉన్నాడు. నాగార్జునుడు, ఆర్యదేవుల రచనల మీద వ్యాఖ్యానాలు రాశాడు. "బుద్ధపాలిత మూల మాధ్యమిక కారికావృత్తి" అనే వీరి గ్రంథం ప్రస్తుతం టిబెట్ భాషలో లభిస్తుంది.

**భంతే :-** భన్తే. భదంతే. స్వామీ. బౌద్ధుల గౌరవ పూర్వక పలకరింపు "పూజ్య భంతే జీ!"

**బద్ధకాపిలాయని :–** బద్ధకచన (పాలీ) భద్రకాత్యాయని. గోప. యశోధర. రాహులమాత. సిద్ధార్థుని అర్ధాంగి.

**భావం(భవం)** :– (being) ఉండటం. సత్త్వం. ఏదైతే ఉంటుందో అది. ఉనికి కల్గినది. మార్పు చెందేది. బౌద్ధుల ప్రతీత్య సముత్పాదం ప్రకారం ఉపాదానం నుండి ఇది సిద్ధిస్తుంది. ఇది రెండు రకాలు.

1. కర్మ భావం :– పాపపుణ్య కర్మల వల్ల కలిగే సంస్కారాలు.

2. ఉత్పత్తి భావం :– ఉపాదానాల ద్వారా కర్మ ఫలాలతో కూడి దానికి అణుగుణంగా ఉత్పత్తి భావం పొందుతాము.

**భావ వివేకుడు :–** (క్రీ.శ. 490–570). మాధ్యమిక వాదంలో స్వాతంత్ర్య శాఖకు చెందినవాడు. ప్రజ్ఞాప్రదీప, మాధ్యమిక హృదయ కారిక, కరతల రత్న, సాంఖ్య తర్కజ్వాల అనేవి ఇతని గ్రంథాలు.

**భాష్యం :–** "సూత్రార్థోవర్ణ్యతే యత్ర వాక్యై సూత్రాను సారిభిః స్వ పదానిచ వర్ణ్యంతే భాష్యం భాష్య విదూవిదుః" "సూత్రాలను అనుసరించి, వాఖ్యాలకు సూత్రార్థాల్ని వర్ణించుతూ, మధ్య మధ్యలో గ్రంథకర్త తన స్వంత పదాల్ని జతచేస్తూ రాసే వ్యాఖ్యను భాష్యం అంటారు.

**భ్రాంతి :–** "భ్రామ్యతే అన్యే ఇతి భ్రాంతి". 'భ్రమ' అంటే అనవస్థానం. అంటే స్థిరంగా లేకపోవడం. ఇది భ్రమింప చేస్తుంది కాబట్టి భ్రాంతి. ఒక దానిని చూచి మరొకటిగా అనుకోవడం.

**భౌతిక వాదం :–** (materialism) భౌతిక పదార్థాలే సత్యం. ఇతరాలన్నీ అసత్యం – అని నమ్మే తాత్త్విక సిద్ధాంతం. అతీత సత్యాన్ని గానీ, నిమిత్త కారణాన్ని గానీ ఇది అంగీకరించదు.

**మనస్సు :–** "సంకల్ప వికల్పాత్మకం మనః" సంకల్పం, వికల్పాలు కలది మనస్సు.

**మల్లులు :–** మల్ల గణతంత్ర ప్రజలు. లిచ్ఛవి, విదేహ, వజ్జి, మల్ల గణ రాజ్యాలు కలసి ఒకే రాజ్యంగా ఉండేవి. దీన్ని వజ్జియన్ యూనియన్ అనేవారు. ఈ రాజ్యం రెండు భాగాలుగా ఉండేది. ఒక భాగానికిపావా, రెండో భాగానికి కుశీనగరం రాజధానులుగా ఉండేవి. బుద్ధుడు తన ఆఖరి భోజనం పావాలో చుందుని ఇంట చేసి కుశీనర వస్తూ మార్గ మధ్యంలోని సాలవనంలో నిర్వాణం పొందారు. తన మరణాంతర క్రియల్లో మల్లులకి సింహ భాగాన్ని అందించారు.

**మహా కాత్యాయన :–** మహా కచ్చాన (పాలీ). అవంతీ నగర వాసి. కాత్యాయన గోత్రీకుడు. తండ్రి తిరిత వచ్ఛ. తల్లి చండిమా. ఇతను నిశిత బుద్ధి. ఆధ్యాత్మిక అంశాల్ని విడమరచి చెప్పగల బోధకుడు. బుద్ధుని శిష్యుల్లో అగ్రగామి.

**మహాసాంఘికులు :–** మహాయానులు. అంటే గొప్ప వాహకం కలవారు. అర్హత్వం వ్యక్తిగతం కాదు అంటారు. అనేకుల్ని నిర్వాణానికి మోసుకు పోతుంది కాబట్టి వీరిది 'మహావాహకం'

అయ్యింది. (స్థవిరులు వ్యక్తిగత అర్హత్వాన్ని కోరుకుంటారు కాబట్టి వారిది 'హీనయానం' ఇరుకైన వాహకం' అన్నారు). వీళ్ళు ఉదారవాదులు. 'కరుణ'కు ప్రాముఖ్యతనిస్తారు. కర్మకాండల్ని ప్రార్థనల్ని అంగీకరిస్తారు. నేపాల్, టిబెట్, చైనా, జపాన్, కొరియా దేశాల్లో ఎక్కువగా ఉండడంవల్ల వీరిని ఉత్తర బౌద్ధులు అంటారు. వీరి గ్రంథాలు సంస్కృతంలో ఉండడం వల్ల "సంస్కృత బౌద్ధులు" అనీ అంటారు. వీరివల్లే బౌద్ధం ప్రపంచ వ్యాపితం అయ్యింది.

**మహా కాశ్యప :-** మహా కస్సప (పాలీ). తండ్రి కపిల. తల్లి సుమనాదేవి. అసలు పేరు పిప్పలి కాశ్యప. ధనవంతులైన బ్రాహ్మణ కుటుంబం. బద్దకలాపిని అనే ఆమెను వివాహమాడాడు. భార్యభర్తలిరువురూ స్నేహితుల్లా కలసి ఉంటూ (సంసార సుఖాలకి దూరంగా ఉంటూ) తల్లి దండ్రులకు సేవ చేస్తూ ఉండేవారు. ఇద్దరూ అహింస పట్ల ప్రేమతో సన్యాసం స్వీకరించారు. బుద్ధుడు అతనికి బోధ చేశారు. బుద్ధుని పరినిర్వాణ సమయంలో కాశ్యపుడు లేడు. ఆ వార్త తెలిసి పావానుండి కుసీనరకు వచ్చాడు. కాశ్యపుడు వచ్చే వరకు బుద్ధుని చితి మండలేదని, కాశ్యపుడు బుద్ధుని పాదాలకు తల ఆన్చి నమస్కరించిన తర్వాతే చితిమండిందని ప్రతీతి. "ధమ్మ పితామహునిగా" పేరు పొందాడు.

**మాధ్యమిక వాదం :-** బౌద్ధ దర్శనంలో మహాయానం నుండి చీలిన ఒక శాఖ. ఆచార్య నాగార్జునుడు దీని వ్యవస్థాపకుడు. శాశ్వత వాదానికీ, ఉచ్ఛేద వాదానికీ మధ్యమ మార్గాన్ని అవలంబించినవారు మాధ్యమికులు. విశ్వం వాస్తవం కాదు,త అవాస్తవం కాదు, సాపేక్షం (relative) అంటారు. వీరు శూన్య వాదులుగా ప్రసిద్ధి. ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుడు (క్రీ.శ.300), బుద్ధపాలితుడు (క్రీ.శ.500), భావవివేక (క్రీ.శ.500), చంద్రకీర్తి (క్రీ.శ.600), శాంతి దేవుడు (క్రీ.శ.700) – మాధ్యమిక వాదులు. ఈ వాదం క్రీ.శ. ఐదో శతాబ్దంలో ప్రాసంగికం, స్వతంత్రం అని రెండు శాఖలుగా చీలిపోయింది. క్రీ.శ. ఎనిమిదో శతాబ్దం వరకు ఈ వాదం ప్రచారంలో ఉంది.

**మిళింద ప్రశ్న :-** మిళింద పన్హ (పాలీ). వాద గ్రంథం. రాజు మిళిందునికి, నాగసేనునికి జరిగిన సంవాదం. పాశ్చాత్య సాహిత్యంలో ప్లేటో డైలాగ్స్‌కి ఉన్నంత ప్రాముఖ్యత ప్రాచ్య దేశాల సాహిత్యంలో మిళింద ప్రశ్నలకు ఉంది. 1890లో Questions of king Milinda అనే పేరుతో రీస్ డేవిడ్స్ యథాతథంగా ఆంగ్లానువాదం చేశాడు. అలాగే 1969లోనూ ఐ.బి. హార్నర్ అనే బౌద్ధ పండితురాలు కూడా యథాతథ ఆంగ్లానువాదం చేశారు.

**మిళిందుడు :-** మినందర్. (క్రీ.పూ. 2వ శతాబ్దం). మౌర్య సామ్రాజ్య పతనం అనంతరం వాయువ్య భారతదేశాన్ని పాలించిన గ్రీకో – బాక్ట్రియన్ రాజు. నేటి పంజాబ్ నుండి ఆఫ్ఘనిస్థాన్ వరకు ఇతని రాజ్యం ఉంది.ఇతని కాలంలో భారతీయ బౌద్ధ కళలు సంస్కృతి, గ్రీకు కళలు సంస్కృతి కలసి పోయాయి. శిల్పకళలో గాంధార శిల్పకళ వెలసింది.

**మీమాంసా :-** మీమాంసా దర్శనం. మీమాంసా అంటే వివేచనా పూర్వక జిజ్ఞాస. అంటే ఒక విషయాన్ని పరీక్షించి తీర్మానించడం. జైమిని – పూర్వమీమాంసా, బాదరాయణుడు – ఉత్తర మీమాంసా (బ్రహ్మసూత్రాలు) కర్తలు. పూర్వ మీమాంసనే 'మీమాంసా' అని పిలుస్తారు. 'అదృష్టం'

అనే పదాన్ని మొదటిగా జైమిని తన పూర్వ మీమాంసలో ప్రయోగించాడు. వీరు యజ్ఞాల వల్ల వచ్చే ఫలాల్ని ఆత్మ స్వర్గంలో అనుభవిస్తుంది అంటారు. ప్రపంచం సత్యమైంది.అది కలకాదు అంటారు.

**మ్లేచ్ఛ :-** శిష్టాచారం లేనిది.

**మొగ్గలిపుత్త తిస్స :-** అశోకుని కాలంలో జరిగిన 2వ బౌద్ధ సంగీతికి అధ్యక్షత వహించాడు. స్థవిరుడు. అశోకుడు రాజ్యానికి వచ్చిన 26వ ఏట, ఆయన తన 80వ ఏట మరణించాడు. అశోకుని కాలంలో భిక్షు సంఘం బాగా వర్ధిల్లింది. కొందరు చెడ్డవారు కూడా సంఘసభ్యులు కావడం చూచి, మొగ్గలిపుత్త తిస్స సంఘానికి దూరంగా ఏడేళ్ళు ఏకాంత వాసం గడిపాడు. అనంతరం, అశోకుని చొరవతో బౌద్ధ వ్యతిరేకుల్ని సంఘం నుండి బహిష్కరించారు. ఆ తర్వాతే బౌద్ధ సంగీతి జరిగినది.

**మౌద్గల్యాయన :-** మొగ్గల్లాన (పాలీ). మొగ్గలి అనే బ్రాహ్మణస్త్రీకి పుట్టాడు. అసలు పేరు కొలిత. సారిపుత్రుని మిత్రుడు. మొదట వీరు సంజయ బేలట్ఠపుత్త శిష్యులు. ఆ తర్వాత అస్సజి దగ్గర బుద్ధుని గురించి విని, బుద్ధుని శిష్యులయ్యారు. బుద్ధునికి రెండో శిష్యునిగా పేర్గాంచాడు. శీలం, జ్ఞానంలో గొప్పవాడు. ఎదుటివారి మనస్సుల్ని చదివే శక్తి ఉన్న వాడు. తన ప్రియ మిత్రుడు సారిపుత్రుని లాగా బుద్ధునికంటే ముందే మరణించాడు.

**యవన :-** గ్రీకు. గ్రీసు. యునాన్.

**యోగాచారం :-** మహాయానం నుండి చీలిన ఒక శాఖ. 'విజ్ఞానవాదం' అంటారు. త్రిపిటకాలలోని 'యోగావచర' అనే పదం నుండి కూడా ఈ పేరు వచ్చియుండొచ్చు. దీని సంస్థాపకుడు మైత్రేయ. వీరు యోగం వల్ల బుద్ధుడు సంబోధిని పొందాడని భావిస్తారు. యోగానికీ, ఆచారానికీ ప్రాధాన్యత నిస్తారు. అసంగుడు వసుబంధు, దిఙ్నాగుడు ఈ శాఖ వారే. విజ్ఞానమే యథార్థమైంది అంటారు. కాబట్టి వీరిని విజ్ఞాన వాదులు అంటారు. నాలందా విశ్వవిద్యాలయంలో ప్రధానంగా బోధించే విషయం ఇదే. చైనా వారికి ఈ వాదం హుయాన్‌త్సాంగ్ ద్వారా పరిచయ మైంది.

**రూపం :-** ఆరోపించబడింది రూపం. "రూపయతి, విమోహయతి ఇతి రూపం" మోహింప చేసేది, లేదా ఆసక్తి కల్గించేది రూపం. వస్తుసముదాయాలన్నీ రూపం కలవే.

**లిచ్ఛవి :-** వృజి (వజి) యూనియన్‌లోని ఒక తెగ. లిచ్ఛవుల రాజధాని వైశాలి. ఈ తెగ గణతంత్ర నిర్మాణం బుద్ధునికి ఎంతో నచ్చింది. బౌద్ధ సంఘ నిర్మాణానికి ఈ తెగ నిర్మాణం దోహదపడింది.

**లోకాయత వాదం :-** "లోకేషు ఆయత్థః" – అంటే లోకాన్ని మాత్రమే ఆలోచించే విషయంగా తీసుకునేది. శుక్రాచార్యుడు ఈ వాదానికి ఆచార్యుడని కొందరంటారు. ఈ లోకాయతుల్ని

రాక్షసులంటారు. బృహస్పతి వీరి ఆచార్యుడని ఇంకొందరంటారు. అడవుల్ని నరికి వ్యవసాయం చేసే వారిని లోకాయతులనీ అంటారు. ఇది లౌకిక జనుల దర్శనం.

**వాచస్పతి :–**వాచస్పతి మిశ్రుడు. క్రీ.శ.9వ శతాబ్దివాడు. మిథిలవాసి. ఉద్యోతకారుని న్యాయవార్తికానికి 'తాత్పర్యటీక' రచించాడు. షడ్దర్శనాలలో వైశేషికానికి తప్ప మిగిలిన ఐదింటికీ 'టీక'లు రాశాడు. షడ్దర్శన శాస్త్రంలో "సర్వతంత్ర స్వతంత్రుడు" అనే బిరుదు పొందాడు. వాచస్పతి దిజ్నాగుణ్ణి తర్కంలో 'భ్రాంత'(భ్రాంతి (blunders) గా పేర్కొన్నారు. ఇతని వేదాంత భాష్యం – "భామతి టీకా", సాంఖ్య భాష్యం – " సాంఖ్య తత్త్వకౌముది", న్యాయ భాష్యం – " న్యాయ సూత్ర ధార",

**వ్యాఖ్య :–** "పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహః వాక్య యోజనా, ఆక్షేపచ్ఛసమాధానం వాక్యానం పంచలక్షణం". పదవిభాగం, పదాల అర్థం, సమాస పదాలకు విగ్రహ ప్రదర్శనం, కావ్యంలోని అలంకారాల్ని సమన్వయించడం, వ్యాకరణాది అంశాలపై ఆక్షేప సమాధానాలు. ఈ ఐదు లక్షణాలు గలది వ్యాఖ్య.

**వాత్స్యాయనుడు :–** క్రీ.పూ. ఒకటో శతాబ్దం వాడు. గౌతముని న్యాయదర్శనానికి భాష్యం రాశాడు. అది "న్యాయ భాష్యం".

**వార్తికం :–** "ఉక్తానుక్త దురుక్త చింతాకరం వార్తికం" ఉక్తా, (చెప్పబడినదాని గురించి), అనుక్త, (చెప్పబడని దాని గురించి), దురుక్త, (దోషయుక్తంగా చెప్పబడినదాని గురించి) – పై మూడు అంశాల గురించి విచారించి, వివరించి చెప్పేదే వార్తికం.

**వికారం :–** ఆకారంలో మార్పు. స్వాభావిక మార్పు. మూల ప్రకృతి నుండి పుట్టినది (సాంఖ్యం).

**విజ్ఞాన వాదం :–** (చూడండి యోగాచారం)

**విచికిత్స :–** విచికిచ్ఛా (పాలీ). నాస్తిక శంక. (Sceptical doubt) మంచా, చెడా? చేయాలా, వద్దా? అవునా, కాదా? అనే డోలాయమాన స్థితి. అనిశ్చితి స్థితి. ఊగిసలాట.

**విపాకం :–** కలసిపోవడం. విభాగించడానికి వీలు లేకుండా కలసి పోవడం. పరిపాకం చెందడం. పాకానికి రావడం. బుద్ధుడు జీవుల్ని ఆధ్యాత్మికంగా పరిపాకం చెందేట్టు చేస్తాడు. కర్మ విపాకం – చేసిన పనికి కలిగే ఫలితం. వేప విత్తు నాటితే మామిడి మొలక రానట్లు, మంచి పనికి మంచి ఫలితం, చెడు పనికి చెడు ఫలితం వస్తాయి.

**విముక్తి :–** విముత్తి (పాలీ). (Delivarance) విమోచనం. ఇది రెండు రకాలు. చేతో ముత్తి: మానసిక విమోచనం. (అర్హంత మార్గం). ప్రజ్ఞావిముక్తి: జ్ఞాన విమోచనం (అర్హంత ఫలం) ఇవికాక ఇంకా ఐదు రకాల విముక్తులున్నాయి.

**విశాఖ :–** విసాఖా (పాలీ). మగధకు చెందిన బద్దియ నగర వాసి అయిన వ్యాపారి ధనుంజయుని కూతురు. తల్లి సుమనాదేవి. వీరు బౌద్ధ ధర్మ అవలంబికులు. శ్రావస్తి నగర వ్యాపారి మిగారకుని

కొడుకు పుణ్యవర్ధనుని వివాహ మాడింది. మిగారకుడు జైన మతావలంబి. ఈ రెండు భావజాలాల మధ్య సంఘర్షణ కొనసాగింది. చివరికి తన మెట్టినింటి వారిని కూడా బౌద్ధ ధర్మాన్ని అభిమానించి ఆచరించేట్టు చేసింది. ఈమెను 'మిగారమాత' అని పిలిచేవారు. శ్రావస్తిలో ఆమె బుద్ధుని కోసం ఒక ఆరామాన్ని నిర్మించి ఇచ్చింది. దానిపేరు పుబ్బారామం (పూర్వారామం). బుద్ధుడు తన జీవిత కాలంలో ఆ ఆరామంలో 9 వర్షావాసాలు గడిపాడు.

**విశేషం :–** వైశేషికులు చెప్పే పంచమ పదార్థం. ఒక పదార్థాన్ని మరొక పదార్థం నుండి వేరు చేసి చెప్పేదే విశేషం. ఇలా పదార్థాల్ని విశేషించి చెప్పింది కాబట్టే ఆ దర్శనాన్ని వైశేషికం అన్నారు. ప్రతి విషయానికి ఒక ప్రత్యేకమైన విశేషం ఉంటుందంటారు వైశేషికులు.

**వృత్తి :–** "సూత్ర మాత్రస్య యా వ్యాఖ్య వృత్తిరిత్యభిధీయతే" సూత్రా, మాత్రాల జోలికి పోకుండా అంటే ఎక్కువ లోతులకు వెళ్ళకుండా చేసిన వ్యాఖ్యను వృత్తి అంటారు.

**వేదన :–** (feeling) అనుభూతి. పంచస్కంధాలలో రెండోది. ఐదు రకాలు. 1. శారీరక సుఖవేదన. 2. శారీరక దుఃఖవేదన. 3. మానసిక సుఖవేదన. 4. మానసిక దుఃఖవేదనా. 5. తటస్థవేదన (ఉపేక్ష).

**వేదాలు :–** "విద్ – జ్ఞానే" – అనే ధాతువుల నుండి వేదం అనే మాట పుట్టింది. ఇవి అపౌరుషేయాలంటారు. ప్రపంచ వాఙ్మయంలోనే అతి పురాతనాలు. వీటిని 'శ్రుతులు' అంటారు. ఋక్, యజుర్, సామ, అధర్వణాలని వేదాలు నాలుగు రకాలు. భారతీయ బ్రాహ్మణ దర్శనాలకి, తాత్త్విక స్రవంతికీ, మతాలకీ పునాదులు వేదాల్లోనే ఉంటాయి. ఇవి సంస్కృత గ్రంథాలు. వీటి కూర్పు క్రీ.పూ. 1200 ప్రాంతంలో జరిగింది. బుద్ధుని కాలానికి మూడు వేదాలే ఉన్నాయి. యజ్ఞకాండని, వర్ణవ్యవస్థనీ వేదాలు ధర్మబద్ధం చేశాయి. బౌద్ధం వాటిని అంగీకరించదు.

**వైశేషికం :–** కణాదుని దర్శనం. షడ్దర్శనాలలో ఒకటి. విశేషించిన గుణాల్ని గూర్చి చెప్పేది. ఈ దర్శనానికి "ఔలూక్య దర్శనం" అనే పేరు కూడా ఉంది. (ఉలూకం అంటే గుడ్లగూబ). ఇది గ్రీకు (యవన) డెమోక్రటీజ్ పరమాణు సిద్ధాంతాన్ని పోలి ఉంటుంది. గ్రీకులకు గుడ్లగూబ (ఉలూకం) పవిత్ర చిహ్నం. బహుశ... అలా దీనికి 'ఔలూక్యం' అనే పేరు వచ్చి ఉండొచ్చు. కణాదుని తండ్రి ఔలూకుడు. కాబట్టి అలాకూడా దీనికి 'ఔలూక్యం' అనే పేరు వచ్చి ఉండొచ్చు.

**శబ్దం :–** వేదాన్ని శబ్దం అంటారు. పంచభూతాల్లో మొదటిది ఆకాశం. ఆకాశ గుణం శబ్దం. మొదటిది కాబట్టి వేదాన్ని శబ్దం అంటారు.

**శాంత రక్షిత :–** ఇతను ఓ రాకుమారుడు. నాలందా విశ్వవిద్యాలయంలో చదివాడు. మహాయాన స్వాతంత్రికతర్కంలో ప్రావీణుడు. బహు బౌద్ధ గ్రంథకర్త. మాధ్యమిక అలంకార, తత్త్వసంగ్రహ గ్రంథకర్త. టిబెట్ వెళ్ళి అక్కడ పదమూడేళ్ళు ఉన్నాడు. అనేక బౌద్ధ గ్రంథాల్ని టిబెట్ లోకి అనువదించాడు.

**శాక్యులు :–** బుద్ధుడు జన్మించిన తెగ. హిమాలయ పాదసీమలో ఉండేది. వీరి రాజధాని కపిలవస్తు. శుద్ధోధనుడు ఈ తెగ అధ్యక్షుడు. ఈ తెగల అధ్యక్షుల్ని "రాజు" అనే పేరుతో పిలిచేవారు.

**శ్రావస్తీ :–** సావత్థీ (పాలీ). కోసల రాజధాని. ఉత్తర ప్రదేశ్‌లో రప్తి (Rapti) నది ఒడ్డున బలరాంపూర్‌కి 15 కి.మీ. దూరంలో ఉంది. జేతవనం ఉన్న ప్రదేశం. అనాథపిండిక నివసించిన పక్కాకుట్టి, అంగులి  మాలుని నివాసమైన కచ్చాకుట్టిలు ఇప్పటికీ శిథిలావస్థలో ఉన్నాయి. ఆనందుడు నాటిన 'ఆనందబోధి' వృక్షం ఇప్పటికీ జేతవనంలో ఉంది. చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ జేతవనాన్ని దర్శించాడు.

**శీలం :–** "శీలతి ఇతి శీలం" – లెస్సగా నడిచేది. చక్కగా నడిచేది. స్థిరమైనది శీలం. ఇది ఒక రకమైన స్థిరమైన సమాధి స్థితే. బౌద్ధం శీలానికి పెద్దపీట వేస్తుంది. బౌద్ధం చెప్పిన నియమాల్ని ఆచరించడమే శీలం. వినయ పిటకంలో బౌద్ధ సంఘ సభ్యులు ఆచరించాల్సిన నియమాలు ఉన్నాయి. భిక్షువులకు 227, భిక్షుణిలకు నియమాలున్నాయి.

**శ్రీహర్షుడు :–** (క్రీ.శ.1192) హర్షవర్ధనుడు. బౌద్ధాన్ని పోషించిన చక్రవర్తి. కవి. శైవాన్ని కూడా పోషించాడు. మత సహనం పాటించాడు. హీనయాన సామ్మితీయ శాఖకు చెందినవాడు. హర్షుని కాలంలోనే చైనాయాత్రికుడు హూయన్‌త్సాంగ్ (యూన్–చాంగ్) భారత దేశానికి వచ్చాడు. నాలందా విశ్వ విద్యాలయ పోషకుడు. బాణభట్టు ఇతని ఆస్థాన కవి.

**సంశయం :–** "అదా" "ఇదా" అనే ఊగిసలాట. ఒక వస్తువునందు కలిగే విరుద్ధమైన జ్ఞానం. సంశయానికి ఐదు రకాల కారణాలున్నాయని న్యాయదర్శనంలో చెప్పారు.

**సంస్కారం :–** సంఖార (పాలీ). అంటే రూపొందడం, (farmation). ఇది మానసిక, వాచిక, శారీరక క్రియల్ని సూచిస్తుంది.

**సత్ :–** సత్తు. ఉనికి లక్షణమే సత్. ఏదైతే ఉంటుందో అది సత్.

**సమవాయం :–** వైశేషికులు చెప్పే ఆరోపదార్థం. రెండు పదార్థాలకున్న విడదీయలేని సంబంధమే సమవాయం. ఈ సంబంధం విడిపోవాలంటే పదార్థాల నాశంతోనే సాధ్యపడుతుంది. నూలుకి – వస్త్రానికి ఉన్న సంబంధం సమవాయం. వస్త్రం నుండి నూలు విడిపోతే వస్త్రం నశిస్తుంది.

**సమాధి :–** ఏకాగ్రత. మనస్సును ఒకే విషయం (మంచి విషయం) పై నిలిపి ధ్యానం చేయడం. ఆ ధ్యాన ఫలితమే సమాధి.

**సముచ్చయం :–** ఒక్క చోటకు చేర్చు. ప్రోగుచేయి. సముదాయం. సంకలనం. సంహితం.

**సర్వాస్తి వాదం :–** సబ్బిత్తి వా (పాలీ). ఒక బౌద్ధ శాఖ. "సర్వం అస్తి" – అంటే ప్రతిదీ ఉంది అని. క్రీ.శ. 3వ శతాబ్దంలో ఈ శాఖ స్థవిరవాదం నుండి చీలింది. రెండో బౌద్ధ సంగీతిలో ఈ వాదుల్ని బహిష్కరించారు. కాశ్మీరం, గాంధార ప్రాంతాల్లో ఈ శాఖ బలీయంగా ఉండేది. కాశ్మీరు

శాఖ వారిని వైభాషికులని, గాంధార శాఖ వారిని మూల సర్వాస్తి వాదులనీ (సౌత్రాంతికులు లేదా సంక్రాంతివాదులు) అంటారు. వసుబంధు రాసిన 'అభిధర్మకోశం', 'మహావిభాష' లు సర్వాస్తి వాద గ్రంథాలు.

**స్పర్శ :–** ఫస్స (పాళీ). contact. మనస్సు, బయట ప్రపంచంతో పెట్టుకొనే సంబంధాన్ని సూచించేది. చూచిన వస్తువు కావాలని అనిపిస్తే అది కోరికకు దారి తీస్తుంది. ఈ స్పర్శానుభవాల్ని నిరోధించడానికి సతీ (mindfulness) అవసరం అంటుంది బౌద్ధం.

**స్కంధ :–** ఖంద (పాళీ). ఇవి ఐదు. రూపం, వేదన, సంజ్ఞ, సంస్కారం, విజ్ఞానం. ఈ ఐదూ కలిస్తే వ్యక్తి రూపొందుతాడు. ఈ ఐదు కాక, ఆత్మ అనే ప్రత్యేక మైనది లేనేలేదు.

**స్థవిర వాదులు :–** థేర వాదులు (పాళీ). బౌద్ధంలో ఒక వర్గం. తొలినాటి బౌద్ధ నియమాల్లో ఎలాంటి మార్పును అంగీకరించనివారు. 'వినయ' నియమాలకు అనుగుణంగా జీవించాలనికోరుకుంటారు. స్థవిర అంటే పెద్దవాడు అని. బౌద్ధ భిక్షువుల్లో వృద్ధుల్ని స్థవిరులు అంటారు. వీరు బుద్ధుణ్ణి మహనీయునిగా అంగీకరించి నప్పటికీ ఒక మానవునిగానే భావిస్తారు. బుద్ధుని బోధనల్ని తు.చ. తప్పకుండా ఆచరిస్తారు. బౌద్ధంలో వీరు మితవాదులు. వ్యక్తిగత నిర్వాణానికి, జ్ఞానానికి ప్రాధాన్యతనిస్తారు. కర్మకాండల్ని ఒప్పుకోరు.

**సాంఖ్య దర్శనం :–** షడ్దర్శనాలలో ఒకటి. దీని కర్త కపిలుడు. "సమ్యక్ ఖ్యాతి" – సాంఖ్యం. అంటే సరైన జ్ఞానం. ప్రపంచ ఉత్పత్తికి 25 మూలమైన పదార్థాల్ని చెప్పింది. ఇలా 25 సంఖ్యగా చెప్పింది ఈ దర్శనం. కాబట్టి 'సాంఖ్యం' అని కూడా అంటారు. ప్రకృతి పరిణామాన్ని చెప్పే దర్శనం ఇది. దీని మూలం అలభ్యం. దీనిపై రాసిన ఈశ్వరకృష్ణుని 'సాంఖ్య కారిక' ప్రస్తుత ఈ దర్శన ప్రమాణ గ్రంథం.

**సాధారణ కారణాలు :–** నీరూ, నిప్పూ, గాలీ, ప్రకృతి, దైవం... ఇవ్వన్నీ సాధారణ కారణాలు.

**సామాన్యం :–** వైశేషికులు సామాన్యాన్ని పదార్థంగా భావిస్తారు. ఇది ఒక సమూహానికి చెందిన సామాన్య లక్షణం. మానవత్వం, గోత్వం, ఘటత్వం లాంటివి. పదార్థం నశించినా, సామాన్యం నశించదు. సామాన్యం – పరము, (అతివిస్తృతం), అపరము (అతిస్వల్పం) పరాపరము (మధ్యరకం) అని మూడురకాలు.

**సారనాథ్ :–** వారణాసి దగ్గరలో ఉండే పట్టణం. బుద్ధుని ధర్మ చక్రప్రవర్తనకి గుర్తుగా ఇక్కడ అశోకుడు ఒక రాతి స్తంభాన్ని చెక్కించాడు. ఆ స్తంభం మీద చెక్కిన నాల్గు సింహాలే మన జాతీయ ముద్ర.

**సారిపుత్రుడు :–** సారిపుత్త (పాళీ). తండ్రి వంగంత. తల్లి రూపశ్రీ. ఊరు ఉపతిస్స. అసలు పేరు ఉపతిస్స. బుద్ధుని ప్రధాన శిష్యుడు. ప్రజ్ఞాశాలి. 'ఇతడే నా ఆధ్యాత్మిక పుత్రుడు' అని బుద్ధుడు ప్రకటించాడు. ఇతని ధర్మబోధ విని బుద్ధుడు ముగ్ధుడై "ధర్మసేనాపతి" అనే బిరుదు

నిచ్చాడు. అభిధమ్మ సంప్రదాయానికి ఆద్యునిగా చెప్తారు. బుద్ధుని కంటే పెద్దవాడు. బుద్ధుని కంటే కొద్ది నెలల ముందు చనిపోయాడు. "లోకోత్తర జ్ఞానంలో నా తర్వాతి వాడు" అని బుద్ధుడు ప్రస్తుతించాడు. ఒకసారి ఇతని చీవరాలు సరిగా లేకపోతే ఏడేళ్ళ బాల సామణేర ఆ విషయం తెలియజేశాడు. అప్పుడు ప్రక్కకు వెళ్ళి చీవరాల్ని సరిచేసుకొని వచ్చి "ఇప్పుడు నా దుస్తులు ఎలా ఉన్నాయి గురువు గారూ!" అని ఆ బాలకునితో నమ్రతతో అన్నాడు. "ఏడేళ్ళ బాలుడైనా సరే నాకు బోధ చేస్తే నమ్రతతో స్వీకరిస్తాను" అన్నాడు. అంతటి ప్రజ్ఞాశాలి సారిపుత్రుడు. ఇతని మిత్రుడు కొలిత, (మౌద్గల్యాయన).

**సాధ్యం :–** సాధింపదగినది.ఒక వాదం ద్వారా ఏ విషయాన్నైతే సంపూర్ణంగా రాబట్టడానికి ప్రయత్నిస్తామో... ఆ విషయాన్ని సాధ్యం అంటారు.

**సుహృల్లేఖ :–**మిత్రునికి లేఖ. మహాయాన తత్త్వానికి చెందిన 123 నైతిక పద్యాల గ్రంథం. శాతవాహన రాజునుద్దేశించి నాగార్జునుడు రాసిన లేఖలు. ఆ రాజు ఎవరనేది ఇదమిత్థంగా తేలలేదు. గౌతమీ పుత్రుడని కొందరు, యజ్ఞశ్రీ శాతకర్ణి అని కొందరు వాదిస్తున్నారు. ఆధునిక పరిశోధకులు యజ్ఞశ్రీ వైపే మొగ్గు చూపుతున్నారు.

**హేరాక్లిటీజ్ :–** (క్రీ.పూ. 535–475). గ్రీకు దార్శనికుడు. ఎఫెస్ నగరవాసి. జమీందారీ కుటుంబంలో పుట్టాడు. బుద్ధుని సమకాలికుడు. బుద్ధునిలా క్షణిక వాది. పరివర్తన వాది. ప్రపంచానికి అగ్ని ప్రళయం సంభవిస్తుందంటాడు. 'అగ్ని' సృష్టికి మూలం అంటాడు. విశ్వం – విశ్వ పదార్థం క్షణ క్షణం పరివర్తన చెందుతూంది. విశ్వ సృష్టే – విశ్వ వినాశనం. విశ్వనాశనమే – విశ్వసృష్టి. ఈ జగత్తే విరుద్ధాంశాల కలయిక అన్నాడు. "ఒకే నది నీటిలో నీవు రెండు సార్లు స్నానం చేయలేవు" అనేది ఆయన చెప్పిందే. గతి తార్కిక భౌతికవాద సిద్ధాంతాన్ని ప్రకటించిన ప్రప్రథమ దార్శనికుడు.

**క్షణికం :–** (కాలమానంలో క్షణం అంటే 30 కళలు). "క్షణ హింసాయాం" – అంటే దుఃఖాన్ని హింసిస్తుంది. దుఃఖాన్ని పోగొట్టుతుంది. "క్షణోతి దుఃఖం ఇతి క్షణః" దుఃఖాన్ని పోగొట్టేది క్షణికం."